
శ్రీ కంచి పరమాచార్య లీలలు

Sri Kanchi Paramacharya Leelalu - 2



SRI KANCHI PARAMACHARYA

Compiled by : Nagesh Kanuru



Sri Jayendra Saraswathi , Sri Chandrasekharendra Saraswathi , Sri Vijayendra Saraswa

శ్రీ కంచి పరమాచార్య లీలలు

(జగద్గురు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారి లీలలు –2)

సేకరణ, సంకలనం :

నాగేష్ కానూరు (Nagesh Kanuru)

First Print: November 2023

Books available at:

1. Sri Kanchi Kama Koti Peetham (Sri Matt)

No .1, Salai Street,

Kanchipuram – 631502, Tamila Nadu

2. Sri Sai master Seva Trust

Sai master Nilayam, Golagamudi – 524321

Nellore, A.P, Ph.7019123548

3. Nagesh Kanuru

2nd floor ,Rajagopal Building, Gollahalli,

Electronic city post, Bengaluru– 560100

naageshk23@gmail.com


Printers:

Manoj printers

3–2–342 & 343, Cheppala Bazar,

Kachiguda, Hyderabad, Ph: 9246887388

Price: Rs. 60/–



నా గురుదేవులు : శ్రీ పెసల సుబ్బరామయ్య గారి పాద పద్మములకు అంకితం.

నా గురుదేవులు : –

అపారమైన కరుణతో తనదగ్గరకు రప్పించుకుని,తమ సన్నిధానాన్ని ప్రసాదించి, అనంత కృపను, మహిమలను చూపించిన నాగురువుగారు – శ్రీపెసల సుబ్బరామయ్యగారు గొలగమూడి (నెల్లూరు జిల్లా, A. P.) లో ఉండేవారు.

తనశరీరము ఉన్నంతవరకు కఠోరనియమపాలన,అపరిగ్రహం,గురుసేవ, భగవద్భక్తుల సేవ చేసి, ఎంతోసామాన్య జీవితాన్నిగడిపి, అతిగోప్యంగా తన మహిమను ఉంచేవారు. మహనీయులసేవ లోనే, పరిపూర్ణంగా దేవుడిపైనే ఆధారపడి జీవితాన్నంటినీ గడిపారు. పరమచార్యులను దర్శించారు.ఇంకా ఎంతోమంది మహాత్ముల మార్గదర్శత్వాన్ని పొంది వారి బోధలు ఆచరించడంలో ప్రాణాలనుసైతం పణంగాపెట్టారు.భగవద్భక్తులకై జ్ఞానేశ్వరి, అవధూత భగవాన్ వెంకయ్యస్వామి వంటి ఎంతోమందిమహనీయుల లీలలను, చరిత్రలను ప్రచురించారు. తనకు ఉండే చిన్న ఇంటిని కూడా భాగాలుగా చేసి భక్తుల నివాసానికై కేటాయించారు.

మన **"ఇష్టా–యిష్టాలు ధర్మానికి లోబడి"** ఉండాలనేవారు. తనను ఆశ్రయించిన వారికి అలా ఉండేటట్లు శారీరక, మానసిక, నైతిక శిక్షణఇవ్వటంలో ఏరకమైన మొహమాటానికి లొంగేవారు కారు.**"ఈసృష్టి అంతా గురుపాదాలు, అందులో ఎక్కడసేవించినా అది ఆయన సేవే**." అని ఆచరించి, బోధించారు. వారి జీవితమంతా **"కఠోరనియమపాలన, కృతజ్ఞత,గురు–భగవత్ భక్తుల సేవ, పుణ్యకర్మలు, సత్సంగం,గ్రంధరచన "** లతోనే గడిచింది.

పరమాచార్యులవారి ఈ 'లీలాసంకలనం' మరింత గురుకృపను ప్రసాదించాలని ప్రార్ధిస్తున్నాను .....

నాగేష్ కానూరు

విన్నపము: ఈపుస్తకంలోని లీలలు,ఇతర విషయాలన్నీ ఉత్తములైన కొందరుభక్తులు రచించిన గ్రంధాలలోనుంచి,ఇంకా ఇంటర్నెట్'లో లభ్యమైనసమాచారం, శంకరమఠం వారి వెబ్ సైటు,ఇతరవెబ్–సైట్లు మరియు అలాంటి సాహిత్యాలలోనుంచి గ్రహించి కూర్చినవి మాత్రమే. **ఏమైనా తప్పులు గమనించినట్లైతే సహృదయంతో మన్నించమని ప్రార్ధన.**

కాంచీపురం – కంచి పీఠం

చెన్నై నుండి 74కి.మీ. దూరంలో ఉన్న కాంచీపురంలో,శ్రీ కంచి కామకోటిపీఠం క్రీస్తుపూర్వం–482సం.లక్రితం(అంటేఇప్పటికి 2500సం.ల.కు ముందు) ఆదిశంకరులవారి సంకల్పంతోస్థాపించడింది.(Ref:http://www.kamakoti.org/peeth/origin.html). అప్పటి నుంచి నిరంతరాయంగా ఈప్రపంచానికి వెలుగైన 70మంది అద్వైతశిఖరాలైన ఆచార్యులకు నెలవై విరాజిల్లుతుంది.ప్రస్తుతం పీఠాధిపత్యం వహిస్తున్నవారు శ్రీశంకర విజయేంద్రసరస్వతీ స్వామివారు 70వఆచార్యులు. వీరిగురువులు పూజ్యశ్రీ జయేంద్రసరస్వతి స్వామివారు,వీరి పరమగురువులు–'నడిచేదేవుడు', 'పరమాచార్యులు' గా ప్రసిద్ధి పొందిన శ్రీ చంద్రశేఖర సరస్వతీ మహాస్వామివారు.వారిగురించిన లెక్కలేనన్ని లీలలు నక్షత్రాలు గా శాశ్వతంగా మెరుస్తుంటాయి.వాటిలో అతికొద్ది లీలలను సేకరించి ఈపుస్తకంలో పొందుపరచడం జరిగింది.

శంకరాచార్యుల పాదస్పర్శతో పునీతమైన ఈనేల– కంచిపట్టణం మోక్షదాయిని అయిన నగరంగా, ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రంగా పేర్కొంటారు. కంచి–సప్తమోక్షపురులలో ఒకటి. (అయోధ్య, మథుర, మాయ–అంటే ఇప్పటి హరిద్వార్, కాశి, కంచి, అవంతిక(ఉజ్జయిన్) ద్వారక – సప్త మోక్షపురులు). మేలురకమైన పట్టు చీరలకు కొన్ని వందలు సం.లు నుంచి కాంచీపురం ప్రసిద్ధి చెందింది.

పురాణాలలో కంచి మహాపట్టణం సాధారణ మానవులకే కాక,మహర్షులకుకూడా తీర్థయాత్రాస్థలంగా చెప్పబడింది.'ఉమాసంహిత'లో వ్యాసమహర్షి నందికేశ్వరుల వారి శాపా నికి గురిఐనప్పుడు మహావిష్ణువు,అతనికి శివుడిని ఆరాధించమంటారు. వ్యాసమహర్షి వార ణాసినుంచి బయలుదేరి,కాంచీపురానికి చేరుకొని శివుడుని తనశాపవిమోచనానికై ప్రార్ధిస్తారు.అతనిశాపవిమోచానానికి గుర్తులుగా శాపగ్రస్తుడైనప్పుడు వ్యాసమునిచేతులు పైకి ఉన్నశిల్పాలు,శాపవిమోచనమైన తరువాత సాధారణస్థితిలో ఉన్నవ్యాసభగవానుని శిల్పాలు ఇక్కడిఆలయగోపుర విమానంలో చూడవచ్చు.భాగవతపురాణంలోను,మార్కండేయ పురా ణంలోను కంచి గురించి ఇతోధికంగాచెప్పబడింది.**బ్రహ్మాండపురాణంలో కంచి, కాశి క్షేత్రాలు పరమశివుని రెండునేత్రలుగా అభివర్ణింప బడ్డాయి.**

కంచిపట్టణమంతా దేవాలయలమయం. కొన్ని వేలకొలది దేవాలయాలు ఉన్నాయి . అదులో **ముఖ్యమైనవి :– కామాక్షి, ఏకామ్రనాథ, వరదరాజస్వామి (బంగారుబల్లి వుండే ఆల యం), కైలాసనాథ, వైకుంఠపెరుమాళ్, ఉత్కళందపెరుమాళ్ (వామనుడు) ఆలయాలు**.

ఈపట్టణంలో ప్రధానదేవత కంచికామాక్షిఅమ్మవారు.**ఇక్కడ ఆరాధించే శివలింగం "పృథ్వీలింగం" జ్యోతిర్లింగాలలో ఒకటి.ఈలింగాన్నిసాక్షాత్తు పార్వతీమాత మట్టితో తయారు**

చేసి స్థాపించింది.మట్టితో చేయబడిన లింగం కాబట్టి, ఈ లింగానికి జలాభిషేకం ఉండదు. ఆదిశంకరులు మనదేశంలో చాలాప్రాంతాలు పర్యటించిన తరువాత కంచిలో ఒక పీఠాన్ని ఏర్పాటు చేసి ఆ మఠాన్ని తానే అధిష్టించారు.

శంకరులు సాటిలేనివారు. వారు అధిష్టించిన ఈ కంచిపీఠంకూడా చెప్పలేనంత ఉన్నత మైనది,పవిత్రమైనది.మనం ఎప్పుడు ఈనేలమీద నడిచినా "**ఈ పుణ్యభూమి–రెండువేల సంవత్సరాల నుండి ఎంతోమంది మహా మహిమాన్వితులు నడిచినదని**" గుర్తుపెట్టుకోవాలి.

శ్రీ ఆది శంకరులు

ఆదిశంకరులు ఉద్భవించేనాటికి, కాలప్రవాహంలో వైదికమతంలో ప్రాంతీయ ఆచారాల కలయికతో,సిద్ధాంతవిభేదాలతో,అనైక్యతతో పాటు అనేక దురాచారాలు కూడా ప్రవేశించాయి. ఆలోపాలను ఎత్తి చూపుతూ వైదిక మతాలను నిరసిస్తూ వ్యతిరేకంగా అనేక ఇతర మతాలు ముఖ్యంగా జైన,బౌద్ధ మతాలు ఎదురుదాడి చేస్తున్నాయి.మన వెన్నెముకైన వేదాల ఉనికికే ప్రమాదంఏర్పడిన ఆపరిస్థితుల్లో శంకరులు బౌద్ధ,చార్వాకాది108 మతాలను తన అపారజ్ఞానసంపత్తితో ఖండించి ఆమతవిద్వాంసులను జయించి, వైదికమతానికి పర మావధిగా అద్వైతమతాన్ని నిరూపించి, స్థాపించారు. అసలు అన్నిరకాల మతాలు భారత దేశంలో ఉండేవనే స్పృహనే లేకుండా చేసారు.

వీరు శరీరంతో జీవించింది కేవలం 32 సం.లు. నేటికి 2500 సం.లకు పూర్వం ఇప్పటి కేరళరాష్ట్రం,కాలడి గ్రామంలో శివగురు, ఆర్యాంబ పుణ్యదంపతులకు వైశాఖ మాసం–శుక్లపక్షం–పంచమి, సందననామ సంవత్సరంలో జన్మించారు. శంకరభగవత్పాదులు అపర ఈశ్వరఅవతారం.జ్ఞానులందరికీ చక్రవర్తి. వీరి అద్భుతమైన లీల ఒకటి జగమెరిగినదే – బాలశంకరులు భిక్ష కోరినపుడు దీన స్థితిలో ఉన్న ఒక ఇల్లాలు ఇంటిలోఅంతా వెదికి ఏమీలేక ఒక ఎండిపోయిన ఉసిరికాయన ఉంటే,అది మాత్రమే ఇస్తుంది. **అమె నుదిటిపై ఉన్న దారిద్ర్యరాతను చదివి శంకరభగవత్పాదులు జాలిచెంది శ్రీమహలక్ష్మిని కనకధారా స్తోత్రంతో స్తుతిస్తారు.** అమ్మవారు ప్రసన్నం చెంది ఆ ఇల్లాలి ఇంట్లో బంగారు ఉసిరికాయల వర్షం కురిపించారు.

శంకరులు శ్రీగోవిందభగవత్పాదుల వారిని గురువుగాస్వీకరించి వారి ఆదేసానుసారం అద్వైతవిద్య బోధిస్తూ వారణాసి చేరుకుంటారు. అక్కడఉండే కాలంలో వ్యాసులవారి బ్రహ్మసూత్రాలకు,భగవద్గీతకు భాష్యాన్ని రచించారు.

ఒకనాడు వృద్ధునిరూపంలో వ్యాసమహాముని శంకరులతో తీవ్రంగా వాదిస్తారు. ఆసమయంలో శంకరులశిష్యులు పద్మపాదులవారు, వచ్చినవారు వ్యాసులని తెలియపరచగా

శంకరులు వారికిప్రణమిల్లుతారు.శంకరులజ్ఞానానికి,భాష్యానికి సంతోషించి వ్యాసులవారు ఆశీర్వదించి అనుగ్రహిస్తారు.

వారణాసిలో ఒకసారి విశ్వేశ్వరుని దర్శించుకొని వస్తుండగా వారికి ఎదురుగా ఒక ఛండాలుడు 4 కుక్కలతో వస్తారు. అతనిని అడ్డుతప్పుకుని దారిఇమ్మని శంకరులు అంటారు. ఆఛండాలుడు అద్వైతసారాన్నంతా అలవోకగా తెలియపరుస్తూ ఇలాప్రశ్నించారు:"ఓ విద్వత్తు కలిగిన బ్రాహ్మణుడా! ఏది, దేనినుంచి, ఎక్కడికివెళ్ళాలి? ఆహారంతో తయారయిన ఈ జీవ శరీరంవెళ్ళాలా?, లేక సజీవమైఉన్న ఈచైతన్యాన్ని శరీరంనుండి విడిపడి వేరుగా వెళ్ళ మంటున్నావా? దేనిని భేదించమని అంటున్నావు?" నిరుత్తరులైన శంకరాచార్యులు వారిని సాక్షాత్తు శివునిగా గుర్తిస్తారు.అద్భుతమైన **'మనీషాపంచకం'** తో వారిని స్తుతిస్తారు.శంకరుల హిమాలయయాత్ర గురించి విశేషంగాచెప్పబడిన విషయాలు ఉన్నాయి.వారు హిమాలయాల లో కైలాసనివాసులయిన శివపార్వతులను దర్శించాలని యోగశక్తితో అక్కడకుచేరుకుంటారు. ఆ ఆదిదంపతులను స్తుతించి శివుని ఆశీస్సులతోపాటు ఐదు 'స్ఫటికలింగాల'ను పొందుతా రు. లోకక్షేమం కోరి, శంకరులు ఆలింగాలలో– ముక్తిలింగాన్ని 'కేదార్నాథ్' ఆలయంలో, 'వరలింగా'న్ని నేటి నేపాల్ లోని 'నీలకంఠక్షేత్రం'లో, 'భోగలింగా'న్ని కర్ణాటకలోని శ్రీశారదా పీఠంలో, 'మోక్షలింగా'న్ని తమిళనాడులోని చిదంబరంలోనూ, **ఐదవలింగమైన 'యోగలింగా' న్ని సాక్షాత్తు, తాను అధిష్టించిన కంచి కామకోటి పీఠంలో స్థాపించారు**.ఈలింగాలు శంకరుల కాలంనుండీ పారంపర్యంగా ఎప్పటికీ పూజలు అందుకుంటూనే ఉన్నాయి–ఉంటాయి.

ప్రసిద్ధమైన అద్వైతవేదాంత విద్యామఠాలను శ్రీశంకరులు ఏర్పాటుచేసారు. అవి– శారదాపీఠం(శృంగేరి), కంచికామకోటిపీఠం(సర్వజ్ఞపీఠం), బదరీనాథ్ (హిమాలయ ప్రాం తం), జగన్నాథ (పూరి),ద్వారకాపీఠం(గుజరాత్).

వివిధగ్రంధాలలో శ్రీశంకరులు ఈ పైనచెప్పినవే కాక,ఇంకాఎన్నోమఠాలనుఏర్పరిచారని చరిత్రకారులుచెపుతున్నారు.శంకరులు దేశంలోని చాలాప్రాంతాలలో పర్యటించారు.అందులో ముఖ్యంగా చెప్పవలసినవి: కాశి, ప్రయాగ, బద్రీనాథ్, కాశ్మీర్, చిదంబరం, జంబుకేశ్వరం, శ్రీరంగం, రామేశ్వరం, తిరుపతి, ద్వారకా, పూరి మొదలైనవి.

కంచిలో శ్రీ శంకరులు కామాక్షి అమ్మవారి మూర్తి ఎదురుగా **"శ్రీచక్ర స్థాపన"** చేసారు. ఆ శ్రీచక్రం వారు ఉన్నప్పటినుండీ ఇప్పటికీ, ఎప్పటికీ పూజలు అందుకుంటూనే ఉంటుంది.

చివరికాలంలో వారు కంచిలోనే తన32వఏట, శివైక్యంపొందారు.**సురేస్వరాచార్యులు, పద్మపాదులు(సనందులు), తోటకాచార్యులు, హస్తమలకులు శ్రీశంకరుల శిష్యులలో ముఖ్యు లు**.శంకరులు కంచిపీఠాన్ని, ఈనలుగురు మిగిలిన నాలుగు పీఠాలను అధిష్టించారు.ఈ మఠాలద్వారా శంకరుల జ్ఞానదీప్తి ప్రపంచానికి ఎప్పటికీ ప్రసరిస్తూనే ఉంటుంది.

ఆది శంకరులు – అభినవ శంకరులు :

అభినవ శంకరులు: ఆదిశంకరాచార్యులు వచ్చిన తర్వాత పదమూడు వందల సంవత్సరాలకు అవతరించిన వారు. ఆదిశంకరాచార్య వారు చేసిన అవైదిక మత నిర్మూలనం వీరు కూడా చేశారు.సర్వజ్ఞపీఠాన్ని కూడా అధిరోహించారు. వీరు ఇతరదేశాలకు కూడా వెళ్లినట్లు ఆధారాలున్నాయి. చైనా,Turkistan(a city in Kazakhstan) ఆఫ్ఘనిస్తాన్ లో ఒక భాగమైన బాహ్లిక రాజ్యాలకు కూడా వెళ్లినట్లు గణరత్నమాల అనే గ్రంథం చెబుతుంది. ఆయాదేశాలు వీరిని తమ గురువులు గా కీర్తించారని ఉంది.

"చీన– తురుష్క – బాహ్లికాత్యై : స్వరుపాచార్య తయాస్తుతం (శ్లో.66)"

ఆదిశంకరులతో సమానమైన ఈ "**అభినవ శంకరుల**" వారిని ఆదిశంకరులు గానే భావించి ఇంతకుముందు పేర్కొన్న **'నిధినాగ'** శ్లోకాన్ని ఆదిశంకరులకు ఆపాదించారు.

ఈశ్లోకంలో పేర్కొనబడిన శంకరులు,**'అభినవశంకరు'లే**.చాలామంది వీరినే "ఆది శంకరాచార్యులవార" ని భ్రాంతిపడటానికి కారణం అయింది. కానీ వీరు క్రీస్తుశకం 8వ శతాబ్దానికి చెందినవారు.వీరు(**అభినవ శంకరులు**) పుట్టింది విభవ నామ సంవత్సరం దశమి నాడు. ఆదిశంకరులనుంచి వచ్చిన శిష్య పరంపరంగా కంచి పీఠాన్ని అధిష్టించిన 68 వ ఆచార్యులు – నడిచేదేవుడు గా ప్రఖ్యాతి గాంచిన "శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీ మహాస్వామి" – వీరినే **'పరమాచార్యుల'ని**,**'మహాస్వామి'** అని,**'పెరియవ'** అని కూడా సంబోధిస్తారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలు: 1. సోమనాథుడు – విరవల్ రేవు, ప్రభాస్ పటాన్, సౌరాష్ట్ర, కథియవార్, గుజరాత్, 2. మల్లికార్జునుడు – శ్రీశైలం, నంద్యాలజిల్లా,ఆంధ్రప్రదేశ్ ,3. మహాకాళుడు – (అవంతి) ఉజ్జయిని, మధ్యప్రదేశ్ ,4. ఓంకారేశ్వరుడు, అమలేశ్వరుడు – మామలేశ్వరం, మధ్యప్రదేశ్ ,5. వైద్యనాథుడు (అమృతేశ్వరుడు) – పర్లి (కాంతిపూర్), దేవఘర్, బీహార్ ,6. భీమశంకరుడు – డాకిని, భువనగిరి జిల్లా, పూనే వద్ద, మహారాష్ట్ర ,7. రామేశ్వరుడు – రామేశ్వరం, తమిళనాడు ,8. నాగేశ్వరుడు (నాగనాథుడు)– (దారుకావనం) ద్వారక వద్ద, మహారాష్ట్ర ,9. విశ్వనాథుడు – వారణాసి, ఉత్తరప్రదేశ్ ,10. త్రయంబకేశ్వరుడు – నాసిక్, మహారాష్ట్ర ,11 కేదారేశ్వరుడు – హిమాలయాలలో, గర్వాల్ జిల్లా, ఉత్తరప్రదేశ్ ,12. ఘృష్ణేశ్వరుడు (కుసుమేశ్వరుడు) – వెరుల్–నగర్, ఔరంగాబాదు ఎల్లోరా గుహల వద్ద, మహారాష్ట్ర.

పరమాచార్యులు... శ్రీ చంద్రశేఖర సరస్వతీస్వామి

పరిపూర్ణదైవీసంపద,అత్యంత కఠోరనియమపాలన,తీవ్రాతితీవ్రమైన తపస్సు,అచంచలమైన శ్రద్ధ, అపారశాస్త్ర పాండిత్యము, అనన్యమైన దైవీ–ధర్మ కార్యనిర్వహణ వారిని ప్రపంచం నలుదిశలా పరమాచార్యులవారిని **మరో శంకరాచార్యులు** గా ప్రసిద్ధి పొందేటట్లు చేసాయి.

పరమాచార్యులవారు వేలూరు(తమిళనాడు) లో,స్మార్తహొయసల కర్నాటక బ్రాహ్మణ కుటుంబంలో,1894వసం.. మే20న,–అనూరాధ నక్షత్రంలో జన్మించారు. స్వామివారి తల్లి

దండ్రులు పుణ్యదంపతులు మహాలక్ష్మీదేవి,సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. జిల్లా విద్యాధికారిగా పని చేసిన సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి స్వామివారు రెండవకుమారుడు. పరమాచార్యస్వామివారికి జన్మించినప్పుడు పెట్టినపేరు స్వామినాథన్. స్వామినాథన్ దిండివనంలో తనతండ్రి పని చేస్తున్న ఆర్కాట్ అమెరికనన్ మిషన్ ఉన్నతపాఠశాలలో విద్యాభ్యాసం చేసి చురుకైన విద్యార్థి గా పేరు తెచ్చుకున్నారు. స్వామికి 1905సం.లో ఉపనయనం జరిగింది.

13వఏటనే సన్యాసదీక్ష పుచ్చుకొని, కంచికామకోటిపీఠం అధిష్టించారు.స్వామివారు కేవలం ఒక పీఠాధిపతే కారు, వారిలో ఒకవేదరక్షకుడు, ఒకశాస్త్రపరిశోధకుడు, రాజకీయవేత్త, చారిత్రక పరిశోధకుడు, జ్యోతిశ్శాస్త్రవేత్త, బహుభాషా–పండితుడు (ఇంగ్లీషు, ఫ్రెంచి, హిందీ, తమిళం, కన్నడ, బెంగాలీ, తెలుగు లతో పాటు,17భాషలలో నిష్ణాతులు)ఉన్నారు.ఇన్ని విషయాల్లో విస్తృతమైనప్రతిభ,సామర్థ్యాలు కలిగిన చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామివారి జీవితం–మహాఅద్భుతం,మహిమాన్వితం. నిండునూరేళ్ళు(1994,జనవరి,8వరకు), విలక్షణమైన జీవితాన్ని గడిపి,పాదచారియై,దేశమంతా సంచరిస్తూ, ధర్మప్రభోదాలుచేసి, దైవశక్తిని నిరూపిస్తూ, సనాతన ధర్మ పునరుద్ధరణకై జీవితాన్ని అంకితంచేసుకున్న మహాపురుషులు శ్రీస్వామివారు.

స్వామివారి శారీరకశ్రమ ఊహకే అందనిది.**1919 వ సం. లో మొదలుపెట్టిన పాదయాత్ర 21 సం.ల పాటు సాగింది**. కొన్ని లక్షలమందిని అనుగ్రహిస్తూ ఆధ్యాత్మిక జాగృతి కలిగిస్తూ చేసిన ఈయాత్రలో 1927లో 'పాల్ఘాట్' వద్ద మహాత్మాగాంధీతో కొన్నిగంటలపాటు చర్చలు జరిపారు.గాంధీగారు భోజనం చేయటం మరిచిపోవటం తో రాజాజీగారు (C.రాజగోపాలాచారి) రాత్రి భోజనానికి గుర్తుచేస్తే, గాంధీగారు మహాస్వామిని ఉద్దేశించి,'ఈ మహానుభావుని తో మాట్లాడు తుంటేనే నాకు కడుపు నిండిపోయింది. ఇంక నాకుభోజనం అవసరంలేదు' అన్నారు.

"కౌపీనవంతః, ఖలు భాగ్యవంతః" అన్న శంకరులవాక్యాలకు ప్రమాణంగా జీవించారు శ్రీస్వామివారు.కోట్ల విలువచేసే మఠం ఆస్తులు,లక్షలాది భక్తులు ఉన్నా,పట్టు పరుపులతో ఊరేగే సౌకర్యంఉన్నా స్వామివారు వాడేది చెక్కపాత్రలు, పడుకునేది–అంగవస్త్రం పరచిన కటికనేల. భయంకరమైన ఎండలలో పర్యటించేటప్పుడు కూడా స్వామివారు కాళ్ళు చావుకోటానికికూడా వీలులేని,గాలికూడారాని ఇరుకుగాఉన్న మేనాలోనే విశ్రమించేవారు. సౌచామనములకు తప్పించి నీరు కూడా తీసుకునేవారు కాదు. **సంవత్సరంలో సగం రోజులు ఉపవాసం, చాలారోజులు కాష్ఠ మౌనం, ఏకాదశినాడు ఉపవాసం, సాయంత్రం త్రయోదశి ఘడియలు వస్తే ఉపవాసం, నవరాత్రులలో ఉపవాసం.14ఏళ్లకే ఉప్పు, చింతపండు, మిరపకాయలు వదిలేసారు.కొన్నాళ్ళుకేవలం పచ్చిఅవుపాలు, మరికొన్నాళ్ళు కేవలం మూడు పిడికిళ్ళు అన్నం, ఇంకొన్నాళ్ళు కేవలం పెరుగులో నానబెట్టిన పేలాలు.. ఇలా తమ జీవితమంతా అత్యంత కఠోర నియమపాలనతో జీవించారు**.ఒకసారి ఒకట్రస్ట్ లోని డబ్బులు పొరపాటున వేరొక

ట్రస్ట్ లోని కార్యక్రమాలకు వాడటం జరిగింది. అది ట్రస్ట్ నియమాలకు విరుద్ధమని తరువాత తెలిసింది.ఆడబ్బు తిరిగి మొదటిట్రస్ట్-లోజమకట్టే ఏర్పాటు చేసినంతవరకూ ఉపవాసం చేసారు స్వామివారు .**పరమాచార్యుల వారికి నాలుగు సార్లు 1954, 1957, 1965 మరియు 1993 సం.ల లో కనకాభిషేకం జరిగింది**. వారిని సన్మానించిన భక్తులలో సర్వజాతుల వారు, ఇతరమతాల వారు, విదేశాలవారు, సామాన్యమానవుల నుంచి, ప్రధానమంత్రి, రాష్ట్రపతుల వరకు ఉన్న అందరి గౌరవ వందనాలను పొంది, వారిని అనుగ్రహించారు.

"స్వామివారిని ఎందుకుఅర్చించవలె?– సమస్తసాధకములందు ఉత్కృష్టతనొందిన మన కంచియోగీంద్రులను అర్చించినట్లయితే మనము కోరుకున్న 'సిద్ధి'-మోక్షం లభిస్తుంది.బ్రహ్మ నుంచి-చీమవరకు ఉన్న సమస్తఉపాధుల్లోనూ వ్యాపించిఉన్న బ్రహ్మపదార్ధమును చూడగలి గిన ప్రజ్ఞ వారిది " అంటారు బ్రహ్మశ్రీ కుప్పా లక్ష్మావధాన్లుగారు.

వారే బ్రహ్మ పదార్ధము-సృష్టిలో స్థితమైన ఏ మూలకంతోను విడదీయలేని ఏకత్వం, సంయోగం అవసరం లేని అనంతమైన అద్వైతం వారే అయి ఉన్నారు.

పరమచార్యుల వారు 'తామెవరో' తెలియ పరిచిన ఒకసందర్భం:

తమిళనాడులో 'పొల్లాచ్చి' గ్రామంనుంచి వచ్చిన మహిళ, వ్రతంలోకట్టుకునే తోరణాన్ని వారికిచ్చింది.మహాస్వామి దానినితమతలపై ధరించారు.అది కిందికిజారి స్వామివారికన్నుకి అడ్డంగాఉందని ఒకశిష్యుడు అడ్డుతీయబోయాడు.వెంటనే వారు,"దాన్నెందుకు తీస్తావు? అది నోములకు కట్టుకునే తోరణం, ఆ అమ్మగారిచ్చింది. స్త్రీలందరూ తోరణాలను అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ.కానీ, ఈమెదృష్టిలో **" నేనే అమ్మవారు-అందుకే ఆమె దానిని నాకు సమర్పించింది "** అన్నారు.

వేరొక సందర్భంలో ఒక చిత్రపటం చూసారు. అందులో మూడుచిత్రాలుఉన్నాయి -ముందుగా దక్షిణామూర్తి,తరువాతఆదిశంకరులు,ఆచిత్రాలకు క్రింద పరమాచార్యులచిత్రం ఉన్నాయి. దాన్నిచూపిస్తూ ,చిత్రంలో ఈ ముగ్గురు చిత్రాలను మాత్రం ఎందుకు చిత్రించారు? అని ప్రశ్నించి ,జవాబు కూడా ఆయనే ఇచ్చారు **"ఈయనే ఆయన, ఆయనే ఈయన"** అని **వేలుపెట్టి చూపుతూ "అందువలననే ఇలా చిత్రించారు" అని తన అవతారాన్ని స్పష్టంగా తెలియపరిచారు.** అంటే **దక్షిణామూర్తికి, ఆదిశంకరులకు, పరమచార్యులకు భేదం ఏమీ లేదు**.

వారి లీలలు 'గంగామహాసముద్రం'.అందులో గుక్కెడు'జలలీలను'తాగితే కూడా అనంతమైన వారి కృపకు పాత్రులమవుతాము!!! అతి స్వల్పమైన పెట్టుబడికి అనంతమైన రాబడి అన్నమాట!

*** *** *** *** *** ***

పరమాచార్యుల లీలావిషయముల పట్టిక

క్రమసంఖ్య	లీలా విషయము	పుట
1.	పరమాచార్య కురిపించిన కనకధార	1
2.	నేను చూసిన దేవుడు	4
3.	పెరియవా – పెరుమాళ్	7
4.	గాయత్రి జపించండి	9
5.	చిత్తూరుకరువు – పరమాచార్యఆదరువు	10
6.	మైలాపూర్ కర్పగాంబళ్	11
7.	మహాస్వామి – మక్కాయాత్ర	12
8.	పరమాచార్య – ప్రదోషంమామ	16
9.	దుప్పటి – దయ	17
10.	అరటి ఆకులు – ప్లాస్టిక్ పొట్లాలు	19
11.	మహాస్వామి – మల్లయోధుడు	20
12.	కాలే కాఫీ – చల్లని మజ్జిగ	21
13.	నేలపైపడ్డ ప్రసాదం	22
14.	మండుటెండ – మజ్జిగ	23
15.	సన్యాసి సంకల్పం	24
16.	ఆశ – ఆశీస్సులు	25
17.	ప్రసాదం – పరమార్థం	26
18.	ఆరోగ్య ప్రదాత	28
19.	మా చిన్నమ్మ జీవితం	30
20.	తోటకూర పప్పు	31
21.	ఎవరు జగద్గురువు?	32
22.	పూర్వీకుల ఆస్తి	33
23	ఇది సర్వజ్ఞులకే సరి	34
24	కంచి స్వామి పంపినవారు రండి	36
25	విదేశీయానం – ప్రాయశ్చిత్తం	37
26	భక్తవత్సలుడు – భక్తవత్సలం	40
27	త్వరగా బయటకు రా!	41

క్రమసంఖ్య	లీలావిషయము	పుట
28.	సన్యాసి – తొమ్మిదో తిరుకళ్యాణం	41
29	వరి పేలాలు – వరి మొక్కలు	46
30	లేచి నడిచి వెళ్ళు	48
31	నువ్వు ఎక్కడున్నా, నీవెంటే..	50
32.	భక్త జన రక్షకుడు	52
33.	పుల్లని దానిమ్మ పళ్ళు	53
34.	పచ్చని పాల సముద్రం	56
35.	మా జీవితాలకు 'మాష్టర్'	58
36.	గోవు వెనక వెళ్ళడమెందుకు?	62
37.	మహాస్వామి – మానసిక చికిత్స	64
38.	ప్రమాదం – ప్రమోదం	66
39.	యతి మహాలయం	69
40.	ఆమెను భర్త దగ్గర వదిలి రా...	71
41.	గుడివ్యవహారం – గబ్బిలజన్మ	72
42.	నాంది–శ్రాద్ధ భోజనం	74
43.	విదేశీయాన విన్నపం	75
44.	సబ్బు – స్నానం	77
45.	కంప్యూటర్ – కరుణ	78
46.	ఎంతటి మహానుభావులు! ఎంతటి కరుణాసముద్రులు!!	80
47.	మఠం – మందుల షాపు	82
48.	ముందు పద్మావతీ కల్యాణంచెయ్యి!	84
49.	వర్షం పడిందా?	87
50.	పరమాచార్య లీలాద్భుతం	89
51.	ఇప్పుడు 'శ్రేష్టిదార్' అని పిలవొచ్చునా?	91
52.	పూల కిరీటం–పండిత గౌరవం	93
53.	ఆయుర్వేదవైద్యం–బొమ్మలకొలువు	94
54.	వేదాధ్యయనం – విదేశీయానం	98
55.	కనకధారా స్తోత్రం	101
56.	అన్నపూర్ణాస్తుతిః	103

శ్రీ పరమాచార్య అష్టోత్తర శతనామావళి

శ్రీచంద్రశేఖరేంద్రాస్మదాచార్యాయ నమః
శ్రీచంద్రమౌళి పాదాబ్జ మధుపాయ నమః
ఆచార్యపాదాధిష్టానాభిషిక్తాయ నమః
సర్వజ్ఞాచార్య భగవత్స్వరూపయ నమః
అష్టాంగయోగ నిష్టాది గరిష్ఠాయ నమః
సనకాది మహాయోగి సదృశాయ నమః
మహాదేవేంద్ర హస్తాబ్జ సంజాతాయ నమః
మహాయోగీంద్ర సంవేద్య మహత్వాయ నమః
కామకోటి మహాపీఠాధీశ్వరాయ నమః
కలిదోష నివృత్యేక కారణాయ నమః ||10
శ్రీ శంకర పదామ్భోజ చిన్తనాయ నమః
భారతీకృత జిహ్వాగ్ర నర్తనాయ నమః
కరుణారస కల్లోల కటాక్షాయ నమః
కాన్తి నిర్జిత సూర్యేందు కప్రాభాయ నమః
అమన్దానంద కృన్మంద గమనాయ నమః
అద్వైతానంద భరిత చిద్రూపాయ నమః
కటితట లసచ్చారు కాషాయాయ నమః
కటాక్షమాత్ర మోక్షేచ్ఛా జనకాయ నమః
బాహుదండ లసద్దండ భానురాయ నమః
ఫాలభాగ లసద్భూతి భూషితాయ నమః ||20
దరహాస స్ఫుర ద్దివ్య ముఖాబ్జాయ నమః
సుధామధు సౌహార్ద భాషణాయ నమః
తపనీయ తిరస్కారి శరీరాయ నమః
తపఃప్రభా విరాజత్వక్తాదృశాయ నమః
సంగీతానంద సందోహ సర్వస్వాయ నమః
సంసారాంబుధి నిర్మగ్న తారకాయ నమః
మస్తకోల్లాసి రుద్రాక్ష మకుటాయ నమః
సాక్షాత్పర శివామోఘ దర్శనాయ నమః
చక్షుర్గత మహాతేజోత్యుజ్వలాయ నమః
సాక్షాత్కృత జగన్మాతృ స్వరూపాయ నమః ||30
క్వచిద్బాల జనాత్యస్త సులభాయ నమః
క్వచిన్మహా జనాత్యంత దుష్ప్రాపాయ నమః
గోబ్రాహ్మణ హితాసక్త మానసాయ నమః
గురుమండల సంభావ్య విదేహాయ నమః
భావనామాత్ర సంతుష్ట హృదయాయ నమః
భావ్యాది భావ్య దివ్యశ్రీ పదాబ్జాయ నమః
వ్యక్తావ్యక్త తరానేక చిత్కళాయ నమః
రక్తశుక్ల ప్రభామిశ్ర పాదుకాయ నమః
భక్తమానస రాజీవ భవనాయ నమః
భక్తలోచన రాజీవ భాస్కరాయ నమః ||40
భక్త కామలతా కల్పపాదపాయ నమః
భుక్తి ముక్తి ప్రదానేక శక్తిదాయ నమః
శరణాగత దీనార్త రక్షకాయ నమః
శమాది షట్క సంపత్ప్రదాయకాయ నమః
సర్వదా సర్వధా లోక సౌఖ్యదాయ నమః
సదా నవనవాకాంక్ష్య దర్శనాయ నమః
సర్వ హృత్పద్మ సంచార నిపుణాయ నమః
సర్వేంగిత పరిజ్ఞాన సమర్థాయ నమః
స్వప్నదర్శన భక్తేష్ట సిద్ధిదాయ నమః
సర్వ వస్తు విభావ్యాత్మ సద్రూపాయ నమః ||50
దీనభక్తావనైకాంత దీక్షితాయ నమః
జ్ఞానయోగ బలైశ్వర్య మానితాయ నమః
భావమాధుర్య కలిత భావాఢ్యాయ నమః
సర్వభూత గణామేయ సౌహార్దాయ నమః
మూకీభూతానేక లోకవాక్ప్ర దాయకాయ నమః
శీతలీకృత హృత్తాప సంసేవ్యాయ నమః
భోగమోక్ష ప్రదానేక యోగజ్ఞాయ నమః
శ్రీఘ్రసిద్ధికరానేక శిక్షణాయ నమః
అమానిత్వాది ముఖ్యార్థ సిద్ధిదాయ నమః
అఖండైక రసానంద ప్రబోధాయ నమః
నిత్యా నిత్య వివేక ప్రదాయకాయ నమః ||60
ప్రత్యగేక రసాఖండ చిత్సుఖాయ నమః
ఇహాముత్రార్థ వైరాగ్య సిద్ధిదాయ నమః
మహామోహ నివృత్యర్థ మంత్రదాయ నమః
క్షేత్ర క్షేత్రజ్ఞ ప్రత్యేక దృష్టిదాయ నమః
క్షయవృద్ధి విహీనాత్మ సౌఖ్యదాయ నమః

తులాజ్ఞాన విహీనాత్మ తృప్తిదాయ నమః
మూలాజ్ఞాన విహీనాత్మ ముక్తిదాయ నమః
భ్రాంతి మోహోచ్చాటన ప్రభంజనాయ నమః
శాంతి వృష్టి ప్రదామోఘ జలదాయ నమః
ఏక కాలకృతానేక దర్శనాయ నమః ||70
ఏకాంత భక్త సంవేద్య స్వభావాయ నమః
శ్రీ చక్ర రధ నిర్మాణ సుప్రదాయ నమః
శ్రీ కళ్యాణ తరామేయ సుశ్లోకాయ నమః
ఆశ్రితాశ్రయణీయత్వ ప్రాపకాయ నమః
అఖిలాండేశ్వరీ కర్ణ భూషాధాత్రే నమః
సశిష్యగణయాత్రా విధాయకాయ నమః
సాధుసంఘ సుతామేయ చరణాయ నమః
అవిభిన్నాత్మైక్య విజ్ఞానబోధకాయ నమః
భిన్న భిన్న మతైశ్చాభి పూజితాయ నమః ||80
తత్వవిద్విపాక సద్బోధ దాయకాయ నమః
తత్తద్భాషా ప్రకటిత స్వబోధాయ నమః
సర్వత్ర సాధితానేక సత్కార్యాయ నమః
చిత్ర చిత్ర ప్రభావాతి ప్రసిద్ధాయ నమః
లోకానుగ్రహ కృత్కర్మ నిష్ఠితాయ నమః
లోకోద్ధరణ కృద్ధూరి నియమాయ నమః
సర్వవేదాంత సిద్ధాంత సమ్మతాయ నమః
కర్మబ్రహ్మాత్మ యోగాది మర్మజ్ఞాయ నమః
వర్ణాశ్రమ సదాచార రక్షకాయ నమః
ధర్మార్థ కామ మోక్ష ప్రదాయకాయ నమః ||90
వేద వాక్య ప్రమాణాది పారీణాయ నమః
పాదమూల సతానేక పండితాయ నమః
వేదశాస్త్రార్థ సద్గోష్ఠిలోలుపాయ నమః
వేదశాస్త్ర పురాణాది విచారాయ నమః
వేద వేదాంగ తత్వ ప్రబోధకాయ నమః
వేదమార్గ ప్రమాణత్వఖ్యాపకాయ నమః
నిర్నిద్ర తేజోవిరాజిత నిద్రాఢ్యాయ నమః
నిరంతర మహానంద సంపూర్ణాయ నమః
స్వభావ మధురోదార గాంభీర్యాయ నమః
సహజానంద సంపూర్ణ సాగరాయ నమః ||100
నాదబిందు కళాతీత వైభవాయ నమఃవాది భేద
విహీనాత్మ బోధనాయ నమః
ద్వాదశాంత మహాపీఠ నిషణ్ణాయ నమః
దేశకాలాపరిచ్ఛిన్న దృగ్రూపాయ నమః
నిర్మాణ శాంతి మహిత నైశ్చల్యాయ నమః
నిర్లక్ష్య లక్ష్య సంలక్ష్య నిర్లేపాయ నమః
శ్రీ షోడశాంత కమల సుస్థితాయ నమః
శ్రీచంద్రశేఖరేంద్రసరస్వత్యై గురుభ్యోన్నమః ||108

1. పరమాచార్య కురిపించిన కనకధార

పరమాచార్యస్వామివారే సాక్షాత్ ఆదిశంకరుల మరొకఅవతారమని, స్వామివారికి గొప్ప భక్తుడైన శ్రీ లక్ష్మీనారాయణన్ తన జీవితానుభవం ద్వారా తెలుసుకున్నారు.

చాలా సంవత్సరాల క్రితం లక్ష్మీనారాయణన్ గారి తాతగారు మరియు తండ్రిగారు చాలా పెద్ద స్థితిలో ఉండేవారు. **ఆ కాలంలో వారి తాతగారు తంజావూరు దగ్గర్లోని తెప్పకుళం అన్న గ్రామం మొత్తం ఆయనదే. కానీ విధి వైపరీత్యాల వల్ల మొత్తం కోల్పోయి, ఆ కుటుంబం కడు పేదరికంలోకి వెళ్లిపోయింది.** కుటుంబ పరిస్థితి వల్ల లక్ష్మీనారాయణన్ రోజూ మానసిక క వేదనను అనుభవిస్తున్నాడు.

తండ్రి దురదృష్టవశాత్తు ఇటువంటి స్థితిలో ఉండి, కోర్టు కేసులో చిక్కుకోవడం వల్ల, ఎనిమిదేళ్ళ లక్ష్మీనారాయణన్ తన అమ్మమ్మ, తాతయ్యల వద్ద ఉండేవాడు. తాతగారి ఊరైన మరయూర్ లో అప్పుడు పరమాచార్య స్వామివారు మకాం చేస్తున్నారు. తను ప్రతిరోజూ స్వామివారి దర్శనం చేసుకునేవాడు. లక్ష్మీనారాయణన్ ఎంతో అప్యాయతతో స్వామివారితో మాట్లాడేవాడు. స్వామివారు కూడా ఎంతో ప్రేమతో అతడిని "మందు" అని పిలిచేవారు.

లక్ష్మీనారాయణన్ 'క్రోంపేట' లోని యం.ఐ.టి కళాశాలలో ల్యాబ్ ఇంజనీయరుగా పనిచేస్తూ నెలకు కేవలం రూ.180 సంపాదిస్తున్నాడు.తల్లితండ్రులు, పిల్లలు, ఇతర బంధువులతోకలిపి, పదిహేడుమంది ఉన్న కుటుంబాన్నిపోషించడానికి ఇది ఏమాత్రం సరిపోదు. తండ్రిగారుకూడా, ఏమీ ఉన్నతమైన ఉద్యోగం చేయడంలేదు. కొన్ని సంవత్సరాల పాటు ఆయన శ్రీమఠంలో పరమాచార్యస్వామివారికి అంకితభావంతో పనిచేసే సహాయకుడిగా పనిచేశారు.**అంతకష్టంలో కూడా ఎన్నోఏళ్లుగా చేస్తున్న శివపూజను మాత్రం ఆయన వదలలేదు. *లక్ష్మీనారాయణన్ తన సంపాదనతో కేవలం గంజితో కుటుంబసభ్యుల సగం కడుపు మాత్రమే నింపగలుగుతున్నాడు. ఎన్నోమార్లు కేవలం నీరుతాగి వారిఆకలిని తీర్చుకుంటున్నారు.*** లక్ష్మీనారాయణన్ ఉద్యోగంతో పాటుగా సాయంత్రాలు మరొక చోట పనిచేస్తున్నా, ఇల్లు గడవడానికి సరిపోవడం లేదు.దాంతో తనకి దైవంపైనమ్మకం పోయి, జీవితంపై వ్యతిరేక భావనలు ఏర్పరుచుకున్నాడు.

రుద్ర నమకచమకాలు పఠిస్తూ తన **తండ్రి చేసే శివపూజను చూసి, కోపంతో "మన కుటుంబం పడుతున్న కష్టాలను చూసికూడా చలించని భగవంతుడిని ఎందుకు పూజ చేస్తున్నారు?"** అని అడిగేవాడు.

మహాస్వామి వారు 1955లో పశ్చిమ మాంబళంలోని రామేశ్వరం వీధిలో మకాం చేస్తున్నప్పుడు లక్ష్మీనారాయణన్ జీవితం ఒక గొప్ప మలుపుతిరిగింది. ఎలాగంటే ...

స్వామివారిదర్శనం చేసుకోవడానికి తనకు సమయం లేకపోవడంతోపాటు, "ఇంత కష్టంలోఉన్నా పెరియవ మనకుటుంబాన్ని ఎందుకుఆదుకోవడంలేదు?" అని తన తండ్రితో ఎప్పుడూ వాదించేవాడు.

ఒకరోజు లక్ష్మీనారాయణన్ తండ్రి మహాస్వామివారి దర్శనానికివెళ్ళి తమ కుటుంబ పరిస్థితి, కుమారుని ప్రవర్తన గురించి స్వామివారికి తెలిపారు. మరుసటిరోజు శుక్రవారం, తమ ఇంటికి వస్తానని మాటిచ్చారు స్వామివారు.

వారి తండ్రిగారి ఆనందం చెప్పనలవి కాదు. కుమారుడు ఇంటికి వచ్చేదాకా వేచి యుండి, శుక్రవారం రోజున మహాస్వామి వారు తమఇంటికి వస్తున్నారని, కనుక కళాశాల నుండి నేరుగా ఇంటికే రావాలని తెలిపారు.

"మన ఇంటికి ఎందుకు రావడం?" అని నిర్లక్ష్యంగా అడిగాడు లక్ష్మీనారాయణన్. కళాశాల నుండి ఇంటికిరాకుండా నేరుగా పనికి వెళ్లిపోయాడు.**మాటిచ్చినట్టుగానే మరుసటి రోజు, మహాస్వామివారు ఇంటికివచ్చి,పూజగదిలో శ్రీచక్రాన్నిప్రతిష్ఠించి ఆ కుటుంబ సభ్యులందరినీ అనుగ్రహించారు**.ఆరోజు ఆకుటుంబంమొత్తం అంతులేని ఆనందాన్ని పొందింది.

కానీ లక్ష్మీనారాయణన్ తండ్రిగారు మాత్రం తనకుమారుడు రాకపోవడం గురించి చాలాకోపంగా ఉన్నారు.కుమారుని రాకకోసం నిద్రపోకుండా వేచియున్నారు. ఎప్పటిలాగే రాత్రి పదకొండు గంటలకు పని ముగించుకుని ఇంటికి వచ్చి భోజనంముగించగానే, **"నేను ఎప్పుడు నిన్ను ఏమీ అడగలేదు.కేవలం ఒక్కపూటభోజనం,ఒక్కజత పంచలతో బ్రతుకుతున్నాను. ఆ మహాత్ముడు మన ఇంటికి వచ్చినప్పుడు నువ్వు ఉండాలని మాత్రమే కోరాను. నా విన్నపాన్ని నువ్వు తిరస్కరించావు.నువ్వు ఒకపాపివి, మహాపాపివి"** అని కన్నీళ్ల పర్యంతమయ్యారు.తండ్రినోట అంతటి మాటలు విన్న లక్ష్మీనారాయణన్ కూడా ఆపుకోలేక కళ్లనీరు పెట్టుకున్నాడు.

మరుసటిరోజు లక్ష్మీనారాయణన్ తండ్రి మహాస్వామివారితో తనబాధను చెప్పుకోగా, తనకుమారుడిని ఆదివారం తీసుకునిరమ్మని చెప్పారు స్వామివారు. ఆదివారం సెలవుదినం కావడంతో లక్ష్మీనారాయణన్ ఈసారి తప్పించుకోలేకపోయాడు.పూజ అయిపోయిన తరువాత స్వామివారు అందరికీ తీర్థ ప్రసాదం ఇస్తున్నారు. లక్ష్మీనారాయణన్ తండ్రితో పాటు వరుసలో నిలబడున్నాడు. వారివంతు రాగానే స్వామివారు తీర్థం ఇవ్వకుండా పక్కన నిల బడమని చేతితో సైగచేశారు. ఇతరభక్తులకి తీర్థంఇస్తూ, వారితో సంభాషణ మొదలుపెట్టారు స్వామివారు.

"నేను గుర్తున్నానా, మండు?" అని మహాస్వామి వారు లక్ష్మీనారాయణన్ తో సంభాషణ మొదలుపెట్టారు. తనకు ఎనిమిదేళ్ళప్పుడు జరిగిన ఒకసంఘటనను గుర్తుచేసుకున్నాడు.

"సరే. నీ తండ్రి నీ గురించి చాలా విషయాలు చెప్పారు. ఎందుకు నువ్వు అలా ప్రవర్తిస్తున్నావు?"

"సరే, ఏమి చదువుకున్నావు? ఎక్కడ పనిచేస్తున్నావు, ఏ సమయానికి తిరిగొస్తావు?"

ఎలక్ట్రానిక్స్ చదివానని, సాయంత్రం ఐదుదాకా కళాశాలలో పనిచేసి, తొమ్మిది దాకా మరొక ఉద్యోగానికి వెళ్ళి, పదకొండు గంటలకు ఇంటికి తిరిగొచ్చి, మరుసటి రోజు ఉదయం 6:20 నిముషాలకు లేస్తానని చెప్పాడు. ఆదివారం మాత్రమే తనకు సెలవు కనుక ఆరోజు ఉదయం పది గంటలకు లేచి మిగిలిన సమయం వినోదంగా గడుపుతాడు.

తను వచ్చినప్పుడు ఇంట్లో ఎందుకు లేవని స్వామివారు అడుగుతారేమో అని లక్ష్మీనారాయణన్ ఆలోచన. కానీ స్వామివారు ఆ విషయాన్ని అడగకుండా, ఉద్యోగం గురించి వివరంగా, ఆదాయం, ఇతర వ్యాపకాలు, కుటుంబ సభ్యుల వివరాలు అడిగారు . అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతూ,తన ప్రస్తుత ప్రవర్తన గురించిన ప్రశ్నలకు జవాబు చెప్పకుండా మౌనంవహించాడు.**ఎందుకు మేము బీదరికంలో మగ్గుతున్నామని స్వామి వారిని అడిగాడు లక్ష్మీనారాయణన్. అది కర్మ వల్ల అని స్వామివారు సమాధానం ఇచ్చారు. వెంటనే "కర్మ అంటేఏమిటి?" అని స్వామివారితో వాదనకు దిగాడు."నేను ఇప్పుడు చెప్పినా నువ్వు అర్థం చేసుకోలేవు. నీకు ఎలాచెప్పాలో కూడా నాకుతెలియదు" అన్నారు** స్వామివారు.

ఆదిశంకరాచార్యులకి సంబంధించిన ప్రముఖ కథనుచెప్పారు స్వామివారు. శంకరులు చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు ద్వాదశి రోజున ఒక బ్రాహ్మణుల ఇంటి ముందర నిలబడ్డాడు. వారు విపరీతమైన దారిద్ర్యంలో ఉన్నందువల్ల ఆ గృహిణి ఎంతో తేజస్సుతో వెలిగిపోతున్న ఆ బాల శంకరులకి ఇవ్వడానికి ఏమీ లేకపోవడంతో, ఇల్లంతా శోధించి ఒక ఎండు ఉసిరికాయ మాత్రమే ఉండటంతో, దానినే శంకరుల చేతిలో వేసింది.తరువాత బాల శంకరులు " కనకధారాస్తోత్రం"చేసి, ఇంతటి దారిద్ర్యంలో కూడాదాచుకున్న ఉసిరికాయను తనకు దానం చేసినందువల్ల ఆమెను అనుగ్రహించమని మహాలక్ష్మి అమ్మని ప్రార్థించారు. అమ్మ వారు బంగారు ఉసిరికల వర్షం కురిపించి, ఆ ఇంటిని ఐశ్వర్యంతో నింపి ఒక్క దెబ్బతో వారి దారిద్ర్యాన్ని తొలగించింది.

ఇలా చెప్పి తరువాత స్వామివారు లక్ష్మీనారాయణన్ తో, **"మీ ఇంటిలో అమ్మవారిని స్థాపించాను. నీ కష్టాలన్నీ అమ్మవారికి చెప్పుకుని, ఆవిడ పాదాలను గట్టిగా పట్టుకో. నిన్ను తల్లిలాగా రక్షిస్తుంది" అనిచెప్పారు**.దాదాపు గంటన్నరపాటు వారితోమాట్లాడి, వారిరువురికీ తీర్థప్రసాదాలను ఇచ్చి ఆశీర్వదించారు స్వామివారు.

ఇంత జరిగినా లక్ష్మీనారాయణన్ మనస్సులో నమ్మకం కలగలేదు. కానీ అతని భార్యకు మహాస్వామిపై విపరీతమైన నమ్మకం, స్వామివారు తనభర్తని కనకధార పారాయణ చెయ్యమని చెప్పినా, కుటుంబ ఆర్థికపరిస్థితి గురించి అతని మనసులో ఎంతోఆందోళనగా ఉండడంవల్ల నమ్మడం లేదని అర్థం అయ్యింది.

అయితే, ***తనలో తనకి తెలియకుండానే, ఏదోజరుగుతోందని గమనించిన లక్ష్మీనారాయణన్, మూడువారాల తరువాత ఒకరోజు ఆఫీసు నుంచి ఇంటికివచ్చిన తరువాత , కనీసం***

కాళ్ళుచేతులు కూడా కదుక్కోకుండా, చొక్కావిప్పి కనకధారాస్తోత్రం చదవనారంభించాడు.

అలా చదవడం మొదలుపెట్టడంతోనే వెంటనే దాని ప్రభావం అతనిపై చూపసాగింది. ఎందు కంటే,అది ఎవరి ఆజ్ఞ? సాక్షాత్ ఆ ఆదిశంకర అవతారమైన పరమాచార్యవారిదే కదా!

మరుసటిరోజు అతని పైఅధికారి విదేశాలకు వెళ్తూ, డైరెక్టరు గారికి ఇవ్వమని ఒక ఉత్తరం ఇచ్చాడు. లక్ష్మీనారాయణన్ ఆవిషయం మరచిపోయి, మూడు రోజుల తరువాత ఆ ఉత్తరాన్ని డైరెక్టరుకు ఇచ్చాడు.

లక్ష్మీనారాయణన్ అక్కడ నిలుచుని ఉండగానే డైరెక్టరు ఆ ఉత్తరాన్ని చదివాడు. చదవడం మొదలుపెట్టగానే లక్ష్మీనారాయణన్ ని కూర్చోమని చెప్పాడు. **ఆ ఉత్తరంలో అతని గురించి గొప్పగా చెబుతూ, అతడి జీతాన్ని ఏడువందల రూపాయలకు పెంచమని ఉంది.** ***ఇక ఆరోజునుండి మహాస్వామివారి అనుగ్రహం పొంగిపొర్లసాగింది. లక్ష్మీనారాయణన్ తాకిన ప్రతీది బంగారం అయ్యింది.తయారీ,ఫైనాన్స్,రియల్ ఎస్టేట్ మొదలైన వ్యాపారాలను ప్రారంభించాడు. ప్రతి వ్యాపారమూ విజయవంతమై కోటీశ్వరుడు అయిపోయాడు. చెన్నై టి. నగర్ లోని మంగయార్ వీధిలోని ఇళ్లన్నీ కొనగలిగిన సంపదను పొందాడు.***

ఇదంతా మహాస్వామి వారి అనుగ్రహం, ఆశీస్సులు అని ఎంతో వినయంగా చెబుతారు శ్రీలక్ష్మీనారాయణన్. పరమాచార్యస్వామివారు సాక్షాత్ శివావతారులు, ఆది శంకర అవ తారులు.చివరికి లక్ష్మీనారాయణన్ **"కనకధార లక్ష్మీనారాయణన్"** గా ప్రసిద్ధిపొందారు.

source: https://www.youtube.com/watch?v=IRjHJriT_3M

శ్రీ 'కనకధార' లక్ష్మీనారాయణన్ గారి తమిళ ఇంటర్వ్యూ నుండి..

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

(గమనిక: ఈ పుస్తకంలో చివరి పేజీలలో కనకధారాస్తోత్రం ఇవ్వబడింది)

2. నేను చూసిన దేవుడు

ఈ సంఘటన జరిగి ఇప్పటికి నలభై సంవత్సరాలు అయ్యింది. మేము పరమాచార్యవారి భక్తులం.ఎప్పుడు వీలుకుదిరితే అప్పుడువెళ్ళి స్వామివారిని దర్శించుకునేవాళ్ళం. అది కాకుండా ఇక ఏం చెయ్యడానికి మాకు కుదిరే పరిస్థితి కాదు.అప్పటికి మా పెద్దబ్బాయి పుట్టి రెండు సంవత్సరాలు. ఉద్యోగరీత్యా నాభర్త అక్కడకు రావడం వల్ల మేము షోలింగర్ (షోల సింగాపురం or షోలింగూర్) లో ఉండేవాళ్ళం.

అప్పుడు నేను తీవ్రమైనజ్వరం,కఫంవల్ల శ్వాససమస్యతో బాధపడేదాన్ని.వేలూరులో ఉన్న వైద్యులు నన్నుపరీక్షించి,చికిత్సను,ఎన్నో ఇంజక్షన్లు సూచించి,మందులు తీసుకుంటూ ఎక్కువగా విశ్రాంతి తీసుకుంటే ఈ సమస్య నుండి విముక్తి కలుగుతుంది అని చెప్పారు.

తిరుచ్చి నాపుట్టినిల్లు.ఇక్కడ నన్ను చూసుకోవడానికి ఎవరూ లేకపోవడంతో, అక్కడకు తీసుకుని వెళ్ళడానికి మాఅమ్మ వచ్చారు. మా అమ్మకు పరమాచార్యస్వామివారి పై ఎనలేని భక్తి. నేను స్వామిని దర్శనం చేసుకుని, వారితో విభూతి ప్రసాదం తీసుకుంటే అంతా సర్దు కుంటుందని తన ప్రగాఢవిశ్వాసం. మరుసటిరోజు ఆదివారం కావడంతో,నాభర్త నన్ను, మా అమ్మను, పిల్లవాడిని తీసుకుని కాంచీపురం తీసుకునివెళ్లారు. పరమాచార్య స్వామివారు కాంచీపురంలో లేరని, తిరుమల్పూర్ అనే చిన్న గ్రామానికి వెళ్లారని శ్రీమఠానికి వెళ్ళిన తరువాతనే మాకు తెలిసింది.

మా అమ్మ కోరిక ప్రకారం మేము అక్కడకు వెళ్లాము. చిన్న రైల్వేస్టేషన్ ఉన్న ఒక చిన్న గ్రామం అది. చెన్నై వైపు నుండి ఒకేఒక పాసింజర్ ట్రైను మాత్రమే అక్కడకు వస్తుంది. అది కూడా కేవలం రెండు నిముషాలు మాత్రమే ఆగుతుంది. అదే ట్రైను సాయంత్రం ఐదున్నరకు మరలా ఆ స్టేషనుకు దక్షిణం వైపు నుండి వస్తుంది. ఇక ఏ రైళ్లు ఆగవు.

ఆ స్టేషనుకు కేవలం ఒకే ఒక స్టేషనుమాష్టర్ ఉన్నాడు. అన్ని పనులూ అతనే చేస్తాడు. చిన్న స్టేషను కావడంతో ఎక్స్ ప్రెస్ రైళ్లు, సరుకుల రవాణా రైళ్లు వచ్చినా కాని, ఏవీ ఆగవు. దూరంగా కనిపించే ఒక తాటి చెట్టు తప్ప,స్టేషను చుట్టూ కనుచూపుమేర ఉన్నదంతా ఖాళీ ప్రదేశమే.

స్టేషనుమాష్టర్ ఒక కుర్రవాడు, ఇటీవలే విధుల్లోకి వచ్చాడు. చాలా మానవత్వం గల వాడిగా కనిపించాడు.నుదుటిపై సన్నని విభూతిరేఖా కనపడుతోంది.మేము మహాస్వామివారి దర్శనానికి వచ్చామని, ఊరిలోకి వెళ్లడానికి దారెటని అతణ్ణి అడిగాము.

వెంటనేఅతడు, "అరెరే! నిన్ననే స్వామివారు తిరుమల్పూర్ వదిలి, ఇక్కడికి ఆయిదారు మైళ్ళ దూరంలోఉన్న ఇంకా చిన్నపల్లె అయిన కులత్తూరుకు వెళ్లారు" అని చెప్పాడు. కొంత మంది శాస్త్రులు స్టేషనుకువచ్చి ఈ విషయం చెప్పి,కాస్త విభూతిని ఇచ్చివెళ్లారని చెప్పాడు. ఆ పల్లెకు వెళ్లాలంటే కేవలం నడిచి మాత్రమే వెళ్ళాలని వేరే మార్గం లేదని కూడా తెలిపాడు.

ఈ విషయం తెలుసుకునేసరికి అయిదున్నరకు ఉండే రైలు కూడా వెళ్లిపోయింది. ఈ స్టేషను తప్ప ఉండడానికి ఏ సౌకర్యమూ లేదు. నేను శ్వాస తీసుకోవడంలో ఉన్న ఇబ్బంది వల్ల బాధపడుతున్నాను.

అదృష్టవశాత్తు మేము ఆహారం తినేవచ్చి,పళ్ళు వెంటతెచ్చుకున్నాము.బాబు కోసం ఆహారం తయారుచేయ్యడానికి వేడినీరు కూడా పుష్కలంగా తెచ్చుకున్నాము. కానీ అప్పటి ఆచారం ప్రకారం మాఅమ్మ, నేను చాలా నగలు వేసుకున్నాము. అంతేకాక మరుసటి రోజు

మావారు కార్యాలయానికి తప్పకుండా వెళ్ళాలి, తాళంచెవి వారితోనే ఉంది కాబట్టి. ఆ కారణంగా ఆయన తిరిగివెళ్ళటానికి ఆతృతగా ఉన్నారు.

చీకటి పడి రాత్రికాగానే, స్టేషన్మాస్టర్ ఎంతోదయతో మమ్మల్ని తన గదిలో ఉండడానికి అనుమతిచ్చాడు.ఆ గదిలో ఒక పెద్దబల్ల, దానిపై ఎప్పుడూ మోగుతుండే పది టెలిఫోన్లు ఉన్నాయి. ఆ బల్లని ఒకమూలకు నెట్టి, మేము కిందపడుకోవడానికి స్థలం ఇచ్చి, తను రాత్రి పనికోసం ఆ బల్లపద్ద కూర్చుండిపోయాడు.

మరుసటిరోజు ఉదయం,ఏడుగంటల రైలుకి తిరిగివెళ్లిపోవాలని నాభర్త అనడంతో **మా అమ్మ వెంటనే, "ఎలాగో పెరియవానే మనల్ని కాపాడుతారు. ఇంతదూరం వచ్చి వారిని చూడకుండా తిరిగెళ్ళే ప్రసక్తే లేదు. అప్పుడే నా కూతురు రక్షింపబడుతుంది"** అని చెప్పింది. ఇలా ఇద్దరూ తలోవైపు మాట్లాడడంతో నేను కాస్త దిగులు పడ్డాను.

అప్పుడే ఒకఅద్భుతం జరిగింది.దూరంగా ఉన్న తాటిచెట్టు వద్ద ఏదోచిన్నగా కన బడుతోంది. దగ్గరకు వచ్చేపాటికి అది ఒక ఎద్దులబండి అని అవగతమైంది.దాన్ని ఒక యువకుడు నడుపుతున్నాడు,వెనుకవైపున ఒకావిడ,ఇంటి పనామెతో కూర్చునిఉంది.వారు రాగానే చాలావిషయాలు చెప్పారు. మహాస్వామి వారు ఇప్పుడువేంచేసి ఉంటున్న ఇంటివారి కోడలు ఆమె.తను ఏవో కారణాలవల్ల త్వరగా చెన్నై వెళ్లాల్సిఉండడంతో పనమ్మాయిని తోడు గా తీసుకుని,తన భర్త చిన్నతమ్ముడి సహాయంతో ఎడ్లబండిలో స్టేషనుకు వచ్చారు.

వివరం ఏమంటే, మహాస్వామివారు నిన్న మధ్యరాత్రే ఆగ్రామం వదిలి వేరేచోటుకు వెళ్ళల్సివుంది.డోలితో పాటుగా వెళ్ళేవ్యక్తి ఇక బయలుదేరడానికి సిద్ధమన్నట్టు వెండి దండా న్ని కూడా చేతిలోకి తీసుకున్నాడు. కానీ వెంటనే స్వామివారు తమలోతాము, "**పాపం, వాళ్ళు నన్ను నమ్మి వస్తున్నారు,వారిని చూసిన తరువాతనే వెళ్దాము**" అనటంతో బృందానికి ఏమి అర్థం కాలేదు.

మహాస్వామివారు మరలాకూర్చుని, ప్రయాణం రెండురోజులపాటు వాయిదా వేస్తున్నానని అక్కడున్నవారితో తెలిపారు. స్వామివారు ఎదురుచూస్తున్న ఆ ప్రముఖవ్యక్తి ఎవరాఅని అక్కడున్నవారు ఆలోచించసాగారు.

మరుసటిరోజు ఉదయం, ఆ ఇంటి కోడలికి తప్పక చెన్నైవెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ఆమె ఈవిషయాలన్నీ చెప్పి తనకుకూడా చాలాఆశ్చర్యంగాఉందని,బండిఇంటికి వెళ్తోందని మమ్మల్ని ఆ బండిలో వెళ్ళవచ్చని చెప్పింది. మహాస్వామి వారి కరుణను తలచుకుని మేము బండి ఎక్కాము. నాభర్త వద్దే కార్యాలయ తాళం ఉండడంతో,బంగారు నగలతోఉన్న భార్యని, అత్తని, బిడ్డని పూర్తిగా స్వామివారి మీదే భారంపెట్టి ఒక అపరిచితునికి అప్పగించి ఉదయం ఏడు గంటల ట్రైనుకు వెళ్లడానికి సిద్ధపడ్డారు. ట్రైను కదులుతుండగా ఆయన దాని తలుపు వద్దే నిలబడి మావైపు చూస్తూ ఉండడం మాకు చాలాదూరం కనబడింది.

మేము స్వామివారు ఉన్న ఇంటికి చేరుకునేటప్పటికి మధ్యాహ్నం పన్నెండున్నర అయ్యింది. మాకోసమే వేచిచూస్తున్న స్వామివారు వెంటనే మాకు దర్శనం అనుగ్రహించి, చాలాసేపు మాతో మాట్లాడారు.

మాఅమ్మ కోరినట్టుగా మాకు ప్రసాదంఇచ్చి,**"నీ కుమార్తె ఆరోగ్యం బాగుపడుతుంది. ఎందుకునువ్వు చింతిస్తావు?"అనిఅన్నారు.** స్వామివారు మాకు ప్రసాదంగా ఎండుద్రాక్ష, విభూతి ఇచ్చారు.తరువాత మేమపుడు పెరియవా చేసినపూజ కన్నులారా వీక్షించి,అక్కడే భోజనంచేసి,మళ్ళీ అదేఎడ్లబండిలో స్టేషనుకు వచ్చి, సాయంత్రం ట్రైను ఎక్కాము.

"**వెళ్ళండి, నరసింహుడు (షోలింగూర్ లక్ష్మీనరసింహస్వామి) మీకు తోడుగా ఉంటాడు"** అన్న స్వామివారి మాటలు నాకు ఇంకా విని పిస్తున్నాయి.**"అమ్మవారిని మరవకండి"** అని కూడా చెప్పారు మాతో.

మేము మాఊరికి చేరుకోగానే ఈవిషయం విన్నావారందరూ ఆశ్చర్యపోయారు. స్వామివారు నాకుండే దయనీయస్థితిని అర్థంచేసుకుని,దాని పరిష్కారానికి ఏర్పాట్లు కూడా చేశారు.**స్వామివారి అనుగ్రహ వీక్షణంవల్ల ఆరునెలల్లో ఎంతో భయపెట్టిన నా అనారోగ్యం మొత్తం తగ్గిపోయి, సంపూర్ణ ఆరోగ్యం కలిగింది**.

--- ముత్తులక్ష్మి నటరాజన్, కుంభకోణం. 'జ్ఞాన ఆలయం' పత్రిక నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

3. పెరియవా – పెరుమాళ్

కంచి వరదరాజ స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో,ఆరవరోజు వరదరాజస్వామి వారికి 'వేణుగోపాలస్వామి అలంకారం' చేశారు. ఆ అలంకారంలో విరాజమానమై వెలుగొందుతున్న స్వామివారిని చూసి అర్చకులు సీమాభట్టార్ ఆనందపరవశులయ్యారు. ఊరేగింపులో భాగంగా శ్రీమఠం ముందుకు రాగానే, పరమాచార్యస్వామివారు బయటకు వచ్చి భక్తులందరితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆ దృశ్యాన్ని చూసి సీమాభట్టార్ భావోద్వేగానికి లోనయ్యారు. అప్పుడే ఒక ఆశ్చర్యకర సంఘటన జరిగింది. **వేణుగోపాలస్వామివారిని చూస్తూ, హఠాత్తుగా ఒక్కసారిగా స్వామి వారివైపు తిరిగారు. కాని, పరమాచార్యస్వామివారు కనపడలేదు. వారిస్థానంలో వేణుగోపాల స్వామి కనపడ్డారు.ఎంతగా పరికించి చూసినా స్వామివారు కనపడడంలేదు.**నోట మాటరాక అలా స్థాణువై నిలబడిపోయారు. కేవలం వారికి మాత్రమే అలాంటి దర్శనం జరిగింది.

ఈ సంఘటన తో పరమాచార్యస్వామి వారు, సాక్షాత్ 'వేణుగోపాలస్వామి' వారే అని 'సీమాభట్టార్'కు అవగతమైంది–**"పెరియవా , పెరుమాళ్ ఒకటే",** వేరుకాదని.

తన పెరుమాళ్ ,పరమాచార్య ఒకటే అని నమ్ముతున్న భట్టార్ కు ,తన భావన నిజమని మరొక సంఘటన లో బుజువుచేశారు మహాస్వామివారు.

అప్పుడు పరమాచార్య స్వామివారు తెనంబాక్కంలొ మకాం చేస్తున్నారు. సీమాభట్టార్ ను తీసుకుని రమ్మని సేవకులను ఆదేశించారు స్వామివారు.ఆయనవచ్చి స్వామివారి ముందు నిలబడ్డారు.

"ఈరోజు ఏమి తిథి?" అని అడిగారు పరమాచార్య స్వామి.

చిన్నగా "ఏకాదశి" అని చెప్పారు సీమాభట్టార్.

"ఉపవాసం మనకుమాత్రమే కదా? వరదునికి(వరదరాజస్వామి) కాదుకదా?" అని పరమాచార్యస్వామివారు అన్నారు. ఇలా అడగగానే,భట్టార్ కాస్తకలవరపడ్డారు."పెరుమాళ్ కి నైవేద్యం ఎందుకు సమర్పించలేదు?" అని అడిగారు స్వామివారు. ఈ ప్రశ్నతో భట్టార్ ఉలిక్కిపడ్డారు. జవాబు చెప్పలేక అతికష్టంతో,"వెంటనే కనుక్కుంటాను"అని దేవాలయానికి పరిగెత్తారు.

విషయం ఏమిటని అడుగగా, దేవస్థానం వంటశాలలో కొంచం గందరగోళం వల్ల స్వామికి నైవేద్యం వండలేదు. వెంటనే ఆసమస్యని పరిష్కరించి, ప్రసాదాలు వండించి నైవేద్యం చేశారు. నివేదన చేసిన ఆ ప్రసాదాన్ని మహాస్వామి వారికి సమర్పించారు.

పెరుమాళ్ కు నైవేద్యం పెట్టలేదని పరమాచార్య స్వామివారికి ఎలా తెలుసు? పోనీ ఆ విషయం తెలిసినా, దానిగురించి తాపత్రయ పడవలసిన అవసరం ఏమిటి? కాని భట్టార్ ఇలా ఆలోచించలేదు. ఎందుకంటే, పరమాచార్య స్వామివారే సాక్షాత్ కంచి వరదరాజ స్వామి అని భట్టార్ కు అనుభవం అయింది కాబట్టి .

ఎందరికో వారివారి ఆరాధ్యదైవంగా పరమాచార్యస్వామివారు అగుపించారు. అన్ని దేవతా స్వరూపాలు ఉన్నది ఈ పరబ్రహ్మ స్వరూపంలోనే కదా! కేవలం భక్తీ, శరణాగతి మాత్రమే మనల్ని పరమాచార్య స్వామివారికి దగ్గర చేస్తుంది. శ్రేయస్సును కలిగిస్తుంది.

--- సీమాభట్టార్, కాంచీపురం. 'శ్రీ పెరియవ మహిమై' పత్రిక నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

4. గాయత్రి జపించండి

ఒకసారి పరమాచార్య స్వామివారి దర్శనానికి మద్రాసులోని 'వన్నియతెయ్ నంపేట్' నుండి నలభైమంది బ్రాహ్మణులువచ్చారు.స్వామివారికి నమస్కరించి వారందరినీ బాధిస్తున్న ఒకసమస్యగురించి స్వామివారికి విన్నవించారు. వారు ఉంటున్న ప్రాంతంలో బ్రాహ్మణులు ధైర్యంగా తిరగడానికి సిగ్గుపడుతున్నారని, అక్కడఉన్న కొంతమంది నాస్తిక వాదులు తమనిచూసి గేలిచేస్తున్నారని, కనపడిన ప్రతిసారి వారిశిఖలు, యజ్ఞోపవితాలు, వైష్ణవప్రతీకలైన ఊర్ధ్వపుండ్రాలు చూసిచాలాహేళనగా మాట్లాడుతున్నారని స్వామివారితో వాపోయారు.

అంతా విన్నవెంటనే స్వామివారు వారిని ఇలాఅడిగారు,"మీరందరూ రోజూ గాయత్రి జపం చేస్తున్నారు కదా?" అని. అందరూ మౌనంగా ఉన్నారు. వారి మౌనంలోని సమాధానాన్ని స్వామివారు గ్రహించి,**"ఇక నుండి రోజూ గాయత్రీజపం చెయ్యడం కొనసాగించండి, అంతాసర్దుకుంటుంది"** అని ఆదేశించారు.

పరమాచార్యస్వామివారి ఆదేశం అనుసరించి వారు, రోజూ గాయత్రిజపం చెయ్యడం మొదలుపెట్టారు. రెండు నెలల్లోనే పరిస్థితి మొత్తం మారిపోయింది. వారు చాలా సంతోషిం చారు. మహాస్వామివారిని దర్శించి విషయం అంతా చెప్పారు.

మహాస్వామి, వారందరితో ఇలా అన్నారు, "**మీకు కలిగిన కష్టాలకు కారణం అంతా మీరు గాయత్రి జపాన్ని వదిలేయడమే. గాయత్రి మంత్రం యొక్క శక్తిని అంచనా వెయ్యడం, లెక్కగట్టడం సాధ్యమయ్యే పని కాదు"**

"మీ సమస్యలన్నిటికీ మూలం మీరు గాయత్రిని వదిలెయ్యడమే"

ఇదికేవలం అక్కడున్న బ్రాహ్మణులకు మాత్రమే చెప్పిన విషయంకాదు, మనందరికీను. **శాస్త్రం** చెప్పినట్టు మనధర్మాన్నిమనం తప్పకపాటించినట్లయితే ఎవరూమనల్ని బాధపెట్టరు. **మనం పాటించే ధర్మమే మనల్ని కాపాడుతుందని, గౌరవాన్ని పొందుతారని స్వామివారి సందేశం**. ఇంతకీ ఆ బ్రాహ్మణులు గాయత్రీ జపం చేయటం లేదని స్వామివారికి ఎలా తెలిసింది?

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

5. చిత్తూరుకరువు – పరమాచార్యఆదరువు

అది1966వ సంవత్సరం. ఆంధ్రదేశంలోని చిత్తూరు జిల్లా తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల వల్ల కరువుకాటకాలతో అల్లాడుతోంది. ఆ సంవత్సరంజూన్ లో చీఫ్ సెక్రెటరి కే.వీ.అనంత రామన్ గారు నన్ను పిలిచి వెంటనే చిత్తూరువెళ్లి జిల్లా కలెక్టరు మెజిస్ట్రేటుగా అధికారాలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాకు ఇస్తున్న కరువుభత్యాలు, నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, కనుక వాటిని సరైన వారికి అందించి పరిస్థితిని చక్కదిద్దాలని ఆజ్ఞాపించారు. 1910 ప్రాంతంలో మా తాతగారు పిడతల సితాపతయ్య చిత్తూర్లోనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పనిచేశారు. తరువాత అనిబిసెంట్ గారితో హోమ్ రూల్ ఉద్యమంలో కూడా పాల్గొన్నారు.

నాఇష్టదైవం వేంకటేశ్వరస్వామివారు కావడంతో అక్కడ పనిచెయ్యడానికి సుముఖత చూపాను కాని, కరువు పరిస్థితి చాలాదారుణంగా ఉంది. కరువునివారణ కోసం ప్రభుత్వం ఇచ్చిన ధనాన్ని దుర్వినియోగం అవ్వకుండా ఆపవచ్చు. అధికారులను కార్యోన్ముఖులను చేసి చెయ్యవలసిన పనులను చేయించవచ్చు.ఆహార సరఫరా విభాగం నుండి ఇంకా ఎక్కువ మొత్తం ధాన్యం తెప్పించుకోవచ్చు. కాని, ప్రచండ భానుడి ప్రతాపాన్ని నివారించి వర్షాలు కురిపించడానికి ఒక IAS అధికారి ఏం చెయ్యగలడు?

కంచి శంకరాచార్యులు కొద్ది రోజులపాటు తిరుమలకి ఆగమిస్తున్నారని నాకు సమాచారం అందింది. కంచి వంటి మఠాధిపతులు వచ్చినప్పుడు, ఆ విషయం జిల్లా అధికార యంత్రాంగానికి ముందస్తుగా తెలిపి, వారికి సౌకర్యాలను కల్పించాలని ఆంగ్లేయుల కాలం నుండి వస్తున్న సంస్కృతి.

కంచి పరమాచార్య స్వామివారు తిరుమలకు వెళ్తుండడంతో చంద్రగిరి సబ్ కలెక్టర్ మరియు తి.తి.దే కార్యనిర్వహణాధికారిని పురమాయించాను ఆ పనులను పర్యవేక్షించడానికి. త్వరగా నా పనులు ముగించుకొని తిరుమలకి వెళ్లి మహాస్వామివారి దర్శనం చేసుకోవాలని నా ప్రణాళిక.

కొద్దిరోజుల తరువాత మహాస్వామి వారిని దర్శించుకొని వారి కళ్ళలోని తేజస్సును, చిరునవ్వును చూసి పులకించిపోయాను.కొద్దిసంభాషణ తరువాత నాకేం కావాలని అడిగారు స్వామివారు. నాకేం కావాలి? **నాకేమి వద్దు కాని, ఈ జిల్లా పరిస్థితి వివరించి, నీరు ఆహారం లేక మనుష్యులు, పశువులు చాలా అవస్థలు పడుతున్నారని** చెప్పాను. నేను వారికి ప్రణమిల్లి వారి వద్ద నుండి సెలవు తీసుకొని వెళుతుండగా **"స్వామివారు తమ కుడిచెయ్యిని పైకెత్తి నాలుగుదిక్కులా ఏదోఆజ్ఞాపిస్తునట్టుగా చూపారు."** నేను దానిగురించి ఎక్కువ ఆలోచించకుండా, నన్ను అలా ఆశీర్వదించారేమో అని అనుకున్నాను.

నేను తిరుమల నుండి తిరుపతికి వచ్చేంతలోగానే అప్పటివరకు ప్రచండ భానుని ప్రతాపంతో ఉన్న ఆకాశం, బాగా మబ్బుపట్టి ఉంది. సమయం గడుస్తుండగా పూర్తిగా మేఘావృతమై మేము చిత్తూరు చేరేపాటికి కుండపోత వర్షం పడుతోంది. అలామొదలైన వర్షం ఇంకా తీవ్రమై ఒక వారం రోజులపాటు ఏకధారగా కురిసింది. ఇదంతా స్వామివారి కృపవల్లనే జరిగిందనే స్పృహ కలుగనేలేదు నాకు.

నేను మరలా కొంత కాలానికి ఆచార్య స్వామివారిని కలవడం జరిదింది.

ఈసారి స్వామివారు, **"కావలసినంత వర్షం కురిసిందా?" అని అడిగారు**."ఏం వర్షాలు స్వామీ?" అని అడిగాను నేను. **"క్రితం సారి వచ్చినప్పుడు అడిగావు కదా! ఆవర్షం"** అంటూ నవ్వారు స్వామివారు.

ఇంతకుముందు ఎంతోబాధతో వర్షాలకోసం స్వామివారిని ప్రార్ధించిన విషయమే మరిచిపోయిన నాకు ఒక్కసారిగా మెరుపు మెరిసి అప్పుడు అర్థమైంది. మన పురాణాలలో చెప్పినట్టుగా స్వామివారు తమమహత్తుతో వర్షంకురిపించారు .నిస్వార్ధంగా చేసే ప్రార్ధనలకి స్వామివారి అనుగ్రహం ఎంతత్వరగా వచ్చిందో నాకు అవగతమయింది. అప్పటి నుండీ భూగర్భజలాలు క్రమంగాపెరిగి తాగునీరు అందరికి లభించసాగింది. నామనస్సంతా కృతజ్ఞతతోనిండి స్వామివారికి ప్రణామములుఅర్పించి వారికి సాష్టాంగం చేశాను.

--- Sri పి. సీతాపతి, రిటైర్డ్ IAS.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

6. మైలాపూర్ కర్పగాంబళ్

మనం ఎంతో వివేకంతో ఉన్నామని, మన ప్రార్థన ఉన్నతమని అనుకుంటాము. కాని నిజానికి ఎలాప్రార్ధించాలో కూడా స్వామి వారినే అడిగి ఆ విధంగా ప్రార్ధించవచ్చు. ఎంతోకృప ఉంటేగాని స్వామివారు తమంతతామే "ఎలాప్రార్ధించాలో,ఎవరిని ప్రార్ధించాలో వివరించాలంటే (ఏమీ అడుగకుండా)" ఆమె ఎంత ధన్యురాలో!

శ్రీమతి త్రిపురసుందరి,ప్రఖ్యాత తమిళకవి, పండితుడు శ్రీ కి.వ.జగన్నాథన్ గారి కోడలు, పరమాచార్య స్వామివారి భక్తురాలు.

మహాస్వామివారి దర్శనానికి వచ్చినప్పుడు ఒకసారి స్వామివారు చెన్నైలో ఆమె ఎక్కడ నివసిస్తున్నది అని ఆ ప్రదేశం గురించి అడిగారు

"నేను మైలాపూర్ లో నివసిస్తున్నాను పెరియవ!" అని బదులిచ్చారు ఆమె.

"దేవాలయానికి వెళ్తుంటావా?" అని అడిగారు స్వామివారు.

"అవును. నేను ఎప్పుడూ కర్పగాంబళ్ అమ్మవారిని దర్శించుకుంటూ ఉంటాను"

"ఆమెని ఏమని వేడుకుంటావు?"

"అందరి సంక్షేమాన్ని కోరుకుంటాను" అని చెప్పింది.

అప్పుడు స్వామివారు ఇలా అన్నారు. "నీకు ఒక విషయం చెబుతాను శ్రద్ధగా విను"

"వెనుకటిజన్మలో నీవుచేసుకున్న పుణ్యఫలంవల్ల నీవు మైలాపూర్లో నివసిస్తున్నావు. ఆమె కర్పగాంబళ్ అమ్మవారు. ఆమెకల్పతరువు. ఆమె భిక్షఇస్తుంది. మనకు ఎన్నో జన్మలు ఉండవచ్చు.ప్రతిజన్మలోనూ నేను మైలాపూర్-లోనే జన్మించాలని,నీ పాదపద్మముల దర్శనం చేసుకునే భాగ్యం కలగాలని ఆమెను ప్రార్థించు"

"ఆమె సన్నిధానంలో ఏ యాచకుడు లేదా చివరికి ఒక కుక్క కూడా ఆకలితో ఉండదు" అని చెప్పారు స్వామివారు.

కర్పగాంబళ్ అమ్మవారి కరుణని ఈజన్మకే కాకుండా అన్నిజన్మలలోనూ ఆమె పొందేటట్లు అనుగ్రహించారు స్వామివారు.

--- శ్రీమతి త్రిపురసుందరి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

7. మహాస్వామి – మక్కాయాత్ర

మార్చినెల ఉషోదయ వేళ. జనవరిలో మొదలైన చల్లని గాలి తిమ్మెరలు ఇంకా విస్తూనే ఉన్నాయి. తెలవారకుండానే టార్చిలైటు వెలుగులో ఒక పల్లకి నదీతీరంలో ఊరేగింపుగా వెళ్తోంది. ముందు పల్లకి, వెనుకగా కొంతమంది జనం, ఏనుగులు, గుర్రాలు, లోట్టిపిట్టల గుంపులు అలా వెళ్తోంది. మాయనూర్, హరిశ్చంద్రపురం, తిట్టచేరి దాటి వెళ్లి నాట్టం అనే ఊరు చేరగానే పల్లకి తలుపులను దండంతో కొట్టిన శబ్దం వినబడింది. వెంటనే నడకను ఆపారు.

అక్కడ ఒక వినాయకునిదేవాలయం ఉంది.అక్కడితో దారి కుడి-ఎడమలు, రెండుగావెళ్తోంది.ముందుగాఅనుకున్నప్రకారం,అక్కడినుండిఎడమవైపుగా ప్రయాణించాలి. కాని మరలా లోపలినుండి శబ్దం రావడంతో 'మాలి' అనేభక్తుడు అదితాము ఎడమవైపు కాకుండా కుడివైపుఉన్నదారిలో వెళ్లాలని అర్థంచేసుకుని ప్రయాణాన్ని కుడివైపుగా మరల్చారు.

"ఇదిబహుశా 'మన్మంగళం' (ఒక ఊరు) వెళ్ళేదారిలాఉంది" అని గుంపులో నుండి ఒకరన్నారు. మనకు లోపలి నుండి ఆదేశంవచ్చింది కాబట్టి, మనం దానిప్రకారం నడచుకోవాలి.ప్రతి విషయానికి ఏదోకారణం ఉంటుంది, అని 'మాలి'చెప్పడంతో,ఇకఎవరూ ఏమీ మాట్లాడలేదు.

మన్మంగళం ఇంకా గాఢనిద్రలో ఉంది.ఒక ఇంటిలోనుండి గృహిణి బయటకు వచ్చి ఇంటిముందర మట్టిదీపం వెలిగించి,వెంటనే దగ్గరలోఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలోకూడా దీపంవెలిగించివచ్చింది.ఇంటిముందర ఊడ్చి, కళ్ళాపిచల్లి శుభ్రపరచడం మొదలుపెట్టింది.అదేసమయంలో అటుగావెళ్తున్న ఊరేగింపుని చూసింది.ఆఊర్లో, అంతటి "గజతురగ" జనసమూహంతో వస్తున్న పల్లకిని చూసి నిశ్చేష్టురాలయ్యింది.

సరిగ్గా ఆగృహిణి ఇంటికి దగ్గరగా రాగానే లోపలినుండి మరలా చప్పుడవ్వడంతో పల్లకిని కిందకుదించారు బోయీలు.

ఆ ఊరు పావనమైనది. ఆఊరి ప్రజల అదృష్టము అంతా ఇంతా కాదు వారిని కరుణించడానికే వచ్చినట్టు నడిచే దైవం, కంచి కామకోటిపీఠం పీఠాధిపతులు-జగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతి పరమాచార్య స్వామివారు ఆఊరి నేలపై అడుగు పెట్టారు.

ఇంటి ముందర శుభ్రం చేస్తున్న ఆమె అంతటి అనుగ్రహాన్ని ఊహించలేదు. కొన్ని క్షణాలు తనకళ్ళను నమ్మలేక అలా చూస్తుండిపోయింది. వెంటనే తేరుకొని లోపలి వెళ్లి తన భర్తకు విషయం చెప్పింది. భార్యచెప్పిన మాటలువిన్నవెంటనే ఆయన లేచి త్వరత్వరగా స్నానాదులు పూర్తిచేసుకొని, విభూధిపూసుకుని బయటకు వచ్చాడు. అప్పటికే అతని భార్య నీళ్ళు మంగళహారతి సిద్ధం చేసింది.

దంపతులిద్దరూ స్వామివారి కాళ్ళుకడిగి, హారతిచ్చి ,నేలపై పదినమస్కారాలు చేసి వారిని ఆహ్వానించారు.కొద్దిక్షణాల్లోనే వారిఇంటిముందర అరుగును శుభ్రపరిచి రంగ వల్లులు తీర్చిదిద్దారు. మహాస్వామివారు అక్కడ కూర్చున్నారు.

ఈలోగా ఏనుగులు, గుర్రాల అరుపులకి మొత్తం ఊరు నిద్రనుండి మేల్కొంది. అందరూ ఆమె ఇంటిదగ్గరకు వచ్చారు.స్వామివారిని దర్శించుకోవడానికి పళ్ళాలలో పూలు,పళ్ళు తీసుకుని చాలామంది వచ్చారు. ఒంటెలు, ఏనుగులను నది దగ్గరకు తీసుకుని వెళ్ళారు. మహాస్వామి వారి పరివారానికి చక్కని వసతి, ఆహారము ఏర్పాటు చేశారు.

అందరికి ఒక్కటే ప్రశ్న,"స్వామివారు ఇక్కడికి ఎలా/ఎందుకువచ్చారు?". ఎందుకంటే ముందస్తుసమాచారం లేకుండా శ్రీమఠం మకాం చెయ్యదు."ముందు అనుకున్నది 'నేడుంగరైగ్రామం' వెళ్ళాలిఅని. కాని పరమాచార్యస్వామివారు ఇక్కడికి రావాలని ఆదేశించారు.మేము వారిఆజ్ఞానుసారం ఇక్కడకువచ్చాము.ఎదో ముఖ్యకారణం ఉండి ఉంటుంది" అని చెప్పారు వైద్యనాథన్.

రెండు రోజులుగా స్వామివారు మౌనంలో ఉన్నారు. ఎప్పుడైనా మాట్లాడవచ్చు. ఇలా రావడం ముందుగానే తెలిసుంటే ఊరి పొలిమేరల నుండే పూర్ణకుంభ స్వాగతం పలికి ఉండే వాళ్ళం అని అనుకున్నారు ఆ ఊరిజనం. కాని స్వామివారి ఆలోచన ఏముందో. అందరూ స్నానాలు చేసి,పూజ ముగించారు.భోజనాలు కూడా అయ్యాయి. స్వామివారు కేవలం ఎండుద్రాక్ష, పాలు మాత్రమేతీసుకున్నారు.తక్కినవారికి ఆ గ్రామస్తులు చక్కగా

అరటిఆకులో భోజనంపెట్టారు.స్వామివారి ఆగమనంవార్త చాలాజోరుగా వ్యాపించి చుట్టు పక్కల ఉన్న గ్రామస్తులుకూడా దర్శనానికిరావడం మొదలుపెట్టారు.అది మార్చి మధ్యకాలం అవ్వడంతో వ్యవసాయపనులు అన్ని అయిపోవడంతో చాలామంది దర్శనానికి వచ్చారు. తామర పూలు, కొబ్బరి బొండాలు, అరటి బోదలు మొదలైనవి తెచ్చి స్వామికి సమర్పించారు.రోజు కూలీగా తనవంతు వచ్చిన ధాన్యాన్నితెచ్చి సమర్పించింది ఒక ముసలి అవ్వ. మొత్తం ధాన్యాన్ని స్వామిముందు ఉంచి నమస్కరించింది. అప్పుడు చూడాలి ఆనంద పారవశ్యాలతో ఉన్న ఆ అవ్వముఖం.అరుగుమొత్తం భక్తులసమర్పణలతో నిండిపోయింది.

గ్రామప్రజలకు స్వామివారితో చెప్పుకోవడానికి చాలా విషయాలు ఉన్నాయి,పెళ్లి ఆలస్యం,గృహంకట్టడానికిఆటంకాలు,ఆస్తిపంపకంలో తగాదాలు, ఇలా చాలా సమస్యలను స్వామివారి ముందు ఉంచారు.

కానీ,స్వామివారు ఏమీమాట్లాడక మౌనంగా అన్నీవింటున్నారు.చేతులెత్తి అక్కడున్న అందరినీ ఆశీర్వదించారు.కొందరికి బిల్వదళాలు, కొందరికి నిమ్మకాయలు ఇచ్చారు. సమయం నడుస్తూ ఉంది కాని, స్వామివారు మౌనం విడలేదు.హఠాత్తుగా మాలిని పిలిచి సైగలతో ఏదోచెప్పారు.చేతులతో శివలింగం,గోపురం మొదలైనవి చూపిస్తున్నారు.బహుశా ఈ ఊళ్ళో అవి ఎక్కడున్నాయి అని అడుగుతున్నారేమో.

మాలి స్వామివారిసైగలను అర్థంచేసుకున్నాడు.అక్కడున్న ఊరిజనంతో,"ఈఊళ్ళో శివాలయంఎక్కడ ఉంది?" అని అడిగాడు. కాని ఎవ్వరినుండి జవాబు రాలేదు. వారిలో ఉన్న ముసలాయన, "ఇక్కడ ఒక విష్ణుఆలయం ఉంది. అదికాక ఒక దేవీఆలయం, గ్రామ దైవం అయ్యనార్ ఆలయం, ఊరి పొలిమేరున గణపతి ఆలయం ఉన్నాయి. శివాలయం గురించి మాకు తెలియదు" అని చెప్పాడు.తొంబయ్యేళ్ల వృద్ధునికే తెలియకపోతే ఇక వేరేవారికి ఏమి తెలుస్తుంది.

మహాస్వామివారు మరలా కొన్నిసైగలు చేశారు. ఊరికి పైభాగాన విష్ణు ఆలయం ఉంది అంటే కింది భాగాన ఖచ్చితంగా శివాలయం ఉండి ఉంటుంది. కాని ఇప్పుడు అది లేదు అంతే.కాని గ్రామప్రజలకు ఆ విషయం ఏమీతెలియదు.అందరూ మౌనంగా ఉన్నారు.

ఈ సంభాషణ జరుగుతుండగా అక్కడకు ఒక మహమ్మదీయ దంపతులు ఒకరు వచ్చారు.అతను తననితాను లతీఫ్ భాయ్ అని,తన భార్యను మేహరున్నిసా అని పరిచయం చేసుకున్నాడు. వారితో పాటు తెచ్చిన రెండు అరటిగెలలను, రోజా పూలను స్వామివారికి సమర్పించారు.మహాస్వామివారు వారినిఆపాదమస్తకం ఒక్కసారి చూశారు. స్వామివారిని దర్శించుకున్న పూజ్యభావం వారి కళ్ళల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. లతీఫ్ భాయ్ తేరుకుని చెప్పడం ప్రారంభించాడు. అతని సంభాషణ వల్ల ఒక విషయం తెలిసింది.

కొన్ని శతాబ్దాల క్రితం ఇక్కడ ఒకశివాలయం ఉండేది. కాలాంతరంలో అదికాస్త పాడైపోయి భూమిలో కలిసిపోయింది. ఆభూమి ఎంతోమంది చేతులుమారి చివరకు లతీఫ్–

భాయ్ ఆధీనంలోకి వచ్చింది."మా నాన్నగారి హయాంలో దర్గాభూములు చూసుకుంటు న్నప్పుడు కొన్ని దేవాలయ భూములను కూడాతీసుకుని వ్యవసాయం చేస్తుండేవారు. శివుని భూములను చూసుకుంటూ, మోసంచెయ్యడంవల్ల వంశంపాడవుతుందని గట్టిగా నమ్మే వారు.దేవునికృప వల్ల ఆ భయం,భక్తి నాకుకూడా అబ్బింది. కాని ఏంచెయ్యాలి? మాకు పుట్టిన ఒక్కగానొక్క కూతురు మానసిక రుగ్మత వల్ల పదేళ్ళ క్రితం చనిపోయింది.

నాకనిపిస్తుంది, తెలిసోతెలియకో మేము ఎదోపాపం చేశాము,అందుకే అల్లాహ్ మాకు ఇలాచేశాడు! అని నిభాయించు కొన్నాము. నిన్న ఇంటివెనుక మట్టిలో ఎదో పని చేసుకుం టుండగా ఒకశబ్దం వినబడింది.కొద్దిగామట్టిని తీసిచూడగా ఒక పెద్దశివలింగం కన పడింది. రాత్రి నాకు నిద్రపట్టలేదు.మేము చాలా ఆందోళనపడి,దాన్ని ఏంచెయ్యాలో పాలుపోక అల్లా ను ప్రార్థిస్తున్నాము.ఉదయం అవ్వగానే చుట్టుపక్కల వారు మీరాక గురించి మాట్లాడు కుంటుండంతో వెంటనే ఇక్కడకు వచ్చాము.ఇప్పుడు మేము ఏమి చెయ్యాలో పరమాచార్య స్వామివారే సెలవియ్యాలి" అని స్వామికి నమస్కరించారు.

"మనస్ఫూర్తిగా ఆ భూమిని ఇవ్వడానికి నేనుసిద్ధం. దానికి బదులుగా నాకు డబ్బు కూడా వద్దు. పూర్వం శివాలయం ఎలా ఉండేదో అలాగే నిర్మిద్దాం. అది గ్రామ ప్రజలకు సమ్మతమైతే అల్లాహ్ కూడా సంతోషిస్తాడు" అని కళ్ళనీరు పెట్టుకుంటూ తన్మయత్వంతో చెబుతున్నాడు. కేవలం మాటలు చెప్పడమే కాదు.

"మావంతుగా శివాలయనిర్మాణం కోసం ఈకానుకని దయతోస్వీకరించండి అని 101/- రూపాయలను తొలిసమర్పణగా దీన్ని భావించండి" అని ఒకపళ్ళెంలో తాంబూలం తో సహా సమర్పించారు. అక్కడున్నవారంతా మాటలురాక అలా చూస్తుండిపోయారు.

ఇప్పటిదాకా మహాస్వామివారు ఆ మహామ్మదీయుడు చెప్పిన విషయాలను మంద హాసంతో వింటున్నారు. సైగలద్వారా స్వామివారు ఎదోఅడిగారు. అతనికి అదేమిటో అర్థం కాకపోవడంతో ఒక పలక-బలపం తీసుకుని వచ్చి స్వామివారికి అందించాడు. స్వామివారు ఆ పలకపై అతను మక్కాయాత్ర చేశారా అనిఅడిగారు.అందుకతను లేదని,అల్లా మాకు అంతధనం ఇవ్వలేదని తెలిపాడు.ఎన్నో సంవత్సరాలుగా ప్రణాళిక వేసుకున్నా వెళ్ళడం కుదర లేదని తెలిపాడు.

వెంటనే మహాస్వామివారు వైద్యనాథన్ వైపుకి తిరిగి విచారిస్తున్నట్టుగా, "స్థలం ఇవ్వడానికి సిద్ధపడ్డ ఇంతటి ఉత్తమమైన వ్యక్తికి మరి మనం ఏదైనా సహాయం చెయ్యాలి కదా? అతని అవసరం కూడా ఇప్పుడు మనకుతెలుసు కదా!" అన్నారు. పరమాచార్యస్వామి వారి ఆలోచనని గ్రామప్రజలకు తెలిపారు వైద్యనాథన్.

అదివిన్న వెంటనే ఊరిప్రజలందరూ మరొకఆలోచన లేకుండా ఒక్కమాటతో అన్నారు -"వారి మక్కా - మదీనా యాత్రకు అయ్యేఖర్చును మేము భరిస్తాము పెరియవ!".

ఆదంపతుల ఆనందానికి అవధులులేవు. స్వామివారు ఆ దంపతులిద్దరినీ, గ్రామప్రజలను ఆశీర్వదించారు.

తరువాత స్వామివారు నిదానంగా పైకిలేచి గోడకు ఉంచిన దండాన్ని తీసుకొని పల్లకిలోకి వెళ్లి కూర్చున్నారు. ఆ ఊరి వారివైపు చూసి నవ్వుతూ అందరిని ఆశీర్వదించారు. మరలా అందరితో కలిసి యాత్రబయలుదేరింది.అప్పుడు మాలి అన్నారు,"ఇప్పుడు అర్థం అయ్యింది ఎందుకు మహాస్వామివారు ఈ ఊర్లో పల్లకి ఆపమన్నారో! ఏకారణంలేకుండా ఏమీజరగదు. పరమాచార్యస్వామివారి ప్రతిచర్యకి ఒక కారణం ఉంటుంది"

-- వైద్యనాథన్ 'శంకర భక్త జ్ఞాన సభ' కార్యదర్శి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

8. "పరమాచార్య" – "ప్రదోషం మామ"

దయాసముద్రుడైన ఆ పరమేశ్వరుడే పరమాచార్య స్వామివారిలాగా ఈ భూమిపై అవతరించారు.కేవలం కొంతమంది మాత్రమే ఈవిషయాన్ని అర్థంచేసుకోగలిగారు. కొంత మంది వారి దివ్యలీలలను అనుభవిస్తూ,పొందుతూఉండిపోయారు. మరికొంతమంది వారి వైభవాన్ని, గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంలో నిమగ్నమయ్యారు.కాని ఒకరు మాత్రం దాన్ని అదేతమ జీవితధ్యేయంగా మలచుకొని మహాస్వామివారే అన్నిరోగాలను పోగొట్టే వైదీశ్వరుడని,సాక్షాత్తు చిదంబరంలోని నటరాజుఅని ప్రజలకు తెలియజేయాలని జీవితాంతం శ్రమించారు. వారే **బ్రహ్మశ్రీ ప్రదోషం మామ**.

పరమాచార్యస్వామివారు ప్రదోషంమామ యొక్క అనన్యభక్తికి ఎప్పుడూ బద్ధుడై ఉంటారు.మహాస్వామివారు తనపైచూపినకరుణని,దయని,ఎన్నిజన్మలకైనాతీ ర్చుకోలేనిదని అంటుంటారు ప్రదోషంమామ.పరమాచార్యస్వామివారిపై మామభక్తిని– వారు నెలనెలా నిర్వహించేఉత్సవాలలోనూ,సంవత్సరోత్సవాలు,జయంతి,మహారుద్ర,సువాసిని పూజల్లోనూ ప్రస్ఫుటంగా చూడవచ్చు.

మామ పదవీ విరమణ పొందిన రైల్వేఉద్యోగి.వారికి వచ్చే పెన్షన్ వారికుటుంబానికి ఏమాత్రం సరిపోయేది కాదు.వారికిఉన్న పెద్దసంపదల్లా పరమాచార్యస్వామివారి ఆశీస్సులే. అదే వారికి ఇన్నికార్యక్రమాలు చేయాడానికి తోడ్పడుతోంది.ఈ కార్యక్రమాల నిర్వహణ విషయంలో మామకి ఎవ్వరూ సాటిరారు.

ఒకసారి మహాస్వామివారు 'మహాగావ్'లో మకాంచేస్తున్నారు.హఠాత్తుగా రామమూర్తి అయ్యర్ తో తమ భిక్షకి దానం సేకరించవలసిందిగా ఆదేశించారు. అక్కడున్న వారందరూ ఇది నమ్మలేకపోయారు.భిక్షకోసం మహాస్వామివారు ధనం అడగడం జరగనిపని. ఎంతో

మంది రాజులు, జమీందారులు కోట్లాదిసంపద ఇస్తామన్నా ధనంపై ఎప్పుడూ స్వామివారు ఇష్టతచూపలేదు. ఎప్పుడైనావాటిని మఠంవారు స్వీకరించివెంటనే అవసరంలో ఉన్నవారికి ఇచ్చివేసేవారు.

అలాంటిది స్వామివారిమాటలకు ఎంతోఆశ్చర్యపోయారు. వారిఆదేశం ప్రకారం, రామ మూర్తిగారు అక్కడున్న ఐదు మంది బ్రాహ్మణులతో 1500 పోగుచేశారు.(అప్పటిలో చాలా ఎక్కువ) "ఇదిఅతనికిఇవ్వు" అనిఅన్నారు స్వామివారు, ముద్దుగా-64పనాయనారుగా పిలు చుకునే ప్రదోషం మామను చూపిస్తూ.

ఆరోజు మామకుఇచ్చిన దానం ఇంకాపెరిగి మేరుపర్వతమంత అయింది,మామకు సహాయపడింది.మరుసటి ప్రదోషం నాటికి తమని దర్శించడానికి వచ్చిన మామతో "ఆ దానం నీ బ్యాంకులోవెయ్యి" అని చెప్పారు పరమాచార్య. మామకు ఉన్నధనం అంతంత మాత్రం. స్వామివారి కార్యక్రమాలు చేయాలని తపన. మరి ఎలాచేయిస్తారు? అందుకే స్వామివారే వారికి అవసరమైన ధనాన్ని సేకరించి ఇప్పించారు.స్వామివారి కార్యక్రమములు, వేదసంరక్షణ, గోసంరక్షణ, దేవాలయ ఉత్సవాలు అన్నీ ఆధనంతోనే జరుగుతున్నాయి. ఇలా అనుగ్రహింపబడింది కేవలం ప్రదోషం మామ ఒక్కరే.

--- 'లోకమాత' 1996 దీపావళి 'కల్కి' విశిష్ట సంచిక నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

9.దుప్పటి - దయ

పరమాచార్యస్వామివారు సతారాలో మకాంచేస్తున్నారు. అది చలికాలం. స్వామివారు బాలు మామకి ఒక దుప్పటినిచ్చి "కుంబకోణం పట్టుపాట్టి" అనే ఆమెకి ఇవ్వమని చెప్పారు. కుంబకోణంపట్టుపాట్టి పరమాచార్యస్వామివారికి పెద్దభక్తురాలు.ఆమెకు సంతానం లేక పోవడంతో ఆమెకున్న రెండు ఇళ్లనూ కంచి మఠానికి ఇచ్చివేసింది.ఆమె చాలా మంచి మనసు కలది. అందరితోనూ బాగా కలివిడిగా ఉండేది.

ఆరోజురాత్రే మహాస్వామివారు నిద్రనుండి మేలుకొని,బాలుమామని నిద్రలేపి **"దుప్పటిని పాట్టికి ఇచ్చావా?"** అని అడిగారు.బాలుమామ ఆవిషయం మరచిపోవడంతో అలా చూస్తూ నిలబడిపోయారు.

వెంటనేవెళ్లి ఆమె ఎక్కడుందోవెతికి ఆమెకు దుప్పటి ఇమ్మని పరమాచార్య స్వామివారు ఆదేశించారు.అది మధ్యరాత్రి కావడంతో చలి చాలా తీవ్రంగా ఉంటుందని, బయటకు వెళ్ళడానికి బాలు మామ భయపడి ఉదయం ఇస్తానని చెప్పారు.

"లేదు! ఇప్పుడే ఈ దుప్పటి తనకిచేరాలి. ఈ రాత్రి చాలా చలిగా ఉంది" అని చెప్పారు స్వామివారు.ఇక చేసేదిలేక ఆ రాత్రిలో ఆమెను వెతుకుతూ వెళ్ళారు బాలు మామ.వెతకగా వెతకగా చివరికి కబిలేశ్వర్ ఇంటి దగ్గర కనపడ్డారు పాట్టి.**ఆమె చలికి తాళలేక గజగజ వణుకుతూ నేలపైపడుకునిఉంది. మహాస్వామివారు ఎందుకు ఆక్షణమే ఆదుప్పటి ఇమ్మని చెప్పారో బాలుమామకు అప్పుడు అర్థంఅయింది.పాట్టి ఆదుప్పటిని తీసుకుని కప్పు కుంది**. జగద్రక్షకుని రక్షణలో ఉన్నట్టు తన్మయత్వం పొందింది పాట్టి. స్వామివారి కరుణ అపారం కదా!

ఇలాంటి సంఘటన ఒకటి బాలుమామ జీవితంలో కూడా జరిగింది. ఇంతటి కరుణను స్వయంగా అనుభవించారు బాలుమామ.ఒకసారి తీవ్రమైన చలికాలంలో, దేవాలయఆవరణం లో పడుకున్నారు బాలు మామ. కప్పుకోవడానికి దుప్పటి కూడా లేదు. ఉదయం నిద్ర లేవగానే ఇంతటి తీవ్రమైన చలిలో ఇంత సుఖంగా పడుకున్నానేమిటా అని ఆశ్చర్యం వేసింది మామకి. చూడగా వారిపై ఒక శాలువా కప్పబడి ఉంది. ఎవరో మఠంలో ఉన్న తన తోటి వారు ఎవరో కప్పి వెళ్ళుంటారని అనుకుని దాని విషయం మరచిపోయారు.

నాలుగు రోజులు గడిచిపోయాయి. స్వామివారు బాలుమామ దగ్గరున్న శాలువా చూసి చాలా బావుందని అది ఎక్కడిదని అడిగారు. మఠంలోని వారే ఎవరో తనపై కప్పి వెళ్ళారని చెప్పారు బాలు మామ. అది **విని స్వామివారు చిన్నగా నవ్వి, అది నేనే అన్నట్టుగా స్వామివారు చేతితో తనవైపు చూపి సైగ చేశారు**.

"ఆ చల్లని నేలపై పైవస్త్రం కూడా లేకుండా పడుకుని ఉన్నావు. మరి మీఅమ్మగారు నిన్ను అలా చూస్తే ఏమనుకుంటారు?" అని అన్నారు.

పరమాచార్య స్వామివారి అపార కరుణ చలికాలంలో వెచ్చదనం, ఎండాకాలంలో నీడ, వర్షాకాలంలో గొడుగు వంటిది. మనల్ని మనం వారికి సమర్పించుకొని జీవితంలో సుఖ సంతోషాలను పొందుదాం.

--- శ్రీ ప్రదోషం మామ గృహం 'రేర్ జెమ్స్' నుండి.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

10. అరటి ఆకులు – ప్లాస్టిక్ పొట్లాలు

పరమాచార్యస్వామివారు సం.1960లో 'తిరుచ్చినేషనల్–కాలేజ్' హైస్కూలులో మకాం చేస్తున్నారు.వారి అనుగ్రహంకోసం ప్రతిరోజూ వేలసంఖ్యలో భక్తులు వస్తున్నారు. వచ్చినవారందరికీ మంచి రుచికరమైన భోజనం పెడుతున్నారు.

ఉదయం పదకొండుగంటలకు మొదలయ్యే ఈ అన్నదానం సాయంత్రం నాలుగ్గంటల వరకూజరిగేది.ఏర్పాట్లు చేసే బృందంసభ్యులు ఈభక్తులతాకిడిని నియంత్రించడానికి, భోజనాలు అయ్యాక వారిని పంపడానికి చాలాతంటాలు పడుతున్నారు.

వారి సమస్యనుస్వామివారికి చెప్పి,భోజనానికి వచ్చేభక్తులకు పంక్తి భోజనం కాకుండా ఆహార పొట్లాలను ఇచ్చే విషయమై స్వామివారికి తెలిపారు.

స్వామివారు ఆ కమిటీసభ్యులను ముందరకూర్చొబెట్టుకుని రెండుప్రశ్నలను అడిగారు. మొదటిది: ఆహారపొట్లాలోని పదార్థాన్ని తిన్నతరువాత ఆ అరటిఆకులను వారు ఎక్కడ పడవేస్తారు?

రెండవది: దాహాన్ని తీర్చుకోవడానికి గ్లాసు నీళ్ళకోసం వారు ఎక్కడకు వెళతారు?

స్వామివారి ముందరకూర్చున్నవారు ఎవ్వరూ కూడా ఈప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోయారు.వారిమౌనాన్నిగమనించి,స్వామివారేఇలాచెప్పారు,"ఖర్చును,పనిఒత్తిడిని తగ్గించుకోవాలని మీరు ఆలోచిస్తున్నారు.ఆకలిగా ఉన్నవాడు మాత్రమే మొదటి బంతి(పంక్తి – వరుస)లో కూర్చోవాలని చూస్తాడు.ఇతరులు చివరిబంతిలో కూర్చుంటారు".

"నేను ఎన్నోప్రాంతాలకు వెళ్లినప్పుడు, భోజనం తరువాత ఆఅరటిఆకులను ఒక తొట్టెలో పడవేస్తారు. నేను చూశాను **ఆ ఆకులలో మిగిలిపోయిన పదార్థాలను నారికురవలు సేకరిస్తారు.మరియు ఆ ఆకులకు అంటుకున్న ఆహార పదార్థాలను ఆవులు తింటాయి. మీరు గమనించండి,ఆకులువేసి భోజనంపెట్టడంవల్ల ఎందరో ఇతరులఆకలి కూడా తీరుతోంది**". "ఆహార పొట్లాలను తయారుచెయ్యాలన్న మీ ఆలోచనను విరమించుకొని, అందరికీ అరటి ఆకులువేసి భోజనం పెట్టండి. ***ఇంతమంది ప్రజలు ఆహారం స్వీకరించడాన్ని చూడటం, దానికోసం ఖర్చుపెట్టటం వల్ల మీకు పుణ్యం. నాకు ఆనందం కూడా***"

ఎన్నో అన్నసమారాధనలు చెయ్యడం చూశాము కానీ,అన్నసమారాధన యొక్క గొప్పదనాన్ని,చేసేవిధానాన్ని, ఇంతటి గొప్పమహాత్ములైన పరమాచార్యస్వామివారుచెప్పిన తరువాతనే అర్థం చేసుకున్నాము.

--- రా. వేంకటసామి. 'శక్తి వికటన్' ఆగస్ట్ 15, 2004 ప్రచురణ

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

11. మహాస్వామి – మల్లయోధుడు

'మన్నక్కల్–కృష్ణశాస్త్రి' అనే యువకుడు తరచుగా శ్రీమఠానికివచ్చి స్వామివారిని దర్శించుకునేవాడు. అతను మంచి ఒడ్డూ–పొడుగూ ఉండి కండపుష్టికలిగినవాడు. ఒకసారి మఠానికి మహాస్వామివారు అతణ్ణిరప్పించారు.

"కృష్ణా!... ఒక గంటసేపు ద్వారం దగ్గర నిలబడు!! కదలడానికి వీల్లేదు, సరేనా?... ఏమంటావు?" అని అడిగారు.

"మీ ఆజ్ఞ పెరియవ" అని బదులిచ్చాడు.

కృష్ణశాస్త్రితో పాటు అక్కడున్నవారెవరికి అర్థం కాలేదు ఈ మాటల అర్థం ఏమిటో. స్వామివారు ఆదేశం ప్రకారం శ్రీమఠంద్వారం వద్ద నిలబడ్డాడు.ఒక గంటగడిచిన తరువాత లోపలికి వచ్చాడు. మహాస్వామివారు పూజ ముగించి రాగానే కృష్ణశాస్త్రి ,స్వామి వారికి చెప్పి సెలవు తీసుకొని మన్నక్కల్ వెళ్ళిపోయాడు.

ఖ్యాతినొందిన మహాబలవంతుడైన మల్లయోధుడు ఒకరు కాంచీపురానికి వచ్చాడు. అతనికి గుప్పెడు నువ్వులని ఇస్తే, అవలీలగా వాటిని నలిపి నూనె తియ్యగలడు.ఎన్నో మల్ల యుద్ధాల్లోగెలిచి ఎంతో పేరుప్రఖ్యాతులు సంపాదించాడు.దాంతో అతన్నిఅభిమానించేవారు చాలా ఎక్కువమంది ఉండేవారు. మహాస్వామివారితో బహుమానం అందుకోవాలని అతని ఉద్దేశం. అతను పరమాచార్యస్వామి ముందర తనకండబలం ప్రదర్శించి స్వామివారు సూచించిన వారితో మల్లయుద్ధం చెయ్యాలని అతని కోరిక.

కంచిలో నివసించే ఆమల్లయోధుని బంధువు ఒకరు ఆ రోజురాత్రి మఠానికి వచ్చి ఒక శిష్యునితో,"మఠంలో వైదికులు, శిష్యులు, పరిచారకులుఉండడం సహజమే.ఇప్పుడు మఠం వారు మల్లయోధులను కూడా వినియోగించుకుంటున్నారా?" అని అడిగాడు.

"అదేమీ ప్రశ్న? మఠం ఎందుకు మల్లయోధులను నియమించుకుంటుంది?" అని అన్నాడు ఆ సేవకుడు.

"ఒక పేరుగాంచిన మల్లయోధుడు ఉదయం పదిగంటలప్పుడు మఠందగ్గరకు వచ్చాడు. ద్వారంవద్ద బలవంతుడైన ఒక మల్లయోధుణ్ణి చూసి కనీసం స్వామివారి దర్శనం కూడా చేసుకోకుండా తిరిగొచ్చాడు.ఇప్పుడే అతణ్ణి చెన్నైపంపించి నేనుఇక్కడకు వస్తున్నాను" అని చెప్పాడు.

అక్కడున్న వారందరూ కడుపుబ్బా నవ్వుకున్నారు. "అందుకా మహాస్వామి వారు 'మన్నక్కల్ కృష్ణశాస్త్రి'ని ద్వారంవద్ద నిలబడమన్నారు.అతణ్ణి చూసే ఆమల్లయోధుడు భయ పడి వెళ్ళిపోయాడు,కనీసం స్వామివారి దర్శనానికి కూడా రాలేదు"

ఒక మల్లయోధుడు వచ్చి శిష్యులతో మల్ల యుద్ధం చెయ్యడానికి ఆహ్వానిస్తాడని పరమాచార్య స్వామివారికి ఎలా తెలుసు?

స్వామివారికి భూత-భవిష్యత్-వర్తమానాలు,"ఆ మల్లయోధుడు కంచి వచ్చాడనే" జరిగిపోయినవిషయం,"మఠానికి వస్తాడనే" భవిష్యత్తు,అతని మనసులోని "బలప్రదర్శన చేయాలనే ఉద్దేశం", సర్వం ముందే తెలుసు.

-- మహాపెరియవళ్ – దరిశన అనుభవంగళ్ 4

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

12. కాలే కాఫీ – చల్లని మజ్జిగ

పరమాచార్య స్వామివారు 'కాఫీ'తాగడాన్ని ఒప్పుకునేవారు కాదు.చాలామంది భక్తులకి ఆ అలవాటుని మాన్పించారుకూడా. అటువంటి సంఘటనే ఇది ఒకటి.

కాంచీపురంలో మహాస్వామివారి దర్శనానికి చెన్నైనుండి ఒకదంపతులు వచ్చారు. 'మీ భర్త చాలాఎక్కువగా కాఫీతాగుతారా?' అనిఆవిడని అడిగారు స్వామివారు.ఆఫీసుకు వెళ్లేముందు మూడుసార్లు, వచ్చినతరువాత మూడుసార్లు తాగుతారని అక్కడ ఎన్నిసార్లు తాగుతారో తనకు తెలియదని చెప్పిందావిడ. వెంటనే కాఫీ తాగడం ఆపెయ్యాలని అందుకు బదులుగా మజ్జిగ త్రాగాలని స్వామివారు ఆదేశించారు.

చెన్నై తిరిగొచ్చిన తరువాత కేవలం రెండురోజులపాటు మహాస్వామివారి ఆదేశాన్ని పాటించగలిగాడు. మూడవరోజు నుండి కాఫీ ఇవ్వాల్సిందిగా భార్యను ఒత్తిడి చేశాడు. ఇక చేసేదేమీ లేక ఆవిడ కాఫీఇచ్చింది.పరమాచార్యస్వామివారి ఆజ్ఞని దిక్కరిస్తున్నాననే బాధతో ఆ కాఫీని స్వామివారి పటం ముందు పెట్టి అలవాటుని మానుకోలేకపోతున్నానని స్వామికి క్షమాపణ చెప్పి సేవించేవాడు. ఇలా కొద్ది రోజులపాటు జరిగింది.

కొంతకాలం తరువాత ఆ దంపతులు మహాస్వామివారి దర్శనానికి కాంచీపురం వెళ్ళారు. వారిని చూడగానే స్వామివారు **"ఇకఎప్పుడూ ఆవేడి కాఫీ తనకు సమర్పించవద్దని, రోజూ ఆ వేడికాఫీ తాగటం వల్ల తమ నాలుక కాలిపోయిందని"** తెలిపారు. ఆ మాటలకు అతను నిశ్చేష్టుడయ్యాడు. ***తన ఇంట్లో ఉన్న స్వామివారి చిత్రపటం సామాన్యమైనది కాదని, రోజూ తను స్వామివారి ముందు పెడుతున్న కాఫీని స్వామివారు నైవేద్యంగా స్వీకరించారని తెలుసుకొని అతను ఆశ్చర్యపోయాడు. అంటే 'చిత్రపటంలో ఉన్నస్వామీ, ఇక్కడ కూర్చున్న స్వామీ ఒక్కరే' అని అర్థంచేసుకుని,తనుచేసినతప్పుకు క్షమాపణలు అడిగాడు.*** కళ్ళనీరు కారుస్తూ,స్వామివారికి సాష్టాంగంచేసి తనమూర్ఖత్వాన్ని మన్నించవలసిందిగా అడిగి,ఇక

జీవితంలో ఎప్పుడూకూడా కాఫీముట్టనని స్వామివారు ఆదేశించినట్టుగా మజ్జిగ తాగుతానని ప్రమాణంచేశాడు.స్వామివారు ఆశీర్వదించి ప్రసాదం ఇచ్చి, కాఫీతాగే అలవాటు వదిలి వేసినంత కాలం నీకుమంచిదని చెప్పి పంపించారు.

--- దినమలర్, 23 ఫెబ్రవరి 2016

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

13. నేలపైపడ్డ ప్రసాదం

'రామస్వామిఅయ్యర్'సేలంలో ప్రముఖ న్యాయవాది.ఆవృత్తిలోఆయన బాగా రాణిస్తున్నారు.పరమాచార్య స్వామివారి అశేషకోటి భక్తులలో ఆయన కూడా ఒకరు. వారు ఒకసారి మహాస్వామివారి దర్శనానికివెళ్ళారు.ఆయన వరుసలోనిలబడి స్వామిని దర్శించుకొని విభూతిని ప్రసాదంగా తీసుకున్నారు.

స్వామివారు ఇచ్చేటప్పుడే పొరపాటున చెయ్యిజారిందో లేక తీసుకునే మునుపే ఈయన చెయ్యి వెనక్కు తీసుకున్నారో మొత్తానికి విభూతిప్రసాదం నేలపై పడింది. నేలపై పడ్డ విభూతిని తీసుకోవడం ఏమిటని రామస్వామి అయ్యర్ ప్రసాదం కోసం మరలా చెయ్యి చాచారు.

అప్పుడు స్వామివారు, "నేలపైపడ్డ ఆప్రసాదం తీసుకో ఆన్నారు". మన్నుతో కలిసిన ఆప్రసాదాన్నే రామస్వామిఅయ్యర్ స్వీకరించాడు.ఎందుకు నేలపైపడ్డ ప్రసాదాన్ని తీసుకొమ్మని స్వామివారు ఆదేశించారు?అని పరిపరి విధాల ఆలోచించారు. ఇంటికి చేరుకునే దాకా ఆ అసంతృప్తి వదల్లేదు.

ఎన్నో ఏళ్లుగా న్యాయస్థానంలో కొనసాగుతున్న తంజావూరులో ఉన్న రామస్వామికి చెందిన భూములవ్యవహారం కొన్ని రోజులతరువాత ఆయనపరంఅయ్యాయి.ఆ న్యాయవాది ఆనందం అనిర్వచనీయం. అసలు దక్కదు అనుకున్న స్థిరచారాస్తులు దక్కితే ఆ ఆనందం వేరు కదా!

ఈవిషయాన్ని మహాస్వామివారికిచెప్పడానికి వెంటనే స్వామివద్దకు బయలుదేరారు. రామస్వామిఅయ్యర్ ను చూడగానే స్వామివారు ఏమన్నారో తెలుసా?

"ఆరోజు నేలపైపడ్డ ప్రసాదాన్ని తీసుకోవడానికి నువ్వు చాలాఆలోచించావు. ఈరోజు నీకు అంత భూమి లభించింది" అని అన్నారు.

అసలు వచ్చిన విషయం చెప్పడానికి రామస్వామి ఇంకా నోరు కూడా తెరవలేదు. ఆవచ్చినవిషయమూ,ఆవిషయానికి సంబంధించిన విషయంకూడా స్వామివారే చెప్పేశారు. ఇదే సామాన్యులు అర్థం చేసుకోలేని పరమాచార్య స్వామివారి దివ్య కరుణ.

--- శ్రీ ఆర్. వెంకటస్వామి, "కంచి మహానిన్ కరుణై నిళగల్" నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

14. మండుటెండ – మజ్జిగ

కంచిమఠం ముందర మజ్జిగఅమ్మే ఒక పాట్టి(అవ్వ)ని,మహాస్వామివారు పిలిచారు. ఒక పెద్దపాత్ర నిండుగా చల్లనిమజ్జిగను తయారుచెయ్యమని చెప్పారు. అలాగే వాటిలో వాడాల్సిన పదార్థాలను కూడా చెప్పారు. ఇంగువ, కరివేపాకు, పచ్చి మిరపకాయలు, అల్లం, ఆవాలుఅన్నీవేసి తయారుచెయ్యమని చెప్పారు.అదంతావింటున్నభక్తులు ఆశ్చర్యపోయారు. కాని,సాధారణరోజులలోమఠానికి,అంతమందిభక్తులురారు.మరి ఇంతమజ్జిగ ఎవరికోసం?

అది'మే'నెలమొదటివారం.సూర్యుడు ప్రచండమైనవేడితో వెలుగుతున్నాడు. కంచిలో 'కచ్చపేశ్వర దేవాలయం' ముందు ఎదో రాజకీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు.వారం తా నాస్తికులు. దాదాపు ఒక 200 మంది ఉన్నారక్కడ.పెద్దపెద్ద స్పీకర్లలో నుండి భావావేశం తో కూడుకున్న మాటలు వినిపిస్తున్నాయి. వారికి నాయకత్వం వహిస్తున్న వ్యక్తి మొత్తం 'దేవా లయాలను నిర్మూలించి' పరిశ్రమలు కట్టి 'యువతకుఉపాధి' ఇస్తామని ఆవేశంతో మాట్లా డుతున్నాడు.

ఇంతలో ఆ నాస్తిక సమావేశాలు పూర్తయ్యి ఆవేశంగా మాట్లాడిన ఆ నాయకుడు కారు ఎక్కి చక్కగా వెళ్లిపోయాడు. అక్కడ చేరినవారందరూ బస్సు ఎక్కడానికి కంచి మఠం దగ్గరకి వచ్చారు.అక్కడ మజ్జిగ అమ్ముతున్న పాట్టిని చూశారు.అంతే! కేవలం పది నిమిషాల్లో ఆ పెద్ద అండా నిండుగా ఉన్న మజ్జిగ ఖాళీ అయిపోయింది.

అప్పుడు వారిలో ఒకడు, "మఠం లోపలికి వెళ్ళి స్వామి దర్శనం చేసుకుందామా?" అని అన్నాడు.అందరికి వెళ్ళాలనేఉందికాని, ఇతరులు తమను తిడతారనేభయంతో ఊర కుండి పోయారు. సరిగ్గా అప్పుడే 'గంగైకొండన్ మండపం'లో ఉన్న ఆంజనేయస్వామి దర్శ నానికి వెళ్ళడానికని మనస్వామివారే బయటకువచ్చారు. ఒక్కసారిగా మొత్తం అక్కడున్న వారంతా కాంచిపురంలోని మేనెల ఎండలతో వేడెక్కిన ఆ ఇసుకలోనే నేలపై పడి స్వామికి సాష్టాంగం చేశారు.

'గంగైకొండన్మండపం'లోకివెళ్తున్న స్వామివారు ఒక్కక్షణం ఆగి,**"అందరికి తాగడానికి మజ్జిగ దొరికింది కదా?"** అని అడిగారు.

'భగవంతుని కరుణకు అంతుఉంటుందేమో తెలియదు కాని, పరమాచార్యస్వామి వారి కరుణకు అంతు, ఎల్లలు ఉండవు', అపార కరుణా స్వరూపులు వారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।

శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

15. సన్యాసి సంకల్పం

ఒకసారి పరమాచార్య స్వామి వారు ఆంధ్రదేశంలోని కర్నూలులో చాతుర్మాస్యం చేస్తు న్నారు.స్వామివారిని సాక్షాత్ ఈశ్వరస్వరూపంగాభావించే శ్రీజనార్ధనానందసరస్వతి అనబడే సన్యాసి ఒకరు ఈ పుణ్యదినాలలో మహాస్వామివారితో గడపాలని నిశ్చయించుకు న్నారు.ఈసన్యాసి పాదయాత్రగా విజయవాడనుండి బయలుదేరి వస్తున్నారని మహాస్వామి వారికి కబురందింది.

ఆ విజయవాడస్వామి పాదయాత్ర మొదలుపెట్టిన రెండు,మూడు రోజులకి, పరమాచార్య స్వామివారు మఠంలో పనిచేస్తున్న శ్రీ ఏకాంబరం మరియు శ్రీ మెట్టూర్ రాజులను ఒక కారు లో విజయవాడ వెళ్లవలసినదిగా ఆదేశించారు.అలాగే పూజ్యశ్రీ విజయవాడస్వామి వారిని కలిసి వారిని కారులో ఇక్కడికి తీసుకురావలసిందిగా చెప్పారు.

అక్కడున్న భక్తులు ఈ మాటలను విని అయోమయంలో పడ్డారు. సన్యాసులు కారులో తిరగడం మహాస్వామివారు ఎన్నటికీఒప్పుకోరు.అలా చెయ్యమని ఆదేశించరు కూడా! ఎందు కంటే అది సన్యాస ధర్మానికి విరుద్ధం కనుక.

ఇంతకీ ఆ విజయవాడస్వామివారిని ఎలా కలుసుకోవాలోకూడా వీరికి తెలియదు. జనార్ధనానంద సరస్వతి స్వామివారు తమ పర్యటనకు ముందుగానే ప్రణాళిక వేసుకోలేదు కనుక వార్తాపత్రికలలో కూడా ఎక్కడా సమాచారము లేదు. వారిద్దరూ గుంటూరు చేరుకొని చుట్టుపక్కల ప్రాంతాలలో వెదకసాగారు. చివరికి వారికి ఆ స్వామివారు 'శివాపురం' అనే ఒక చిన్న గ్రామంలో తారసపడ్డారు.

వచ్చినవారి నోటివెంట పరమాచార్యస్వామివారి ఆదేశాన్ని వినగానే ఆ విజయవాడస్వామి వారు అమితాశ్చర్యానికి లోనయ్యారు.ఆనందంతో,సంభ్రమాశ్చర్యాలతో పరమాచార్యస్వామి వారిని సాక్షాత్తు ఆకైలాసవాసియైన పరమేశ్వరుడే అని వేనోళ్ళ కొనియాడారు.

అసలేం జరిగిందంటే, మహాస్వామివారిని దర్శించాలనే కోరికతో ఆ ముందురోజు వరకూ కర్నూలు వైపు పాదయాత్ర చేశారు. హటాత్తుగా కాలినరం ముడిపడి ఇబ్బంది పెట్టడంతో శివపురంలో ఆగవవలసి వచ్చింది.చాలా ఆందోళన చెందిన స్వామివారు వారు చికిత్సతీసుకుని పాదయాత్రగానే కర్నూలుకు వెళ్లాలని నిర్ణయించుకుని ఉంటే వారు మళ్ళీ వచ్చే చాతుర్మాస్యానికే చేరేవారు.విజయవాడస్వామి బాధను తమ సర్వజ్ఞత్వంతో గ్రహించి, మహాస్వామివారే, వారిని పిలుచుకుని రావడానికి కారుని పంపారు. కాలినెప్పితో బాధ పడుతున్న స్వామివారు అతికష్టంపై కారుఎక్కి కూర్చున్నారు. కర్నూలుకు ప్రయాణించి పరమాచార్యస్వామివారి దివ్యసన్నిధికి చేరుకున్నారు.

మహాస్వామివారిని ఇలా కొనియాడారు.“ఈశ్వరా! కైలాసనాథుడుగా నీకు కనీసం ముసలిఎద్దు అయినా వాహనంగాఉంది.కానీ, ఇప్పుడు కంచినాథుడుగా, పరమాచార్యులుగా వచ్చిననీవు, ఉన్న ఆ ఎద్దును కూడావదిలిపెట్టి మొత్తం దేశంఅంతా పాదచారియై తిరగడానికి నిర్ణయించుకున్నావు”

వారు‘సాక్షాత్ శంకరావతారులు’ కాబట్టే ఇది స్వామివారికి సాధ్యమైందని గ్రహించారు విజయవాడ జనార్ధనానంద సరస్వతీస్వామి.వారి కాలి సరంబాధను కూడా మహాస్వామి వారు కరుణతో తొలగించారు.పూర్తి స్వస్థతతో విజయవాడ స్వామి వారు కృతార్ధత పొందారు.

--- ‘ప్రదోషం మామ’ ‘గృహం న్యూస్ లెటర్’ నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

16. ఆశ – ఆశీస్సులు

ఘటంమ్యాస్ట్రో ‘విక్కువినాయకరం’ చిన్నతమ్ముడు,ఘటంవిద్వాన్ ‘సుభాష్ చంద్రన్’ మరియు అతనిభార్యకు,దీపావళిరోజున పరమాచార్య స్వామివారికి ఏదైనా సమర్పించాలని కోరిక.సాంప్రదాయ పీఠాధిపతులు పరమ నిష్టతో,మడితో చెయ్యని వంటకాలను తీసుకోరు. కాని వారు పరమప్రీతితో ఎలాగైనా ‘పాలకోవాను’ మహాస్వామివారికి సమర్పించాలని నిశ్చయించుకున్నారు.పాలకోవాను తయారుచేసి,ఒక స్టీలుడబ్బాలో వేసుకుని కాంచీపురానికి బయలుదేరారు. తిన్నగా ‘ప్రదోషం వేంకటరామ అయ్యర్’ మామ ఇంటికి వెళ్ళారు.

మామ,వారు వచ్చిన విషయంవిని‘చంద్రన్’తోఇలాఅన్నారు.“కేవలం,నీ భక్తి–ప్రపత్తులకి నా పరమాచార్యస్వామివారు ఈపాలకోవాను స్వీకరిస్తారు,వారు స్వీకరించక పోయినా ఈ పదార్థం వారిని తప్పక చేరుకుంటుంది”

ఈమాటలకు చాలా సంతోషించిన ‘సుభాష్ చంద్రన్’ భార్యతో కలిసి, శ్రీమఠానికి చేరుకున్నారు.తమఎదురుగానే ఈపాలకోవాను మహాస్వామివారు స్వీకరించాలని మనస్సులో అనుకున్నారు. మఠానికి చేరుకోగానే మహాస్వామివారు ఏదో పుస్తకం చదువుతూ ఉన్నారు.వారు,అక్కడఉన్న ‘కైంకర్యంవ్యక్తి’కి తామువచ్చిన విషయంతెలుపగా, అతను మహాస్వామివారు అటువంటివాటిని అంగీకరించరని,అదీకాక ఈరోజుదీపావళి కావడంతో శ్రీమఠములో ఎక్కువరద్దీ ఉంటుంది, కాబట్టి, స్వామివారిని ప్రత్యేకంగా కలవడం కూడా కుదరదని చెప్పి, తను వెళ్ళిపోయాడు.

చంద్రన్ కొద్దిగా ఆలోచన చేసి కొద్దిసేపు అక్కడే స్వామివారికి దగ్గరగా ఉండడానికి నిశ్చయించుకున్నాడు. కాని ఆ ‘కైంకర్యం అతను’ మరలా అటువైపుగా వచ్చినప్పుడు ఇంకా

ఇక్కడేఉన్నారా అంటూఅరుస్తాడేమో అని,కాస్తకంగారు పడుతున్నాడు.అరగంట గడిచింది, స్వామివారు ఇంకా పుస్తకంచదువుతూనే ఉన్నారు.అతను భయపడినంతా జరిగింది. ఆ కైంకర్యం వ్యక్తి అటుగా పచ్చాడు.

ఆశ్చర్యకరంగా అదేసమయానికి అతణ్ణి మహాస్వామివారు రమ్మనడంతో చంద్రన్ ఊపిరి పీల్చుకున్నాడు.అద్భుతం జరిగింది – **స్వామివారు పాలకోవాడబ్బాను చంద్రన్ నుండి తీసుకుని రావాల్సింది గా అతణ్ణి ఆదేశించారు**. దాన్ని అతను మాదగ్గరనుంచి తీసుకుని స్వామివారి ముందు ఉంచారు.

ఆ కారుణ్యమూర్తి డబ్బాలో చెయ్యిపెట్టి వేలితో చిన్న కోవాముక్క తీసుకుని వారి ఎదుటే నోటిలోవేసుకున్నారు.చెయ్యెత్తి దంపతులిద్దరిని ఆశీర్వదించారు.**వారి అపార 'భక్తి–ప్రేమ' లకు స్వామివారు కరిగిపోయారు.అంతమంది జనసమూహంలో వీరికే ప్రత్యేకంగా అడిగి మరీ స్వీకరించారు**.మనంకూడా వారిలాగే శ్రద్ధాభక్తులతో అన్నీస్వామివారి పాదాలకు సమర్పించి, ఆయన ఆశీస్సులు పొందుదాం.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

17. ప్రసాదం – పరమార్థం

అది 1993వ సం. 'నంగనల్లూర్' లో ఆంజనేయస్వామి దేవస్థానం ప్రారంభం చేస్తున్న సందర్భం.దేవాలయం నిర్మాణపనులు త్వరితగతిన జరుగుతున్నాయి. చాలామంది భక్తులు కూడా వస్తున్నారు.ఒకరోజు నేను పరమాచార్యస్వామివారి ఆశీస్సులకొరకు వెళ్లాను. స్వామికి సాష్టాంగంచేసి నమస్కరించాను. మహాస్వామి వారు ఆశీర్వదించి నాతో ఇలా అన్నారు, "ఇక్కడకు వచ్చే చాలామంది భక్తుల ద్వారా విన్నాను–దేవాలయానికి భక్తులు ఎక్కువగా వస్తున్నారు అని,చాలా పెద్దవిగ్రహం కదా! స్వామివారి ఆకర్షణశక్తి కూడా చాలా ఎక్కువగానే ఉన్నట్టుంది".

నన్ను ఆశీర్వదించి ఎంతోవాత్సల్యంతో,"ఆయన చాలా పెద్దస్వామి కదా! మరి ఎక్కువ ప్రసాదం నివేదన చెయ్యాల్సి వస్తుంది కదా?" అని అడిగారు.నేను వెంటనే, "ఒక పెద్ద సంచి బియ్యాన్ని వండి నివేదన చేస్తున్నాము పెరియవ" అని బదులిచ్చాను.

"ఉత్తి అన్నం మాత్రమేనా?"

"లేదు పెరియవ చిత్రాన్నాలు వంటివి చేసి నివేదిస్తాము"

"నివేదనకు ఏమేమి తయారు చేస్తుంటారు?"

"ఉదయంనుండి చాలారకాలు తయారు చేస్తుంటాము. వెణ్ పొంగల్,బెల్లం పొంగల్, పులిహోర, మిరియాల అన్నం, పెరుగన్నం అలా వరుసగా చేస్తుంటాము పెరియవ!"

"మరి వీటికోసం చాలా మంది భక్తులు వస్తుంటారు కదా!"

కొంచం గర్వంతో, "ప్రతిరోజూ చాలా ఎక్కువ మంది భక్తులు వస్తారు. ప్రసాదాలు ఏవీ మిగలవు" అన్నాను.

మహాస్వామివారు కొద్దిసేపు మౌనంగా ఉన్నారు. "ప్రసాదాలు కొద్ది కొద్దిగా ఇస్తారా, ఎక్కువ మొత్తంలో ఇస్తారా?" అని అడిగారు స్వామీ.

అతిశయించిన గర్వంతో, "ఒక పెద్ద ఆకులో ఎక్కువ ప్రసాదం ఇస్తాము పెరియవ" అని అన్నాను.

"ఇక్కడకు వచ్చేవారి వద్ద నేను ఈవిషయం విన్నాను. నిన్ను ఒకవిషయం అడగ దలచుకున్నాను.ప్రసాదాన్ని ప్రసాదంలాగా కొద్దిగాఇవ్వాలా? లేక భోజనంలాగా ఎక్కువ ఇవ్వాలా?" అని అడిగారు.

ఊహించని ప్రశ్నకు, ఏమని సమాధానం చెప్పాలో తెలియక నిలబడ్డాను.

మహాస్వామివారు నవ్వుతూ,"ఎందుకు అలాస్థాణువులా నిలబడిపోయావు? కేవలం నేను తెలుసుకోవడానికే నిన్ను ఈ ప్రశ్న అడుగుతున్నాను" అని అన్నారు.

కొద్దిగా సంశయిస్తూ వినయంగా, "లేదు పెరియవ. భక్తులు ఎంతో దూరం నుండి ఇక్కడకు వస్తారు.బహుశా వారికి ఆకలిగా ఉంటుంది కాబట్టి వారికి ఎక్కువ మొత్తంలో ప్రసాదాన్ని....." అని ఇంకా నేను ముగించకుండానే, స్వామివారు – నువ్వు ఏమి ఆలోచిస్తు న్నావో నాకు అర్థం అవుతుంది. కాని నాఉద్దేశ్యం "***ప్రసాదాన్ని ప్రసాదం లాగా తక్కువ మోతాదులో ఇవ్వాలి. ఆకలిగొన్న వారిని కూర్చుండబెట్టి వేరేగా భోజనం పెట్టాలి***" అని "మన వేదాలు, శాస్త్రాల్లో – ఎన్నో చెయ్యవలసినవి, చెయ్యకూడనివి నిర్దేశించబడి ఉన్నాయి. **కొన్ని కేవలం మన స్వీయానుభావం వల్ల మాత్రమే అర్థం అవుతాయి"** అని ఇదమిత్థంగా ఏమీ చెప్పక పోవడంతో,అర్థంకాక,"నాకు ఈవిషయం అర్థంకాలేదు పెరియవ! ఏదిసరైనది? ప్రసాదం కొంచంఇవ్వాలా? ఎక్కువఇవ్వాలా? ఈవిషయంలో నాకు దయచేసి సహాయం చేయండి " అని అడిగాను.

"లేదులేదు, ఈవిషయంలో సరైనదిఏది? అనేవిషయం నీకే అనుభవంలోకి వస్తుంది. అప్పటి దాకా ఓపికగా ఉండు" అని నన్ను ఆశీర్వదించి పంపారు.(కొన్నిసార్లు కేవలం సలహా పాటించటంవల్ల, అనుభవం రాక, మనసులో ఒక 'వెలితి' ఉండే అవకాశం ఉంది. అందువల్ల, అనుభవంకల్పించి నేర్పించడం పరమాచార్యవారి సంకల్పం కావచ్చు.కాని అంతి మంగా వారు చెప్పినది చెప్పినట్టుగా, ఎదురుచెప్పకుండా ఆచరించటమే మన విధి)

ఇప్పుడు నేను పాండిచెర్రి నుండి దిండివనం వెళ్ళేదారిలోఉన్న పంచవటిలో ఒక దేవాలయంనిర్మిస్తున్నాను.అది ముప్పైఆరుఅడుగుల పంచముఖఆంజనేయస్వామి ఆలయం. ఇప్పుడు నిర్మాణం పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇక్కడకూడా పెద్దపెద్దఆకుల్లో ఎక్కువ ప్రసాదం ఇవ్వడం ఆనవాయితీ.కొన్నిసార్లు నేనే ఆప్రసాదవితరణ చేస్తుంటాను.ఒకరోజు

ఎప్పటిలాగే ఒకఆకులో కదంబం(సాంబారుఅన్నం) మరొకఆకులో పెరుగన్నం పెద్దమొత్తం లో ఇస్తున్నాము. అక్కడే కూర్చుని తింటున్న కొద్దిమంది నా వద్దకు వచ్చారు.

అందులోఒకరు చాలానిష్టూరంగానాతో,"మీరు సాంబారన్నం,పెరుగన్నం ఎక్కువ ఎక్కువ ఇస్తున్నారు బావుంది.రుచిగా కూడా ఉంది.కాని మీకు ఒకసలహాఇవ్వాలని ఉంది. సాంబార్ అన్నానికి నంచుకోవడానికి పోరియల్,పెరుగన్నానికి తోడుగా 'కారంఊరగాయ' (ఆవకాయ) ఇస్తే బావుంటుంది" ఆ మాటలు విని నేను నిశ్చేష్టుణ్ణి అయ్యాను.అంటే వీరికి ప్రసాదం అనేభావనే లేదు,ఉంటే అలాఅడగరు.1993లొ చెప్పిన పరమాచార్య స్వామివారి మాటలు ఒక్కసారిగా గుర్తుపచ్చాయి.

"లేదులేదు, ఈవిషయంలో సరైనదిఏది? అనేవిషయం నీకే అనుభవంలోకి వస్తుంది. అప్పటి దాకా ఓపికగా ఉండు!"..***స్వానుభవంతో ఇప్పుడు, నాకు నిజం అవగతమైంది. ప్రసాదాన్ని ప్రసాదం లాగ కొద్దిగానే ఇవ్వాలి అని.***

ఎంతో కష్టపడి,భక్తి-శ్రద్ధలతో ఆలయాలు కట్టి,సేవచేస్తున్న తనభక్తుని మనస్సు బాధ పడకుండా, ప్రేమతో అతనిని అవగాహన కల్పించి సరిదిద్దారు మహాస్వామి.

--- శ్రీ రమణి అన్న, "మహా పెరియవర్" నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

18. ఆరోగ్య ప్రదాత

కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు ఈ ఏడాదితో 'శత సంవత్సరం'లోకి అడుగుపెడుతున్నారు.

స్వామివారు పీఠాధిపత్యం వహించగానే, స్వామివారు వేదవ్యాప్తికి, వేద ప్రచారానికి కార్యోన్ముఖులై ఎన్నోపాఠశాలలను పునరుద్ధరించి,ఎంతోమంది వేదపండితులకు వారి జీవితాంతం ఆర్థిక స్వావలంబనను చేకూర్చే దిశగా నిమగ్నమయ్యారు. వేద భాష్య పరీక్షలు నిర్వహించి, యువ పండితుల్లో ఎంతో ఆసక్తిని పెంచారు. ఉత్తీర్ణులైన వారిని తగు విధంగా సత్కరించారు.

ఒకసారి స్వామివారు యాత్రలో భాగంగా మాగ్రామానికి వచ్చినప్పుడు నాతో, "న్యాయ శాస్త్రంలో ఎంతోపాండిత్యాన్ని గడించావు,సంతోషం,ఇక నీవు **అద్వైతవేదాంతం – తత్వంలో అత్యుత్తమ గ్రంథమైన అద్వైత-సిద్ధిని చదువు**"అనడంతో మరలా నాఅధ్యయనం మొదలైంది.

స్వామివారు సన్యసించగానే***"ఆహారం విషయంలో సన్యాసి పాటించాల్సిన నియమాలను అత్యంత కఠినంగా పాటించేవారు. మనస్సు, జ్ఞాపకశక్తి ల విషయంలో నియమపాలన***

అత్యంత ఆవశ్యకం అన్న సూత్రం ఆధారంగా స్వామివారు తమ ఆహారఅలవాట్లను మహా కఠినతరం చేశారు".

సన్యసించిన తరువాత సన్యాసి ఇతరములైన సంభాషణలను విడిచిపెట్టాలి అనే అర్థమిచ్చే **"అన్యోవచో విమున్చత అతమునీ"** అన్న శ్రుతివాక్యాన్ని అనుసరించి స్వామివారు **ఎప్పుడో నాలుగు మాటలు మాత్రమే మాట్లాడుతూ, తక్కిన సమయం అంతా మౌనంగానే** ఉండేవారు.

స్వీయక్రమశిక్షణ పాటించడంవల్ల, నిరంతర సాధనవల్ల అఖండజ్ఞానాన్ని సంపాదించడంతో పాటు, ఇతరుల కోరికలను ఈడేర్చే భగవత్ శక్తిని కూడగట్టుకున్నారు.వారే భగవంతుడు అయ్యారు.

నేను 1992జూన్ నుండి, చాలానీరసించిపోయి,పూజాదికాలు,విద్యార్థులకు పాఠం చెప్పడం వంటి రోజువారీపనులు కూడా చేసుకోలేకపోతున్నాను.నాస్వరంకూడా బలహీనంగా,పేలగా మారిపోయింది. అప్పుడు నేను ఆదిశంకరుల బ్రహ్మసూత్ర భాష్యాలపై భారతీయ తర్క పద్ధతిపై ఆధారంతో చిన్న వ్యాఖ్యానం వ్రాసే పనిలో ఉన్నాను.**'శంకరభక్త జనసభ'** వారి ఆధ్వర్యంలో దాన్ని ముద్రించాలని శ్రీ వైద్యనాథ అయ్యర్ తీవ్రంగా కృషి చేస్తున్నారు.

1992 సెప్టెంబర్ 6 నుండి కంచిలో జరుగుతున్న అద్వైత సభలో పాల్గొంటున్న పండితులకు, పరమాచార్య స్వామివారికి, ఈ పుస్తకాన్ని ఇవ్వదలచి కంచికి బయలుదేరాను. ఆరోజు నేను ఇంకా నీరసించిపోయి, నేను ఇచ్చిన వాక్యార్థము జీర గొంతుకతో చెప్పడం వల్ల అక్కడున్నవారెవరికి సరిగ్గా వినబడి ఉండదు.సాయంత్రం నేను పరమాచార్యస్వామి వద్దకు వెళ్లాను.ఆపుస్తకాన్ని స్వామివారికి ఇచ్చి, ప్రదక్షిణ నమస్కారం చేసి,స్వామివారి దివ్య పాద కమలాలను అత్యంత భక్తితో నా తలపై ఉంచుకున్నాను. మనోహరమైన చిరునవ్వుతో స్వామివారు నన్ను అనుగ్రహించి ఆశీర్వదించారు.అంతసేపూ, శ్రీశంకరవిజయేంద్ర సరస్వతి స్వామివారు కూడా అక్కడేఉన్నారు. చిన్నస్వామివారు నన్ను ఆశీర్వదించి,**"చాలా కాలం తరువాత,మేము ఈరోజు పరమాచార్యస్వామివారి నవ్వును చూశాము"** అని చెప్పారు.

మరుసటిరోజు నుండే నాఆరోగ్యంలో మార్పు కనబడి త్వరలోనే స్వస్థత చేకూరింది. నేను ఇప్పుడు మంచి స్వరంతో పాఠాలు చెప్పగలుగుతున్నాను, చిన్న చిన్న దూరాలు కూడా నడవగలుగుతున్నాను.

"శ్రీ చంద్రశేఖరగురోశతాబ్దిఅంతర జీవనేకార్యేఅనుగ్రహఇతి ఏవశంకరం ప్రార్థయేసదా"

శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి గురుదేవులకు మరో వందసంవత్సరాల జీవితాన్ని ప్రసాదించాలని శ్రీ ఆదిశంకర భగవత్పాదులని వేడుకుంటున్నాను.

-- జి. సుబ్రహ్మణ్య శాస్త్రి. "kamakoti.org" నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

19. మా చిన్నమ్మ జీవితం

పరమాచార్యస్వామివారి భక్తుల్లో మాఅమ్మగారి పెద్దమ్మకుమార్తె(నాకు చిన్నమ్మ), ఆవిడభర్త ప్రముఖులు.మాబాబాయిగారు బాంబే(నేటిముంబై)లో ఎదోవ్యాపారం చేసేవారు. హఠాత్తుగా వ్యాపారంలో పెద్ద నష్టంవచ్చి, చెన్నైకి తిరిగొచ్చారు.అప్పుడు పరమాచార్య స్వామివారు చెన్నైలో మకాం చేస్తున్నారు.మాచిన్నమ్మ రోజులో చాలాసేపు మఠంలోనే ఉండేవారు.ఈసమయంలోనే తమ ఇరవయ్యేళ్ళ కుమారుడు హఠాత్తుగా మరణించినా, ఆవిడ అక్కడే పూలుకూర్చడం వంటి సేవ చేస్తుండేవారు.**వ్యాపారం దెబ్బతిన్నా ,కుమారుడు మరణించినా ఆమె విశ్వాసం చెక్కుచెదరలేదు, స్వామివారిని వదలలేదు.**

మహాస్వామివారు త్రిపురసుందరీసమేత **చంద్రమౌళీశ్వరపూజ చేస్తున్నప్పుడు ఒకసారి కామాక్షిఅమ్మవారిలాగా ఒకసారి శంకరునిలాగా కనపడేవారని,మరలాచూడగా అంతలోనే మందహాసముతో సన్యాసిగా దర్శనం ఇచ్చేవారు** అని ఆమె చెబుతుండేవారు.

ఒకరోజు మా చిన్నమ్మ కూతురు చిన్నపిల్ల తన బట్టలకు నిప్పంటుకుందని చెప్పింది. మాచిన్నమ్మ ఒక్కసారిగా పరమాచార్య స్వామివారిని తలచుకొని, నిప్పును ఆర్పి బట్టలు తీసేసింది. కాని పాప ఒంటి మీద చిన్న కాలిన గుర్తు కూడా లేదు.

తరువాత వారు మహాస్వామివారు తిరిగి బొంబాయివెళ్లి తిరిగి వ్యాపారం మొదలు పెట్టమన్నారు.అద్భుతంగా వారిపూర్వవైభవాన్ని తిరిగిసంతరించుకొన్నారు.అందు కోసమే స్వామివారు వారిని వెనక్కు పంపారు అని చెప్పవలసిన అవసరం లేదు.

మా చిన్నమ్మ పెద్దకుమార్తెకు పెళ్ళిచేయడానికి సిద్ధపడినప్పుడు, పరమాచార్యస్వామి వారు ఆమెని,"ఇప్పుడు నువ్వు ఇచ్చుకుంటావు.రేపు నీకుమారునికి ఇలాగే పుచ్చు కుంటావు కదా?" అని అడిగారు. ఆందుకు మా చిన్నమ్మ,"నేను అసలు ఏమి అడగను పెరియవ" అని బదులిచ్చారు. అలాగే నడుచుకున్నారు కూడా. అంతేకాకుండా ఏ విధమైన హంగు ఆర్భాటాలు లేకుండా పూర్ణ వైరాగ్యంతో జీవించేవారు. తరువాత తమ వ్యాపారం మొత్తం, అన్నిబాధ్యతలను తమ కుమారునికి అప్పజెప్పి,ఇద్దరూ కంచిమఠం చేరుకున్నారు. మహా స్వామివారు మఠంలోనే వారికి వసతి కల్పించారు.రోజూ మూడు పూటలా స్వామివారి దర్శనం చేసుకునేవారు.తరువాత కొంతకాలానికి ఒక ఇల్లు తీసుకొని అక్కడ జీవించేవారు.

ఒకసారి మాచిన్నమ్మ కుమార్తె కంచికి వెళ్ళినప్పుడు,తనభర్త ఆరోగ్య దృష్ట్యా బైపాస్ సర్జరి చెయ్యాలని డాక్టర్లు చెప్పారని మహాస్వామికి విన్నవించుకుంది. "డాక్టర్లు శస్త్రచికిత్స తప్పనిసరి అంటున్నారు పెరియవ.అలా లేకుండా స్వామివారే వారినిరక్షించాలి"అని వేడుకుంది.పరమాచార్యులవారు ఆశీస్సులు ఇచ్చారు. అతనికి ఎటువంటి శస్త్రచికిత్స లేకుండానే, డాక్టర్లే ఆశ్చర్యపోయే విధంగా అతని ఆరోగ్యం కుదుటపడింది.

కర్మఫలం వల్ల ఎన్నికష్టాలు ఎదురైనా విశ్వాసంతో స్వామిని నమ్మిన వారికి తప్పక కాపాడి,తరింపచేస్తారు.

--- శ్రీమతి ఇందిరా బాలసుబ్రమణియమ్, మహాపెరియవళ్ – దరిశన అనుభవంగళ్

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

20. తోటకూర పప్పు

స్వామివారు పీఠాధిపత్యాన్ని స్వీకరించిన తొలిరోజుల్లో ఒకరోజున మధ్యాహ్నం భిక్ష (భోజన) చేస్తూ 'ఈ పదార్థం బాగుంది, ఏమిటిద'ని అడిగారట.

అది "తోటకూరపప్పు" అని వంటవాడు చెప్పాడు. "ఓ చాలాబాగుంది" అన్నారట. మరునాడు భిక్షలో కూడా అదికనిపించింది. ఆయన "బాగుంది" అన్నారట. అలా రోజూ కనిపిస్తున్నది. ఐదవరోజున వంటవాడిని పిలిచి రోజూ ఎందుకుచేస్తున్నావని అడిగారు.

దానికి వంటమనిషి 'ఈమఠానికి మీ శిష్యులు చాలామంది వస్తారు కదా,వారితో చెప్పాను ఇది మీకిష్టమని. వారు ఇక్కడికి వచ్చేటప్పుడు కట్టలుకట్టలు తోటకూర ఆకుకూర పట్టుకొస్తున్నారు. అందుకని రోజూ చేస్తున్నా' అని చెప్పాడు. ఆయన విని ఊరుకున్నారట.

మరునాడు భిక్షసమయానికి విస్తరి ముందు కూర్చోకుండా గోశాలలోకి వెళ్లి, అక్కడి నుంచి ఆవుపేడతీసి నాలుకకు రాసుకున్నారట.ఆపక్కరోజున కూడా ఇలాగే చేస్తుంటే మఠం మేనేజర్ చూసి పరుగుపరుగున వచ్చి "అయ్యా! మీరేం చేస్తున్నారు" అని అడిగాడు. దానికి స్వామి వారు... "నేను ప్రపంచానికి మార్గదర్శకం చేయవలసిన పీఠాధిపతిని. సత్యదండం ధరించి,కాషాయంధరించి వెడుతుంటే నాపేరు తెలియకపోయినా సాక్షాత్ శంకరాచార్యుల వారు వస్తున్నారు' అని అంటారు.ఇంక ఏఊరువెళ్ళినా ఈవార్తకూడావెడుతుంది. శంకరాచార్యులవారికి తోటకూరపప్పు ఇష్టమని కొన్నాళ్ళు తెస్తారు. ఎండాకాలం వస్తుంది. ఎక్కడినుంచో కష్టపడి తెస్తారు.ఆతరువాత ఈశంకరాచార్యుల వారికి తోటకూర తేవడానికి ఛస్తున్నాం' అంటారు. ***"పదిమందికి మంచి గురించి, నిగ్రహం గురించి చెప్పవలసిన వాడిని, భోజనం విషయంలో నాలుక నిగ్రహం చేసుకోలేని నేను ఈ నాలుకతో దేశానికి ఏం మంచిమాట చెప్పగలను."***

వంటవాడిది కాదు తప్పు, రుచికి లొంగిన నాది. అందుకే రుచికి లొంగడం మానితే తప్ప మంచిమాట చెప్పడం కుదరదని నాలుకను గోమయంతో శుభ్రం చేసుకుంటున్నాను. శుద్ధి తర్వాత మళ్ళీ పదార్థాలు తీసుకుంటాను" అని చెప్పి మూడు రోజుల తర్వాత ఆయన ఆహారం తీసుకున్నారు.

"సన్యాసాశ్రమ ధర్మాన్ని పరమాచార్యస్వామి వారు పాటించినట్టుగా ఈశతాబ్ధిలో ఇంకెవ్వరూ పాటించలేదు. ఆచార్యులు ఎందరో ఉండవచ్చు, కాని పరమాచార్య ఒక్కరే. స్వాములు ఎందరో ఉండవచ్చుగాక, మహాస్వామివారు ఒక్కరే. వారు చేసిన ఆచరణాత్మక ధర్మప్రబోధానికి ఈ జాతి ఎప్పటికీ వారికి ఋణపడి ఉంటుంది."

--- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ గారి ప్రవచనం నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

21. ఎవరు జగద్గురువు?

సం.1933 లో పరమాచార్యస్వామివారు వారణాసిలో ఉన్నప్పటి సంఘటన.కాశీ మహారాజు రాజభవనంలో మహాస్వామివారిని స్వాగతించారు.అక్కడ ఎందరో విద్వాంసులు, పండితులు ఉన్నారు.వారిలో కొంతమంది పండితులకిస్వామివారిపై కొంచం అసూయ. పరమాచార్యస్వామికి "జగద్గురు" అన్నబిరుదు ఎలాసంభావ్యం అన్నది వారి కడుపుమంట.

అక్కడున్న వారిలో ఒక పండితుడు,"ఈ జగద్గురువు ఎవరు?" అని అడిగాడు.

స్వామివారు మర్యాదతో, "నేనే" అని సమాధానమిచ్చారు.

ఆ పండితుడు వ్యంగ్యంగా "తమరు జగద్గురువు" అన్నాడు.

అందుకు స్వామివారు **"जगतां गुरुः न - నేను జగద్గురువు అని అంటే దాని అర్థం నేను ఈ జగత్తుకు గురువు అని కాదు అర్థం."**

"जगति पद्यमनाः सर्वे मम गुरवः" - "విశ్వంలోని అన్ని ప్రాణులూ,నాకు గురువులు అని అర్థం" అని చెప్పారు."

ఇలాచెప్పగానే అక్కడున్న పండితులందరూ ఆశ్చర్యంతో వెనక్కుతగ్గారు. కాని,మహా స్వామివారు అంతటితో ఆపలేదు.

ఈవాదం జరుగుతున్న మందిరంలో పిచ్చుకలు పెట్టిన కొన్నిగూళ్ళు ఉన్నాయి. స్వామి వారు ఒకగూటివైపు చెయ్యి చూపిస్తూ,ఆపండితులను అడిగారు,"किं इदं?– ఏమిటిది?"

అందుకు ఆ పండితులు, "नीडः - గూడు" అని చెప్పారు.

మహాస్వామివారు "केन निर्मितं? – ఎవరు కట్టారు?" అని అడిగారు.

వారు "चटकैः - పిచుకలు" అని చెప్పారు.

స్వామి వారితో,**"ఈగూడు కట్టినది కాళ్ళు,చేతులు లేని ఆచిన్ని పక్షులు. మనకు కాళ్ళు, చేతులుఉన్నాయి.కాని,మనం వాటిలా గూడు కట్టలేము. ఆ పిచ్చుకలకు 'క్రియాశక్తి' ఉంది. నాకు ఆ శక్తి లేదు"** ***కాబట్టి ఆ పిచ్చుకలు నాకు 'గురువులు' అని చెప్పారు!!!***

ఇంక,ఏమని మాట్లాడతారు ఆపండితులు?స్వామివారి వినమ్రతకు, జ్ఞానానికి తల వంచటం తప్ప!

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

22. పూర్వీకుల ఆస్తి

ఒకసారి స్వామివారు,భక్తులతో,సాధారణ విషయాలగురించి మాట్లాడుతున్నారు.వారు భక్తులతో, **"మనపూర్వీకులు భూమి, డబ్బు, బంగారం, తోటలు, ఇళ్ళు మొదలైనవి తమ తరువాత తరాలవారు మంచిపనులకోసం, ధర్మాచరణ చేయడంకోసం మనకు ఇచ్చి వెళ్ళారు. ఇది వారు మనకిచ్చినపెట్టుబడి. వారిపిల్లలు సంతోషంగాఉండాలి అని వారు ఇలా చేసారు. వచ్చే తరాలవారు కూడా మంచిపనులు చెయ్యాలని వారుఆశించారు. వాటినుండి వచ్చేలాభాలతో ధర్మ కార్యాలు, పదిమందికి ఉపయోగపడే పనులు చెయ్యాలని వారు ఇంత చేసారు."**

కాని చాలాచోట్ల అలా జరగడం లేదు.వారు చెయ్యాలనుకున్న ధర్మకార్యాలు లేదా వారి వీలునామాలో చెయ్యాలని చెప్పినవి కూడా జరగడం లేదు. వీటికోసం కేటాయించిన సొమ్ముని కూడా కుటుంబ అవసరాల కోసం వాడుకుంటున్నారు.**"ఇది అధర్మం,చాలా పెద్ద తప్పు. ఎన్నోకుటుంబాలు ఇలాంటిడబ్బుని,అన్యాయంగా అనుభవిస్తున్న వారు చాలాబాధలు పడుతున్నారు. అది ప్రయాగ నుండి గంగను తెచ్చి, రోడ్డు పక్కన పారబోయడం వంటిది"** అని చెప్పారు.

మహాస్వామివారు ఇలా చెప్పగానే ఒక భక్తుడు నిలబడి ఏడుస్తూ,"మా పూర్వీకులు చెప్పినట్టు నేను,అన్నిధర్మకార్యాలుచేస్తాను. ఇకనుండి ధర్మమార్గంలో బ్రతుకుతాను. ఇప్పటి వరకు నేను చేసిన అన్నితప్పులను మాహాస్వామి వారు మన్నించాలి" అని వేడుకున్నాడు.

అవ్యాజ కరుణతో మహాస్వామివారు ఆ భక్తుడితో,"ఇది నీకుమాత్రమే ప్రత్యేకంగా చెప్పినది కాదు.చాలాకుటుంబాల్లో ధర్మకార్యాలకోసం ఉంచినసొమ్ముని వేరేవాటికి వినియోగిస్తున్నారు" అని అన్నారు.

బాధపడిన ఆ భక్తుడు మహాస్వామి వారికి సాష్టాంగం చేసి భారంగా నిలబడ్డాడు.

స్వామివారు అతణ్ణి దగ్గరకు పిలిచి, **"పశ్చాత్తాపానికి మించినది లేదు. ఇకనుండి ధర్మంగా సంపాదించి ధార్మికంగా ఖర్చుపెట్టి, మీ పూర్వీకులు చెప్పినట్టుగా నడుచుకో"** అని ప్రసాదంఇచ్చి,పంపారు. **ఒక్కమాటతో,జన్మజన్మలలో అనుభవించ వలసిన చెడ్డకర్మఫలం వల్ల కలిగే బాధ నుండి కాపాడారు.**

కేవలం పరమాచార్యులవారి ఉనికి ఇలాంటి ఎన్ని వేల,లక్షలమందికి ఎన్ని జన్మల పాపకర్మనుంచి విడుదలచేసిందో, ఎంతమందికి ఎన్నిబాధలనుంచి ,రాబోయేకర్మలనుంచి కాపాడేరో,వారిని సన్మార్గంలో నడిచేటట్లుచేసి ఎంతమందికి వారివల్ల మేలుకలిగేటట్లు వారిని మలిచారో...

--- 'ఇన్ ద ప్రెజెన్స్ ఆఫ్ డివైన్' అనుభవాల సంగ్రహం 1

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

23. ఇది సర్వజ్ఞులకే సరి

యోగమూర్తులైన శ్రీశ్రీశ్రీ మహాపెరియవా సాక్షాత్-పరమేశ్వర అవతారులు, శుకబ్రహ్మ అంతటి ఉన్నతమైనవారు.వారిలీలలు తెలియరాదని వారుఎంతగా ప్రయత్నించి నా కొన్నికొన్ని సమయాల్లో వారి అవతారరహస్యం భక్తులకుతలియజేసి వారిని ఆశీర్వదిస్తూ ఉంటారు.

'ఎచ్చాంగుడి-గణేశఅయ్యర్' కు జరిగిన అనుభవానికి భక్తులు ఎంతగానో ఆశ్చర్యచకితులై, అసలు,పరమాచార్య స్వామివారికి తెలియనివిషయం ఒకటి ఉంటుందా అని మురిసిపోతారు.

ఆయన పదవీవిరమణ పొందిన ఇంజనీరు. భార్యతో పాటు మహాస్వామివారి దర్శనానికి వచ్చారు."ఎంత ఖర్చుతో కూడుకున్నదైనా పర్లేదు, స్వామివారు నాకేమైనా ఒక కార్యం అప్పగిస్తే ఆనందిస్తాను" అని స్వామివారికి తెలిపారు. అందరు భక్తులకి ప్రసాదం ఇచ్చి పంపిన తరువాత అతనితో, స్వామివారు-"కుంభకోణంలో ఎన్నో పిళ్ళయార్ (వినాయకుడు) దేవాలయాలు ఉన్నాయి. పైన ఏఆచ్ఛాదనా లేని ఎందఱో వినాయకులు మర్రిచెట్ల క్రింద,నదిఒడ్డున ఉన్నారు.నువ్వు వాటికి నువ్వులనూనెతో అభిషేకంచేసి, గంధం ముద్దలతో అలంకరించి, ధూపం వెలిగించి, పళ్ళు, కొబ్బరికాయలు,తమలపాకులు,వక్కలతో నైవేద్యం చెయ్యి. పట్టణానికి ఒక కిలోమీటరు పరిధిలో అవి దేవాలయాలలో ఉన్నా, చెరువుల వద్ద ఉన్నా ఇలాచెయ్యి. ఇది చాలు" అని ఆదేశించారు.

కుంభకోణంలో ఉన్న అన్ని వినాయకుల విగ్రాహాలకీ పూజ చెయ్యమనడం గణేశ అయ్యర్ కు చాలా ఆనందంగా తోచింది. కాని, అతనిసమస్యను స్వామివారితో,"గత ఇరవై నాలుగు సంవత్సరాలుగా ఉత్తరభారతంలో ఉండడంవల్ల, అక్కడ చుట్టుపక్కల ఎవరూ తెలియక పోవడం వల్ల, నాకు ఈ పూజాపద్ధతులలో అంతగా అనుభవంలేదు" అని చెప్పాడు.

మహాస్వామివారు'శ్రీ బాలు' ని పిలిచి,"కుంభకోణంలోని 'పళక్కడైత్యాగు'కి వ్రాయి. కావాల్సిన మొత్తం సహాయం అతను చేస్తాడు. ఈ 'కైంకర్యం' ముగిసిన తరువాత గణేశ అయ్యర్ తో పాటు తనను కూడా ఇక్కడకు రమ్మని చెప్పు" అని చెప్పారు.

పళక్కడైత్యాగు తన భార్యతో సహా గణేశఅయ్యర్ ఇంటికి వచ్చాడు. వెంటనే వారికి అప్పగించిన కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. మూడు రోజులపాటు వీళ్ళ అవసరానికి రాజ వేద పాఠశాల వారి వ్యాను కూడా సమకూరింది.

కుంభకోణం శ్రీమఠంవద్ద ఉన్న గ్రానైటుస్తంభంపైఉన్నవినాయకుడితో మొదలుపెట్టి, మొత్తం నూటఅరవైఎనిమిది వినాయకవిగ్రహాలను వెతికి, కనిపెట్టి అన్నింటికి పూజ చేశారు. అయిదు టిన్నుల నువ్వల నూనె, అరకేజీ గంధం, కిలో కర్పూరం, యాభై కట్ల అగరవత్తులు ఖర్చుచేసి, దేవాలయాల్లో ఉన్న వినాయకులకోసం వాటిని పూజారులకు ఇచ్చి, బయట ఉన్న వినాయకులకు వారే స్వయంగా అభిషేకం, పూజ చేశారు.

కాళ్ళు,చేతులు సరిగాలేక, భిన్నమైపోయిన కొన్ని వినాయక విగ్రహాలకు పూజ చెయ్యటానికి వారికి సందేహం కలిగి, శ్రీమఠం అధికారుల ద్వారా విషయాన్ని పరమాచార్య స్వామివారికి తెలుపగా, దానికి స్వామివారు **"కళ్ళు, చేతులు లేని మనుషులు కూడా ఈ లోకంలో బ్రతకడంలేదా? వాటికి కూడా పూజ చెయ్యమని చెప్పండి"** అన్న సమాధానం వచ్చింది. దాంతో ఆ భిన్నమైన వినాయకులకు కూడా అభిషేకము, పూజ జరిగాయి.

కుంభకోణంలో ఇక 'ఏ వినాయక విగ్రహం మిగలలేదు' అని నిర్ధారణకు వచ్చాక కాంచీపురానికి తిరిగొచ్చారు.అప్పుడు మహాస్వామివారు కర్నూలులో ఉండడంతో, స్వామి వారిని దర్శించుకుని కార్యక్రమం పూర్తిచేశామని చెప్పడానికి రెండు కుటుంబాలు ప్రయాణ మయ్యాయి. వాళ్ళు చెప్పిన విషయమంతా విన్న మహాస్వామివారు, వారికి ఆశ్చర్యం కలిగేలా ఒక ప్రశ్న అడిగారు.

"ఇంకా ఆరు వినాయకులు ఉన్నారు, వాటిని మీరు ఎలా వదిలేశారు?" వారు ఊరంతా తిరిగి వెతికి వెతికి అన్నిటికి అభిషేకం చేస్తే, ఇంకా ఆరు ఉన్నాయని పరమాచార్య స్వామివారు ఎలా చెప్పగలుగుతున్నారు అని ఆశ్చర్యపోయారు.

స్వామివారే దానికి సమాధానంగా, "చక్కోట్టై దగ్గర ఒక వినాయకుడు, స్వామిమలై వెళ్ళే దారిలో ఒక వినాయకుడు, వ్యవసాయ వీధిలో ఒక వినాయకుడు, 'అరసలరు' నది ఒడ్డున చెట్టు కింద ఒకవినాయకుడు అని(ఇంకా రెండు వినాయకుల స్థలాలు చెప్పారు కాని వాటివివరాలు గుర్తులేదు)". అప్పుడు వాళ్లకు అర్థం అయ్యింది ఈ ఆరింటిని వదేలేసామని.

"పర్లేదు లెండి! మరలా మీరు కుంభకోణం వెళ్ళినప్పుడు, ఈ ఆరు వినాయకులకు కూడా అభిషేకం,పూజ చెయ్యండి" అని చెప్పి వారి మనస్సును మరల్చారు స్వామివారు. కుంభకోణంలో పుట్టి పెరిగి, మొత్తం ఊరు తెలిసిన వారికి కూడా ఈ నూటఅరవైఎనిమిది వినాయక విగ్రహాలు కాకుండా ఇంకా ఆరు వినాయక విగ్రహాలు ఉన్నాయని చెప్పగలరా?

ఇది కేవలం సర్వమూతెలిసిన పరమాచార్యస్వామివారికి మాత్రమే సాధ్యం. ఈ విషయం గణేశఅయ్యర్ కు, త్యాగు కు ఆరోజే అర్థమయ్యింది. స్వామివారికి నమస్కరించి ఆశీస్సులు అందుకున్నారు.

--- "శ్రీ శ్రీ శ్రీ మహాపెరియవా మహిమై" పత్రిక నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

24. కంచి స్వామి పంపినవారు రండి

ఇది జూన్,1984లో జరిగినసంఘటన.అప్పుడు స్వామివారు ఆంధ్రదేశంలోని మెహబూబ్ నగర్(ఇప్పటి తెలంగాణ)లో పర్యటిస్తున్నారు.అక్కడజరిగే శంకరజయంతి ఉత్సవాలలో పాల్గొనవలసిందని నన్ను ఆజ్ఞాపించారు.నేనువెళ్ళి మహాస్వామివారిని దర్శించు కున్నాను,వారు నన్ను శృంగేరి వెళ్ళి అక్కడి జగద్గురువులను కలవమని చెప్పారు.

నాతోపాటు మరొక ఐదుగురము కలిసి శృంగేరి వెళ్ళాము.మేము శృంగేరి చేరిన వెంటనే శారదాపీఠంసెక్రెటరీని కలిసాము.ఆయన,'ముందస్తుఅనుమతి(అపాయింట్మెంట్)'లేకుండా ఆచార్యులను కలవడం కుదరదని చెప్పారు.

నేను మహాస్వామి వారిని మనస్సులోనే ప్రార్థించి అక్కడ కూర్చొని శారదామాతకు సహస్రనామం చెయ్యడం ప్రారంభించాము.దాదాపు ఒకగంటతరువాత శృంగేరిపీఠ జగద్గురువులు శ్రీశంకరాచార్య అభినవవిద్యాతీర్థ మహాసన్నిధానం, శ్రీశంకరాచార్య భారతీ తీర్థసన్నిధానం ఇరువురూ దీపారాధనకు వచ్చారు.వారు శారదాంబకు చేయవలసిన పూజ అంతా ముగిసిన తరువాత మహాసన్నిధానంవారు మావైపు చూస్తూ,"కంచి మహాపెరియవ వద్ద నుండి వచ్చినవారు మమ్ము కలవచ్చు" అని చెప్పి ముందుకు నడిచారు.

మాకు చాలాఆశ్చర్యం వేసి, వారివెంట వెళ్ళాము.దాదాపు గంటసేపు వారితో సంభాషించాము. మేము తిరిగివచ్చిన తరువాత సెక్రెటరీగారు మావద్దకువచ్చి మమ్మల్ని క్షమాపణ కోరుతూ "**మిమ్మల్ని పరమాచార్యస్వామివారు పంపారని,మీకు అన్నిటికంటే పెద్ద అపాయింట్మెంట్ ఉందని నాకు తెలియదు**"అని చెప్పాడు.అప్పుడు నేను అతనితో "సన్యాసులను సిద్ధపురుషులను కలిసేప్పుడు ఏపరిచయం చేసుకోవలసిన అవసరం లేదని" చెప్పాను.

అచ్చంగా ఇలాంటి సంఘటనే తపోవనంసాధు త్రివేణిగిరిస్వామిగళ్ మరియు తిరువణ్ణామలై విసిరిస్వామిగళ్ వారి దగ్గర కూడా జరిగింది.

ఇక్కడ అర్థం చెసుకోవలసినది ఏమంటే,మనకు తెలిసినదానికంటే మహాత్ములకు తెలిసినది ఎక్కువ.వారిది వ్రాతసంభాషణ,మౌఖికసంభాషణ కాదు.వారిది ఆత్మసంభాషణ. మనంకేవలందూతలం అంతే! ఉన్నది ఒకేపరబ్రహ్మం అయినప్పుడు,వారు ఆపరబ్రహ్మము నందు రమించునప్పుడు ఒకరితో ఒకరు మాట్లాడవలసిన పనిలేదు.వారు అత్మస్థితి చేత ఒక్కటిగా ఉండి, ఎప్పుడూ మనతోనే ఉంటారు.

--- కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

25. విదేశీయానం – ప్రాయశ్చిత్తం

పరమాచార్యస్వామివారి అనుగ్రహంవల్ల మద్రాసులోని ప్రభుత్వఆసుపత్రిలో 1964 నుండి1992 దాకా ఎన్నో మెదడుకు సంబంధించిన శస్త్రచికిత్సలు చేసాను. పదవీ విరమణ తరువాత ప్రైవేటు ఆసుపత్రులలో దాదాపు దశాబ్దం పాటు పనిచేశాను.

ఇది నా పెళ్ళయినతరువాత జరిగిన విషయం– ఆకాలంలో ఉపనయనం అయిన బ్రాహ్మణులు విదేశాలకువెళ్ళివస్తే,వచ్చినవెంటనే ప్రాయశ్చిత్తంకోసం రామేశ్వరంవెళ్ళి సేతు స్నానం చేసిరావాలి.మాది సంప్రదాయంపాటించే కుటుంబమైనా,నాకుఇది కుదరలేదు. విదేశాలనుండి వచ్చినవెంటనే నాకు హెర్నియా ఆపరేషన్ జరిగింది.తరువాత వివాహం. ఆ తరువాత ఇక ఆసుపత్రి పనిలో పడి రామేశ్వరం వెళ్ళడానికి కుదరలేదు.

నాకు గుర్తున్నంతవరకు 1975లో పరమాచార్య స్వామివారి దర్శనానికి నా చెల్లెలు, మేనకోడలితో కలిసి కాంచీపురం వెళ్ళాను. అప్పటికే నేను చాలాసార్లు విదేశాలు వెళ్ళి వచ్చాను. నైజీరియా నుండి వచ్చిన మధ్యవయస్కుడైన ఒక బ్రాహ్మణుడు కూడా స్వామివారి దర్శనానికి వచ్చాడు. దాదాపు ఒక అరవై డెబ్భై మంది అక్కడ ఉన్నారు. ఒక గంటసేపు ఈ ప్రాయశ్చిత్తం గురించి మాట్లాడారు. ఆ సంభాషణ మీకోసం.

పరమాచార్య స్వామివారు అందరిని ఉద్దేశించి, "ఈపెద్దాయన ప్రాయిశ్చిత్తం చేసుకోవాలా–వద్దా అని తెలుసుకోవడానికి నైజీరియా నుండి వచ్చాడు" అని నావంక తిరిగి "బహుశా కళ్యాణరామన్ కి కూడా ఈవిషయంపై అడగాలనివచ్చాడు.రామేశ్వరం వెళ్ళాలా? వద్దా? అని"

మహాస్వామి : "భారతందేశంలో ఎన్ని రామాయణాలున్నాయి?"

కళ్యాణరామన్ : "బహుశా ఒక వంద"

మహాస్వామి : "మన దేశంలో దాదాపు 300 వందల భాషలు,మాండలికాలు ఉన్నాయి.కాబట్టి అన్నిరకాల రామాయణాలు కూడా ఉండొచ్చు. సీతారాములు లంక నుండి అయోధ్యకు ఎలా చేరుకున్నారు?"

కళ్యాణరామన్: "పుష్పక విమానంలో"

మహాస్వామి : "అవును, నిజం.ఇందులో ఆశ్చర్యం ఏమంటే వాల్మీకి రామాయణం లో గాని, లేదా వేరే ఏ ఇతర రామాయణాలలో కాని లంక నుండి తిరిగివచ్చిన తరువాత రాముడుకాని, ఇతరులు కాని ప్రాయశ్చిత్తం చేసుకున్నట్టు లేదు.మీరు అనుకోవచ్చు, సముద్ర

మార్గంలో వస్తే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి కాని వారందరు వచ్చినది వాయిమార్గంలో కదా అని"

వారు ఒక ఫ్రెంచి దేశస్థుని పేరు చెప్పి, అతని గురించి విన్నావా? అని అడిగారు. నేను లేదని చెప్పాను.

మహాస్వామి : "ఇతను ఒక చరిత్రకారుడు. చోళుల ప్రారంభ పరిపాలనా కాలంలో అతను ఈదేశంలో ఉండేవాడు.అప్పుడు పరిపాలిస్తున్న చోళరాజు కుమార్తెకు తగిన వరుడు భారతదేశంలో దొరకలేదు.ఆప్పటికాలంలో హిందూరాజులు ఇతర దేశాలైన కాంబోడియా, థాయ్ లాండ్, ఇండోనేసియాలలో రాజ్యం చేసేవారు. నువ్వు బాంకాక్ వెళ్ళావా?"

కళ్యాణరామన్ : "వెళ్ళాను పెరియవ"

మహాస్వామి : "అక్కడ ప్రాకారాలకు రామాయణం బొమ్మలతో ఉన్న ప్రఖ్యాత బౌద్ధ దేవాలయానికి వెళ్ళావా? "

కళ్యాణరామన్ : "వెళ్ళాను పెరియవ"

మహాస్వామి : "సరే, ఆ చోళరాజు కాంబోడియా రాకుమారుణ్ణి తన అల్లుడిగా చేసుకోవడానికి నిశ్చయించుకున్నాడు.అతన్ని భారతదేశానికి పిలిపించి పెళ్ళి జరిపించాడు. ఆ రాజదంపతులుతో పాటు చాలామంది రాజపురోహితులు, చలికత్తెలు, పరిచారకులు, సేవకులు కూడా రాకుమారుని రాజ్యానికి వెళ్ళారు.

అక్కడ కొన్ని రోజులు ఉన్న తరువాత పురోహితులు భారతదేశానికి తిరిగొచ్చారు. ఆ చరిత్రకారుడు ఈ వివాహం గురించి ప్రతి చిన్న విషయాన్ని పొందుపరిచాడు. అందులో పురోహితులు కాంబోడియా వెళ్ళినప్పుడు గాని మళ్ళా ఇక్కడికి తిరిగి వచ్చినప్పుడు కాని ప్రాయశ్చిత్తం చేసుకున్నట్టు ఎక్కడా రాయలేదు"

"ఈరోజుల్లో అమెరికా వెళ్ళడానికి ఎన్ని రోజులు పడుతుంది?" అని అడిగారు

కళ్యాణరామన్ : "దాదాపు పద్దెనిమిది గంటలు. లండన్ లో దిగితే 24 గంటలు పడుతుంది పెరియవ"

మహాస్వామి : "అది అసలు విషయం. మన శాస్త్రాలలో ఏమి చెప్పారంటే, ఎవరైనా వరుసగా మూడురోజుల పాటు నిత్య కర్మానుష్టానము (రోజూ చేసే సంధ్యావందనం, సమిధాదానం, అహ్నిహోత్రం) చెయ్యకపోతే, వారు ఖచ్చితంగాప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ఆరోజుల్లో ప్రతిఒక్కరూ రోజూ నిత్యకర్మ చేసేవాళ్ళు. చెయ్యడానికి ఎప్పుడు కుదరదు అంటే సముద్రమార్గంలో ప్రయాణిస్తే.

ఎందుకంటే స్నానానికి శుద్ధజలం దొరకదు కాబట్టి. అందుకే సముద్రం దాటితే, మూడు రోజులు నిత్యకర్మ మానేస్తే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. బహుశా ఆ పురోహితులు రెండు రోజులలో కాంబోడియా చేరుకుని ఉంటారు, మరియు శ్రీరాముడు కొన్ని గంటలలో

అయోధ్య చేరుకుని ఉంటారు. అందుకే ప్రాయశ్చిత్తం చేసుకోలేదు" అని మహాస్వామి వారు మాకు జ్ఞానబోధ చేసారు.

ఇది ఇప్పటికి అన్వయిస్తే ఎంతోమంది కొన్ని వందలసార్లు ప్రాయశ్చిత్తం చేసుకోవలసి ఉంటుంది, మూడురోజులపాటు సంధ్యావందనం చేయనందుకు ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి విదేశాలు వెళ్ళినవారు మాత్రమే అర్హులు కారు, వరుసగా మూడు రోజులు సంధ్యావందనం మానేసిన వారందరూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిందే.

ఇది శాస్త్ర-ఇతిహాసాలపై, స్వామివారికి ఉన్న పట్టుని చూపించే చక్కటి ఉదాహరణ. చెప్తున్న విషయానికి చిన్నచిన్న ఉదాహరణలతో పామరులకుసైతం అర్థంఅయ్యేలాగా చెప్పడం వారికే చల్లుతుంది. నా మనస్సులోఉన్న అనుమానాలన్నీ తీరిపోయాయి.రామేశ్వరం వెళ్ళకపోవడంవల్ల నాకుపాపంలేదు. కాని,ఈనాటి ఈ సంఘటనవల్ల జీవితాంతం ఒక్కరోజు కూడా సంధ్యావందనం,గాయత్రి మానకూడదు అన్న నాసంకల్పం ఇంకా బలంగా మనస్సులో నాటుకుంది.

మహాస్వామి వారు ఇంకా ఇలా చెప్పారు.

ఇంకా కొందరు చెప్తారు మనం ఇంకొక ద్వీపానికి వెళ్తే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి అని. ఆఫ్రికా ద్వీపమా?

కళ్యాణరామన్ : అవును

మహాస్వామి : "కాదు. ఆఫ్రికా, ఆసియా మరియు ఐరోపా ఒకే భూభాగం లోనివి. కేవలం వందేళ్ళక్రితం ఆంగ్లేయులు 'సూయజ్ కెనాల్'తవ్వగాఅది పేరుకుద్వీపం అయ్యింది.

నిజానికి ఒకప్పుడు ఆస్ట్రేలియా,ఆసియా,ఆఫ్రికా మరియు ఐరోపా ఒకేపెద్ద భూభాగం. కొన్ని లక్షలసంవత్సరాలలో సముద్రంమధ్యలో రావడంవల్ల ఆభూపలకలు దూరం జరిగాయి. అందువల్ల అవి ప్రత్యేక ఖండాలు అయ్యాయి"

ఇది వారికున్న భౌగోళిక,చారిత్రక,భూగర్భశాస్త్ర-విజ్ఞానానికి నిదర్శనం.పరమాచార్య స్వామివారు అన్ని శాస్త్రాల్లోను ప్రావీణ్యులు.

చివరగా నైజీరియానుండి వచ్చినపెద్దమనిషికాని, కళ్యాణరామన్ కాని ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిన అవసరం లేదు ఎందుకంటే వారు మూడు రోజుల లోపే ప్రయాణం చేశారు. కాని,***మూడు రోజులకంటే ఎక్కువ సంధ్యావందనం వదిలినవారు మాత్రం, తప్పక ప్రాయశ్చిత్తం చేసుకుని తీరవలసిందే. ఎట్టిపరిస్థితిలోను నిత్యకర్మను పాటించి తీరవలసిందే.***

ఇది సాక్షాత్ ఈశ్వర వాక్కు!!!

--- ప్రొ. యస్. కళ్యాణరామన్, న్యూరోసర్జన్, చెన్నై

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

26. భక్తవత్సలుడు – భక్తవత్సలం

1964 వ సం.లో శ్రీమఠం యొక్క విడిది 'కరైకుడి' లోని శంకరమఠంలో ఉంది. స్వామివారి దర్శనంకోసం తమిళనాడు అప్పటిముఖ్యమంత్రి శ్రీభక్తవత్సలం విచ్చేశారు. మహాస్వామివారు వారితో,**"రామేశ్వరం దగ్గరఉన్న 'ధనుష్కోటి' క్షేత్రంగురించి విన్నావా? అక్కడున్న వారందరిని వెంటనే వారిసామానుతో పాటుగా అక్కడినుండి ఖాళీ చెయ్యించ డానికి ఆదేశాలు జారీచెయ్యి. ప్రభుత్వఆస్తుల్ని కూడా సంరక్షించు కోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకో"** అని ఆజ్ఞాపించారు.

'ఎందుకు?ఏమిటి? అని భక్తవత్సలం అడగాలి కదా. కాని ఒక్క విషయం కూడా అడగలేదు. ***ఎందుకంటే,ఆ ఆదేశాలు వచ్చినది భూతభవిష్యత్ వర్తమాన కాలాలను ఎరిగిన పరమాచార్యస్వామివారి నోటినుండి కనుక'.*** కారణం అడగడం వల్ల ప్రయోజనం కూడా ఏముంటుంది? ఏదిఏమైనా అది చాలాపెద్ద కారణమే అయ్యి ఉంటుంది.

అవును, నిజంగా అది చాలా పెద్ద కారణమే!!

సరిగ్గా స్వామివారు అలా 'ఖాళీ చెయ్యించమని' చెప్పిన ఏడెనిమిదిరోజులకి భయంకర మైన వేగంతో తీవ్రమైన సుడిగాలులు, పెద్దపెద్ద సముద్రపుఅలలతో కూడిన భయంకరమైన తుఫాను వచ్చింది. మొత్తం ధనుష్కోటినగరం తుఫానులో చిక్కుకొని సముద్రపు నీటిలో మునిగిపోయింది.

ఇంతటి ప్రళయం నుంచి తప్పించమని స్వామివారికి ఎవరైనాచెప్పారా? ***ప్రకృతిలో భాగమైన సముద్రం ప్రళయాకారం దాలిస్తే, ప్రకృతికిఅతీతమైన మనస్వామి ప్రళయాన్నుంచి కాపాడారు.*** భౌతికమైన అధికారంకలిగినవారు మహనీయులైన స్వామివారినిగాని లేక అటు వంటి గురువులనుగాని శరణుపొందితే వారిని వాహకంగాచేసుకుని సాధారణ ప్రజలకూ కృపను చూపిస్తారు.ఇక్కడ భక్తవత్సలుడు ఎవరు? కాషాయం కట్టినవాడా?లేక తెల్లని చేనేత దుస్తులు కట్టిన వాడా?

--- వి.శ్రీనివాసన్, చెన్నై. మహా పెరియవళ్ – దరిశన అనుభవంగళ్ 2

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

27. త్వరగా బయటకు రా!

కంచిపరమాచార్యులసేవలో తరించి, జన్మధన్యత పొందినవారిలో శ్రీకంఠన్ ప్రముఖులు,ముఖ్యులు కూడా! మహాస్వామివారుతప్ప వేరు ప్రపంచం లేదని భ్రతికిన– శ్రీవారి సేవకుడు తాను.

ఒకసారి పరమాచార్యవారు మఠంలోలేరు.కొద్దిదూరంలో ఉన్నారు.సాయంత్రం శ్రీ కంఠన్ అత్యంతభక్తితో రుబ్బురోలులో పిండి రుబ్బుతూఉన్నారు. చేతులు పనిచేస్తూ ఉన్నా కాని, మనస్సంతా మహాస్వామివారి గురించిన ఆలోచనలే.

అంతలోనే మఠం సేవకులొకరు గాభరాగా లోపలికివచ్చి,ఆయాసంతో రొప్పుతూ, **"చేస్తున్న పనినివదిలి,వెంటనే బయటకురమ్మని స్వామివారిఆదేశం"**అని తెలిపారు. 'ఎందుకు ఇలాంటి ఆదేశాన్ని ఇచ్చారు,విషయం ఏమిటి' అని శ్రీకంఠన్ ఎప్పుడూ ఆలోచించరు. పరుగుపరుగున వెంటనే మహాస్వామి వారి సమక్షానికి వచ్చేశారు. శ్రీకంఠన్ బయటకు వచ్చిన కొద్దిక్షణాల్లోనే అతను కూర్చున్న భవనంయొక్క పైకప్పు కూలసాగింది. శ్రీకంఠన్ గనక బయటకు వచ్చి ఉండకపోయిఉంటే పైకప్పుశిథిలాల్లో అతను చిక్కుకుపోయేవారే.

దివ్యదృష్టిగల పరమాచార్యుల కారుణ్యహృదయంవల్ల శ్రీకంఠన్ ఆపదనుండి తప్పించుకున్నారు.జరగబోయేది ఏమిటో,ఆసర్వేశ్వరునికి ఎలాతెలుసని శ్రీకంఠన్ అడగగలడా? కళ్ళనీరు కారుతుండగా తనప్రాణాలు కాపాడినదేవునికి సాష్టాంగ వందనం చేసారు. మరింత శరణాగతితో తనజీవితాన్ని మహాస్వామివారి పాదాలచెంత సమర్పించారు శ్రీకంఠన్. స్వామివారి అనుగ్రహంతో,ఎన్నోఏళ్ళు సేవచేసి, తరువాత సన్యసించి,చివరికి మహాస్వామి వారిలో చేరుకున్నారు.

పరమాచార్య స్వామివారిని శరణుపొందిన వారికి నిరంతరం,వారిని కనిపెట్టుని ఉంటారనేదానికి నిరూపణ ఈ లీల.

--- రా. వెంకటసామి, శక్తి వికటన్ ప్రచురణ

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

28. సన్యాసి – తొమ్మిదో తిరుకళ్యాణం

అది సాయం సంధ్యాసమయం.శ్రీమఠంలో మహాస్వామివారి దర్శనంకోసం చాలామంది భక్తులు వేచియున్నారు. స్వామివారు తమగదిలోనుండి బయటకువచ్చి మామూలుగా వారుకూర్చునేస్థలంలో గోడకుచేరి కూర్చొన్నారు. ఒక్కొక్కరుగా భక్తులు వస్తూ మహాస్వామి

వారికి సాష్టాంగంచేసి,వారిని ప్రార్థించి తమకష్టాలను తీర్చవలసినదిగా కోరుకుంటున్నారు. మహాస్వామివారు తగినసూచనలనుఇచ్చి ,ఆశీర్వదించి ప్రసాదం ఇచ్చి పంపుతున్నారు.

రాత్రి 8:30 అయ్యేటప్పటికి భక్తులందరూ దర్శనంముగించుకున్న తరువాత, వారు గదిలోకి వెళ్ళడానికి లేస్తూఉండగా తొందరపడుతూ ఒకదంపతులు వచ్చారు. వారి వెంట ఒకఅమ్మాయి కూడావచ్చింది.స్వామివారికి సాష్టాంగంచేసి వారితో పాటుగా తెచ్చిన నాలుగు పెద్దసంచులలోనుండి పదార్థాలనుతీసి అక్కడఉన్న పెద్దపళ్ళెంలోపెట్టి మహాస్వామి వారికి సమర్పించారు.

స్వామివారు ఆ పళ్ళాలలోఉన్న కలకండ,జీడిపప్పు,పిస్తా,బాదం,ఎండుద్రాక్ష, ఖర్జూరం తెచ్చినవారినిచూసి,చాలాసంతోషంతో,"అరెరె!మన విశ్వనాథన్! అమెరికా నుండి ఎప్పుడు వచ్చావు? నీభార్యకూడావచ్చిందా? సంతోషం, ఎందుకు ఇవన్నీతీసుకు వచ్చావు? నీపక్కన నిలుచున్నది నీకూతురుకదూ?ఓహో పెళ్ళిసంబంధం కుదుర్చుకుని వచ్చావా?మరి ఈపళ్ళాలలో వివాహ పత్రిక లేదే?" అని మహాస్వామి అడిగారు.

అంతే! ఆముగ్గురూ మనసులో గూడుకట్టుకున్న బాధ పెల్లుబకగా మహాస్వామి పాదాల వద్ద పడి, ఏడవడం మొదలుపెట్టారు.

స్వామివారు కొంచెంఆగి,ప్రేమతో "విశ్వనాథా! నేనేమైనా తప్పుమాట్లాడానా? ఎందుకు చిన్నపిల్లలులాగా ఏడుస్తునారు?"అని అన్నారు

వెంటనే విశ్వనాథన్ లెంపలేసుకుని ఆత్రుతగా శివశివా! అపచారం అపచారం! అలాంటిదేమిలేదుపెరియవ! మీరు 'పెళ్ళి నిశ్చయమైందా? పెళ్ళిపత్రికఏది?' అని అడగ గానే మేము మాబాధని ఆపుకోలేక పోయాము.ఈమెకిప్పుడు 25 సంవత్సరాలు.మేము తనకి పెళ్ళి చేయాలని17వ సంవత్సరమునుండే, సంవత్సరానికి రెండునెలలు ఇక్కడఉండి, అబ్బాయిని వెతుకుతున్నాము.కానీ ఇంతవరకూ ఏసంబంధం కుదరలేదు.చదువు, అందం, ఐశ్వర్యం అన్నీ ఉన్నా అదృష్టం లేదు" అని మళ్ళా ఏడవడం మొదలుపెట్టాడు.

అప్పుడు రాత్రి 9:30 అయింది.మహాస్వామివారికి పరిస్థితి అర్థమైంది.అతన్ని స్థిమిత పరచడానికి "సరే,బాధపడకు! రండి,వచ్చి మీముగ్గురు ఇక్కడకూర్చోండి" అని వారిముందు న్న స్థలం చూపించారు.

ముగ్గురూ అక్కడకూర్చున్నారు.మహాస్వామివారు మాట్లాడుతూ "విశ్వనాథా! నాకు తెలుసు నువ్వు ఎన్నో దేవాలయాలకి, చెరువులకి, ఎందరో పేదలకి దాన ధర్మాలు చేసావు. నీకు ఇంతటి మానసిక వేదనా! సరే, నువ్వు అమెరికాలో స్థిరపడి ఎన్ని సంవత్సరములు అయింది"

"20 ఏళ్ళు పెరియవ" విశ్వనాథన్ బదులిచ్చాడు.

స్వామివారు అమ్మాయిని చూపిస్తూ, చిరునవ్వుతో "ఈమె నీ ఒక్కగానొక్క కూతురు కదా? ఏమిటి పేరు?"అనిఅడిగారు.విశ్వనాథన్ నోటికి తనచేతిని అడ్డంగాపెట్టుకొని "ఔను పెరియవ ఈమె ఒక్కతే ,పేరు అపర్ణ." అని అన్నాడు.

"జాతకాన్ని ఎవరైనా జ్యోతిష్కులకు చూపించావా?"

"చాలా మందికి చూపించాము స్వామి. ప్రతిఒక్కరూ ఏదో దోషము ఉందని చెప్తూ కొన్ని నివారణలు చెప్పారు. వారు చెప్పినవన్నీ చేసాము."

మహాస్వామి వారిని "ఏమేమి చేసారు?" అని అడిగారు.

"పితృదోషపరిహారార్థం రామేశ్వరంలో తిలహోమం, కంజనూర్లో శుక్రప్రీతి, తిరునాగేశ్వరం లో రాహుప్రీతి, ఆలంగుడిలో గురుప్రీతి, కుర్తాళందగ్గర్లోని తిరుమనంజరిలో ప్రత్యేకపూజలు, తిరునల్లార్ లో నళతీర్థంలోస్నానం ఇంకా శనిప్రీతి, ఇలా ఎన్నోచేసాము పెరియవ"

స్వామివారు అడ్డుపడుతూ "అయినా ఫలప్రాప్తిలేదంటావు"అని వెంటనే విశ్వనాథన్ భార్యతో "అమ్మాయి పెళ్ళికి కావలసిన నగలు అన్నీ చేయించారా?" అని అడిగారు.

"అన్నీ సిద్ధము చేసాము పెరియవ" అని ఆమె బదులిచ్చింది.

"మంచిది! ఎన్ని సవర్లబంగారం పెడుతున్నారు అమ్మాయికి" అని అడిగారు.

"ముప్పై సవర్లతో ఆభరణములు చేయించాము. దానితో పాటు వేరేగా రెండుసెట్లు ఇరవై ఇరవై సవర్లతో చేయించాము" అని విశ్వనాథన్ అన్నాడు.

"ఆ 20 సవర్ల రెండు సెట్లు ఎవరికోసం?"

"పెరియవ, అపర్ణకు పెళ్లి కుదిరితే తనపెళ్ళితోపాటు మరోఇద్దరు పేద అమ్మాయిలకుకూడా మొత్తంఖర్చు మేమేభరించి పెళ్ళిచేద్దామని అనుకున్నాము.అందుకే వేరే ఆభరణాలు కూడా చేయించాము. కానీ, అపర్ణపెళ్ళే కుదరటంలేదు" అని విశ్వనాథన్ మళ్ళీ విలపించాడు. సమయం రాత్రి10:30 కావస్తోంది.

మహాస్వామి అడిగారు "ఎన్నిరోజులలో మీరు అమెరికా తిరిగివెళ్ళాలి?"

"ఇరవై రోజుల తరువాత పెరియవ "

"భేష్! మహాస్వామి సంతోషించి "మీరు భోజనం ముగించారా?" అని అడిగారు.

"ఇంకాలేదు" అని విశ్వనాథన్ అన్నాడు.

మహాస్వామివారు వంటవాడికి కబురుపంపి అతను రాగానే "ఏముంది?" అని అడిగారు. "అన్నం ఉప్మా, గుమ్మడికాయ సాంబార్ ఉంది" అని అన్నాడు.

విశ్వనాథన్ కుటుంబాన్ని వంటశాలలోకి వెళ్ళి భోజనం చేసిరమ్మని ఆదేశించారు. వారు వచ్చేవరకు స్వామివారు అక్కడేఉన్నారు.రాత్రి11గంటలు అయింది.వారు విశ్వనాథాన్ తో "విశ్వనాథా, నీకుమార్తెపెళ్ళితో పాటు ఇంకో ఇద్దరుఆడపిల్లలకి, పెళ్ళిచేయాలని నగలుకూడా సిద్ధపరచుకునిఉన్నావు.నీది చాలా విశాలహృదయం.కామాక్షి అమ్మవారు నిన్ను తప్పక రక్షిస్తుంది." అని అతన్ని అనునయించారు.

తరువాత అతనితో "ఒక పని చెయ్యి.**రేపుఉదయం కుటుంబసమేతంగా తిరువణై కోయిల్ వెళ్ళు.అక్కడ అఖిలాండేశ్వరి అమ్మవారికి,జంబుకేశ్వరునికి అభిషేకం చేయించు. అక్కడ 'అఖిలాండేశ్వరి' అమ్మవారి చెవులకి సువర్ణ శ్రీచక్రతాటంకాలు అలంకరించబడి ఉంటాయి.మీ అమ్మాయి అపర్ణకు చెప్పు, కళ్ళు ఆర్పకుండా ఆతాటంకాలను చూస్తూ తనకు వివాహం త్వరగా జరగాలని కోరుకొమ్మను.** అది చేసిన తరువాత.."

విశ్వనాథన్ ఉత్సాహంతో స్వామివారి మాటలకు అడ్డుపడుతూ "పెరియవ మా ఇంటి దైవం ఆ అఖిలాండేశ్వరి అమ్మవారే" అని చెప్పాడు.

"భేష్!అలాగైతే మరీ మంచిది. రేపు ఉదయమే మీరందరూ వెళ్ళి ఈ పని చెయ్యండి. అక్కడినుండి తిరుమలవెళ్ళి స్వామివారికి కళ్యాణోత్సవం చేయించి స్వామిని ప్రార్థించండి. అంతాసరిపోతుంది.మీరుతెచ్చిన ఈపదార్థములన్నీ ఆ అఖిలాండేశ్వరి అమ్మవారికి సమర్పించండి" అని మహాస్వామి లేచి నిలబడ్డారు.

వారందరూ స్వామికి సాష్టాంగంచేసారు. విశ్వనాథన్ స్వామివారివైపు చూసి సంకోచిస్తూ "పెరియవ, నా కుమార్తెకి 17 సంవత్సరాల వయసప్పటి నుండి నేను ఎప్పుడు ఇక్కడకు వచ్చినా తిరుమల శ్రీనివాసునికి కళ్యాణం చేయిస్తున్నాను. ఇప్పటి దాకా ఎనిమిది సార్లు చేయించాను" అని అన్నాడు.

"సరే విశ్వనాథా! **పోయేదేముంది. ఈసన్యాసికోసం తొమ్మిదోసారి చేయించు.** (సరి విశ్వనాథ అథనాళఎన్న కొరంజుడా పొరథు? ఇంథ సన్యాసి సొల్రథుకాగ ఒంబతవథు థడవయ్యెనడతివయ్యెన్)"అని మహాస్వామి నవ్వుతూ తమగది లోపలికి వెళ్ళిపోయారు. రెండురోజుల తరువాత విశ్వనాథన్ కుటుంబం మహాస్వామివారు చెప్పినట్టు తిరువణైకోయిల్ లో అభిషేకము, తాటంక దర్శనము కావించుకొని తిరుమలకు వెళ్ళారు.

ఆ రోజు కళ్యాణంచేయించే ఆర్జితభక్తులు చాలామంది ఉన్నారు. కళ్యాణం జరిగే చోట భక్తులరద్దీ ఎక్కువగాఉంది.విశ్వనాథన్ కుటుంబం ఆ నివాసంమధ్యలో ఒక మూలలో కూర్చొనిఉన్నారు.అక్కడఉన్న వైఖానసఅర్చకులు స్వామివారికళ్యాణాన్ని వేదోక్త మంత్రాలతో అంగరంగ వైభవంగా జరిపిస్తున్నారు.వారి మంత్రోచ్చారణ తారాస్థాయికిచేరి ప్రాంగణ మంతా ధ్వనిస్తోంది.

విశ్వనాథన్ భారమైన హృదయంతో "తండ్రి శ్రీనివాస! ఇది నీకు న్యాయమా? నీ కళ్యాణాన్ని ప్రతిరోజు ఇంతవైభవంగా జరిపించుకుంటావు.మరి నాకూతురు ఏం తప్పు చేసిందని తనకి తగిన వరుణ్ణిఇచ్చి పెళ్ళి జరిపించటంలేదు" అని బాధ పడుతూ కంట కన్నీరు అపలేకున్నాడు.

విశ్వనాథన్ కి దగ్గరలో ఒక కుటుంబం కూర్చొని ఉంది.ఆ కుటుంబయజమానికి ఒక యాభై-యాభైఐదు సం. వయస్సు ఉంటుంది.అతను ఆప్యాయంగా విశ్వనాథన్ వెన్ను నిమురుతూ"అయ్యా,నా పేరు వైద్యనాథన్.మాదిమద్రాసు.నేను చాలాసేపటినుండి మిమ్మల్ని

గమనిస్తున్నాను.ఇంత వైభవంగా ఆ శ్రీనివాసుని కళ్యాణం జరుగుతూ ఉంటే ఆనందంగా వీక్షించకుండా ఎందుకు మీరు ఏడుస్తున్నారు?" అని అనునయించారు.

విశ్వనాథన్ ఆయనమాటలకు కొంచెం నెమ్మదించి,తనబాధనంతా ఆయనతో పంచుకుని కాస్త కుదుటపడ్డాడు.వైద్యనాథన్ వెనుకకు తిరిగి అపర్ణను చూసాడు. అతనికి అమ్మాయి మంచి గుణవంతురాలు అనిపించింది.

వైద్యనాథన్ అతన్ని "మీ గోత్రమేంటి" అని అడిగాడు. "వధుల గోత్రం"

"మాది శ్రీవత్స. మరి మీ అమ్మాయి వయస్సెంత?" అని అడిగాడు.

"ఇప్పుడు 25 సంవత్సరాలు.ఇవన్నీ ఎందుకు అడుగుతున్నారు" అని విశ్వనాథన్ అడిగాడు.అందుకు వైద్యనాథన్ "ఈ కళ్యాణం అయిపోనివ్వండి. మిమ్మల్ని తీసుకుని వెళ్ళి మీతో మొత్తం చెప్తాను" అన్నాడు.

కళ్యాణం ముగించుకొని అందరూ ప్రసాదం తీసుకొని వైద్యనాథన్ ఉంటున్న అతిథి గృహానికి విశ్వనాథన్ కుటుంబాన్ని పిలిచుకొని వెళ్ళాడు.అక్కడ విశ్వనాథన్ తో"మేము తంజావూరు ప్రక్క మేలట్టూర్ వాళ్ళం.నేను ఇప్పుడు మద్రాసులోని రక్షణపద్దుల శాఖలో పనిచేస్తున్నాను.నాకు ఒక్కడే కొడుకు,పేరు శ్రీనివాసన్.,వయస్సు-26సంవత్సరములు, అమెరికాలో"ఫోర్డ్ మోటార్స్"లో పనిచేస్తున్నాడు.రేపు సెలవుపైన మద్రాసుకు వస్తున్నాడు. గత మూడేళ్ళుగా అమ్మాయికోసం వెతుకుతున్నాము.మేము కామకోటి మఠానికి భక్తులం. మూడునెలల క్రింద మహాస్వామి వారిని దర్శించి, అబ్బాయికి పెళ్ళి కావట్లేదు అని అడిగితే తిరుమలకు వెళ్ళి శ్రీనివాసునికి కళ్యాణం చేయించమన్నారు.ఆ అదృష్టం ఇప్పుడు వచ్చింది. ఆయన అనుగ్రహం ఉంటే మీఅమ్మాయి మాకోడలు అవుతుంది" అని చెప్పాడు.

వాళ్ళు పిల్లల జాతకములను తీసుకుని తిరుమలలోనే ప్రముఖ జ్యోతిష్కులకు చూపించారు.ఆశ్చర్యంగా వారిద్దరి జాతకాలు పదిఅంశాలలో కూడా చక్కగా కుదిరాయి. ఇరు కుటుంబాలవారు సంతోషంగా ఆ రాత్రికే చెన్నై బయలుదేరారు. మరుసటి రోజు శ్రీనివాసన్ అమెరికానుండి వచ్చాడు.అతనికి 'అపర్ణ' నచ్చింది. ఆమెకు కూడా అబ్బాయి నచ్చాడు.పదిహేనురోజుల్లో ముహూర్తాలుపెట్టుకుని చెన్నైలోని 'రాజేశ్వరి కళ్యాణమండపం' లో వివాహం చెయ్యాలని నిశ్చయించుకున్నారు.ఇరు కుటుంబాల వారు మహాస్వామివారి దర్శనానికి కంచికి వచ్చారు.ఆరోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంవల్ల రాత్రి 9గంటలకు మహాస్వామివారి దర్శనం లభించింది.విశ్వనాథన్, వైద్యనాథన్ కుటుంబాలు మహాస్వామి వారికి సాష్టాంగంచేసి,తనుతెచ్చిన పదార్థములను సమర్పించాడు. వైద్యనాథన్ వారివెనుక నిలుచున్నాడు.

స్వామివారు చిన్నగానవ్వి,"ఏం విశ్వనాథా! తొమ్మిదోసారి శ్రీనివాసునికి కళ్యాణం చేయించగానే వివాహంనిశ్చయమైందా?, నీకుమార్తె చాలా అదృష్టవంతురాలు" అని గట్టిగా నవ్వారు.

స్వామివారికి ఏమీచెప్పకుండానే, వారేవిషయం చెప్పడంతో అంతా ఆశ్చర్యపోయారు. **మీ అమ్మాయికి "జన్మాంతర వివాహప్రతిబంధక దోషం" ఉన్నది.దాని పరిహారం కొరకే "అఖిలాండేశ్వరి అమ్మవారి శ్రీచక్రతాటంకదర్శనము","తొమ్మిదోసారి శ్రీనివాసునికి తిరు కళ్యాణము" చేయించమని చెప్పాను**.ఇంతకీ "నీకు కాబోయే వియ్యంకులు ఎవరు? ఏవూరు?" అని అడిగారు.విశ్వనాథన్ వెనుకనిల్చున్న వైద్యనాథన్ ముందుకువచ్చి స్వామికి సాష్టాంగం చేసి, "నేనే పెరియవ వీరికి కాబోయే వియ్యంకుడిని. అంతా మీ అనుగ్రహం!" అన్నాడు.

మనకేమీ తెలియక, పుణ్యకార్యాలు ఎంతగాచేస్తున్నా మనవారికి ఎందుకు అవరో ధాలు వస్తున్నాయో అని మధనపడతాం, కాని వారివారి పూర్వకర్మలు(దోషాలు) ఏమిటో, ఏమిచేస్తే అవి తీరుతాయో మనకేమి ఎరుక?, స్వామివారి కరుణతోనే, వారికి శరణాగతి చెందటం తోనే తీరుతాయి.

స్వామివారు వైద్యనాథన్ వైపు చూసి, ఎవరు? మేలట్టూరు వైద్యనాథన్! మూడునెలల క్రితం అమెరికాలో ఉన్న మీఅబ్బాయికి సంబంధం కుదరటంలేదన్నావు. తిరుమలవెళ్ళి శ్రీనివాసునికి కళ్యాణం చేయించమన్నానుకదా? ఎప్పుడు జరిపించావు?" అని అడిగారు. "ఇద్దరమూ ఒకే రోజే శ్రీనివాసుని కళ్యాణం చేయించుకున్నాము పెరియవ! సంబంధం కూడా అక్కడే నిశ్చయించుకున్నాము.అంతా మీఅశీర్వాదము!" అని మాటలు గాద్గదికమై, మహాస్వామికి చెప్పాడు.

"సంతోషంగా ఉండండి!" అని,మహాస్వామి వారు దీవించారు. సమయం రాత్రి పదిగంటలు అయింది.స్వామివారునవ్వుతూ,"ఆలస్యమవుతోంది విశ్వనాథా!వాళ్ళు చెప్పారు,మఠంలో ఈరోజుకూడా అన్నం,ఉప్మా,గుమ్మడికాయ,సాంబారునేచేసారు.మీరందరూ ఇక్కడే ఫలహారం చెయ్యండి" అని చెప్పి పంపించారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

29. వరి పేలాలు – వరి మొక్కలు

స్వామివారి రోజూతీసుకునే ఆహారానికి సంబంధించినసంఘటనలు ఎన్నో ఉన్నాయి. అందులో ఒకటి –

దాదాపు ఇరవైఅయిదేళ్ళ క్రితం పరమాచార్యవారు విల్లుపురం దగ్గర్లోని గోపాలస్వామిఅయ్యర్ ఉండే గ్రామంలో మకాం చేస్తున్నారు. అప్పుడు ఈ గోపాలఅయ్యర్ స్వామివారి దర్శనానికివెళ్ళగా,స్వామివారు అతణ్ణి,"నాకు కావాల్సిన వరిపేలాలను తయారుచెయ్యడం నీకు కుదురుతుందా?" అని అడిగారు. మహాభాగ్యంగా భావించి అతను,ఒక భూస్వామికూడా కావడంతో,మరుసటిరోజే తయారుచేసి మంచి వరి పేలాలను

తీసుకుని వచ్చాడు. మహాస్వామి చూసి "ఇవి చాలాబావున్నాయి,వీటిని రోజూ నాకు కావాల్సి నంత పంపు" అన్నారు.

ఇంతవరకు, ఈపని (వరి పేలాలను స్వామివారికి సరఫరా చేసే పని) తంజావూరు అడ్వకేటు వెంకట్రామ అయ్యర్ చేసేవారు. అతను వెంటనే స్వామివారిని, "ఇన్ని రోజులుగా తప్పకుండా మీకు వరి పేలాలను సరఫరా చేస్తున్న నన్ను మీరు ఇలా నిరాశ పరచవచ్చా?" అని అడిగాడు. "గోపాలన్ తెచ్చిన వరి పేలాలు కూడా బావున్నాయి. ఇన్నిరోజులూ నువ్వే ఇచ్చావుకదా!.ఇప్పుడుఅతనిని ఇవ్వనీ" అని ,"సరే నువ్వుకూడా ఇవ్వు"అన్నారు. తరువాతి నెల ఇద్దరూ వరి పేలాలు ఇచ్చారు.తరువాతి నెలలో వెంకట్రామఅయ్యర్ లోకాన్ని వదిలి వెళ్ళిపోయారు.వరిపేలాలను ఒకరు ఇస్తూఉన్నా, పరమాచార్యవారు మరొకర్ని వరి పేలాలు ఇవ్వమని ఎందుకు ఆదేశించారో అప్పుడు అర్థం అయ్యింది అందరికీ.

అప్పటి నుండి గోపాలఅయ్యర్ క్రమం తప్పకుండా వరిపేలాలను సరఫరా చేసే వాడు. వాటిని ఇవ్వడానికి మహాస్వామివారు మకాం చేసిన ప్రాంతాలకు సైతం వెళ్ళేవాడు. అందుకోసం గోపాలఅయ్యర్ మచిలీపట్నం, హంపి, బళ్ళారి, కర్నూలు, రాజమండ్రి, సతారా,సకపట్,చెన్నై, కాంచీపురం,తేనంబాక్కం వెళ్ళాడు.ఒకసారి వరిపేలాలు తీసుకుని షోలాపూర్ వెళ్ళినప్పుడు పరమాచార్య స్వామివారు ఇక వద్దని చెప్పారు. గోపాలఅయ్యర్ ఆత్రుతతో, "మీనుండి ఇటువంటిఆజ్ఞ పొందడానికి నేనుచేసిన తప్పుఏమిటి? ఇలా అయినా నెలకొకసారి నాకు మీ దర్శన భాగ్యం కలిగేది కదా" అని స్వామివారిని అడిగాడు.

అందుకు స్వామివారు, "నేను వరి–పేలాలను స్వీకరించడం ఆపేశాను. అది వరి నుండి వస్తుంది.వరిచెట్లలో 'జీవం' ఉంటుంది.అందుకే,అది "పాపంగా" భావించి వాటి నుండి వచ్చే ఆహారాన్ని తినడంమానేశాను. బదులుగా,పచ్చి అరటిపళ్ళ పిండిని తినాలను కుంటున్నాను. నువ్వు దాన్ని తయారు చేసి ఇవ్వగలవా?" అని అన్నారు.

గోపాల అయ్యర్ వెంటనే ఒప్పుకున్నాడు. ఎంతో కృతజ్ఞతతో గోపాలఅయ్యర్ నాతో అన్నాడు,"ఆనాటి నుండి,తిరుచ్చిలో ఉన్న నా బంధువులొకరికి 'నేంద్రంకాయ్' రకం అరటి పళ్ళను పంపమని చెప్పాను.వాటిని ఎండబెట్టి, రుబ్బి, దాన్నుండి చక్కని పొడిని తీసి టిన్లలో స్వామివారికి ఇచ్చేవాణ్ణి.దాన్ని స్వామివారు, గంజిలా,ఇడ్లీలుగా లేదా ఏదైనా సరిపడే ఆహా రంగా వాడేవారు. ఇప్పటికీ ఈపిండిని స్వామివారికి సమర్పించుకునే భాగ్యాన్ని నాకు ప్రసా దించారు స్వామివారు".

పూర్వకాలంనుండీ 'నేంద్రంకాయ్' పొడిని చిన్నపిల్లల ఆహారంగా కేరళ ప్రాంతంలో వాడేవారు. ఆహారం విషయంలో చిన్నపిల్లలకు, వృద్ధులకు కొంత సామ్యం ఉంది. వారికి తేలికగా జీర్ణమయ్యి, ఎక్కువ శక్తిని ఇచ్చే ఆహారం కావాలి.

సాధారణంగా మనకు కలిగే అనుమానం; వరికి ఉన్నట్టే అరటిచెట్టుకు కూడా ప్రాణం ఉంటుంది కదా!అని. దానికి సమాధానం – ప్రతి కోతకీ, వరిమొక్కని చంపి ధాన్యం

సేకరించాలి,కాని అరటిచెట్టుకు, వేర్లనుండే చిన్నచిన్న పిలకలు మొలుస్తాయి,కాబట్టి **"అరటి పళ్ళు కోయడం,చెట్టును చంపినదానితో సమానం కాదు!"**.

--- పరంధమన్ వి. నారాయణన్, "పరమాచార్యర్" నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

30. లేచి నడిచి వెళ్ళు

లోకక్షేమం కోసం 'జ్ఞానభూమి' పత్రిక చాలా చోట్ల పూజ, జపము మరియు హోమము నిర్వహిస్తోంది. పాండిచ్చేరి శ్రీ శంకర సేవా సమాజం వార్షికోత్సవం సందర్భంగా జ్ఞానభూమి ని హోమంనిర్వహించమని పత్రికా ప్రతినిధులు వారిని సంప్రదించారు.

పూజ, హోమానికి శ్రీ గోపాలఅయ్యర్ మరియు శ్రీ శ్రీధర్ లు ఆలస్యంగా వచ్చారు. ఎందుకు ఆలస్యం అయ్యిందని అడుగగా, "పరమాచార్య స్వామివారిని దర్శించుకోవడానికి మేము కాంచీపురం వెళ్ళాము. వార్షికోత్సవ ఉత్సవాల గురించి స్వామివారికి తెలిపి శ్రీవారి ఆశీస్సులు తీసుకున్నాము" అని తెలిపారు.

వారి నియమాన్ని మెచ్చుకుని, "మీరు తరచూ స్వామివారిని కలుస్తుంటారా?" అని అడిగాను. అందుకు గోపాల అయ్యర్, "స్వామివారి అనుగ్రహం లేకపోతే నేను లేను. వారి అనుగ్రహం వల్లనే నేను ఈరోజు జీవించియున్నాను" అంటూ, "కొద్దినెలల క్రితం నేను గుండె సంబంధిత సమస్యతో ఒక ఆసుపత్రిలోని ఐ.సి.యులో ఉన్నాను. ఆసుపత్రి నుండి వచ్చిన తరువాత కూడా దాదాపు మంచానికే పరిమితమయ్యాను. వేరొకరి సహాయం లేకుండా కదలలేని పరిస్థితి. కేవలం ఆ ఒకటి రెండు నెలల్లో మాత్రమే స్వామివారి దర్శనానికి కంచి మఠానికి వెళ్ళలేదు.

ఇరవైఅయిదు సంవత్సరాలుగా పరమాచార్య స్వామివారిని దర్శించుకుంటున్నాను. ప్రతిసారి స్వామివారి రోజువారీ ఆహారానికి కావాల్సిన పదార్థాలను సమర్పించేవాణ్ణి". "బదులుగా ఏమీ తీసుకునేవాడివి కాదా?" అని వారిని నేను అడిగితే, అందుకు ఆయన, "స్వామివారి ఆశీస్సులు, అనుగ్రహం కంటే విలువైనది ఏముంది? రెండు నెలల క్రితం ఆరోగ్యం సహకరించక, ఆ పదార్థాలని మా అల్లుడు శ్రీధరన్ చేత పంపాను. వెంటనే స్వామి వారు, 'గోపాలన్ ఎక్కడ? ఈ మధ్య ఇటువైపు రావడం లేదు' అని అడిగారు.

శ్రీధరన్ నా ఆనారోగ్యం గురించి, లేచి నడవలేని నా అశక్తతను గురించి స్వామి వారికి చెప్పగానే, స్వామివారు మా అల్లునితో 'తనని ఇక్కడకు రమ్మని నేను చెప్పానని చెప్పు' అని అన్నారు. 'వారు ఇప్పుడున్న పరిస్థితిలో . . .' అని శ్రీధరన్ ఇంకా ఎదో చెప్పబోతుండగా **'అతను రాగలడు, రమ్మని చెప్పు'** అని స్వామివారు స్థిరంగా చెప్పారు.

రెండురోజుల్లో ఒక వ్యాను ఏర్పాటు చేసుకుని స్నేహితులు బంధువులతో కలిసి ప్రయాణానికి సిద్ధమయ్యాము. వ్యానులో చక్రాల కుర్చీలో కూర్చుని నేను ప్రయాణం చెయ్యాలని మొదట అనుకున్నాము. కాని ఆచార్యులవారి అనుగ్రహం! నా అంతట నేనుగా వ్యాను వద్దకు నడిచి రాగలిగాను. అలా నడవగలగడం కొన్ని నెలలుగా ఇదే ప్రథమం.

మేము కాంచీపురం చేరుకోగానే నేను వచ్చానని పరమాచార్య స్వామివారికి తెలిపారు. అందుకు స్వామివారు, 'గోపాలన్ ను ఇక్కడకు రమ్మని చెప్పు' అని ఆదేశించారు. వెంటనే మావాళ్ళు 'ఆయన నడవలేరు, మేము మోసుకొని వస్తాము' అని తెలుపగా, **'వద్దు, మోసుకొని రావద్దు. నడుచుకుంటూ ఇక్కడకు రమ్మని తనకి చెప్పండి'** అని అన్నారు.వారు ఇది ఎలాసాధ్యం అనుకున్నారు .

వారు నా చేతులను పట్టుకుంటే నేను పరమాచార్యస్వామివారి వద్దకు నడుచుకుంటూ వచ్చాను. ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని చూడగానే, నా కళ్ళు వర్షించాయి. నన్ను వదిలివేయమని పట్టుకున్న వారిని ఆచార్యుల వారు ఆదేశించారు. అక్కడే నన్ను కూర్చోమని చెప్పారు. కళ్ళ నీరు కారుతుండగా, అతికష్టంతో సగం సాష్టాంగం చేసి కూర్చున్నాను. కొద్దిసేపటి తరువాత స్వామివారు నన్ను ఆశీర్వదించి, **'లే! లేచి నడిచి వెళ్ళు'** అని ఆజ్ఞాపించారు. వారు చెప్పిన విధంగానే చేశాను.**అనాటినుండి నేను ఎటువంటి అనారోగ్యమూ లేకనా కాళ్ళపై నిలబడగలుగు తున్నాను, నడవ గలుగుతున్నాను**. అంతా పరమాచార్య స్వామివారి అనుగ్రహం, కరుణ మాత్రమే".

వీరి కుటుంబం తరతరాలుగా కంచి మఠానికి, పరమాచార్య స్వామివారికి ఎంతో దగ్గరైన, కొద్దికాలం క్రితమే గోపాల అయ్యర్ గారిని శ్రీ కంచి కామకోటి మఠం ప్రతినిధిగా చేశారు.

గోపాలఅయ్యర్ పూర్వజన్మలో ఎంతోఎంతో పుణ్యం చేసుకుని ఉంటారు.అందుకే పరమాచార్యస్వామివారు రోజూ ఆహారంలో వాడే పదార్థాలని సమర్పించే భాగ్యం పొందగలిగాడు. తనకి కలిగిన ఈ అదృష్టం ఎందరికో ఈర్ష్యను కలిగించింది కూడా!

పరమాచార్య స్వామివారు రసేంద్రియాన్ని జయించినట్టు బహుశా ఇక ఏ సన్యాసి జయించలేదేమో! పెద్ద మొత్తంలో పోషక ఆహారం తీసుకోవడమే చక్కని ఆరోగ్యానికి రహస్యమన్న సిద్ధాంతాన్ని స్వామివారు తప్పని నిరూపించారు. తొంభై మూడేళ్ళ (అప్పటికి) స్వామివారి జీవితంలో అమితంగా తినడం కాని, నిద్రించడం కాని, అనారోగ్యం కాని ఉన్నట్లు కనబడదు. అంతటి తీవ్రమైన నియమబద్ధ జీవితం గడిపినా చదవడం, భక్తులకు దర్శనం ఇవ్వడం, చర్చించడం, పూజ చెయ్యడం, మఠాన్ని చూసుకోవడం, యాత్రలు చెయ్యడం, కొత్త ప్రణాళికలు, పథకాలు ఆరంభించడం వంటివిషయాల్లో స్వామివారు ఎప్పుడూ అలసిపోలేదు.

భారతదేశం మొత్తం తిరిగినపాదాలు ఇవి మాత్రమేనేమో. ఆసేతు హిమాచలం, కాశ్మీరం నుండి కన్యాకుమారి దాకా, ద్వారక నుండి జగన్నాథ్ దాకా ఉన్న భూమిని పావనం చేస్తూ, ఎన్నో దేవాలయాలను, తీర్థాలను స్పర్శించాయి ఆ దివ్యచరణ కమలాలు.

ఇంతకీ స్వామివారి రోజూఆహారం, మజ్జిగలో కాని పెరుగులో కాని నానబెట్టిన పేలాలు మాత్రమే!

--- వి. నారాయణన్. 'పరమాచార్యర్' పుస్తకం నుండి.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం ।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

31. నువ్వు ఎక్కడున్నా, నీవెంటే..

'గుజరాత్'లో నివసించే ఒకకుటుంబానికి పరమాచార్యవారు కాని, స్వామివారి వైభవం కాని ఏమీతెలియవు.ఒకరోజుఉదయం ఆ ఇంటావిడ తనభర్తని ఒక గుజరాతీపత్రిక ను తెమ్మని చెప్పింది.

దినపత్రికచదివే అలవాటు ఆమెకు లేనందువల్ల,ఎందుకని అడిగిందో భర్తకు అర్థం కాలేదు.ఆమెకేకాదు,ఇంట్లో ఎవరికీకూడా దినపత్రికలు కొనడం,చదవడం అలవాటు లేదు. అతనికి కొంత అయోమయంగా తోచి,"నువ్వు రోజూ దినపత్రిక చదువుతావా? ముందు ఒక కప్పు టీ ఇవ్వు!" అని ఆమె మాటలను అతను పట్టించుకోలేదు.

"ముందువెళ్లి నాకు ఆ దినపత్రికని తెచ్చిపెట్టండి!తరువాతనే నేను 'టీ' తయారు చేస్తాను" అని కొద్దిగా అభ్యర్థించింది.

ఆమె ఎందుకు ఇంతగాచెబుతోందో అర్థంకాక,బయటకు వెళ్లి ఆమెచెప్పిన పత్రికను కొనుక్కుని ఇంటికి వచ్చాడు.ఇంకా ఇంటిలోకి అడుగుపెడుతుండగానే,ఆమె వచ్చి అతని చేతిలోని పత్రికను లాక్కొని, గబగబా పేజీలు తిప్పుతోంది.

చివరిపేజి లో 'రామేశ్వరంలోని అగ్నితీర్థం దగ్గర నిర్మించిన శ్రీఆదిశంకర మంటప కుంబాభిషేకానికి' సంబంధించిన పూర్తిపేజీ ప్రకటనఅది.అందులో దండంతోసహా నిలబడి న పరమాచార్యస్వామివారి నిలువెత్తు చిత్రాన్ని కూడా ముద్రించారు.

మహాస్వామివారి చిత్రం చూడగానే,ఆ వనిత ఆనందంతో "అవును! ఈయనే! అది ఈయనే!" అని సంతోషంతో చెప్పసాగింది .

ఆవిడ భర్తకి ఏమీ అర్థంకాకపోగా,ఈమె కేమయ్యిందని ఆందోళన ఎక్కువ అయ్యింది.

కొద్దిగా చికాకుపడుతూ,"ఏం మాట్లాడుతున్నావు?ఈపత్రికను తీసుకురమ్మని చెప్పావు, తరువాత,'ఈయనే!ఈయనే!'అని అరుస్తున్నావు,అసలు ఏమయ్యిందినీకు?"అని అడిగాడు.

"నా కలలో వచ్చిన మహాత్ముడు ఈయనే" అని ఆమె చెప్పడంతో,"సరే! నీకు ఎదో కలవచ్చింది.ఈయనే ఆ కలలో వచ్చినవ్యక్తి అని నీకుఎలా తెలుసు?" అని అడిగాడు. తన కలను వివరంగా భర్తకు చెప్పింది.

"నాకు ఒక కలవచ్చింది. కలలో,నేను మన ఇంటిముందర ఉదయాన్నే ముగ్గు వేస్తు న్నాను.నాముందు,ఒక కాంతివంతమైన సన్యాసి ప్రత్యక్షమయ్యారు.నాకు ఆయన సాధారణ 'సన్యాసి'లా అనిపించలేదు.ఆయన దివ్యతేజస్సును చూసి నాశరీరం మొత్తం పులకించి పో యింది. వారిని లోపలకు రమ్మని ఆహ్వానించాలని అనుకున్నాను. 'మీరు లోపలకు రారా?' అని అడిగాను.ఆమహాత్ముడు లోపలకువచ్చి కూర్చున్నారు.వారికి నేనునమస్కారం చేశాను. వారు నాతో,**'నీవు నన్ను చూడడానికి రాకపోయినా, నేను నిన్ను చూడడానికి వచ్చాను'** అని అన్నారు.నాకు ఏమీఅర్థంకాలేదు.నేను వారితో,**'స్వామి!మీరు ఎవరో,ఎక్కడుంటారో కూడా తెలియదు. మరి నేను మీవద్దకు వచ్చి, మిమ్మల్ని ఎలా దర్శించుకోగలను?'** అని అడిగాను. అప్పుడే స్వామివారు ఈ దినపత్రికను చూడమని చెప్పారు.అక్కడితో కల ఆగిపోయి నిద్ర నుండి మేల్కొన్నాను.అందుకే ఈ పత్రికను తీసుకునిరమ్మని నేను మిమ్మల్ని అడిగాను. ఇదిగో **ఈ పత్రికలో ఉన్న మహాత్ములే–నాకు కలలో కనబడిన స్వామివారు.**వారుఎవరో, ఎక్కడున్నా సరే మనం వెళ్లి వారిని దర్శించుకోవాలి.అసలు ఎంతో ఆశ్చర్యంగా ఉంది "

భార్యచెప్పిన విషయాలు విని అతను కూడా ఆశ్చర్యపోయాడు. ఇది బహుశా దేవుని ఆజ్ఞయే అనుకున్నాడు.ఈ మహాత్ములు ఎక్కడుంటారో కనిపెట్టడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాడు.'కంచి కామకోటి పీఠం'అని అక్కడ వ్రాసి ఉండడంతో, ఇద్దరూ కాంచీపురం బయలుదేరారు.

వారు కాంచీపురం చేరుకొని విచారించగా, పరమాచార్య స్వామివారు ఇక్కడలేరని 'ఇలయత్తాంగుడి'లో మకాం చేస్తున్నారని తెలుసుకున్నారు.వారు వదలక,అక్కడకు కూడా పయనమయ్యారు.అక్కడకు చేరుకొని,వారురావడానికి గల కారణాన్ని వివరంగా అక్కడున్న శిష్యులకు తెలిపారు.

వారు అంతదూరంనుండి రావడం వల్ల బాగా అలసిపోయి ఉండడం వల్ల, శిష్యులు వారిని చూసి జాలిపడి, ముందుగా స్నానం చేసి, కాస్త ఏదైనా ఫలహారం తిని, తరువాత స్వామివారి దర్శనానికి రమ్మనిచెప్పారు.కాని,వారు దానికిఒప్పుకోలేదు.ముందు స్వామివారి దర్శనం, తరువాతే ఏమైనా అని తెలపడంతో శిష్యులు లోపలకు వెళ్లి విషయం స్వామివారికి చెప్పారు.

పరమాచార్య స్వామివారు బయటకు వచ్చారు. ఆమె స్వామివారిని చూసి"మీరే–నా దైవం; నేను ఎప్పటికి మీవద్దనే ఉంటాను" అని విపరీతంగా ఆపలేకుండా ఏడుస్తోంది.

ఆమె కొంచం స్థిమితపడిన తరువాత,స్వామివారు, ఆమె ఎవరని, ఎక్కడ నుండి వచ్చారని, తన గురించి వాళ్లకు ఎలా తెలిసిందని అడిగారు.

"నా కలలో మిమ్మల్ని దర్శించాను" అని బదులిచ్చి మొత్తం జరిగిన విషయాన్ని స్వామివారికి చెప్పింది. స్వామివారు చిన్నగా నవ్వారు.

"ఆ కల నీకు ఎప్పుడు వచ్చింది?"

"వారం పది రోజుల ముందు"

"ఆరోజు పౌర్ణమియే కదా?"(స్వామివారే స్వయంగా వెళ్లి ఆరోజు దర్శనం ఇచ్చిన విషయం అక్కడున్నవారికి అర్థమవ్వాలని అలా అడుగుతున్నారేమో!)

'దేవుణ్ణి' చూసిన ఆనందంతో,కళ్ళల్లో ఆనందభాష్పలు రాలుతుండగా,ఆమె స్వామి వారికి పంచాంగ నమస్కారం చేసింది.**"దిగులు పడకు.నువ్వు ఎక్కడున్నా, నేను నీవెంటే ఉంటాను "** అని స్వామివారు ఆ గుజరాతీ దంపతులను ఆశీర్వదించి పంపారు.ఎంత గొప్ప అభయం!! ఎంతటి గొప్ప ఆశీస్సులు!

--- "శ్రీ శ్రీ శ్రీ మహాపెరియవా మహిమై" పత్రిక నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

32. భక్త జన రక్షకుడు

శ్రీనివాసన్, పరమాచార్య స్వామివారికి గొప్ప భక్తుడు. అతని నాలుగేళ్ల కుమారుడు విశాఖన్ మూడవ అంతస్తు ఇంటి నుండి చూస్తూ క్రిందకు పడిపోయాడు. పడీ పడడంతోనే మూర్చిల్లాడు. వెంటనే పిల్లవాణ్ణి రాయపెట్ట ఆసుపత్రికి తీసుకునివెళ్ళారు. కాని వారికి అతనిపై ఎటువంటి నమ్మకము లేదు.

పిల్లాడి శరీరానికి వెలుపల ఎటువంటి గాయం కాలేదు. లోపలివైపు ఏమైనా దెబ్బ తగిలిందేమో అని డాక్టర్లు తలను, ఇతర భాగాలను ఎక్స్'రే తీసి చూశారు. కాని వారికి ఎటువంటి గాయము కనబడలేదు. అంతేకాక ఎముకలు కూడా ఏవి విరగలేదని రూఢి అయ్యింది. విషయం విని అందరూ ఆశ్చర్యపోయారు.

అంత ఎత్తు నుండి క్రిందకు పడుతున్నప్పుడు పిల్లవాడి శరీరం కొన్ని చెట్టుకొమ్మలకు తగలడంతో అక్కడక్కడా చిన్న చిన్న గాయాలు అయ్యాయి. డాక్టర్లందరూ ఆశ్చర్యపోయారు.

సాయింత్రం ఆరుగంటలప్పుడు పిల్లాడికి మెలకువ వచ్చింది. చిన్నగా కళ్ళు తెరిచి గొణుగుతున్నట్టుగా మాట్లాడుతున్నాడు.

"నాన్న మూడో అంతస్తు నుండి క్రిందకు తొంగి చూస్తుండగా పడిపోయాను. నువ్వు రోజూ పూజ చేసే చిత్రపటంలోని 'పెరియవా' ఉన్నారుకదా, నన్ను రెండుచేతులతో పట్టుకున్నారు. నా నుదుటిపై కుంకుమ, విభూది కూడా పెట్టారు నాన్న" అని చెప్పాడు.

అక్కడ చుట్టూ ఉన్నావారు ఈ విషయం విని సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. అప్పుడే కంచికి వెళ్ళి తిరిగొచ్చిన పక్కింటివ్యక్తి శ్రీహరిహర అయ్యర్, పరమాచార్య అనుగ్రహాన్ని నిజం చేస్తూ, స్వామివారి ప్రసాదం ఇచ్చాడు.

శ్రీనివాసన్ ఎప్పుడు పరమాచార్య స్వామివారి దర్శనానికి వెళ్ళినా,స్వామివారు శీనివాసన్ ని, **"మూడో అంతస్తు నుండి పడిపోయిన విశాఖన్ ఇప్పుడు ఎలా ఉన్నాడు? ఎన్నో తరగతి చదువుతున్నాడు?"** అని అడిగేవారు.

మనం వారిని ఆశ్రయిస్తే,ఎక్కడ ఉన్నా, ఎటువంటి స్థితిలో ఉన్నా మనలని సదా సంరక్షించేందుకు, పరమదయాళువు అయిన మన మహాస్వామివారు ఉన్నారు. కరుణా సముద్రుల కరుణ నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది . . .

--- "శ్రీ శ్రీ శ్రీ మహాపెరియవా మహిమై" పత్రిక నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

33. పుల్లని దానిమ్మ పళ్ళు

అది నవంబర్ 1963. జగద్గురు పరమాచార్య 'తిరువిడైమరదూర్'దగ్గరలోని, కావేరీ ఉత్తర తీరాన ఉన్న 'కళ్యాణపురం' అన్న చిన్న గ్రామంలో ఇరవైఐదు రోజులపాటు మకాం చేశారు.

ఒకరోజు ఉదయం తంజావూరు ఆసంద లాడ్జి యజమాని కె.యస్. గోపాలస్వామి (కె.యస్.జి) అయ్యర్ నా వద్దకు వచ్చి, తనతో పాటుగా వచ్చిన మద్రాసు వ్యక్తితో కలిసి కళ్యాణపురంలో ఉన్న పరమాచార్య స్వామివారి దర్శనానికి రాగలవా అని అడిగారు. నేను వెంటనే ఆ అవకాశాన్ని కాదనకుండా వాళ్ళతో బయలుదేరాను.

మధ్యాహ్నం మూడు గంటలప్పుడు మా కారు 'తిరువిడైమరదూర్' దగ్గరలోని విరకోలన్ నది వంతెన దాటగానే, దారిపక్కగా పెద్ద దంతాలతో ఉన్న శ్రీమఠం ఏనుగు కొబ్బరి ఆకులను తింటూ కనబడింది. శ్రీమఠం గోవులను నదిలో స్నానానికి తీసుకుని వెళ్తున్నారు.సేవకులు ముందర ఉన్న ఇంటి అరుగుపై సేదతీరుతున్నారు. అక్కడ ఎక్కువ హడావిడి ఏమీ లేదు. మఠం మేనేజరు మమ్మల్ని స్వాగతించి, దగ్గరలోని ఇంటిలో ఉన్న మఠం కార్యాలయానికి తీసుకునివెళ్లాడు.

అక్కడ మాతోపాటు వచ్చిన ఒక మద్రాసు పెద్దమనిషి, మేనేజరుకు వంద రూపాయల నోట్ల కట్ట ఇచ్చి, దానికి సరిపడా రూపాయి చిల్లర తీసుకుని పెద్ద చెక్క తట్టలో పెట్టుకున్నాడు. కొన్ని బుట్టల్లో పళ్ళు, బెల్లం, చిన్న డబ్బాల్లో మంచి కుంకుమపువ్వు, పెద్ద గంధపు చెక్క, కొన్ని

స్వచ్ఛమయిన కర్పూరం పొట్లాలు తెచ్చాడు. మేము అన్నిటిని రెండు వెదురు పళ్ళాలలో సర్దాము.అతను తీర్చిదిద్దిన కచ్చపంచలోకి మారి, నుదుటిపై, ఎదపై, చేతులపై వీబూధి రేఖలు దిద్దుకుని సిద్ధమయ్యాడు.

అందరమూ పూజ జరిగే చోటుకి వెళ్ళాము. ఆ ఇంటి వెనుకవైపున ఉన్న గోశాలలో పరమాచార్యస్వామివారు ఉన్నారు.నేను ముందుగా వెళ్లి వీరి గురించి స్వామివారికి తెలిపాను.

స్వామివారు మౌనంగా తల ఊపారు. ఆ మద్రాసు పెద్దమనిషి, కె.యస్.జి ఇద్దరూ వచ్చి,తెచ్చినవాటిని స్వామివారికి సమర్పించి, ముగ్గురమూ సాష్టాంగంచేశాము.స్వామివారు 'అయ్యర్' ని గుర్తుపట్టి ఒక చిరునవ్వు నవ్వి, మహామహోపాధ్యాయ 'మన్నార్గుడి రాజుశాస్త్రి' గారి మునిమనవడైన వై. మహాలింగశాస్త్రి గారితో మరలా మాట్లాడడం మొదలుపెట్టారు. స్వామివారు, రాజుశాస్త్రి గారి "దుర్జనోక్తినిరాస (చెడ్డవారి మాటలకు దండన)"(ఇది వారి రచనలో అంశమేమో!) గురించి మాట్లాడుతున్నారు. అందులోని కొన్ని వాక్యాలను చెబుతూ మహాలింగ శాస్త్రి గారు సంభాషణను కొనసాగిస్తున్నారు. ఇలా ఒక అరగంట పాటు జరిగింది.

నేను కొంచం కలవరపడ్డాను. కె.యస్.జి నన్ను కూడా తీసుకువెళ్ళడానికి కారణం– నేను స్వామివారికి చాలా దగ్గరని, తన మద్రాసు స్నేహితుణ్ణి స్వామివారికి పరిచయం చేసి వెంటనే పెద్ద పెద్ద ఆశీస్సులు ఇప్పిస్తానని. కాని ఇప్పుడేమో మమ్మల్ని పూర్తిగా విస్మరించారు స్వామివారు. వెనుకనుండి కె.యస్.జి నన్ను పొడుస్తున్నాడు. కాని నేను ఏం చెయ్యగలను? స్వామివారు చేస్తున్న చిన్న చిన్న వ్యాఖ్యలకు కూడా ఆ మద్రాసు వ్యక్తి పెద్దగా నవ్వుతున్నాడు, అలాగైనా స్వామివారు తనను గమనించి చూస్తారని. మాకు మాత్రం చాలా ఆందోళనగా ఉంది.

గోశాల ద్వారం వద్ద ఎవరో తొంగిచూశారు, స్వామివారి దర్శనం కోసం. వేదపురీ! ఎవరది? అని అడిగారు స్వామివారు.స్వామివారికి విసనకర్ర వీస్తున్న వేదపురి,ద్వారం వద్దకు వెళ్లి, మయూరంలోని వల్లల్లార్ వీధి నుండి వచ్చిన ఒక శ్రౌతి గారిని పిలుచుకునివచ్చాడు. శ్రౌతి గారి చేతిలో ఒక చిన్న వెదురు బుట్ట, అందులో రెండు టెంకాయలు, కొన్ని అరటిపళ్ళు ఉన్నాయి.పెద్ద 'సామవేద–పన్నం' ఒకటి చదివి సాష్టాంగంచేశారు.అత్యంత వినయంతో, భక్తితో, తన కుమార్తె వివాహం ఒక వేదవిద్యార్థి తో కుదిరిందని స్వామివారి అనుగ్రహ, ఆశీస్సులు కావాలని ప్రార్థించాడు.

వెంటనే స్వామివారు, "మీ అమ్మాయి ఇంకా ఉన్నత పాఠశాలలో చదువుతున్నదని చెప్పావు. మరి ఈపెళ్ళికి తన అంగీకారం ఉందా?" అని అడిగారు.

"పెరియవా అనుగ్రహం వల్ల ఇప్పటికి మా ఇంట్లో పూర్వపు ఆచారాలనే పాటిస్తున్నాము" అని చెప్పారు శ్రౌతి.

ద్వారం వద్ద మరలా ఎవరో తొంగిచూశారు. వేదపురి ద్వారం వద్దకు వెళ్లి, మాట్లాడి తిరిగొచ్చాడు. "విల్లెనూర్ నుండి ముసలావిడ. ఆమె పెరియవా కోసం పుల్లని దానిమ్మ పళ్ళు తెచ్చింది. ఇదిగో పెరియవా!" అని చెప్పాడు.

"ఇక్కడకు తీసుకుని రా". వేదపురి ద్వారం వద్దకు వెళ్లి తిరిగొచ్చి, "అక్కడినుండే స్వామివారికి నమస్కారం చేసి తను వెళ్తానంటోంది పెరియవా" అని చెప్పాడు.

"తనను ఇక్కడకు రమ్మని చెప్పు". ఆమె ద్వారంవద్ద నిలబడి, నమస్కారం చేసి వణుకుతూ నిలబడింది.

మహాస్వామివారు చేతిలోకి ఒక పండును తీసుకుని, దాన్ని తిప్పుతూ, వై. మహాలింగ శాస్త్రితో మాట్లాడుతున్నారు.

ఇల్లెనూర్ వైద్యనాథస్వామి గురించి చెబుతూ, "వైతా (వైద్యనాథస్వామి) గురించి నీకు తెలుసా?", "అప్పట్లో ఒకసారి నాకు కడుపులో కొద్దిగా సమస్య వచ్చింది. ప్రముఖులు, మద్రాసు ఆయుర్వేద కళాశాల నటేశ శాస్త్రి నన్ను పుల్లని దానిమ్మ పళ్ళ రసం త్రాగమన్నారు. అది చాలా అరుదైన రకం. అది పుల్లగా ఉంటుంది కాబట్టి ఎవరూ దాన్ని పెంచరు. ఈ విషయం విన్న 'వైతా' ఎక్కడెక్కడో తిరిగి మూడో రోజు కొన్ని పళ్ళు తెచ్చాడు"

"తరువాత తన ఇంటి మధ్యలో ఆ చెట్టును నాటి జాగ్రత్తగా పెంచాసాగాడు. దాన్ని ఇంటి వెనుకనున్న పెరడులో పెంచలేదు, ఎందుకో తెలుసా, అక్కడ నాటితే ఆ చెట్టుకు ఇంట్లోని ఆహార పదార్థాలు అవీ వెయ్యడం వల్ల కలుషితం అవుతుందని, నేను తిననేమో అని. ఆ చెట్టుకు కాచిన కాయలన్నీ నాకే సమర్పించేవాడు. నేను వేరే ప్రదేశాలలో ఉంటే, ఎప్పుడైనా వాటిని ఉపయోగించుకునేలాగా ఈ అమ్మ వాటిని ఒక ప్రత్యేక విధానంలో ఎండబెట్టేది. వైతా లేడు. ఇప్పుడు అతని భార్య అప్పుడప్పుడు పళ్ళు తెస్తుంటుంది".

"అరుదుగా దొరికేవాటికే విలువ ఎక్కువ. పురావస్తు తవ్వకాల్లో దొరికినవి ఇప్పుడు పనికిరానివైనా వాటికి విలువ ఎక్కువ. దొరికిన దాని కాలం ఎంత పాతదైతే అంత విలువ. ఉదార సంబంధ సమస్యలకు ఇప్పుడు ఎన్నో పరిష్కారాలు వస్తుండడంతో ఇప్పుడు ఈ పళ్లకు విలువ లేదు. కాని ఇది అరుదు కాబట్టి, విలువ ఎక్కువే. ఈ సందర్భంలో నాకు రామాయణం నుండి ఒక విషయం జ్ఞప్తికి వస్తోంది. హనుమంతుడు రావణుని రాజభవనంలో తిరుగుతూ, అక్కడున్న అరుదైన రత్నాలనూ, అరుదైన కళాఖండాలను చూసి వాటిని రెండు రకాలుగా విభజిస్తాడు"

స్వామివారు కొద్ది క్షణాలు ఆ భాగాన్ని గుర్తుచేసుకున్నట్టుగా భంగిమచేస్తూ..

అవును. అది ఇలా ఉంటుంది...

"య హి వైశ్రవణే లక్ష్మీ!
య చ ఇంద్ర హరివాహనే!"

"రావణుడు కుబేరుని సంపదని, ఇంద్రుని సంపదని దోచుకున్నాడు. కుబేరుని సంపదలో ఉన్న బంగారము, వెండి, రత్నాలు మొదలైనవి విలువ కట్టి మొత్తం చెయ్యొచ్చు. కాని ఇంద్రుని సంపదలో ఉన్న వెలకట్టలేని, అరుదైన, పాత వస్తువులను వెలకట్టలేము. ఈ విషయాన్ని 'హరిఅహన' అన్న పదంలో అర్థచేసుకోవాలి. ఇంద్రుని గుర్రాలు పచ్చని రంగులో ఉన్నాయి. అవి చాలా అరుదైన రకం. వాటిని వెలకట్టి ఎక్కడా కొనలేము. అవి అపూర్వమైనవి. వాటిని పోలినవి కూడా ఎక్కడా దొరకవు. అటువంటి అరుదైనవే ఈ పళ్ళు కూడా"

అక్కడున్నవారికి ఎవరికీ ఈ ప్రభోదం ఎందుకో, ఎవరికోసమో అర్థం కావడంలేదు.

అకస్మాత్తుగా స్వామివారు వేదపురి వైపు తిరిగి,"ఇక్కడకురా! మద్రాసు నుండి వచ్చిన పెద్ద మనసున్న ఈ పెద్దమనిషి నాకోసం అపరిమితంగా తెచ్చాడు. అది ఒక మంచి పనికి ఉపయోగిద్దాం.లెక్కపెట్టవలసిన అవసరం లేదు. **మొత్తం 'శ్రౌతి' పైపంచెలో వెయ్యి. పెళ్ళి కోసం అపరిమితమైన ధనం ఖర్చుపెట్టి ఉంటాడు. ఇది అతని అవసరం తీర్చగలదు**" అని చెప్పారు.

సాధారణ సంభాషణ కు ఎంతటి గొప్ప ముగింపు!!. మద్రాసు పెద్ద మనిషి గర్వం మొత్తం గాలిలో కలిసిపోయింది. ఒకేఒక చిన్న మాటతో అతణ్ణి స్వామివారు ఎంతో ఎత్తుకు చేర్చారు. కుమార్తె పెళ్ళికి లెక్కలేనంత ధనం సమకూరింది శ్రౌతి గారికి.

అదీ మహాస్వామి వారు అంటే!

--- వి. స్వామినాథ ఆత్రేయ. "kamakoti.org" నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

34. పచ్చని పాల సముద్రం

పరమాచార్య స్వామివారిని ప్రముఖ గీత రచయిత 'కన్నదాసన్' కలిశాడు. ఎప్పటిలాగే వారు ఆధ్యాత్మికత గురించి మాట్లాడుకున్నారు. ఇతఃపూర్వం కన్నదాసన్ నాస్తికుడుగా ఉండి మన మతం గురించి హేళనగా రాసేవాడు. మహాస్వామివారి ప్రభావం వల్ల మెల్లిగా మారి పోయాడు. స్వామివారే అతణ్ణి పనికిమాలిన హేతువాదం నుండి బయటకు తెచ్చారు. కాని విమర్శించడం అనే సామాన్య గుణం మాత్రం అతణ్ణి వదలలేదు.

"పాలు తెల్లగాఉంటాయి కదా? మరి పాలకడలి ఎందుకు మేఘవర్ణంగా చూపబడుతుంది? మహావిష్ణువు రంగు పాలసముద్రంలో కలిసిపోయిందా?" అని అడిగాడు స్వామివారిని.

స్వామివారు ఒక చిరునవ్వు నవ్వి, **"ప్రశాంతంగా ఉండు! మధ్యాహ్నానికి నీకు సమాధానం దొరుకుతుంది"** అని చెప్పారు.

కన్నదాసన్ కలవరపడ్డాడు. ఇక ఏమీ మాట్లాడడానికి సాహసం చెయ్యలేదు. ఆ మాధ్యాహ్నం శ్రీమఠానికి 'వుమ్మిడి బంగారుచెట్టి' వచ్చాడు. కన్నదాసన్, వుమ్మిడి ఇద్దరూ చెట్టియార్ కులానికి చెందినవారు. వాళ్ళ పద్ధతిలో వారు నమస్కరించుకున్నారు. తరువాత వుమ్మిడి బంగారుచెట్టి పెద్ద పచ్చని మరకతాన్ని స్వామివారు స్వీకరించాలని వారి పాదాల వద్ద సమర్పించాడు. మహాస్వామి వారికి రత్నాలకు రాళ్ళకు భేదం లేదు.

స్వామివారు మఠం పరిచారకులని పిలిచి ఒక పాత్రలో పాలను తెమ్మని చెప్పారు. పాలు తెచ్చిన తరువాత ఆ మరకతాన్ని పాలపాత్రలో ఉంచమని వుమ్మిడికి చెప్పారు. ఇది వుమ్మిడికి పిడుగులాంటి మాట. సాధారంగా మరకతాన్ని పరీక్షించడానికి ఇలా చెయ్యడం తనకు వ్యాపారంలో అనుభవం.

కంచిశ్రీచరణులు నా భక్తిని, నేనుతెచ్చిన రత్నాన్ని శంకిస్తున్నారా? అని అనుకుని మౌనంగా ఆ పనిచేశాడు. వెంటనే ఆచరులు కన్నదాసన్ ను పిలిచారు చూడమని. అది చూసి కన్నదాసన్ ఆశ్చర్యపోయాడు. పాలు మొత్తం లేత పచ్చ రంగులోనికి మారిపోయి, పాలలో మునిగిన మరకతం నుండి ఒక చిన్న కాంతిరేఖ కనపడుతోంది.

కన్నదాసన్ కు నోట మాట రావడంలేదు. ఇది ఎలా జరిగింది? ఆచార్యులవారు అలా జరగడానికిగల కారణాన్ని శాస్త్రీయంగా వివరించి, ఇలాగే పాలసముద్రం విషయంలో కూడా **"పరమాత్మ పాల సముద్రంలో పడుకున్నప్పుడు, ఆయన నుండి కూడా ఇటువంటి తేజస్సు వస్తుంది. అందుకే అది మేఘవర్ణంగా ఉంటుంది"** అని తెలిపారు.

వెంటనే కన్నదాసన్ కళ్ళు ఆనందంతో వర్షించగా, అప్పటికప్పుడే **"తిరుప్పార్కడలిల్ పళ్ళికొండాయే శ్రీమన్నారాయణా . . ."** అంటూ ఉద్వేగభరితంగా ఒక అలౌకిక, మధుర గీతాన్ని వ్రాసి స్వామివారిని స్తుతించారు (**ఈ పాటను 1975లో వచ్చిన స్వామి అయ్యప్పన్ అన్న తమిళ సినిమాలో కే. జే. ఏసుదాస్ గారు అద్భుతంగా పాడారు**).

'వుమ్మిడియార్'కి, ఆచార్యస్వామివారు ఆశీస్సులు అందించి,ఆమరకతాన్ని వరదరాజ స్వామి దేవాలయానికి తీసుకునివెళ్ళి, దానితో స్వామివారికి మకుటాన్ని చేయించమని ఆదేశించారు.

'కన్నదాసన్'తో పాటు అతనుకూడా కళ్ళనీరు పెట్టుకున్నారు.స్వామివారు మరకతాన్ని పాలలో ముంచమని చెప్పినప్పుడు అవమానపడ్డాను అనుకున్నాడు. కాని, అది రత్నాన్ని పరీక్షించడానికి చెయ్యమన్నది కాదని తెలిసి పశ్చాతాప్పడ్డాడు.

ఇలాంటి ఎన్నో సంఘటనలతో జనుల అజ్ఞానాన్ని,అహంకారాన్ని పోగొట్టే జ్ఞానగురువులు మన మహాస్వామివారు.

కే. జే. ఏసుదాస్ గారి అద్భుత గళంలో ఆ పాటను ఇక్కడ వినవచ్చు.

www.youtube.com/watch?v=npqGilN-7Os



అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

35. మా జీవితాలకు 'మాష్టర్'

కంచి కామకోటి పీఠం శంకరాచార్యులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామివారు **నా మాష్టర్**. వారు మా జీవితాల్లోకి ఎలా వచ్చారో చెబుతాను. నాకు నాలుగేళ్ళప్పుడు మా అమ్మ చనిపోయారు. నేను ఉబ్బసంతో ఎన్నో సంవత్సరాలుపాటు చాలా బాధపడ్డాను. కార్టికోస్టరాయిడ్స్ వల్ల ఉపశమనం ఉన్నా, వాటిని రోజూ వాడవలసి ఉంటుంది. 10-10-1971న నాగేశ్వరితో నా వివాహం జరిగింది. తనకు ఒక కంటిలో చూపులేదని,మరొక కన్ను కూడా ఎంతోకాలం ఉండదని తెలిసింది. కాని తన రాకతో మా జీవితాల్లో వెలుగును నింపింది.

ఒకసారి తిరువణ్ణామలై వెళ్ళాలని సంకల్పం కలిగింది. గురువును అన్వేషిస్తున్న నాకు 'నీ గురువును నేను కాదు, నీకోసం ఒక గురువును వెతుకుతున్నాను' అన్న సందేశం నాకు దొరికింది. మేము ఆశ్రమం బయటకు అక్కడున్న ఒక వ్యక్తి ఒక పుస్తకాన్ని నా చేతిలో పెట్టి చాలా మంచి పుస్తకం, కేవలం అయిదు రూపాయలే అన్నాడు. ఆసక్తి లేకపోయినా కొన్నాను. కానీ, ఆ పుస్తకం నా జీవితాన్ని మొత్తంగా మార్చివేసింది. ఆ పుస్తకం మరేదో కాదు, **డా. పాల్ బ్రంటన్ గారి 'ది సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా' (The Search in secret India)**.

మూడు నెలల తరువాత నేను యధాలాపంగా ఆ పుస్తకాన్ని తెరిచి, 'స్పిరిచ్యుయల్ హెడ్ ఆఫ్ సౌత్ ఇండియా' అన్న శీర్షికను చూసి ఆశ్చర్యపోయాను. మొత్తం అధ్యాయాన్ని చదివి ఈ మాస్టర్ (పరమాచార్య) గురించి తెలుసుకోవాలని అనుకున్నాను. ఒక అంగట్లో చల్లని పానీయం తాగుతున్నప్పుడు కంచి శివార్లలోని తెనంబాక్కంలో మాష్టర్ ఉంటారు అని నాతో చెప్పాడు ఆ అంగడి యజమాని. నేను పెరిగిన వాతావరణం వల్ల అప్పటిదాకా శంకరాచార్యులనబడే పీఠాధిపతులు అసలు ఉంటారనే విషయం కూడా నాకు తెలియదు.

నెల్లూరు నుండి రెండు బస్సులు మారి తెనంబాక్కం చేరేటప్పటికి సాయింత్రం అయ్యింది. బావిలో నుండి చెక్క పాత్రతో నీటిని తోడుతుండగా మొదటిసారి స్వామివారిని చూశాను. స్వామి సేవకులు శ్రీకంఠన్,స్వామివారికి నన్ను పరిచయం చేసి నా ఉబ్బసం సమస్య గురించి స్వామివారితో చెప్పారు.స్వామివారు వేళ్ళతో నాపై నీటిని చిలకరించారు. అది తప్ప వేరే మాటలు కాని, చేష్టలు కాని లేవు. ఆగస్ట్ 23, 1973న తొలిసారి స్వామివారితో జరిగిన అనుభవం ఇదే.

రెండవసారి వచ్చినపుడు–మధ్యరాత్రి, తెనంబాక్కం చేరుకున్నాను.చిరుజల్లు పడుతూ ఉంది. నేను అక్కడే మట్టినేలపైన పడుకున్నాను. రాత్రి రెండుగంటలప్పుడు లేచిచూస్తే, లోపల ఎవరో తిరుగుతున్నట్టుగా కనబడడంతో, స్వామివారు నిదానంగా లోపల ఉన్న బావివైపుగా నడవడం చూసాను. వారు నేలను ఊడ్చి, అక్కడ ఉన్న టబ్బులో స్నానం చేశారు. దాదాపు రెండు గంటలపాటు నేను అక్కడే ఉండి స్వామివారిని గమనించగలిగాను. ఆ "ఏకాంత దర్శనం"తో నా కోరికలన్నీ తీరిపోయాయన్న భావన ,తెలియని సంతృప్తి కలిగాయి.

మూడవసారి వారిని దర్శించుకున్నప్పుడు మాష్టర్ (స్వామివారు) నా కళ్ళల్లోకి సూటిగా చూశారు. అప్పుడు ఎదోశక్తి నాలోకి ప్రవేశించిన భావనకలిగింది. అప్పటినుండి,నా ప్రవర్తన లో ఎంతో మార్పు చోటుచేసుకుంది.

నాల్గవసారి వెళ్ళినప్పుడు **నేను వారి భక్తుడనని వారి మాటల ద్వారా తెలియపరిచారు**. అంతటి గొప్ప వ్యక్తుల నోటి నుండి ఆ మాటలు రావడం నాకు ఆశ్చర్యాన్ని,ఆనందాన్ని కలగ జేసింది.ఈ మాటలు నన్ను దృఢమైన విశ్వాసంతో నింపి నా జీవితంలోని చీకటి సంఘటన లనుండి కాపాడాయి.

ఒక ఉగాదిరోజు దర్శించుకున్నప్పుడు, స్వామివారు నాకు పుత్రసంతానం కలుగు తుందని ఆశీర్వదించారు. వేసవి సెలవులప్పుడు నా భార్య గర్భవతిగా ఉండగా, నన్ను మూడు నెలలపాటు తనతో ఉండమని ఆదేశించారు. అప్పుడు ఇంట్లో ఉన్న తనని తేలు కరచింది. నేను వెంటనే స్వామి దగ్గరకు పరిగెత్తగా, ఈశ్వర శాసనం అలా ఉంది , కాని భయపడాల్సిన అవసరం లేదన్నారు. సాయింత్రం తనకు నెప్పి నుండి ఉపశమనం కలగగా, మాష్టర్ దగ్గరకు తీసుకుని వెళ్లాను.మేము తిరిగి వెళ్ళాల్సిన రోజు మాష్టర్ మమ్మల్ని దగ్గరకు పిలిచి, 'వెళ్ళిరండి' అని ఆశీర్వదించి పంపారు. సంతోషంతో ఇంటికి వెళ్ళిపోయాము.

తొలినాళ్ళల్లో మాష్టర్ తో నామనసులో బాధను తెలుపుకోవడానికి 'గజేంద్ర మోక్షం' పద్యాలు పాడేవాడిని. మాష్టర్ ఉత్సాహంగా 'మరొక్కసారి' అని ఆదేశించేవారు. రెండవసారి 'ఒరిరిక్కె'లో ఒకనాటి ఎండాకాల మధ్యాహ్న సమయాన పద్యాలు చెప్పమన్నారు. అప్పుడే భారతదేశ ఉపరాష్ట్రపతి డా. శంకర్ దయాళ్ శర్మగారు మహాస్వామి వారిని కలిసి వెళ్ళారు. కంచిలోఉండేటప్పుడు **నాకేమైనా బాధ ఎక్కువైనప్పుడు వారి సమక్షంలో రాత్రంతా మనసు లోనే స్వామివారితో చెప్పేవాణ్ణి. రాత్రి ఒంటిగంటప్పుడు స్వామివారు లేచి, నా విజ్ఞాపన విన్నా**

రన్నట్టుగా, ఏదో ఒక ప్రశ్న వేసి తిరిగి పల్లకిలోనికి వెళ్ళిపోయారు. "వారి సమక్షంలో నా బాధ తగ్గడం నాకు ఎన్నోసార్లు అనుభవం అయ్యేది"

ఒకసారి స్వామివారు పర్యటనలో, కర్ణాటకలో ప్రవేశిస్తున్నారు . తిరుపతి నుండి నేను రెండు రోజులు ప్రయాణించి, బెల్గాం జిల్లాలోని రామదుర్గ్ అనే చిన్న గ్రామాన్ని చేరుకున్నాను. స్వామివారు మకాం చేస్తున్న అడవి ప్రాంతం వైపు వెళ్తున్న ఒక ట్రాక్టరు ఎక్కి, ఒక జలపాతం వద్ద మాష్టర్ ను చూశాను. ఆ అర్ధరాత్రిలో, అడవిలో నన్ను చూసి సంతోషిస్తారనుకున్నాను, కాని వారు అలా ప్రవర్తించలేదు. "రాజారావుతో నీకు ఏమిటి సంబంధం?" అని అడిగారు. **మా నాన్నగారు(రాజారావుగారు) స్వామివారికి ఎలా తెలుసునని నేను కలవరపడ్డాను. కొద్ది రోజుల క్రితమే నేను మానాన్నతో గొడవపడిన విషయం గుర్తువచ్చింది. మనస్సులోనే క్షమాపణ చెప్పుకున్నాను.** వెంటనే స్వామివారు చిరునవ్వి, దేశభక్తి ప్రోత్సహించేటట్లు మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్ లో ఒకగోవును కొనుగోలు చేశాము. దాన్ని వారి దగ్గరకు ఎలా తీసుకుని వెళ్లాలా అని ఆలోచిస్తున్నాము. వారి కరుణవల్ల మఠంకి చెందిన లారీలో తీసు కునిరమ్మని స్వామివారే ఆదేశించారు. గోవును చూడగానే స్వామివారు తమ కడుపును చేతితో తడుతూ, **"దాని పాలు ఈ కడుపుకే"** అని నవ్వుతూ చెప్పారు. "ఆ గోవుని ప్రసవం కోసం నేనే తీసుకునివెళ్లాలని, తరువాత మఠానికి తీసుకురావాలని" ఆదేశించారు. దాని బాగోగులు స్వామివారే స్వయంగా విచారిస్తూ, దాని పాలను మాత్రమే త్రాగేవారు.

స్వామివారు మా అబ్బాయి సరస్వతి చంద్రశేఖర్ ఉపనయనం తన సమక్షంలో చెయ్యమని చెప్పారు. అదీ శంకరజయంతి మరుసటి రోజు. మొత్తం కార్యక్రమం ముగిసే దాకా మాష్టర్ భక్తులకు దర్శనంఇవ్వలేదు.కార్యక్రమం వైభవంగా జరిగింది. మాష్టర్ శిష్యుడు చంద్ర 'వీడియో' కూడా ఏర్పాటు చేశారు.ఎందరో వేదపండితులు, వారి విద్యార్థులు పటువును ఆశీర్వదించారు. పిల్లవానికి మాష్టర్ ఎన్నో బహుమానాలు ఇచ్చారు. మాష్టర్ ధరించిన బిల్వ మాలను స్వయంగా వారే పిల్లవాని మెడలో వెయ్యడం పెద్ద ఆశీర్వచనం. **ఏదైనా ఒక దేవతను ఉపాసించడంకూడా సద్గతిని ప్రసాదిస్తుందని స్వామివారు తెలిపారు. కార్యక్రమం మరుచటి రోజు వారివద్ద ఉన్న ఇత్తడి పాత్రను నాకు ఇచ్చారు. అది మాకు లభించిన అక్షయ పాత్ర**.

మాష్టర్ ఆంధ్రదేశ పర్యటన సమయంలో ఉండగా, నా భార్య కంటిచూపు తగ్గడం మొదలయ్యింది. మాష్టర్ తిరిగి కంచి చేరేటప్పటికి తను పూర్తిగా చూపు కోల్పోయింది. ఆమె 'రెంటినల్ పెగ్మెంటోస' అనే వ్యాధివల్ల వచ్చిన శుక్లాల సమస్యకు శంకర నేత్రాలయలో మూడేళ్ళుగా చికిత్స తీసుకుంటోంది. తన కంటిచూపు తిరిగిపొందాలని మాష్టర్'ను ఎన్నో సార్లు వేడుకున్నాను. ఒకరోజు స్వామివారి సేవకులు బాలు శస్త్రచికిత్స కోసం మద్రాసు న్యాయస్థానంలోని న్యాయవాది మణి అయ్యర్ ను కలవమని నాకు ఒక లేఖ ఇచ్చారు. నా

భార్య శస్త్రచికిత్సకి సిద్ధపడింది కాని మరలా కొన్ని పరీక్షలు చెయ్యగా, కంటిలోపల దృష్టి లేదని, ఇటువంటి కంటిపై శస్త్రచికిత్స చెయ్యడం మంచిది కాదని తెలిపారు. మేము వెంటనే స్వామివారి వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నాము.

స్వామివారు, "మిమ్మల్ని శంకర నేత్రాలయకు వెళ్ళమని ఎవరు చెప్పారు?" అని అడిగారు. ఆ లేఖ ఇచ్చింది బాలు అని చెప్పాను. స్వామివారు తమ శిష్యుడైన పట్టాభిరామన్ కు మమ్మల్ని జట్కాలో మఠంలోని వేంగుడి డాక్టర్ దగ్గరకు తీసుకునివెళ్ళమని చెప్పారు. ఆ డాక్టర్ కూడా పరిస్థితి చాలా తీవ్రంగా ఉన్నదని, కాని స్వామివారు చెప్పారు కాబట్టి వైద్యం చేస్తానని తెలిపారు. ఆయన ఒక యాభై ఇంజక్షన్లు సూచించారు. వాటిని మేము మాష్టర్ వద్దకు తెచ్చినప్పుడు మౌనంగా ఉన్నారు.ఇలా చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రతి పౌర్ణమి రోజు, మాష్టర్ పౌర్ణమి పూజ ముగించగానే, తనకు దృష్టిని అనుగ్రహించమని వేడుకునేవాణ్ణి, "మాష్టర్ ఒక్క మాట చెప్పండి" అని .-కాని ఏ సమాధానము ఉండేది కాదు. ఒకరోజు మాష్టర్ నా ప్రార్థనలకు స్పందించారు."నాకు ఒక కన్ను లేదు నా సోదరునికి రెండు కళ్ళూ లేవు" అనిచెప్పారు. మీఅబ్బాయికి దృష్టి సరిగ్గా ఉందా? అనిఅడిగారు. స్వామివారి నుండి అనుగ్రహ పూరిత వాక్కులు వచ్చాయి.**"ఆమె కోసం రోజూ నేను ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను"** అని.

దాదాపు పాతిక సంవత్సరాలు కార్టికోస్టరాయిడ్స్ వాడడం వల్ల ఏడేళ్ళుగా ఎడతెగని జ్వరంతో బాధపడుతున్న నన్ను చూసి స్వామివారు దయతో నాకు రెండు మంత్రాలను ఇచ్చారు–**'జ్వరానికి గరుడ మంత్రం','ఉబ్బసం తగ్గడానికి సవిత్ర మంత్రం'.నమ్మకంతో నేను ఆ మంత్రాలను సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు నిరాహారిగా ఉపాసించడం మొదలు పెట్టాను. అప్పటి నుంచీ జ్వరం ఉబ్బసం సమస్య లేదు.** ఒకసారి రథసప్తమి నాడు ఉదయం నుండి సాయంత్రం దాకా సూర్యుణ్ణి చూస్తూ మంత్రానుష్టానం చెయ్యడం వల్ల రెటీనా మధ్యలో నల్లగా మాడిపోయింది. అటువంటి సమయంలో కూడా–నా భార్యకున్న 'రెంటినల్ పెగ్మెంటోస' కోసం చికిత్స ఉన్నది అని వార్తాపత్రికలో చూసి, మాస్టర్ ను దర్శించి వెళ్దామని బయలుదేరాము. ఆరోజు చంద్రగ్రహణం కావడంతో ఆ రాత్రంతా మాష్టర్ దగ్గరకు వెళ్ళలేకపోయాము. మరుసటి ఉదయం మాష్టర్ దగ్గరకు వెళ్లగలిగాము. మాష్టర్ నన్ను చూసి ఒకసారి చిరునవ్వి చెయ్యెత్తి మమ్మల్ని ఆశీర్వదించారు. నేను వారితో మాట్లాడాలనుకున్నాను. కానీ మాష్టర్ లోపలకు వెళ్ళిపోయారు. తరువాత జరిగిన సంఘటనల వల్ల శ్రీ అరబిందో గారి స్మృత్యర్థం మదురైలో నిర్మించిన 'అరవింద్ ఐ హాస్పిటల్స్' కు వెళ్ళాము. కొద్ది గంటల్లోనే తనని పరీక్షించి, ఉదయం శస్త్రచికిత్సకు సిద్ధం చేశారు. శస్త్రచికిత్స బల్ల దగ్గర ఒక డాక్టరు ఈ కంటికి శస్త్రచికిత్స చెయ్యడం వ్యర్థమని చెప్పగా, అందుకు డాక్టర్ వెంకటస్వామి ఆమె కు చిన్నగా చూపు వచ్చినా పర్లేదు శస్త్రచికిత్సను కొనసాగించండి అని చెప్పారు. అటువంటి సమయంలో నాభార్యకు చిరుమందహాసం చేస్తూ మాష్టర్ దర్శనమిచ్చారు .

ఆపరేషన్ జరిగిన ఐదవ రోజు, **మమ్ములనందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ, పదేళ్ళ తరువాత తను చూడగలుగుతోంది. తరువాత మాష్టర్ ఆమె కలలో కనబడి, తన భర్త త్యాగం వల్ల తనకు చూపు వచ్చిందని చెప్పారు.** ఆమెకు ముప్పైయ్యేళ్ళ పాటు ఒక కంటిలో, పదేళ్ళ పాటు రెండవ కంటిలో కూడా చూపు లేదు. ఈ శస్త్రచికిత్స వల్ల ఒకటికాదు రెండు కళ్ళకూ చూపు లభించింది. నెల్లూరు, తిరుపతిలో ఉన్న **వైద్యులు ఈ అద్భుతాన్ని గిన్నీస్ బుక్ రికార్డ్స్ లో చేర్చాలని, ఈ సంఘటన వల్ల దైవం పై నమ్మకం ఏర్పడుతుందని** తెలిపారు.

"తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకూ!!!"

పరమపూజ్య జగద్గురు శంకరాచార్య శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారిని స్వర్ణోత్సవ సందర్భంగా కలిసి నమస్కరించే భాగ్యం నాకు కలిగింది. విశ్వమానవాళికి, అందునా హిందువులకి వారు ఆశాకిరణం. వారి దయ వల్ల విశ్వశాంతి కలుగుగాక.

--- ఆర్. సుబ్బరామయ్య, యం.ఎస్సి. "kamakoti.org" నుండి

వీరి (సుబ్బరామయ్య గారి) జీవితం మనకు ఎన్నో విషయాలు బోధిస్తుంది. మొదటి గా వీరికి అసలు పరమాచార్యుల వారి గురించే తెలియదు. స్వామివారిని కలిసిన తరువాత మరి వదల లేదు, ఎన్ని కష్టాలు ఉన్నా సరే!. స్వామి వారు పర్యటన్నల్లో ఎక్కడున్నా , ఎంత శ్రమైనా ఓర్పుతో వెదికి, దర్శించుకునేవారు. ఎంత కృప పొందారంటే, స్వామివారు మంత్ర దీక్షని యిచ్చారు, అడగకుండానే పుత్ర సంతానాన్ని ప్రసాదించి, వారే అతని కుమారుని ఉపనయాన్ని తనసన్నిధిలో జరిపించారు. అతని ప్రార్ధన మన్నించి అతను కొని సమర్పించిన ఆవుయొక్క పాలను స్వీకరించేవారు.ఐతే, స్వామివారు కొన్ని కోరికలు తీర్చారు, మరి కొన్నింటికి (వారి భార్యకు చూపు తెప్పించటం వంటివి) ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా మౌనమే, లేదా చిరునవ్వే, గాని తీర్చలేదు. అయినా సరే దృఢంగా పట్టుకున్నారు.చాలా సంవత్సరాలు ప్రార్ధించిన మీదట, అసలు చూపు రావటం అసాధ్యం అనుకున్న, అతని భార్య కళ్ళకి చూపు యిచ్చారు. *అతని స్థిరమైన విశ్వాసానికి, అతని భార్య తలరాత ని కూడా మార్చేశారు.*

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

36. గోవు వెనక వెళ్ళడమెందుకు?

పరమాచార్యస్వామివారు విజయయాత్రలలో భాగంగా, వివిధప్రాంతాలలో నివసిస్తుండే వారు.అలాంటి సమయాలలో కొందరు భక్తులు, తమ ఇళ్ళకు రమ్మనో లేదా అక్కడి దేవా లయాలకు రమ్మనో అభ్యర్థిస్తుంటారు.

భక్తులు రమ్మని ప్రార్థిస్తున్నది దేవాలయానికే అయితే పరమాచార్య స్వామివారు దాదాపుగా వారి అభ్యర్థనను మన్నించి అక్కడకు వెళ్లి, దైవదర్శనం చేసుకుని, దగ్గరలోని ఒక స్థలంలో మకాం చేసి, కొద్దిసేపో లేదంటే ఒకరోజో అక్కడ ఉండి భక్తులకు దర్శనం ఇచ్చి అనుగ్రహిస్తుంటారు.కొన్నిసార్లు ఏదైనా ఉపన్యాసం కాని లేదా సామాన్య విషయాలు చర్చించడం కాని జరుగుతూ ఉంటాయి.

ఒకసారి పరమాచార్య స్వామివారు తమిళనాడు మొత్తం విజయయాత్ర చేస్తున్నారు. యాత్రలో భాగంగా తిరుచ్చిరాపల్లిలో కొన్నిరోజుల పాటు మకాం చేశారు. ప్రతిరోజూ స్వామి వారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చేవారు.

ఆ భక్తజన సమూహంలో తిరుచ్చిలోని ఒక కళాశాల ప్రధానాచార్యులు కూడా ఉన్నారు. వరుసలో అతని వంతు రాగానే మహాస్వామివారికి నమస్కరించి, ఎన్నోరకాల పళ్ళు పూలు సమర్పించాడు. మహాస్వామివారి దివ్యపాదములు తన కళాశాలను తాకాలని, విద్యార్థులని అనుగ్రహించాలని ప్రార్థించాడు.కాని మహాస్వామివారు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. అతని ప్రార్థనకు మౌనమే వారి సమాధానం అయ్యింది.అతనుమాత్రం రోజూవచ్చి స్వామి వారిని అర్థించేవాడు.చివరగా ఒకరోజు కరుణాసాగరులైన మహాస్వామివారు అతనిపై తమ దయను ప్రసరింపజేశారు. పటికబెల్లం, కుంకుమ ప్రసాదం ఇస్తూ, స్వామివారు అతనితో, **"రేపు ఉదయం మీ కళాశాలకు వస్తాను. కానీ, ఒక ఆవు,దూడ తో నీవు, నీభార్య సిద్ధంగా ఉండండి"** అని ఆజ్ఞాపించారు.

ఆ భక్తుని సంతోషానికి అవధులు లేవు. "ఖచ్చితంగా అలాగే చేస్తాను పెరియవా" అని మహదానందంతో వెళ్ళిపోయాడు.చెప్పినట్టుగానే ఉదయం స్వామివారు కళాశాలకు వెళ్ళారు. అతను ఆవు, దూడ, పూర్ణ కుంభంతో సహా స్వామివారికోసం ఎదురుచూస్తున్నాడు. మహాస్వామి వారుసమర్పించిన పూర్ణకుంభాన్ని స్వీకరించి, కళాశాల ద్వారం వద్దకు వచ్చి నిలబడ్డారు.

స్వామివారు ఆ భక్తునితో, **"నువ్వు ఎక్కడేక్కడైతే నేను రావాలి అనుకుంటున్నావో, అక్కడకు నువ్వు ఆవు,దూడను ముందు తీసుకుని వెళ్ళు,నేను అనుగమిస్తాను"** అని తెలిపారు. స్వామివారి ఆదేశం ప్రకారం అతను భార్యతో కలిసి ఆవు దూడను ముందు తీసుకుని వెళ్తూ ఉంటే స్వామివారు ఆవు వెనుకగా వస్తున్నారు. మొత్తం కలియతిరిగిన తరువాత స్వామివారు ఆ భక్తునితో, "సంతృప్తిగా ఉందా?" అని అడుగగా, అతను తనకు కలిగిన ఆనందాన్ని మాటలలో చెప్పలేక, కళ్ళ నీరు కారుస్తూ, హృదయం ఉప్పొంగి, తనకు స్వామివారు కలిగించిన అదృష్టానికి, వారి దయకు కృతజ్ఞతగా నేలపైపడి సాష్టాంగనమస్కారం చేశాడు.

తమ వసతికి తిరిగొచ్చిన స్వామివారు సాయంత్రం భక్తులతో మాట్లాడుతూ, ఉదయం తాము కళాశాలకు వెళ్లొచ్చిన విషయం ప్రస్తావనకు రావడంతో ఒక వ్యక్తి స్వామివారిని, **"పెరియవా, కళాశాలో మీరు ఆవు వెనుకగా ఎందుకు వెళ్ళారు?"** అని అడిగాడు.

స్వామివారు చిరునవ్వుతో , "అతను నాపై అత్యంత భక్తిభావం కలవాడు. నేను వస్తే అది కళాశాలకు మంచిది అని నమ్మి నన్ను ఆహ్వానించాడు. కాని అది ఆడపిల్లలు చదివే కళాశాల,వారు అన్నిరోజుల లోను కళాశాలకు వస్తారు.వారు దూరం ఉండాల్సిన సమయాలలో కూడా కళాశాలకు వస్తారు". అందుకే నేను, "అతని కోరికను తీర్చాలి. నా అనుష్టానం,నియమపాలన కూడా కాపాడబడాలి!" దానికి పరిష్కారం ఒక్కటే. ***"మన శాస్త్రాలలో ఉన్నదాని ప్రకారం, ఎటువంటి అశౌచమైనా, ఎటువంటి స్థలమైనా గోవు డెక్కల నుండి వచ్చే ధూళి తగిలితే, ఆ స్థలం పవిత్రమవుతుంది. అందుకే ఆవును ముందు వదిలి నేను దాన్ని అనుసరించాను"*** అని బదులిచ్చారు.

స్వామివారు చెప్పిన విషయాన్ని విన్న వారందరూ స్థాణువులై నిలబడి పోయారు. ఇంతటి ధర్మసూక్ష్మము ఉంటుందా అని!,**కొన్ని పరిస్థితులలో మహాత్ములు ధర్మాన్ని మీరినట్లు అనిపించవచ్చు. కానీ,మన పరిమితమైన అవగాహనకు, గుహ్యమైన ధర్మసూక్ష్మం అర్థం కాదు. పరశురాముడు తండ్రి ఆనతి పాటించటం, రాముడు సీతాదేవిని దూరం చేసుకోవటం వంటివి.అందుకే మహనీయులు చెప్పినవి, మనకు సందేహం ఉన్నాసరే! , తూ.చ. తప్పక అచరించటమే శ్రేయస్కరం, *"వారు చెప్పినదే ధర్మం – మనం అనుకున్నది కాదు"*.**

ధర్మాన్ని, ఆశ్రమ నియమ పాలనను ఇంతగా పాటించే జీవితం ఉంటుందా అని మనం అనుకోవచ్చు. ఇలా దయను కూడా ధర్మంతో ముడిపెట్టి పాలించేవారు కంచి పరమాచార్య స్వామివారు కాక ఇంక ఎవరు ఉంటారు?

--- "కడవులిన్ కురల్" – తిరువారూర్ దివాకరన్. 'కుముదం' పత్రిక నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

37. మహాస్వామి – మానసిక చికిత్స

బుద్ధిమాంద్యంతో ఉన్న తమ పిల్లాణ్ణి తీసుకుని దంపతులొకరు కాంచీపురానికి వచ్చి, పిల్లవాడు చాలా దీనస్థితిలో ఉన్నాడని, అతని స్థితి బాగుపడేలాగా ఆశీర్వదించమని మహాస్వామివారితో మొరపెట్టుకున్నారు.

అప్పుడు వారికి, మహాస్వామివారికి జరిగిన సంభాషణలో నేను గ్రహించినది.

మహాస్వామి : "పిల్లాడు ఏదేని నెప్పితో బాధపడుతున్నాడా?"

తల్లితండ్రులు : "లేదు పెరియవా"

మహాస్వామి : "ఆహారం కావాలని లేదా తినని మారాం చేస్తున్నాడా?"

తల్లితండ్రులు : "లేదు, ఏది పెడితే అది తింటున్నాడు"

మహాస్వామి : "తన ఈ స్థితి వల్ల మానసిక కృంగుబాటుకు లోనవుతున్నడా?"

తల్లితండ్రులు :"లేదు పెరియవా, తను అందరిలాంటి పిల్లవాడు కాదని తనకు అస్సలు తెలియదు"

మహాస్వామి : **"కోరిక, బాధ, ఆకలి, ఆశ, నిరాశ లేని ఉత్తమ స్థితి కోసం మన మహర్షులు కొన్ని వందల సంవత్సరాల పాటు తపస్సు చేశారు. మీ పిల్లాడి స్థితి అటువంటిది. అది భగవంతుడు తనకి ఇచ్చిన గొప్ప వరం. అతనికి శారీరక, మానసిక సమస్యలు ఏవీ లేవు. ఆ స్థితిని పోగొట్టి ,తిరిగి అతనికి బాధను ఎందుకు కలగజేయాలని అనుకుంటున్నారు? మీరు ఇచ్చే మందులు పూర్తిగా అతడి సమస్యను తీర్చి, సాధారణ పిల్లాడిలా మార్చగలిగితే మీరు ప్రయత్నించవచ్చు. కాని అది సాధ్యం కాదని వైద్యులు తేల్చేశారు కదా!**"

ఇది మనకు వచ్చే సాధారణ ఆలోచనలకు అతీతంగా ఉన్న విషయం. కాని ఇదే సరైనది, నిజమైనది. మనలాంటి స్థితి నిజానికి అతనికి దుఃఖ పడే పరిస్థితి.

మరొకసారి, 'పోస్ట్ మేనింజిటిక్ హెమిపరెసిస్' తో బాధపడుతున్న బిడ్డతో తల్లి–తండ్రి లు మహాస్వామివారి వద్దకు వచ్చారు. వారు మధ్యతరగతి ఆదాయానికి చెందినవారు. చాలా బాధలో ఉన్నారు. వారు స్వామివారితో, "ఇలా మాకే ఎందుకు జరిగింది? ఏమి తప్పు చేశామ ని మాకు ఈ బిడ్డ బరువుని ఇచ్చారు? వేలకొలది తల్లితండ్రులకు మంచి పిల్లల్ని ఇచ్చిన భగవంతుడు మాకు మాత్రం ఇలాంటి బిడ్డను ఎందుకు ఇచ్చాడు?" అని బాధపడ్డారు.

స్వామివారు ఆ దంపతులతో, "భగవంతుడు మిమ్మల్ని శిక్షించలేదు. నిజానికి మీరు దేవునిచేత ఎన్నుకోబడ్డారు.ఏదో పూర్వజన్మ పాపకర్మ వల్ల ఈ పిల్లాడు ఇలా అనుభవిస్తున్నా డు. అంతేకాక ఈ బాధ తనకి ఎక్కువగా ఉండరాదు అని భగవంతుడు ఆలోచించాడు. ఈ పిల్లాడికి మంచి ధనవంతులైన తల్లితండ్రులను ఇచ్చుంటే, బహుశా వారు పిల్లాడి బాగోగులు చూడటానికి పనివారిని నియమించేవారు. దాని వల్ల తల్లితండ్రుల నిజమైన ప్రేమ, ఆప్యాయత, అనురాగం తనకి లభించేవి కాదు. అలాకాక, పేదవారైన తల్లితండ్రులైతే, వారికే తినడానికి తిండి లేకపోవడంతో, పిల్లాణ్ణి చూసుకోవడానికి వారికి సమయము, డబ్బు రెండూ ఉండేవి కావు. **వేలమంది తల్లితండ్రులలో భగవంతుడు మిమ్మల్నే ఇతనికి తల్లితండ్రులుగా ఇచ్చాడు కాబట్టి అతను మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండగలుగుతాడు. అతని బాధ కూడా కొద్దిగా ఉపశమనం పొందుతుంది. ఈ పనికి మీరు మాత్రమే సరైనవారని దేవుడు మిమ్మల్ని ఎన్నుకున్నాడు. భగవానుడు మిమ్మల్ని శిక్షించడంలేదు**" అని తెలిపారు.

ఇది భిన్నమైన కోణంలో ఆలోచనే కాదు,పూర్తిగా కొత్తదైన మానసిక చికిత్సా విధానం కూడా! వారి బాధను మాటలతో తీరుస్తూ, మనసును స్థిమిత పరిచి, మానసిక పరిస్థితిని కూడా మార్చేస్తారు.**ఏవిధంగానైనాసరే, వారిని ఆశ్రయించినవారికి లౌకికమైన, అలౌకికమైన లాభం రెండూ చేకూరుతాయి. ఒకటి తెలిసి, రెండవది తెలియకుండా.**

గురు (భగవంతుని) కృప పొందగలిగితే, నరకంలో కూడా స్వర్గం తయారవుతుంది. ప్రహ్లాదునికి, తన ప్రాణంపెట్టి చూడాల్సిన కన్న తండ్రే,విషం పెట్టించి,ఏనుగులతో తొక్కించి చంపే పరిస్థితి. కానీ వాటి అన్నింటినుంచి ఎలా కాపాడబడ్డాడు?

– ప్రొ. యస్. కళ్యాణరామన్, న్యూరోసర్జన్, చెన్నై. "మూమెంట్స్ ఆఫ్ ఎ లైఫ్ టైం" నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

38. ప్రమాదం – ప్రమోదం

1972, జనవరి 8న మా అత్తమామలతో కలిసి వారి శతాభిషేకానికి ఆశీస్సులను కోరుతూ పరమాచార్య స్వామి దర్శనం కోసమని కాంచీపురం బయలుదేరాము. వలజాబాద్ దగ్గరలో మామామగారు కాస్త కారు ఆపమంటే, ఆపి, వారితోపాటు రోడ్డుకు అటువైపు వెళ్లాను.నాలుగేళ్ల మా రెండో అమ్మాయి నా దగ్గరకు రావాలని కారునుండి దిగి, విల్లుని వదిలిన బాణంలా దూసుకొచ్చింది.

అది జాతీయ రహదారి కావడంతో, వేగంగా వస్తున్న ఒక వాహనం మా అమ్మాయిని ఢీ కొట్టడంతో, అమ్మాయి చక్రాల కింద పడిపోయింది. అ ప్రమాదాన్ని చూసిన అందరమూ, భయానికి లోనయ్యి మ్రాన్పడిపోయాము. ఆ ప్రమాదంలో అమ్మాయి తలకు పెద్ద దెబ్బ తగిలి తలంతా రక్తపు మడుగులో తడిసిపోయింది. తలలో పెద్ద దెబ్బ తగలడం వలన, ముక్కులో, చెవుల్లో రక్తం కారుతూ ఉంది. వెన్నెముక చివరి భాగంలో, ఎడమకాలు ఎముకల్లో చీలిక వచ్చింది.ఎడమదవడ ఎముక విరిగిపోయి, బయటకు కనిపిస్తోంది.ఎడమ కనుగుడ్డు ఇరుక్కు పోవడంతో కంట్లో రక్తపు చారిక కనపడుతోంది. బయట కనపడేవి కాకుండా లోపలి అవయవాలు కూడా దెబ్బతిన్నాయి. నిండు గర్భిణి అయిన నా భార్య ఈ భీకరదృశ్యాన్ని చూసి,పెద్ద కేకపెట్టి మూర్ఛపోయింది.

వెంటనే పాపను కాంచీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళాము. అక్కడి వైద్యులు పాపస్థితి చూసి తను ప్రాణాలతోఉండడం అసంభవమని నిర్ధారించారు. మహాస్వామివారి దర్శనం చేసుకోకుండా పాపని మద్రాసుకు తీసుకుని వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాము.

ఇక్కడ ఉన్న **ప్రత్యేక నిపుణులు, న్యురోసర్జన్లు కూడా పాప బ్రతకదు అని తేల్చేశారు.** నా పాప స్థితిపై వైద్యులు ఇచ్చిన తీర్పు నాకు ఆశనిపాతంలా తాకింది. వెంటనే నా భార్య తన సోదరుడిని కంచికి పంపి, ఈదుర్ఘటన గురించి,పాపపరిస్థితి గురించి పరమాచార్యస్వామి వారికి తెలపమని చెప్పింది.ఇలాంటి స్థితిలో కూడా అతనకు మహాస్వామివారిపై ఉన్న నమ్మకం, భక్తి అనన్యమైనది.

మొత్తం విషయం అంతా విన్న స్వామివారు కొన్ని క్షణాలపాటు కళ్ళు మూసుకుని, దగ్గరలో ఉన్న వెదురు బుట్ట నుండి **ఒక ఆపిల్ పండును తీసుకుని, కమండలంలో ఉన్న నీటి తో అభిషేకించి, దానికి పూజ చేసి నా బావమరిదికి ఇచ్చి, ఆసుపత్రిలో పాప వద్ద ఉంచమని ఆజ్ఞాపించారు.జగన్మాత కామాక్షిదేవి అనుగ్రహం వల్ల పాప గండాన్ని దాటగలదని చెప్పారు.**

కాని పాప ఏ వైద్యానికి ప్రతిస్పందించటం లేదు.క్షణమొక యుగంలా గడుస్తోంది. డాక్టర్లు కూడా ఆందోళన చెందుతున్నారు. పరమాచార్య స్వామివారు ఇచ్చిన ఆపిల్ పండును పాప మంచందగ్గర పెట్టాము.వారం రోజుల్లో అద్భుతం జరిగింది. వైద్యులని అబ్బురపరుస్తూ, వైద్యచరిత్రని సవాలుచేస్తూ పాపకోలుకుని మాట్లాడుతుంది. **అత్యంత సౌందర్యంతో, ఖరీదైన పట్టుపుట్టంతో, తలపై బంగారు కిరీటంతో, చిరునవ్వుతో అమ్మవారులాఉన్న ఒక చిన్నపాప రాత్రి–పగలూ తనప్రక్కనే కనిపిస్తూ ఉన్నదని నాకు, అక్కడున్న అందరికీ చెపుతూంది.**

లార్డ్ టెన్నిసన్ చెప్పినట్టుగా,**"ఈ ప్రపంచం కలలు కంటూ పొందినవాటికంటే, ప్రార్థన ద్వారా పొందినవే ఎక్కువ".** కాని ఇక్కడ ఎటువంటి ప్రార్థన చెయ్యకపోయినా, అవ్యాజ కరుణామూర్తి అయిన పరమాచార్య స్వామివారి అనుగ్రహం వల్ల నా కుమార్తె చావు నుండి రక్షింపబడింది.

తను పూర్తిగా కోలుకున్న తరువాత పాపని మహాస్వామి వారి వద్దకు తీసుకుని వెళ్ళాను. స్వామివారు విపరీతమైన జ్వరంతోఉన్నా మాకు దర్శనం ప్రసాదించి, పాప ఆరోగ్యం గురించి విచారించారు.వారి కరుణా కటాక్షములు, దయ, ప్రేమ, ఆశీస్సులను తలచుకుని చిన్న పిల్లాడిలా వెక్కివెక్కి ఏడ్చాను. నాకు **"స్వామివారు ప్రతి ఆదివారము సహస్ర గాయత్రీ జపం చెయ్యాల్సిందిగా అజ్ఞాపించారు. ఆధ్యాత్మికం నుండి మనస్సును దూరంచేసే రాజకీయ చర్చ లకు దూరంగా ఉండమని"** చెప్పారు.ఏ విధంగా మీఋణం తీర్చుకోగలను అని అన్నాను. అందుకు వారు **"నీ రుణాన్ని కేవలం గాయత్రీ జపం ద్వారా మాత్రమే తీర్చుకోగలవ"** నిచెప్పారు. కొన్ని నెలల పాటు స్వామివారి ఆజ్ఞను పాటించి పూర్తి విశ్వాసంతో, **కేవలం ఆదివారమే కాకుండా ప్రతి రోజూ సహస్ర గాయత్రీ చెయ్యడం ప్రారంభించాను**.

ఒకసారి పరమాచార్య స్వామివారు సతారాలో మకాం చేస్తున్నప్పుడు వారి దర్శనానికి వెళ్లాను.అప్పుడు సమయం మధ్యరాత్రి మూడు గంటలు. ఆసమయంలో కూడా పరమాచార్య స్వామివారు నాకోసం కబురు చేసి, గాయత్రీ మంత్రం యొక్క ధ్యాన శ్లోకం చెప్పమన్నారు. కొద్దిగా శరీరంలో ప్రకంపనలు కలుగుతుండగా, శ్లోకం అప్పజెప్పాను. దాదాపు అరగంట సేపు మహాస్వామివారు గాయత్రి విషిష్ఠతను, అర్థాన్ని తెలుపుతూ సంభాషించి, జపంచేసే టప్పుడు ఆ అర్థాన్ని స్ఫురణలో ఉంచుకోమన్నారు. కాని అంతటి మహిమాన్వితమైన మంత్ర రాజమైన గాయత్రీ మంత్ర ధ్యాన శ్లోకంలో చెప్పబడినట్టుగా అమ్మవారిని ధ్యానించలేనని నా అశక్తతను తెలియజేశాను. కాని **జప సమయంలో మహాస్వామివారి దివ్యచరణ కమలాలను మాత్రం జపం సాగుతున్నంత సేపూ మనస్సులో నిలుపుకుని ఉంటా**నని తెలపడంతో స్వామి

వారు చిన్నగా నవ్వారు.ఇది నాజీవితంలో ఒక అద్భుతమైన ఘట్టం. **గాయత్రి మంత్రం యొక్క విషిష్ఠతని, గొప్పదనాన్ని, అర్థాన్ని నాకు అగుపరచి నాలోని భక్తిభావాన్ని పెంపొందించారు.**

పరమాచార్య స్వామివారు పరబ్రహ్మ యొక్క సాకార రూపం. "నేను బ్రతికినందుకు మా న్నాన్నకు ఋణపడిఉన్నాను. బాగా బ్రతికినందుకు నా గురువుకు ఋణపడిఉన్నాను" అని తనని ఉన్నత వ్యక్తిగా మార్చిన గురువైన అరిస్టాటిల్ గురించి అలెగ్జాండర్ చెప్పినట్టు, విరోధము, కోపము, ద్వేషము, అహంకారము, క్రూరత్వము వదిలి ఇంత అద్భుతంగా జీవిస్తు న్నాము అంటే అది కేవలం పరమాచార్య స్వామివారి కరుణ వల్ల మాత్రమే.

అశాంతి, బాధ, ఆందోళనలతో ఉన్న ఎవరైనా మహాస్వామి దర్శనం కోసం కంచి వెళ్తే, ఆ కరుణ నిండిన కన్నులు, దివ్యత్వం ఒలకబోసే చిరునవ్వు, ప్రశాంతత నిండిన ముఖము, తేజస్సుతో కూడిన దేహాన్ని చూడగానే, ఒక్కసారిగా మనస్సును శాంతపరచి, అమృతం త్రాగిన అనుభూతితో, కొత్త ఉత్సాహము, ఉత్తేజంతో ఇంటికి తిరిగివెళతారు.

మన శాస్త్రాల్లో చెప్పిన సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలు, నియమాలను పాలించ డంలో, ఇతరులచేత పాలింపజేయటంలో మహాస్వామివారు ఎప్పుడూ ముందే. వేలకొలది ప్రసంగాలలో, ఉపన్యాసాలలో వీటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని జనసమూహానికి అందించి వారిని కార్యోన్ముఖులను చేశారు.ఈ **నియమనిష్టలు ఎప్పటికప్పుడు కాలాను గుణం గా,వ్యక్తుల అవసరాలను బట్టి మార్పులు చేయకుండా అవలంబించాల్సిన పవిత్ర విషయాలు.** కాని ఈ కాలంలో ద్విజులుకూడా వీటిని విడిచి ఐహిక విషయాలకోసం పాకులాడడం స్వామివారికి ఎక్కువ బాధకలిగించే విషయం. ఇది వారికి కాస్త కోపాన్ని, ఆవేదనని కూడా కలిగించేది, ఎందుకంటే, మనమందరం చుక్కానిలేని, తెడ్డులేని, గమ్యంలేని ప్రయాణాన్ని సాగిస్తున్నాము.ఇది కేవలం లంపటాలలో ముంచుతుంది కాని ఉద్ధరణలో కాదు. సంప్రదా యాలకు ఎక్కువ విలవనివ్వడంతో శ్రీవారిని కొందరు ఛాందసులుగా భావించారు. కాని ఇప్పటి మన ఈతిబాధలు, కష్టాలు, కడగండ్లు, సమస్యలు కడతేరాలి అంటే అది పరమాచార్య స్వామివారి కరుణ వల్లే సాధ్యం.

ఆదిశంకరుల అవతారమే కాదు, సాక్షాత్ పరమశివ అవతారమైన మన మహాస్వామి వారి బోధనల మేరకు, మన బ్రతుకులను అనుసరించేటట్లు మలుచుకుని అలా బ్రతకడానికి ప్రయ త్నం చేద్దాము. నీలకంఠుడు, బృహదీశ్వరుడు, పరమేశ్వరుడు ఐన ఆ సదాశివుడు సాకార రూపం తో మానవ శరీరంతో కొద్దికాలం క్రితం వరకూ మన మధ్యనే తిరిగాడు.పరమాచార్య స్వామివారు ఆచరించిన ధర్మనిష్టతో, నియమాలతో బ్రతకడానికి మన లాంటి అల్పులకు కుదరకపోయినా, మనం చెయ్యగలిగినంత, పాటించ గలిగినంత మాత్రం తప్పకుండా ఆచరించాలి.

--- సి.యన్. కుప్పుస్వామి. "kamakoti.org" నుండి

39. యతి మహాలయం

బెల్గాం లో 1979 చాతుర్మాస్యం ముగిసిన మరుసటి రోజు ద్వాదశి కావడంతో 'పారణ' కు, పరమాచార్య స్వామివారి భిక్షకు 'సాంబ్ర' గ్రామంలో ఉన్న మా ఇంట్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి.తెల్లవారుఝాము నాలుగున్నరప్పుడు మందిరంలో శ్రీ ఏకాంబరం పంచాగం చదువుతూ చివర్లో, "యతి మహాలయం" (ప్రత్యేక పుణ్యకార్య పర్వదినం) అని ముగించారు.

పదిన్నర సమయంలో శ్రీ రాజగోపాల్ (మెట్టూర్ స్వామిగళ్) ఇంటికి వచ్చి, "యతి మహాలయ ద్వాదశి" రోజు, ఎక్కడెక్కడో సంచరిస్తూ సిద్ధిపొందిన సన్యాసుల ఆరాధన చెయ్యడం చాలా ముఖ్యమని, ఈ సంవత్సరం మీ ఇంట్లో జరగాలని, స్వామివారి ఆజ్ఞ మేరకు ఆరాధనని దార్వార్ శ్రీ బాలచంద్ర ఘనాపాటి, తిరువణ్ణామలై శ్రీ రామువాధ్యర్ చేయిస్తారని తెలిపారు. దాదాపు ఎనభై మందికి భోజనం పెట్టాలి కాబట్టి దానికి సంబంధించిన ఏర్పాట్లు చేసుకోమని తెలిపారు. పరమాచార్య స్వామివారు తెలిపిన ప్రకారం,ఈ ఆరాధన సిద్ధిపొందిన సన్యాసులందరినీ ఉద్దేశించి చేసేది. ఇప్పటిదాకా ఆరాధన జరగనివారికి కూడా.. ఎందుకంటే ఇది "సన్యస్థ మహాలయం".

ఇది వినగానే మాకు ఆశ్చర్యము, ఆందోళన రెండూ కలిగాయి. బెల్గాం ఇక్కడకు పదిహేడు కిలోమీటర్ల దూరం కావడంతో పూజకు కావాల్సిన ఏర్పాట్లు చెయ్యడానికి సమయం పడుతుంది. కాని, ఆరాధన పన్నెండున్నర కల్లా మొదలవ్వాలని ఆదేశం. బెల్గాం లో ఉన్న స్నేహితులు ఆరాధనకు కావాల్సిన సంభారాలతో సాంబ్ర చేరుకున్నారు. పరమాచార్యస్వామి వారి ఆదేశం ప్రకారం ఉగార్ స్వామి సమక్షంలో ఆరాధన మొదలయ్యింది.

కోయంబత్తూరు నుండి ఒక పెద్ద మిల్లు యజమాని తన తల్లితో సహా స్వామి వారి దర్శనానికి వచ్చాడు. ఆమె వయస్సురీత్యా కారునుండి కిందకు దిగలేకపోవడంతో పరమాచార్య స్వామివారే కారువద్దకు వెళ్లి దర్శనం ఇచ్చారు. అతను తనవెంట తెచ్చిన ఆరుజతల ధోవతులు మహాస్వామి వారికివ్వగా, వాటిని బ్రాహ్మణులకిమ్మని మాఇంటికి పంపారు స్వామి వారు. మధ్యాహ్నం మూడు గంటల పదిహేను నిముషాలకు మొత్తం కార్యక్రమం పూర్తయింది. నలుగురు బ్రాహ్మణులు (ఒకరు ఆదిశంకర స్వరూపులు) భోజనాదులు కూడా ముగించారు. ఇప్పుడే మహోత్తరమైన సంఘటన జరిగింది.

మా కార్యాలయంలో పనిచేసే ఒకతను పరుగుపరుగున ఇంటికి వచ్చి, పరమాచార్య స్వామివారు ఇంటివైపు వస్తున్నారని తెలియజేశాడు. దర్భాసనం, గొడుగుతో బాలు, ఏకాంబరం, ఇతరులు వెంటరాగా సరిగ్గా మూడున్నరకు పరమాచార్య స్వామివారు ఇంటి ద్వారం ముందర ఉన్నారు. మా కళ్ళను మేమే నమ్మలేకున్నాము.

ఎలాగో ఒక పూర్ణకుంభాన్ని త్వరగా సిద్ధంచేసి, వంటింటి బాధ్యత తీసుకున్న శ్రీకంఠన్, స్వామివారికి అందించాడు.వారు ఇంటిలోకి రాగానే, పూజగది ఎక్కడని అడిగి వెళ్లి కొద్దిసేపు

కూర్చుని జపం చేశారు. వెంటనే ఆరాధన జరిగిన హాలులోకి వచ్చి, తీర్థ కుంభానికి శిరస్సు వంచి నమస్కారం చేశారు. తరువాత వంటగదిలోనికి వెళ్లి, బ్రాహ్మణులకు సిద్ధం చేసిన వంటకాలను చూపమని శ్రీకంఠన్ ను అడిగారు. మరలా పూజగదిలోకి వెళ్లి, ఆరాధన కోసం వండిన వంటకాలను అన్నంతో సహా తీసుకునిరమ్మని శ్రీకంఠన్ ను ఆదేశించారు. ఎంతటి అద్భుతమైన సన్నివేశం!

సాయంత్రం అయిదుగంటలదాకా మహాస్వామివారు ఇంటిలోనే ఉన్నారు.శ్రీ ఉగార్ స్వామి ఉపన్యాసంవిని, దగ్గరలోఉన్న ఎయిర్పోర్ట్ దేవాలయానికి ప్రయాణమయ్యారు. వెళ్ళే టప్పుడు గొడుగు,దర్భాసనం,పీట,శాలువా పూజగదిలోనే వదిలేసారు. తరువాత వాటిని వారి కి తిరిగివ్వాలని ప్రయత్నించినప్పుడు మా ఇంటిలోనే ఉంచమని, **ప్రతీ "సన్యాస మహాలయం" రోజూ,ఒక వేద బ్రాహ్మణుని ఆదిశంకరులుగా భావించి, భోజనం పెట్టి తాంబూల దక్షిణలు సమర్పించి గౌరవించమని ఆదేశించారు.**స్వామివారి అనుగ్రహం వల్ల ఇది ఇప్పటికీ జరుగు తూనే ఉంది.

ఆరోజు రాత్రి స్వామివారు దత్తాత్రేయ ప్రతిష్ట కోసం సిద్ధం చేస్తున్న ఆలయంలో కూర్చుని, వచ్చిన భక్తులకు దతాత్రేయ అవతార ఉద్దేశ్యం వివరించారు. మేమందరం వారిలో సాక్షాత్తు గురు దత్తాత్రేయులనే దర్శించుకున్నాము. నవరాత్రికి కూడా స్వామివారు ఇక్కడే ఉంటారన్న నిశ్చయానికి వచ్చేశాము.

కాని జరిగినది వేరొకటి! మరురోజు, 18 ఆగస్ట్ 1979న ఉదయం 6 గం. లకు స్వామి వారు దేవాలయం నుండి బయలు దేరి తూర్పు వైపుగా ప్రయాణమయ్యారు. ఎప్పటిలాగే సేవకులందరూ పరుగు పరుగున స్వామివారిని అనుసరించి వెళ్ళిపోయారు.

మహాస్వామివారు ఘాట్ మార్గంగుండా **పన్నెండు కిలోమీటర్లు నడిచి వెళ్లి, 'కరడిగుడ్డి' అనే ప్రాంతాన్ని చేరుకున్నారు. అక్కడ చుట్టూ కొండల నడుమ, చిన్న నీటిప్రవాహం వద్ద ఉన్న 'జంబులింగ మందిర్' అను ఒక పాడుబడిన శివాలయంలో బస చేశారు**. ఆరోజు ప్రదోషం కావడంతో, సాయంత్రం పూజ, అభిషేకము చేయాలని అనుకున్నారు.

బాలు మరియు ఇతరులు అభిషేకం చేస్తుండగా, మహాస్వామివారు గట్టిగా రుద్రం చదవడం మేము విన్నాము. చూస్తుంటే చాకాలం పాటు ఆ ఆలయంలో అభిషేకము, పూజ జరిగినట్టు లేదు. దాని తరువాతనే ఈ అద్భుతం జరిగింది:–

ఉదయం నుండి ఆకాశం నిర్మలంగా ఉండి, ఎటువంటి వర్ష సూచన లేదు. కాని అభిషేకం ముగిసిన వెంటనే, ఆకాశం మొత్తం మేఘావృతమై వర్షం మొదలైంది. పరమాచార్య స్వామివారు కూర్చున్న దేవాలయం మరియు రోడ్డును వేరుచేస్తూ ప్రవహిస్తున్న నీటిప్రవాహం ఉధృతమైంది. మేము చాలామందిమి రోడ్డు మీదనే ఉన్నాము. ప్రవాహం ఆవలివైపునుండి చీకటిలో శ్రీకంఠన్ అరుపు వినబడింది. అక్కడున్న వారినందరినీ ముఖ్యంగా ఆడవారిని నా కారులో ఇంటికి తీసుకుని వెళ్లాల్సిందిగా పరమాచార్య స్వామివారి ఆదేశం. అంత పెద్ద వర్షం

పడుతుండగా, ఆ చీకట్లో ఘాటురోడ్డులో పన్నెండు కిలోమీటర్ల ప్రయాణం క్షేమకరం కాక పోయినా, **"ఆజ్ఞ వచ్చినది నడిచేదేవుని నుండి కాబట్టి, ఇక ఏమి ఆలోచించకుండా పన్నెండు మందినీ, ఇతర వస్తువులనీ ఎక్కించుకుని, పరమాచార్యస్వామి నామం చెప్పుకుంటూ కారు లో వెళ్ళిపోయాను. సరిగ్గా ఇంటి గేటు ముందరకు రాగానే కారు ఆగిపోయింది.**

మరుసటిరోజు ఉదయం కారుమెకానిక్ బానేట్ తెరవగానే, కార్బురేటర్ మొత్తం నీటితో నిండిపోయింది. అసలు కారు ఇక్కడిదాకా ఎలా వచ్చింది? అని అతను ఆశ్చర్యపోయాడు." అప్పుడు పరమాచార్య స్వామివారి కరుణను గుర్తు తెచ్చుకున్నాము.

ఆరోజు రాత్రి అందరమూ మునుపటి యతి మహాలయ ప్రసాదాన్ని స్వీకరించాము. స్వామివారి దృష్టి తగిలినందువల్ల అది సమృద్ధిగా ఉంది. దాదాపు ఎనభై మంది తిన్నా అది ఖాళీ అవ్వలేదు. ఇది కూడా అద్భుతమే!

--- సాంబ్ర కృష్ణమూర్తి. "మూమెంట్స్ ఆఫ్ ఎ లైఫ్ టైం" నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

40. ఆమెను భర్త దగ్గర వదిలి రా...

చాలా సందర్భాల్లో, ఇతరులపైన పరమాచార్య స్వామివారి ప్రేమ బహిర్గతం అవ్వదు. కాని ఒకసారి మహాస్వామివారు శ్రీమఠం బాలు మామని ఒక పని చెయ్యమని ఆదేశించారు. ఆ సంఘటన వివరాలు బాలు మామ మాటల్లో.

శ్రీమఠం మకాం షోలాపూర్ లో విడిది చేసి ఉన్నప్పుడు, ఒక సాయంత్రం మహాస్వామి వారు బాలు మామను పిలిచి, ఒక వ్యక్తి గురించి చెప్పి ***"ఇతని ఇంటికి వెళ్లి, వారి అమ్మాయిని తీసుకుని తన భర్త ఇంటిలో వదిలిరా!"*** అని ఆజ్ఞాపించారు.

ఆ మాట విని బాలు మామ నిశ్చేష్టుడయ్యాడు.

పరమాచార్య స్వామివారు చెబుతున్న వ్యక్తి స్వామివారికి పరమ భక్తుడు, వైశ్య కులానికి చెందినవాడు, పెద్ద సంసారం కలవాడు, ఏవోకారణాల వల్ల అతని కుమార్తె భర్త నుండి విడువడి, తల్లితండ్రుల వద్దే ఉంటోంది.ఈ విషయం ఎవరూ మహాస్వామివారికి తెలుపలేదు. కాని స్వామివారి నుండి ఇటువంటి ఆదేశం వచ్చింది.

"ఏమిటి ఈ ఆదేశం? మరొకరి కుటుంబ విషయాల్లో నేను జోక్యం చేసుకోవడం ఎలా? ఆ అమ్మాయిని తీసుకునివెళ్ళి భర్త ఇంటిలో వదిలిరావాలా? ఇది సరైనదేనా?" అని పరి పరివిధాల ఆలోచిస్తున్నాడు బాలు మామ. ఎటువంటి ఆజ్ఞనైనా స్వామివారి నుండి వెలువడితే, సహాయకులెవ్వరూ మరొక్క ఆలోచన లేక అమలుచేస్తారు.కాని ఈ విషయంలో బాలు మామ సంకోచిస్తున్నాడు.

బాలు మామ ఇబ్బందిని అర్థం చేసుకున్న స్వామివారు,అతనికి ధైర్యంగా ఉంటుందని, "నీతోపాటు బ్రహ్మచారి రామకృష్ణన్ ని కూడా వెంట తీసుకునివెళ్ళు" అని చెప్పారు.

వారు ఆ ఇంటికి వెళ్లి, స్వామివారి ఆదేశాన్ని వారికీ తెలిపారు. స్వామివారి ఆదేశాన్ని వినగానే అందరూ ఏడవడం మొదలుపెట్టారు. వారికి వచ్చిన అనుభవాల వల్ల, **అమ్మాయిని అక్కడకు పంపడం అంటే, ప్రేమ తో పెంచుకున్న చిలకను పిల్లి వద్దకు పంపడమే అని వారి భావం** .

కాని వారికి మహాస్వామి వారిపై ఉన్న నమ్మకం, భక్తిచేత ఎటువంటి అనుమానానికి తావివ్వకుండా మనస్సును స్థిమితపరచుకున్నారు. స్వామివారే ఇలా ఆదేశించారంటే అందులో ఎదో ఉంటుందని వారికి తెలుసు.అమ్మాయిని పంపడానికి నిర్ణయించుకున్నారు.ఆ అమ్మాయి ఎంత భయపడుతుందో, బాలు మామ కూడా అంతే తట పటాయిస్తున్నాడు.కాని అది స్వామివారి ఆజ్ఞ కావడంతో ఇక బయలుదేరింది.ఏమి జరుగుతుందో అని భయపడుతూ ముగ్గురూ బయలుదేరారు.

కానీ వీళ్ళు అక్కడకు వెళ్ళగానే అత్తింటి వారు ఎంతో సాదరంగా వాళ్ళను ఆహ్వానించారు. వీరు ఎంతగానో ఆశ్చర్యపోయారు.ఆమె భర్త కూడా తనని ప్రేమతో ఆదరించి, ఇక్కడే ఉంచుకుంటాను అని ప్రమాణం చేశాడు.

స్వామివారు ఏమిచేశారో!! అత్తింటివారి మనసు మార్చారా? లేక ఆమె కర్మను మార్చారా? వారు ఎప్పుడు ఏమి చేస్తారో మనమెందుకు ఆలోచించటం? చెప్పింది చేయటమే శ్రేయస్కరం అని మరోసారి నిరూపణ అయింది.

-- శ్రీ రా. గణపతి, "శంకరర్ ఎంద్ర సంగీతం" నుండి..

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

41. గుడివ్యవహారం – గబ్బిలజన్మ

శ్రీ జగదీశ భట్ గారి జీవితంలో జరిగిన ఈ సంఘటన వల్ల శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు సర్వాంతర్యామి అని, ఈనాటికి భక్తులను కరుణిస్తున్నారని రూఢి గా అవగతమవుతుంది.

'ఉత్తర చిదంబరం'గా పేరు గాంచిన సతారాలోని నటరాజస్వామి దేవాలయం స్వామివారి ఆదేశం ప్రకారం నిర్మించబడింది.ఆలయం పూర్తవడానికి ముందే,శ్రీ జగదీశభట్ గారిని దేవాలయ వ్యవహారాలు చూసుకోవల్సిందిగా ఆజ్ఞాపించారు.

శ్రీ జగదీశభట్ సతారా వెళ్లి, అత్యంత భక్తి,శ్రద్ధ లతో ఆలయ వ్యవహారాలు చూసు కుంటూ ఉండేవారు.కాని అతనక్కడ చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఇక వాటిని తట్టుకో లేక కంచీపురానికి వచ్చి,స్వామివారికి తనకు కల్గిన ఇబ్బందులను ఏకరువుపెట్టాడు. కరుణా మూర్తులైన స్వామివారు అతని ఇబ్బందులను విని, పరిపూర్ణమైన ఆశీస్సులను అందించి, సతారాకు తిరిగివెళ్ళమని ఆదేశించారు. జగదీశభట్'తో మాట్లాడుతూ,"ఏకాంబరేశ్వర దేవా లయంలో తలక్రిందులుగా వేలాడుతున్న గబ్బిలాలను చూశావా?" అని అడిగారు. గబ్బి లాలకు నోరు, మలమూత్ర ద్వారములు రెండూ ఒక్కటే అని చెప్పారు. తినడానికి, విసర్జించ డానికి కూడా ఒక్కటే వాడుతాయి.**"ఎవరైనా దేవాలయ నిధులు, ధనము తస్కరించడానికి ప్రయత్నిస్తే, మరుసటిజన్మలో గబ్బిలంగా జన్మిస్తాడు అని శాస్త్రవచనం".** స్వామివారు ఇదం తా చెప్పగానే, దేవాలయ ద్రవ్యవిషయంలో అతను మరింత శ్రద్ధ కనబరుస్తూ, ఇది తనకు హెచ్చరికగా భావించాడు.

స్వామివారే స్వయంగా అతణ్ణి ఉత్సాహపరచడంతో కొత్తశక్తి వచ్చినట్లై దేవాలయాన్ని చూసుకునే బాధ్యతను తీసుకుని, చాలా సంవత్సరాల పాటు తన కర్తవ్యాన్ని నిర్వహిం చారు. ఒకసారి వల్ల మొత్తం దేవాలయ బాధ్యత, అర్చక బాధ్యత మొత్తం జగదీశభట్ గారి పైనే పడ్డాయి. అన్ని వ్యవహారాలు చూసుకోవడం తలకు మించినభారం అయిపోయింది. అటువం టి సమయంలో ఒకసారి స్వామివారు తనకు ఎందుకు ఇంత ఇబ్బంది కలగ జేస్తున్నారని అనుకుంటూ నిరాశకు గురయ్యాడు.

ఒత్తిడితో ఆరాత్రి జగదీశభట్'కు నిద్రపట్టడం లేదు. తెల్లవారుఝామున నిద్రపట్టి పరమాచార్యవారు కలలో కనపడ్డారు, రెండుచేతులను పైకెత్తి ఆశీస్సులను అందించారు "ఏమి భయపడకు. అంతా నేను చూసుకుంటాను" అని స్వామివారు ధైర్యం ఇచ్చినట్టుగా అనిపించింది. కనుల నీరు కారుతుండగా వెంటనే నిద్రనుండి మేల్కొన్నారు. అది నిజంగా జరిగిన భావనగా తప్ప, కల లాగా అనిపించడం లేదు. స్వయంగా పరమాచార్య స్వామివారే వచ్చి ఆశీర్వాదించినట్టుగా ఉంది. ఆరోజు తనకి నూతనోత్సాహం కలిగింది. అన్ని పనులనూ ఎంతో ఉత్సాహంగా చేసుకున్నారు. ఒత్తిడి అసలు లేదు. ఇదంతా కేవలం పరమాచార్య ఆశీస్సులవల్లే అని అతనికి తెలుసు.

మరుసటిరోజు మరొక్క ఆశ్చర్యం జరిగింది.ఇంతకుముందు భట్'కు సహాయకునిగా పనిచేసి, వదిలి వెళ్ళిపోయిన యువకుడు, దేవాలయానికి వచ్చి భట్ ముందు నిలబడ్డాడు. ఎన్నో చోట్ల పనికి ప్రయత్నించి, చివరకు ఇక్కడే తనకు అనుగుణంగా ఉందని తిరిగొచ్చాడు. ఇక ఎప్పటికీ , ఈ దేవాలయాన్ని విడవకూడదనే దృఢ నిశ్చయంతో ఉన్నట్లు చెప్పాడు.అది కూడా మహాస్వామివారి కరుణయే అని జగదీశభట్ గారికి అవగతమైంది.

బ్రహ్మజ్ఞానుల ఆశీస్సులు వారు భౌతికంగా మనవద్ద లేకపోయినా అవి తప్పక జరిగి తీరుతాయని జగదీశభట్ గారి జీవితంలో జరిగిన ఈ సంఘటన వల్ల అర్థమవుతుంది.

-- "శ్రీ పెరియవ మహిమై" పత్రిక నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

42. నాంది –శ్రాద్ధ భోజనం

ఒకసారి పరమాచార్య స్వామివారు చిత్తూరు జిల్లా మదనపల్లి దగ్గరలోని చిన్న తిప్ప సముద్రం అనే ఊళ్ళో మకాం చేస్తున్నారు. అక్కడి ప్రజలు దాన్ని ఊరిపేరుతో కాకుండా సి.టి.యస్(Chinna Tippa Samudram-CTS) అని పిలిచేవారు. కొద్దిరోజుల్లోనే శంకర జయంతి కూడా! దాన్ని దృష్టిలో ఉంచుకుని స్వామివారి పరమభక్తులైన శ్రీ కల్లూరి వీరభద్ర శాస్త్రి గారు, నేను చెన్నై నుండి బస్సులో సి.టి.యస్ కు వెళ్ళాము.

శ్రీశాస్త్రిగారు ఆయన సహోదరుడు ఇద్దరూ గొప్ప సంస్కృత పండితులు– ఆంధ్ర దేశానికి చెందినవారు. వారి విద్వత్తు మహాస్వామి వారికి బాగా తెలుసు. ఆయన తరుచుగా మహాస్వామివారి దర్శనానికి వచ్చేవారు.రెండు రోజులలో శంకర జయంతి. అప్పుడు అక్కడ మహాస్వామివారి కైంకర్యం చెయ్యడానికి ముగ్గురు మాత్రమే ఉన్నారు. ప్రతిరోజూ దర్శనానికి దాదాపు నలభై మంది దాకా వచ్చేవారు.

ఆ ఊళ్ళో ఒక ధనికుడు ఉండేవాడు. శ్రీవారికి పరమ భక్తుడు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు అతని ఇంటనే బస చేసి, భోజనాదులు చెయ్యడానికి ఏర్పాటు చేశాడు. శంకర జయంతిని పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. శ్రీ వీరభద్ర శాస్త్రి గారిని వివరణాత్మక ప్రవచనం చెప్పవలసిందిగా ఆదేశించారు. స్వామివారు కూడా శ్రీ శంకరుల గురించి,వారి నామము(పేరు) యొక్క వైశిష్ట్యాన్ని గురించి వివరించారు. వడ్ల ధాన్యాన్ని పంచి పెట్టారు. తర్వాత అందరూ ఆ ధనికుని ఇంటికి వెళ్లి భోజనాదులు ముగించాము.

మరుసటిరోజు ఆ ధనికుని ఇంట్లో ఆయన మనవడి ఉపనయన కార్యక్రమం ఉంది. ఉప నయనంరోజు–ఉదయం మహాస్వామివారు వ్యక్తిగత సహాయకులైన రామకృష్ణన్, శ్రీకంఠన్ లను పిలిచి, **"వాళ్ళ ఇంటిలో ఈరోజు ఉపనయనం. ఇక్కడకు దర్శనానికి వచ్చిన భక్తులను 'ఉపనయనం అయిన ఇంటిలో భోజనం చెయ్యకండి' అని చెప్పండి. మీరు ఇద్దరూ వండి, అందరికి ఆహారం పెట్టండి"** అని ఆజ్ఞాపించారు.ఈవిషయాన్ని ఆధనికునికి కూడా తెల పమని ఆదేశించారు.

విషయం విన్న ఆ ధనికుడు హతాశుడయ్యాడు. "మావల్ల ఏ తప్పిదము జరిగింది?" అని అతని వేదన. శంకర భక్తులను ఆకలి తీర్చే పుణ్యాన్ని కోల్పోయాము అని అతని బాధ. బాధతో దాదాపుగా ఏడ్చే పరిస్థితిలో ఉన్నాడు.అతనిబాధని పరమాచార్య స్వామివారికి తెలి పారు. అందుకు స్వామివారు, **"ఉపనయనం జరిగే ఇంటిలో నాంది శ్రాద్ధం చేస్తారు. నాంది**

జరిగిన ఇంటిలో ఇతరులు భోజనం చెయ్యరాదని మన శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే భోజన ఏర్పాట్లు ఇక్కడ చెయ్యమని మీకు చెప్పాను" అని విశదపరచారు స్వామివారు.

ఈ శాస్త్ర సంబంధిత విషయాన్ని అందరికి స్వామివారు ఇలా తెలియజేశారు. శాస్త్ర సంబంధ విషయాల్లో ఎంతో ప్రావీణ్యం ఉన్నవారికి కూడా ఈ విషయం తెలియదు. కానీ పరమాచార్య వారి విషయం వేరు. వారికి తెలియని ధర్మం, శాస్త్రప్రమాణం ఉండవు.

"తస్మాత్ శాస్త్ర ప్రమాణంతే కార్యా కార్యా వ్యవస్థితౌ"

--- చంద్రమౌళి మామ, కాంచీపురం.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

43. విదేశీయాన విన్నపం

పరమాచార్య వారి గురించి నేను మొదటిసారి విన్నది 1943 లో, నేను ఆరవతరగతి చదువుతున్నప్పుడు.కొన్ని రోజుల తరువాత తిరుచిరాపల్లిలో ప్రముఖ వైద్యులు, శ్రీ మఠం లో కూడా సాధారణ వైద్యునిగా, పంటివైద్యునిగా పేరుగాంచిన మానాన్నగారు డా।.వి.సుబ్రమణి యమ్ గారు నన్ను, మాఅమ్మను,నా సోదరిని తీసుకుని దర్శనానికి వెళ్ళారు. అప్పుడు సంధ్యా సమయం.'తిరువానైకోయిల్' మఠం తోట ఆవరణం లో చిన్నగుడిసె లో పరమాచార్యుల వారికి పాదపూజ చేశారు మా నాన్నగారు. మహాస్వామి వారు నవ్వుతూ, మందహాసంతో, కరుణాపూరిత మోముతో దాదాపు అరగంట పటు సాగిన ఆ క్రతువులో అలా కూర్చుని ఉండ డం నాకు ఇప్పటికి గుర్తు. అరవై ఏళ్ళ తరువాత కూడా కళ్ళు మూసుకుంటే ఇప్పటికి ఆ మనోహర దృశ్యం గోచరమవుతుంది.

నా జీవితాన్ని, జీవన గమనాన్ని మలుపు త్రిప్పిన అద్భుత జ్ఞాపకం, నన్ను మహాస్వామి వారు విదేశాలకు వెళ్ళడానికి అనుమతి ఇవ్వడం:- అది 1960 ఏప్రియల్ లేదా మే లో జరిగినది. కామన్వెల్త్ స్కాలర్షిప్ లకు మొదటి విడత విద్యార్థులను జాబితా వెలువడే సమయం. కొత్త స్కాలర్షిప్ ల విధానం మొదలు పెట్టిన తరుణం.

అందుకోసం నేను ఢిల్లీలో ఇంటర్వ్యూ ఇచ్చిన కొద్దిరోజుల తరువాత ఈడిన్ బర్గ్ లో రెండేళ్ళ పాటు న్యూరోసర్జికల్ శిక్షణకు ఎంపికయ్యానని తెలిసింది. తిరుచ్చిలో ఉన్న మా నాన్నగారికి విషయం తెలిపాను. **అప్పట్లో పరమాచార్యస్వామివారు సాంప్రదాయ కుంటుంబ పిల్లలు చాలాకాలం పాటు విదేశాలకు వెళ్ళే ఆలోచనను సమ్మతించేవారు కాదు.** స్వామివారు అనుమతి ఇస్తేనే నేను వెళ్ళడానికి కుదురుతుందని నాన్నగారు తెలిపారు.పరమాచార్య స్వామి అనుగ్రహం కోసం అందరమూ శ్రీ మఠానికి వెళ్ళాము.

నాన్నగారు : రామన్'కు స్కాట్'ల్యాండ్ వెళ్లి 'మెదడుశస్త్రచికిత్స' లో శిక్షణ పొందడానికి స్కాలర్షిప్ లభించింది. వెళ్ళాలని ఆశపడుతున్నాడు.

మహాస్వామి : అందువల్ల ఏమి ప్రయోజనం?

నాన్నగారు : ఇప్పుడు జనరల్ సర్జరీలో యమ్ యస్ డిగ్రీ ఉంది. విదేశాలకు వెళ్లి, న్యూరోసర్జరీలో నిష్ణాతుడు అయితే, ఎక్కువ ధనం సంపాదించవచ్చు.

మహాస్వామి : అతను వెళ్ళడం వల్ల ఉపయోగం ఏమి?

నాన్న గారు : తను ఇంగ్లాడు వెళ్లి, ఎఫ్.ఆర్.సి.యస్ డిగ్రీ తెచ్చుకుని, పరిశోధన చేస్తే పి.హెచ్.డి డిగ్రీ లభిస్తుంది.

మహాస్వామి : **అది కాదు,అతను వెళ్ళడం వల్ల ప్రజలకు ఏమిటి ఉపయోగం?**

అప్పుడు అర్థం అయ్యింది మా నాన్నగారికి మహాస్వామి వారి ప్రశ్నలలో ఉన్న అంతరార్థం. అప్పుడు మా నాన్న ఇలా జవాబు ఇచ్చారు.

ఇప్పుడు మెదడుకు సంబంధించిన ఆపరేషన్లు డా. రామమూర్తిగారు ఒక్కరే చేస్తున్నారు. వారు ఒక్కరే అవ్వడం వల్ల ఎందతో రోగులకు శస్త్రచికిత్స అందడం లేదు. విదేశాలకు వెళ్లి శస్త్రచికిత్సలు చేసుకునే అంత స్తోమత అందరికీఉండదు.**రామన్ విదేశాలకువెళ్లి, న్యూరో సర్జరీలో శిక్షణ పొంది వస్తే,ఎక్కువమంది రోగులకు చికిత్సచెయ్యవచ్చు. అంతే కాక, భారత దేశంలోనే ఇంకా ఎక్కువమంది డాక్టర్లకు శిక్షణ ఇచ్చి, వారు శస్త్రచికిత్సలు నిర్వాహించేటట్టు చెయ్యవచ్చు. ఇది ప్రజలకు చాలా ఉపయోగకరం పెరియవ**.

మహాస్వామి : అలా అయితే, వెళ్ళమని చెప్పు.

ఒక విషయాన్ని ***మహాస్వామి వారు నిర్ణయించే విధానం ఇది– ఒక సాంప్రదాయ బ్రాహ్మణ యువకుడు నిత్యానుష్ఠానం వదిలి విదేశాలకు వెళ్ళడమా, ఎక్కువ విద్యార్హతలు సంపాదించడమా, ఎక్కువ ధనం ఆర్జించడమా అన్నది ముఖ్యం కాదు. ఇక్కడ ఈ దేశంలో ఉన్న ప్రజలకు అందువల్ల కలగబోయే సహాయం, తద్వారా వారికి కలిగే ఉపయోగం మాత్రమే ముఖ్యం. స్వామివారి నిర్ణయానికి కొలమానం లోక శ్రేయస్సు!***

-- ప్రొ. యస్. కళ్యాణరామన్, న్యూరోసర్జన్, చెన్నై. "మూమెంట్స్ ఆఫ్ ఎ లైఫ్ టైం" నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

44. సబ్బు – స్నానం

ఒకరోజు స్వామివారు స్నానం చేస్తున్నారు. దగర్లోనే ఉన్న చిన్నపిల్లవాడు స్వామివారిని చూస్తున్నాడు. మహాస్వామివారు ఎప్పటిలాగే సబ్బు వాడకుండా మట్టితో ఒంటి టిని తోముకుంటూ స్నానం చేస్తున్నారు.ఆపిల్లవాడు అది చూడగానే స్వామివారిని "స్నానానికి మీరు సబ్బు వాడరా?" అని అడిగాడు. "నాకు సబ్బు వాసన పడదు అందుకే. సబ్బుకి బదులుగా నేను ఇసుక వాడతాను" అని బదులిచ్చారు. "ఓహ్ అలాగా! సరే కాని, ఒళ్ళు రుద్దుకోవడానికి మీరు ఇలా ఇసుక వాడితే, అది కొంచం కళ్ళల్లో పడితే చాలా బాధ కలిగిస్తుంది కదా?అందుకే అడిగాను" అని అడిగాడు ఆ పిల్లాడు.ఆ పసివాడి హృదయంలోని ప్రేమ, ఆత్రుత చూసి స్వామివారు ఇలా చెప్పారు: **"స్నానం చేసేటప్పుడు మన శరీరాన్ని మట్టితో రుద్దుకుంటే మన పాపాలన్నీ పోతాయని మన శాస్త్రాల్లో చెప్పబడి ఉంది. అందుకనే నేను ఇలా చేసాను"** ఈ సమాధానంతో కూడా ఆ పిల్లాడు తృప్తి పడలేదు.స్వామివారితో విబే ధిస్తూ **"ఊరికే నాకు ఏమేమో చెప్పకండి. మీరేకదా దేవుడు! మీకు పాపంఎలా ఉంటుంది? దేవునికి ఎక్కడైనా పాపం అంటుతుందా? మీరు ఇలాచెయ్యడం ఎందుకు?"** అని ప్రశ్నిం చాడు.మహాస్వామివారు స్నానం చెయ్యడం ఆపి ఒక్కక్షణం ఆ పిల్లవానివంక చూశారు. **"ఎవరో చెప్పిన మాటని ఎంతగా నమ్మాడు అని తీక్షణంగా అతనివైపు చూసి ఇలా అన్నారు:** ***"నేను దైవమో కాదో లేదో, నాకు పాపాలు అంటుతాయో అంటవో, నాకు తెలియదు. కాని నన్ను గురువుగా భావించే నాభక్తుల పాపాలన్నీ తప్పకుండా నన్ను అంటుతాయి. కాబట్టి వాటినన్నిటిని పోగొట్టుకోవడానికే నేను మట్టితో దేహాన్ని రుద్దుకుని స్నానం చేస్తున్నాను!"*** ఇక మాట్లాడడా నికి తనకి పరిణితి, వయస్సు లేకపోవడంతో ఆ సంభాషణని ఇక ఆపి చిన్న పిల్లాడు కాబట్టి నవ్వి ఊరుకున్నాడు.

ఒకరోజు రాత్రి మతా శారదాదేవి నిద్రపోకుండా జపంచేస్తూనే ఉన్నారు.ఒక శిష్యుడు ఈ విషయం తెలిసి అమ్మని అడిగాడు,"అమ్మా! నిన్నరాత్రి మీరు నిద్రపోలేనట్లుగా ఉంది" అని.**"అవును, రాత్రి రెండుగంటలదాకా మాశిష్యుల ఉద్ధరణ కోసం జపంచేస్తున్నాను. ఇక్కడి వారు చాలామంది పనిలోపడి జపము,ధ్యానము సరిగాచెయ్యరు. కాబట్టి, వారితరపున నేను చేశాను"**.ఆత్మజ్ఞానిఅయినా అమ్మ అమ్మే! మహాస్వామివారు కూడా, ఇలానే తమని ఆశ్ర యించిన వారి పాపాలు దగ్ధమవటానికి, ఆత్మోద్ధరణ త్వరితగతిన పొందటానికి, అనేక విధా లుగా సాధన చేస్తారు. అది ఏవిధంగానో, ఎవరికోసమో, చెప్పరు! నిష్కామ కర్మ చేస్తారు – శ్రీకృష్ణుని వలెనే!!

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

45. కంప్యూటర్ – కరుణ

శ్రీమతి రమా రాజగోపాలన్ జీవితంలో పొందిన పరమాచార్య స్వామివారి అనుగ్రహం:

రమా భర్త చేస్తున్న ఉద్యోగం వదిలి, కొత్త ఉద్యోగానికై ప్రయత్నాలు చేస్తున్నారు. తను కూడా తన భర్తకు, ఇంటికి ఏదైనా సహాయం చెయ్యాలని నిర్ణయించుకుంది. "ఉద్యోగం లేని వారికి ప్రభుత్వం ఇచ్చే ఏదైనా సహాయాన్ని మనం కూడా పొందవచ్చు కదా!" అని తనభర్తను అడిగింది. అతను నిర్లక్ష్యంగా, "నువ్వు చదువుకోలేదు. మరి ప్రభుత్వ నహాయం పొంది నువ్వు ఏమిచేస్తావు" అని బదులిచ్చాడు. రెండురోజుల తరువాత, ఉద్యోగం వెతకటం కోసం బాంబే (ముంబై) కు వెళ్లిపోయాడు.కుటుంబ పరిస్థితి గమనించి రమ చాలా బాధపడుతోంది.ఆర్థిక సహాయం గురించిన వివరాలేమైనా తెలుస్తాయేమోనని రోజూ వార్తాపత్రికలు చూస్తోంది. వ్యవసాయానికి, కుట్టుమిషన్లకు, టైప్ రైటర్లకు, చిన్నపాటి ఉద్యోగాలకి ప్రభుత్వం ఆర్థికసహా యం అందిస్తుందని ఒక వార్తను చూసింది.

వెంటనే ఆమెకు ఒక ఆలోచన కల్గింది. అప్పుడే కంప్యూటర్ల వాడకం మొదలవుతోంది. ఒక కంప్యూటరు కొనడానికి కావాల్సిన లోను కోసం దరఖాస్తు చేసుకుంది. ఆ వారంలోనే, ఇంటర్వ్యూ కోసం తమని వచ్చి కలవమని బ్యాంకు నుండి సమాధానం వచ్చింది.

ఏ కార్యమైనా చెయ్యబోయే ముందు పరమాచార్య స్వామిని తలచుకుని ప్రార్థించడం రమకు అలవాటు. దరఖాస్తు పంపేటప్పుడు కూడా మహాస్వామి వారి పటం ముందు నిలబడి, ప్రార్థించిన తరువాతనే బ్యాంకుకు పంపింది. ఇప్పుడు ఇంటర్వ్యూకు వెళ్లేముందు, స్వామివారి పటానికి నమస్కారం చేసి ఇంటర్వ్యూ కోసం కాంచీపురానికి బయలుదేరింది.

ప్రయాణంచేస్తూ, తనకు కంప్యూటర్ల గురించి బొత్తిగా ఏమి తెలియదు కనుక ఇంటర్వ్యూ లో వారు ఏదైనా కంప్యూటర్లకు సంబంధించిన విషయం అడిగితే తను ఎలా సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తోంది. బ్యాంకువారు తనని నమ్మి, కంప్యుటర్ కొనడానికి ఆర్థిక సహా యం ఎలా చేస్తారు అని అనుకుంటోంది. కాని తనకు వరమాచార్య స్వామిపై గట్టి నమ్మకం, వారు తప్పక దారిచూపి, సహాయం చేస్తారని!

ఇంటర్వ్యూకు వెళ్లేముందు కాంచీపురం శ్రీమఠానికి వెళ్లి దర్శనం కోసం పరమాచార్య స్వామివారి ముందు నిలబడింది. మొత్తం విషయం అంతా తెలిపి ఆశీస్సులు అర్థించింది. స్వామివారు చిన్నగా నవ్వి, కంప్యూటర్ల వెనుక ఉన్న విజ్ఞానం ఏంటో తెలుసా?" అని అడిగి, వారే వాటి గురించి చెప్పడం మొదలుపెట్టారు.

'మనిషి' తెలివితో చేసే పనులన్నింటిని ఆ యంత్రాల చేత చేయించేలాగా వాటిని రూపొందిస్తున్నారు.ఎక్కువగా మతిమరుపు ఉంటున్న ఈ రోజుల్లో అది ఒకవరం. మనం

ఇచ్చిన మొత్తం సమాచారాన్నిఅందులోకి ఇస్తే, దాన్ని మొత్తం అది దాచిపెట్టుకుని, మనం కావాలన్నప్పుడు ఎటువంటి తప్పులులేకుండా తిరిగి ఇస్తుంది.కాని కంప్యూటర్లు మానవ మేధస్సుకు సమానం కావు" అని స్వామివారు చెప్పగానే, ఆవిడకు కంప్యూటర్ల గురించిన ప్రాథమిక అవగాహన, వాటి అవసరం తెలిసింది.

తరువాత స్వామివారు, "కంప్యూటర్ల గురించి ఏం చదువుకున్నావు? అని అడిగారు. ఇప్పుడు రమ ఇరకాటంలో పడింది.

"ఇప్పుడే నేర్చుకోవడం మొదలుపెట్టాను పెరియవ" అని బదులిచ్చింది.

"పని మొదలుపెట్టక ముందే, దాని ఫలితం పొందాలని ఆలోచిస్తున్నావన్నమాట" అని చిన్నగా నవ్వి కుంకుమ, కలకండ ఆమె పైలు మీద పెట్టి ఆశీర్వదించారు.

అంతులేని విశ్వాసంతో ఇంటర్వ్యూకు వెళ్ళింది. అక్కడ వాళ్ళు తన చదువు గురించి కానీ,కంప్యూటర్లతో తను చెయ్యబోయే పని ఏంటని కాని అడగలేదు. వారు అడిగిన విషయం కంప్యూటర్ల వల్ల ఉపయోగం ఏంటని. తను ఇంటర్వ్యూకు వచ్చే ముందు పరమాచార్య స్వామివారిని కలిసినప్పుడు స్వామివారు కంప్యూటర్ గురించి చెప్పిన విషయాన్ని మొత్తం వాళ్లకు చెప్పింది.ఇక్కడ 'ఇటువంటి ప్రశ్ననే అడుగుతారని స్వామివారికి తెలుసు' కాబట్టి, ఇదే విషయం స్వామివారు రమకు తెలిపారు.

తన సరళమైన, స్పష్టమైన సమాధానాన్ని విని అధికారులు సంతోషించారు.

ఇక ఎటువంటి ప్రశ్నలు అడగకుండా వెళ్ళవచ్చుని చెప్పారు. తనకు సహాయం అందదని బాధతో ఇంటికి వచ్చి పరమాచార్య స్వామివారి చిత్రపటం ముందు నిలబడి, "వికలాంగునికి తేనే కావాలని కోరిక" (తమిళ సామెత– వికలాంగుడు చెట్టుచివరికొమ్మన ఉన్న తేనె ఎలా తెచ్చుకుంటాడు?) లావుంది అని ఏడ్చింది. కాని స్వామివారి ఆశీస్సుల వల్ల, వారంలోపే తనకి ముప్పైఅయిదు వేల రూపాయల బుణం లభించింది.

పరమాచార్యుల ఆశీస్సులు ఉంటే , వికలాంగునికైనా తేనె నేరుగా వచ్చి నోటిలోకే పడదా?

కేవలం భక్తి శరణాగతి మాత్రమే మనల్ని పరమాచార్య స్వామివారికి దగ్గర చేస్తుంది. శ్రేయస్సును కలిగిస్తుంది.

ఈలీల లో: 'రమ'గారికి కంప్యూటర్ గురించి కనీస అవగాహన లేదు, అర్హతా లేదు. అసలు అప్పటికి కంప్యూటర్ల వాడకమే తక్కువ.అయినా సరే పరమాచార్యుల వారిని ఆశ్రయించింది. గురు కృపను పొందింది. అనుకున్నది సాధించుకుంది. **భౌతికమైన అర్హత లేకున్నా గురు అనుగ్రహంవల్ల ఏమైనా పొందవచ్చని** నిరూపించారు ఆమె!

శ్రీ పెరియవ మహిమై" పత్రిక నుండి.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

46. ఎంతటి మహానుభావులు! ఎంతటి కరుణాసముద్రులు!!

స్వామివారి చేత శ్రీశివరామకృష్ణ పెరియవ అనే అనిపించుకున్న శ్రీ శివరామకృష్ణ శాస్త్రి గారి అనుభవాలు:

మాయవరం శ్రీ శివరామకృష్ణ శాస్త్రి (మాయవరం పెరియవ) చాలా బాధ పడుతూ ఏడుస్తూ శ్రీమఠం వచ్చారు.ఆయనచేసే 'భాగవత సప్తాహం' ను మహాస్వామివారు చాలా మెచ్చుకునేవారు.శాస్త్రిగారు ఎప్పుడు సప్తాహంచేసినా శ్రీకృష్ణ పరమాత్ముడే స్వయంగా వింటున్నాడా అన్నట్టు తమధ్యాసను భాగవతంపైన తప్ప, వేరేవాటిపైన ఉంచేవారు కాదు. అంత గొప్ప శాస్త్రిగారు కన్నుల నీరు కారుస్తూ, మఠం మేనేజరు శ్రీ విశ్వనాథ అయ్యర్ గారితో మాట్లాడుతున్నారు.

అయ్యర్, శ్రీ కణ్ణన్ మామతో "శాస్త్రి గారు ఎందుకో చాలా భారమైన హృదయంతో దీనంగా ఏడుస్తూ వచ్చారు. ఈ విషయాన్ని మనం వెంటనే మహాస్వామి వారితో చెప్పి శాస్త్రి గారు మహాస్వామిని కలుసుకునేలాగ చెయ్యాలి" అని అన్నారు.శ్రీ కణ్ణన్ మామ విశ్రాంతిలో ఉన్న మహాస్వామి వారిని కలిసారు. మహాస్వామివారు "ఏమిటి" అని అడిగారు. మామ 'శాస్త్రి గారి విషయం' చెప్పారు.

అందుకు మహాస్వామివారు "అతను కారులో వచ్చాడు కదా!" అని అడిగారు.అవును అన్నారు మామ. "సరే, అతన్ని పాద ప్రక్షాళన చేసుకుని, వెనుక ఉన్న గుమ్మం వైపు నుండి రమ్మను" అని అన్నారు.మహాస్వామి వారు ఒక ఉసిరికాయ చెట్టు కింద కూర్చుని ఉన్నారు. శాస్త్రి గారు వచ్చి స్వామి వారికి వందనం చేసి బాధపడుతూ,"పెరియవా! నా అల్లునికి ఆరోగ్యం బాగోలేదు . ఎక్స్ రే తీయిస్తే, అతని రెండు ఊపిరితిత్తులు సగం పాడైపోయాయని ఒకటి అసలు పనిచేయటంలేదు, రెండవది మాత్రమే పనిచేస్తూ ఉందని చెప్పారు. అతను ఒక నెల కంటే ఎక్కువ రోజులు బ్రతకడని కూడా చెప్పారు." అని వాపోయాడు.శాస్త్రి గారు అలా కన్నీరుతో చెపుతూ,ఇలా అన్నారు **"ఒకవేళ జరగరానిది జరిగినా కానీ, ఈ దుఃఖం నన్ను ఆవరించకుండా మీరు నన్ను అనుగ్రహించమని వేడుకుంటున్నాను".**

(మనలో ఎవరు ఇలా ప్రార్థించగలరు, ఒక్క జ్ఞానులు,పండితులు తప్ప). శాస్త్రిగారు మరలా చేతులు జోడించి స్వామివారితో, **"ఈశరీరం వెళ్ళిపోయినంతవరకు, ఈ దుఃఖం నన్ను బాధింపకూడదు"** అని అన్నారు.

కణ్ణన్ మామ ఇది చూస్తూ "అతను ఏడుస్తూ కూడా తనకు ఈ దుఃఖం బాధించకూడదు అంటున్నాడు" అని అనుకున్నారు.

మహాస్వామి అదివిని ఒక విచిత్రమైన ప్రశ్నవేసారు *"ఒకవేళ ఆ యంత్రములు తప్పు చెప్తున్నాయేమో కదా?"* అని.

అప్పుడు శాస్త్రి గారు, "**మేము 27 ఎక్సరేలు తీయించాము, అన్నీ డాక్టర్లు చెప్పినదే ఋజువుచేస్తున్నాయి.ఇక 20-25 రోజులకంటే ఎక్కువ బ్రతకడు అని**".అప్పుడు స్వామి వారు ***"నువ్వు వేదాంతం బాగా నేర్చుకున్నావు కదా! అందులో 'భగవాన్ భయ నాశనః' అని ఉంది కదా! ఆయననే శరణువేడు!"*** అన్నారు.ఆ మాటలను విని శాస్త్రిగారు తేలికపడ్డ మనసు తో, ప్రసాదమును స్వీకరించి వెళ్ళి పోయారు.

కానీ, ఒక్క15 రోజుల తరువాత చాలా ఆత్రుతతో మఠానికి శాస్త్రిగారు మళ్ళీ వచ్చారు.

కణ్ణన్ మామ వారిని చూసి,"ఆరోజు చాలాచాలా బాధపడ్డాడు" అని, మేనేజరు అయ్యర్ గారితో , **"చూస్తూ ఉంటే వారి అల్లుడు మరణించినట్టు ఉన్నది త్వరగా తీసుకువెళ్ళు"** అంటూ, తనుకూడా మహాస్వామి వద్దకుపరిగెత్తారు. ఈసారి కూడా మహాస్వామి విశ్రాంతిలో ఉన్నారు. మామ మాటలు విని, స్వామివారు "ఎందుకు వచ్చాడు? అల్లుడు మరణించాడా? ఖచ్చితంగా అంత్యసంస్కారములు అన్నీ పూర్తి అయిఉంటాయి. అంతా అయిపోయిన తరువాతనే ఇక్కడకు వచ్చుంటాడు.అతను పండితుడు కదా, ఇవన్నీ బాగా తెలిసుంటాయి" అన్నారు.

మామ అవుననన్నట్టు తల పంకించి **"ఈ రోజు మహాస్వామి వారు చాలా సాధారణవ్యక్తి లాగా మాట్లాడుతున్నారే"** అనుకున్నాడు.

శాస్త్రి గారు మహాస్వామిని సమీపించి ముకుళిత హస్తాలతో,**"ఈశ్వరా! మీ నోటీనుండి వచ్చిన మాటలు నిజము అయ్యాయి. అన్ని యంత్రములు అబద్ధం చెప్పాయి. వైద్యులు ఏం ప్రమాదం లేదని అన్నారు. మా అల్లుడు బాగున్నాడు**" అని అన్నారు. వీటన్నిటికీ సాక్షులుగా ఉన్న కణ్ణన్ మామ,మేనేజర్ అయ్యర్ స్థాణువులయ్యారు.

అదే ఉసిరికాయ చెట్టు, అదే మహాస్వామి వారు, అదే శాస్త్రి గారు. కానీ సందర్భము వేరు.

మహాస్వామి నవ్వుతూ "ఓ, యంత్రములుకూడా అబద్దాలు చెప్తాయా! మనుషులు మాత్రమేచెప్తారు అనుకున్నాను"అని, అన్ని వివరములు కనుక్కుని శాస్త్రి గారికి ప్రసాదము, ఉత్తరీయాన్ని ఇచ్చి పంపారు.

మాయవరం శివరామకృష్ణ శాస్త్రిగారు తన పుస్తకములో,ఆ సంఘటన గురించి, **"మహాను భావుల నోటి నుండి వచ్చు మాటల వలన ఏమైనా జరుగవచ్చు"** అని వ్రాసుకున్నారు.

[సత్యవ్రత నిష్ఠలయిన వారి పలుకులకు అనుగుణంగా సృష్టి నియమాలు,సృష్టి రెండూ మారిపోతాయి. వారు పలికిందే నిజం, అంతవరకూ అది నిజం కాకపోయినా సరే, వారి మాటల వల్ల నిజమై తీరుతుంది. 27 ఎక్సరేల లో అన్నీ ఒకే పరికరంతో తీసి ఉండరు. అన్ని పరికరాలూ తప్పుడు రిపోర్టులు ఇచ్చే అవకాశం ఉండదు.అతని పరిస్థితి నిజంగానే తీవ్రమై నదే. కానీ పరమాచార్యవారి మాట వల్ల, శాస్త్రిగారి అల్లుని ఊపిరితిత్తులు బాగయి, ఆ రిపోర్టులను అబద్ధం చేశాయి. స్వామివారు పలికితే, మరణించి, బూడిద ఐన తరువాత కూడా శరీరం, ప్రాణం తెచ్చుకుని నడిచి వస్తారు. ఇదే విషయాన్ని భగవాన్ వెంకయ్యస్వామి వారు చెప్తారు–సంకలనకర్త]

Source: Internet

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

47. మఠం – మందుల షాపు

చాలా ఏళ్లక్రితం కంచిలో శ్రీమఠం ఎదురుగా పూలకొట్టు,పచారి కొట్టు, మందుల షాపు ఇలా చాలాదుకాణాలు ఉండి వ్యాపారం చేసుకునేవాళ్ళు. ఇండియన్‌బ్యాంకు వారికి శ్రీమఠం ఎదురుగా ఒక శాఖనుప్రారంభించి మఠం లావాదేవీలను చూసుకోవాలని కోరిక. వారు తమ అలోచనని మఠంఅధికారులకు తెలిపి వారిఅనుమతి తీసుకున్నారు. మఠం ఉన్నప్పటి పరిస్థితుల ప్రకారం బ్యాంకువారు మఠంఎదురుగా స్వయంగా ఒక సొంత భవ నాన్ని కట్టుకుని శాఖను ప్రారంభించవలిసి ఉంది. ఇందుకోసం అక్కడున్న దుకాణాలను ఖాళీ చేయించి వేరొకచోట వాటిని ఏర్పాటు చేసుకోవడానికి తగినస్థలాన్ని ఆ దుకాణదారులకు ఇవ్వాలి. ఇండియన్‌బ్యాంకు వారు మఠం ఎదురుగా తమశాఖను ప్రారంభించారు. రెండుసంవత్సరాల తరువాత దంపతులొకరు మహాస్వామివారి దర్శనానికివచ్చి, వారితో ఈరోజు మా పెళ్ళిరోజు, స్వామివారు మమ్మల్ని దీవించాలి అని ప్రార్ధించారు. మహస్వామి వారు వారిని గుర్తుపట్టి, నువ్వు మందుల షాపు ముదలియార్ కదూ? అని అడిగారు. 'అవును స్వామీ'

"మీ తండ్రి అంతిమ సమయంలో చాలా క్లేశపడ్డాడు.

'అవును స్వామీ'

వారి బాగోగుల గురించి కనుక్కున్న తరువాత మహాస్వామి వారు ఇలా అడిగారు. "ఇప్పుడు షాపు ఎక్కడ పెట్టుకున్నావు?"

"షాపు ఇంకా ఎక్కడా పెట్టుకోలేదు స్వామీ. సరైన స్థలంకోసం చూస్తున్నాము" అని చెప్పారు. మహాస్వామి వారు కనుబొమ్మలు ముడిచి "ఎందుకు? శ్రీమఠం ఎదురుగా ఉన్న స్థలం ఖాళీ చేసిన తరువాత నీకు వేరొకస్థలం ఇవ్వలేదా?" అని అడిగారు. ముదలియార్ సణుగుతూ "అదీ..... " అంటున్నాడు.స్వామివారికి అర్థం అయ్యింది. మఠం మేనేజరు గణేశఅయ్యర్ ని పిలిపించారు. స్వామివారు విషయం విచారిస్తున్నారు.'మనకు వీలున్నంతలో దాదాపు అంద రికి మరోచోట స్థలాలు ఇచ్చాము' అని చెప్పాడు. ముదలియార్ ఇంటి చిరునామా తీసుకుని అతణ్ని పంపించివేసారు.

ఆ తరువాత రోజంతా మహాస్వామి వారు ఎవ్వరితోను మాట్లాడలేదు. తీవ్రమైన చింతన లో ఉన్నట్టు కనిపించారు.

మందుల షాపు ముదలియారుకు వేరోకచోట స్థలం ఇవ్వలేదు అనే విషయం వారిని చాలాసంకటంలో పడేసింది. ఇలా చేయడం ఇచ్చిన మాటను అతిక్రమించడమే. అది అసత్య దోషం. వారు చివరగా తీసుకున్న నిర్ణయం అందరికి చెప్పారు. వారి నిర్ణయం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది.

తరువాత వారు మేనేజరుని పిలిచి విచారించారు. శ్రీమఠం వెనుక రోడ్డుపక్కగా చాలా ఖాళీ స్థలంఉంది. మఠం కాంపౌండు గోడని కూల్చితే ముదలియార్ పాతషాపుకు మూడింతలు పెద్దస్థలం లభిస్తుంది. ఆ సాయంత్రం లోపల ఆస్థలం అతనికి కేటాయించారు. అదే రోజు దర్శనానికి వచ్చిన శ్రీమఠం భక్తుడైన ఒక ఇంజనీరుకు అక్కడ దుకాణం కట్టవలసిందని ఆజ్ఞ. మూడునెలలో చక్కగా దుకాణాన్ని నిర్మించారు. ముదలియార్ అక్కడ తన మందుల షాపుని పెట్టుకుని మరలా వ్యాపారం మొదలుపెట్టాడు.

పరమాచార్యవారు చేసిన ప్రమాణాలు నెరవేర్చడంలో చాలా నిక్కచ్చిగాఉంటారు.ఎట్టి పరిస్థితిలోనైనా వాటిని నెరవేర్చవలసిందే.స్వామివారి అనుగ్రహాన్ని,తనకు కలిగిన అదృష్టాన్ని తలచుకొని ముదలియార్ చాలాసంతోషపడ్డాడు. తనకు రావలసిన స్థలం రాకపోయినా, ఏమాత్రం మాట్లాడకుండా ఓర్చుకున్న ముదలియార్ ధన్యజీవి.దానికితగిన ఫలితాన్ని స్వామి వారు యిచ్చారు.

--రా. వేంకటసామి. శక్తి వికటన్, జులై 2 2004 ప్రచురణ

48. ముందు పద్మావతీ కల్యాణంచెయ్యి!

కంచి పరమాచార్య స్వామివారనే ప్రత్యక్ష దైవాన్ని స్వయంగా సేవించి తరించే భాగ్యం పొందటమే కాకుండా, ప్రతి రోజూ వారివల్ల భక్తులు పొందేఅనుభవాలకు , స్వామివారి దివ్య అవతార లీలలకు సాక్షిగా ఉండి, ధన్యత పొందిన అతి కొద్దిమందిలో శ్రీమఠం బాలుమామ ఒకరు. వారుచెప్పిన ఒక లీల:

మరవక్కాడు రామస్వామి అనే భక్తునికి నలుగురు కూతుళ్ళు, ఇద్దరు కుమారులు. యుక్తవయస్సులో అతను ఏ విషయంలోనూ ఆసక్తి చూపకుండా, ఊరికే అక్కడా ఇక్కడా తిరుగుతుండడంతో, నెలవారీ ఆదాయం అంటూ ఏమి వచ్చే పరిస్థితి లేదు. వైదిక కర్మలలో పండితులకు సహాయం చెయ్యడంవల్ల లభించే కొద్ది మొత్తమే అతని కుటుంబానికి ఆసరా. అతను నివసిస్తున్న గృహం తాతలనాటిది కావడంతో ఇంటికి అద్దె కట్టాల్సిన అవసరం లేదు. గ్రామ శివార్లలో అతనికి ఒక కొబ్బరితోట ఉంది. దాని నుండి వచ్చే ఆదాయమే వారికి తిండి పెడుతోంది. పెద్దమ్మాయికి ఇరవైరెండేళ్ళు,రెండవ అమ్మాయికి ఇరవైయ్యేళ్ళు. ఇద్దరి పెళ్ళిళ్ళు ఒకే ముహూర్తంలో జరిపించేస్తే ఖర్చు కొంతతగ్గుతుందని అతని ఆలోచన. కాని జరుగుతున్న సంఘటనలు దానికి ఊతమియ్యడంలేదు. ఊహించనివిధంగా పెద్దమ్మాయికి మంచి సంబంధం కుదరడంతో, త్వరగా పెళ్లిచెయ్యాలని, కొబ్బరితోట అమ్మడానికి నిశ్చయించుకుని ఒకరి వద్ద ధరకూడా నిర్ణయించేశాడు. కాని అతను చేస్తున్న ఈపని అన్నగారికి నచ్చలేదు. ఆకొబ్బరి తోట తరతరాలుగా వస్తున్నది కావడంతో, అందులో ఇతనికి భాగం ఉన్నది కాబట్టి, కోర్టుకు వెళ్లి స్టే–ఆర్డర్ తెచ్చుకున్నాడు. రామస్వామి అయ్యర్ కు ఏమీపాలుపోలేదు. అసలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. ఎలాగోలా కుమార్తె పెళ్లి జరిపించాలి అనుకున్నాడు. కాని అతని అన్న కొబ్బరితోట అమ్మకానికి అడ్డుపడ్డాడు.ఇంక రామస్వామి చాలా బాధలోకి వచ్చేశాడు. తను చేసేదేమి లేక, కరుణా సముద్రుడైన స్వామివారి వద్దకు పరిగెత్తుకుని వచ్చాడు. స్వామివారికి సాష్టాంగం చేసి నిల్చుని, గద్గదమైన స్వరంతో, కళ్ళ నీరు కారుతుండగా మొత్తం విషయం అంతా స్వామివారికి విన్నవించాడు. పరమాచార్య స్వామివారు అయిదు నిముషాల పాటు అతనివైపు చూసి, ఏమీ చెప్పకుండా ప్రసాదం ఇచ్చి పంపేశారు. **పెద్ద దుఃఖభారంతో వచ్చిన ఆ భక్తుడు నిరాశపడ్డాడు. పరమాచార్యవారు కనీసం మాట సాయంగానైనా 'బాధపడకు' అని కూడా చెప్ప కుండా పంపించివేశారు, అన్న బాధతో బయటకు వచ్చాడు.**

అతను బయటకు రాగానే, బాలుమామ కనపడ్డారు. దుఃఖం తన్నుకురావడంతో తన బాధను బాలుకు చెప్పుకున్నాడు. "పరమాచార్య స్వామివారు తలచుకుంటే ఏమైనా చెయ్యగలరు.మాఅన్నకు పెద్ద ఇల్లు, ఆస్తి, ఐశ్వర్యం అన్నీ ఉన్నాయి. ఎప్పుడూ యాత్రలలో ఉంటాడు. నేను ఎప్పుడూ ప్రత్యక్షంగా కలవలేను. నావల్ల చెయ్యడం కాకపోయినా ఎపుడూ మా నాన్న గారి ఆబ్దీకానికి కూడా పిలవడు,ఎంతో కష్టపడి నాకుమార్తె పెళ్లి చేద్దామనుకుంటే, ఇలా

చేశాడు. మొత్తం విన్న తరువాత "ఇదంతా ఎందుకు స్వామివారితో చెప్పలేదు?" అని అడిగాడు బాలు."నేను మొత్తం చెప్పాను, **పరమాచార్య స్వామివారు సాంతంవిన్నారు. కేవలం విభూతి ప్రసాదం ఇచ్చారు కాని ఏ "అనుగ్రహం ఇవ్వలేదు" అని బదులిచ్చాడు రామస్వామి.** ఎంతో బాధతో తన గోడు చెప్పుకున్న రామస్వామిని చూసి, పెరియవా ఇలాచెయ్యకుండా ఉండాల్సింది అనుకున్నాడు బాలు, అందరిపై కరుణను ప్రసరించే మహాస్వామి, రామ స్వామిని ఇలా వదిలేయడు కదా! అందునా, పేదవాడైన రామస్వామిపై స్వామివారి కరుణ దయ అపారమైనవి కదా! అని అనుకున్నాడు. ఏమి బాధపడవద్దు, **నీ సమస్యను స్వామివారికి వదిలి, ఏంజరగాలో, అది చూడు.ఎలాగో స్వామివారే నిన్ను కాపాడుతారులే అని అతణ్ణి స్వాంతనపరచి పంపాడు బాలు.**

కొన్ని రోజులు గడిచిపోయాయి.**"ఉపన్యాన చక్రవర్తి – శ్రీ మార్గబంధుశాస్త్రి"** స్వామి వారి దర్శనానికి వచ్చారు. అతని ఐశ్వర్యము, యశస్సు అతను ధరించిన తెల్లని పట్టుపంచె, 'జరీ'అంచు ఉన్న అంగవస్త్రం,బంగారుతో అల్లిన రుద్రాక్షమాల, నవరత్నహారాలలో కనపడుతోంది.వారు ఎప్పుడు వచ్చినా, స్వామివారు వారితో గంటల తరబడి వివిధ అంశాలపై మాట్లాడేవారు.సాయింత్రాలు ఉపన్యాసం చెప్పమని స్వామివారు అడిగేవారు. కాని ఈసారి ఎందుకనో ఎప్పటిలాగా లేదు. భార్యతో, ఇద్దరు శిష్యులతో కలిసి, చేతిలో ఉన్న పళ్లెం నిండా పళ్ళతో వచ్చినిల్చున్న ఆయన్ని పట్టించుకోకుండా,స్వామివారు ఇతరులతో సంభాషిస్తున్నారు.

"ఎందుకు ఇవ్వాళ ఇలా జరుగుతోంది. దేశంలోనే ప్రఖ్యాతిచెందిన ఉపన్యాస చక్రవర్తి వేచి యున్నాడు సరే స్వామివారికి చెబుదాం" అనుకుని, బాలు గట్టిగా స్వామివారికి వినపడేటట్లు, **మార్గబంధుశాస్త్రి వచ్చారు" అని చెప్పాడు.**స్వామివారి చూపు ఇటువైపు పడ్డట్టుగా అనిపించడంతో అటువంటి అవకాశం కోసం ఎదురుచూస్తున్న మార్గబంధుశాస్త్రి పళ్ళతో పట్టుకున్నపాత్రను స్వామివారికి సమర్పించి, **"చాలాకాలం తరువాత ఏడెనిమిది రోజుల దాకా నాకు ఎటువంటి కార్యక్రమాలు లేవు,అందుకని తిరుమలకు వెళ్తున్నాను. 'శ్రీనివాస కల్యాణం' చేయించాలని నాభార్య కోరిక. అందుకనే వెంటనే బయలు దేరాము. పెరియవా అనుగ్రహంతో మేము 'శ్రీనివాస కల్యాణం' చేయించాలని అనుకుంటున్నాము"** అని చెప్పాడు.

స్వామివారు అతని వైపు చూడనైనాలేదు. కనీసం అతని మాటలు కూడా విన్నట్టులేదు. చుట్టూ ఉన్నవారితో ఎంతో ఉత్సాహంగా మాట్లాడుతున్నారు,కాని దాదాపు అరగంటపాటు మార్గబంధుశాస్త్రి ని పట్టించుకోలేదు. స్వామివారికి గుర్తుచేయాలని "శాస్త్రిగారు అక్కడ నిలబడి ఉన్నారు" అని మరలా చెప్పాడు బాలు. **ఎందుకు ఇవ్వాళ 'నన్ను ఇలా నిర్లక్ష్యం చేస్తున్నారని'** తలచి,"అవును, పెరియవా నన్ను అనుగ్రహించాలి,స్వామివారు నన్ను ఆశీర్వదించి, తిరుమలకు వెళ్ళడానికి అనుమతి ఇవ్వాలి. శ్రీనివాస కల్యాణం చేయించడానికి ఈరోజే తిరుమలకు వెళ్తున్నాను" అని శాస్త్రి మళ్ళీ అర్థించాడు.

ఒక్కసారిగా మహాస్వామి వారు లేచి, "ముందు పద్మావతీ కల్యాణం చెయ్యి!" అని చెప్పి మరేమీ పలుకకుండా లోపలకు వెళ్ళిపోయారు.

దీనంతటినీ గమనిస్తున్న అక్కడున్నవారికి ఏమీ అర్థం కాలేదు, విపరీతంగా తోచింది. "శ్రీనివాస కల్యాణం' అంటే 'పద్మావతీ కళ్యాణమే' కదా! అంటే "తిరుమలలో శ్రీనివాస కల్యాణం చేయించేవారందరూ తిరుచానూరు వెళ్లి తరువాత చేయించే 'పద్మావతీ కల్యాణం' చేయించమనా స్వామివారి ఆదేశం?" దీనికి అర్థ మేమిటో మార్గబంధుశాస్త్రికి కూడా అర్థంకాలేదు. ఎందుకు స్వామివారు ఇటువంటి ఆదేశా న్ని ఇచ్చి, లోపలకు వెళ్ళిపోయారో అని ఆలోచిస్తూ నిలబడిపోయాడు. కాని, వెంటనే, దాని అర్థమేంటో,అంతరార్థ మేమిటో స్వామివారే అతనికి స్ఫురింపచేశారు.

రెండు నెలలు గడిచిపోయాయి. **పరమ సంతోషంతో, వెలిగిపోతున్న ముఖంతో రామ స్వామి అయ్యర్ పరమాచార్యవారి దర్శనానికి వచ్చాడు.ఈసారి వచ్చింది తన కుమార్తె పెళ్లి పత్రికను సమర్పించడానికి.** స్వామివారికి సాష్టాంగపడి, ***మీఅనుగ్రహం వల్ల, నాకుమార్తె పెళ్లి ఖర్చు మొత్తం భరించడానికి మా అన్న ఒప్పుకున్నాడు. కేవలం కన్యాదానం చెయ్యడం మాత్రమే నాబాధ్యత అని, మిగిలినదంతా తను చూసుకుంటానని నాతో చెప్పాడు. కొబ్బరి తోట పైన వేసిన కోర్టుకేసు కూడా వెనక్కుతీసుకున్నాడు. నా చిన్న కుమారునికి ఉపనయనం చేసి, తన శిష్యునిగా తీసుకుంటానని చెప్పాడు. మాఅన్నయ్య ఇలా మారిపోతాడని నాకలలో కూడా అనుకోలేదు. ఇదంతా స్వామివారి అనుగ్రహం వల్లనే సాధ్య మయ్యింది అని చెప్పుకుంటూ పోయాడు.*** కాని స్వామివారు ఎలా అనుగ్రహించారో అతనికి తెలియదు! మహాస్వామి వారు చిన్ననవ్వుతో, చెయ్యెత్తి ఆశీర్వదించి, ప్రసాదం ఇచ్చి పంపారు.

రామస్వామి అయ్యర్ బయటకు రాగానే, మరలా బాలు తారసపడ్డాడు. "రామస్వామి! ఏమిటి, నీ చేతిలో! పెళ్లి పత్రికా? నీ కుమార్తెదా? నీదగ్గర ఒక్క పైసా కూడా లేదని చెప్పావు కదా?" అని అడిగి, రామస్వామి ఇచ్చిన పత్రిక తీసుకున్నాడు. అందులో ఇలాఉంది:-

"చి.ల. సౌభాగ్యవతి॥ పద్మావతి, మరవక్కాడు జగదీశ్వర శాస్త్రిగారి మనవరాలు,
నా తమ్ముడు చిరంజీవి రామస్వామి పెద్ద కుమార్తె..."
చివరన – ఇట్లు "మీ భవదీయుడు, మార్గబంధుశాస్త్రి."

బాలు ఆశ్చర్యంతో నోట మాటరాక నిశ్చేష్టుడయ్యాడు.రెండు నెలల క్రితం పరమాచార్య వారు మార్గబంధుశాస్త్రి కి చెప్పినదానికి అర్థం ఇదా! **"రామస్వామి అయ్యర్ అన్న ఈయనే (మార్గబంధుశాస్త్రి) అని స్వామివారికి తెలిసి ఉండవచ్చు. కాని రామస్వామి పెద్ద కుమార్తె పేరు పద్మావతి అని ఎలాతెలుసు?"** అయినా, స్వామివారికి అంతా తెలుసు అన్న నిజంలో ప్రత్యేకత ఏముంది? **వారు సర్వజ్ఞులుకదా!** ఆ ప్రత్యక్ష డైవానికి అనుగ్రహించడం తప్ప ఇంకేం తెలుసు. అనుకున్నారు.

– "శ్రీ శ్రీ శ్రీ మహాపెరియవా మహిమై" పత్రిక నుండి

49. వర్షం పడిందా?

మానాన్నగారు శ్రీ యమ్.రాజాహ్ అయ్యర్, Ex. MLC, రామనాథపురం (రామ్నాడ్) జీవితంవల్ల నేనుతెలుసుకున్నది పేదలకు సహాయంచెయ్యడం, ప్రతిభఉన్నా అణగదొక్కబడిన వారికి,ఆపదలో ఉన్నవారికి చేతనైన సహాయం చేసి ఆదుకోవడం.

ఫిబ్రవరి 1974లో మానాన్నగారు స్వర్గస్తులయ్యారు. రామ్నాడ్ లాంటి చిన్న ఊరిలో కూడా వారికి నివాళులర్పించడానికి జాతిబేధం లేకుండా కొన్ని వేలమంది పేదవారు హాజరయ్యారు. నేను వారి లక్ష్యాలను పాటించాలని తీర్మానించుకున్నాను. అప్పటికి నాకు పెళ్లి కావల్సిన ఇద్దరు తోబుట్టువులుఉన్నారు. కొన్ని కారణాలవల్ల మా చెల్లెలు రాజేశ్వరికి సరైన సంబంధం కుదరటం లేదు. నడిచే దైవమైన పరమాచార్యస్వామిని దర్శించమనీ, వారి దర్శనభాగ్యం వల్ల మంచి జరుగుతుందని కొందరు చెప్పారు.

వారి మాటలను విశ్వసించి 1975 జులై 4 శుక్రవారం నాడు స్వామివారి దర్శనానికై కంచి వెళ్ళాము. సాయంత్రం ఐదుగంటలప్పుడు కలవై చేరుకున్నాము. నాకు ఎలాంటి దుస్తులు వేసుకోవాలోకూడా తెలియక, ఫ్యాంటు,జులపాలు,చుబుకందాకా పెంచిన గడ్డంతో కలవై కొలను వద్దకు వెళ్ళాము. గురువుని చూడటానికి మహాస్వామివారు వస్తారని కొలను అవతలకువెళ్ళమని ఒకరుచెప్పగా, పరమాచార్యవారు ముగ్గురు అనుచరులతో అటుగా రావడం, నేనుచూశాను. వారు గురువుల బృందావనాల ముందు కొద్దిసేవు ప్రార్థన చేశారు. నావైపు చూశారు. అప్పుడు నాకు కలిగిన అనుభూతిని ఎప్పటికీ మాటల్లో వర్ణించలేను. మరొకసారి ప్రదక్షిణం చేస్తూ మరలా నన్నుచూశారు. నా ఆహార్యాన్ని చూసి ఒక శిష్యుడు నేనవరని సైగ చేసి అడిగాడు.

మహాస్వామి వారికి వినబడాలని.“నేను ‘రామ్నాడ్ రాజాహ్ అయ్యర్’కుమారుణ్ణి” అని నేను గట్టిగా అరిచాను. కొన్ని నిముషాలపాటు స్వామివారు పట్టించుకోలేదు. నా పక్కనున్న ముసలావిడ కొద్దిగా చీత్కారంతో,మృదువుగా, బాబూ! శ్రేష్ఠమైన శుక్రవారంరోజు స్వామి వారిని ఇలా దర్శించుకునే భాగ్యం కలిగింది.నువ్వు ఫ్యాంటుతో విచిత్ర వేషధారణతో వచ్చిందే కాకుండా ఎందుకు అంత గట్టిగా అరుస్తావు? ఇలా చెయ్యడం నీకు ‘సరియైనదేనా?’ అని అడిగింది.

నేను అలా అనుచితంగా అరవాల్సింది కాద,ని నా భార్య కూడా అన్నది. మేము అక్కడి నుండి ముందు వైపుకు వెళదామని కదులుతుండగా స్వామివారు మరలా ఇటువైపు రావడం చూసి, ఆవిడ మాటలను గుర్తుకు తెచ్చుకుని చొక్కా విప్పి గోడవైపుకు పరిగెత్తాను. మహాస్వామివారు సైగలతో నేను ఎవరని అడిగారు. నేను చిన్నగా రామ్నాడ్ రాజాహ్ అయ్యర్ కుమారుణ్ణి అనిచెప్పాను.అప్పుడు **స్వామివారు మానాన్నగారి గురించి సైగల్తో చెబుతుండగా పక్కనఉన్న శిష్యులు నాకు అర్థంఅయ్యేలా చెబుతున్నారు. డా. నర్వేపల్లి రాధాకృష్ణన్**

(రాష్ట్రపతి) నుండి పురస్కారాన్ని పొందడం,శాననమండలికి వారుచేసిన సేవ, దాదాపు 45 నిముషాలపాటు చాలావిషయాలు చెప్పారు. భక్తులు, శిష్యులు చాలామంది చూస్తూ నిల బడ్డారు. **నేను నాప్రమేయం లేకుండానే చిన్నపిల్లడిలా ఏడుస్తున్నాను.**

నేను రావడానికి కారణమేమని అడిగారు స్వామివారు. నాబాధను చెప్పుకున్నాను. నా చెల్లివెవు చూపిస్తూ "ఆ అమ్మాయి ఈ అమ్మాయేనా?" అని అడిగారు. నేను అవునని చెప్పాను. రుద్రాక్ష చుట్టూ వేలు తిప్పుతూ, పెళ్ళికి అన్ని ఆభరణాలు ఉన్నాయా? అని అడిగారు. అన్నీ ఉన్నాయి స్వామీ, ఒక్క వరుణ్ని వెతకడం తప్ప,నేను చెయ్యవలసిందేదీ లేదని చెప్పాను.

స్వామివారు మా చెల్లిని దీవించారు. వారి కరుణ అపారమైనది.అప్పుడు సమయం ఆరు ముప్పావు కావడంతో బాగా చీకటిగా ఉందని నేను వెళ్ళబోయాను. వారి సాన్నిధ్యం నుండి వెళ్ళేటప్పుడు,స్వామివారి అనుమతి తీసుకోవాలని నాకు తెలియదు. ఒకరు అదితెలిపి, స్వామివారిని అడగమని చెప్పగా నేను అనుమతి అడిగాను. స్వామివారు "మద్రాసు నుండి ఎలావచ్చావు? అనిఅడిగారు.కారులో వచ్చాననిచెప్పాను. ***'ఈరోజు వర్షం పడిందా?'*** అని ఒక శిష్యుణ్ణి అడగగా, అతను లేదని చెప్పాడు. ***స్వామివారు ఒక్కక్షణం ఆలోచించి, వెళ్ళేటప్పుడు జాగ్రత్త!అని ఆశీర్వదించి పంపారు.*** అలా ఎందుకు అన్నారో తరువాత తెలిసింది.ఆరోజు రాత్రి చాలా పెద్ద వానపడడంవల్ల **స్వామివారి దగ్గరనుండి(కలవై నుండి) కాంచీపురం చేరు కోవడానికే రాత్రి పదకొండుగంటలు అయ్యింది. మరునటి రోజు ఉదయం చెన్నై చేరుకో గలిగాము.అంటే సుమారు ఒకటిన్నర గంటల ప్రయాణానికి, ఏడు గంటలు పట్టింది. గత ముప్ఫయిసంవత్సరాలలో, కాంచీపురంలో అత్యంత ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యిందని ఆరోజు పేపర్లలో చెదివాను.**

మూడు రోజుల తరువాత సంవత్సరం క్రితం మానాన్నగారు సంప్రదించిన వరుడు యస్.కె.వైద్యనాథన్ నుండి ఫోను వచ్చింది. అతను ఇప్పుడు పెళ్ళి చేసుకోవాలను కుంటున్నా డని కనుక ఆగష్టు 8న ఇంటికి వస్తానని కబురు చేశాడు. అతను రెండు నిబంధనలతో పెళ్ళి కి ఒప్పుకున్నాడు. వారి తల్లితండ్రుల సమ్మతి కోసం ఉడుమల్లపేట్ లోని వారి తల్లితండ్రుల ఇంటికి మా చెల్లిని తీసుకుని వెళ్ళాలని,రెండవది వారి తల్లితండ్రులు ఒప్పుకుంటే, నిరాడంబరంగా, 'స్త్రీ ధనం' అంటే వరకట్నం లేకుండా పెళ్ళి చెయ్యాలని. ఎంత ముచ్చటైన షరతులో !!

ఇప్పుడు,వారికి వివాహం జరిగి నాచెల్లెలు ఆమె భర్త ఇద్దరు పిల్లలతో బొంబాయి (ముంబై)లో చాలాసంతోషంగా ఉన్నారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

50. పరమాచార్య లీలాద్భుతం

కంచి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారికి నా సోదరుడు గొప్ప భక్తుడు. అప్పుడు స్వామివారు ఆంధ్రప్రదేశ్ లోని మచిలీపట్నంలో మకాం చేస్తున్నారు. స్వామివారి దర్శనం కోసం,ఉపదేశములు వినడం కోసం వేలమంది భక్తులు వస్తున్నారు. అప్పుడు చాలా కష్టాల్లో ఉన్న నాసోదరుడు ఒక మూలన కూర్చుని ఉన్నాడు. స్వామివారి వద్దకు వెళ్లి ఆశీస్సులు పొందాలని కోరికఉన్నా ఆ భక్తుల రద్దీలో వెళ్ళలేక నిస్సహాయుడై అలా ఉండిపోయాడు. హఠాత్తుగా స్వామివారు "దుర్గాప్రసాద్, ఇలా రా!" అని పిలిచారు. తన పేరేంటో తనని ఎలా పోల్చుకున్నారో ఆ దేవుడికి, పరమాచార్య స్వామివారికి మాత్రమే తెలుసు. అప్పటికి ఒక్కసారి కూడా స్వామివారినికలవలేదు నాసోదరుడు. ఆశ్చర్యంతో భక్తులు దారి విడువగా నడుచు కుంటూవెళ్లి, స్వామికి సాష్టాంగంచేసి కన్నీళ్ళతో వారి చరణకమలాలను అభిషేకించాడు. స్వామివారు ఓదార్చి మంచి రోజులు వస్తాయని, ఒక కుమారుడు కూడా కలుగుతాడని ఆశీర్వదించారు. స్వామివారి మాటలు నిజమై తన పరిస్థితి బాగుపడి ఒక కుమారుడు కూడా కలిగాడు. పరమాచార్య స్వామికి కృతజ్ఞతగా వాడికి చంద్రశేఖరన్ అని పేరు పెట్టుకున్నాడు.

మరొక్క అనుభవం నా జీవితంలో జరిగినదే. పరమాచార్య స్వామి వంటి మహాత్ములను నేను గౌరవించేవాడిని కాని, అక్కడున్న భక్తుల రద్దీకి భయపడి వారి వద్దకు వెళ్ళేవాడిని కాను. ఒకసారి స్వామివారి దర్శనానికి వెళ్లాను.1940–50 మధ్య నేను ఉన్నత పాఠశాలలో చదివేవాడిని. కొత్తకొత్త ఆవిష్కరణలు చేసే శాస్త్రవేత్త అవ్వాలని నా కోరిక. అలా ఒకసారి మొటిమలతో బాధపడుతున్న నేను, దానికి మందు కనుక్కోవాలని సాలిసిలిక్ఆసిడ్ ను కర్పూరం,నూనెలతో కలిపి నుదుటన పూసుకున్నాను.దాంతో భరించలేని మంట మొదలయ్యింది. వెంటనే మొహం కడుక్కుని అద్దంలో చూసుకుంటే, దేవుడా! నుదురు పైన చాలా భాగం చర్మం కాలిపోయి, మాంసం కనబడుతోంది. ఏవో కొన్ని లేపనాలు పూసినా చర్మం బాగా కమిలిపోయి, చూడడానికి వికారంగా తయారయ్యింది. మావాళ్ళు భయపడి ఎందరో వైద్యులకు చూపించినా ఫలితం లేకపోయింది.అసలు ఏంజరిగిందంటే,సాలిసిలిక్ ద్రావకం (ఫీనాల్ కాంపౌండ్) కర్పూరంతో కలిసి రసాయనిక చర్య జరిగి కణజాలన్ని కాల్చే ఫీనాల్ విడుదలయ్యింది. ఇది నేను తరువాత చేసిన పరిశోధనలో కనుగొన్నాను. ఏమైతేనేమి చాలా నెలలు గడిచిపోయాయి, మచ్చ అలా మిగిలిపోయింది.

ఒకరోజు రాత్రి నాకు ఒక ఆశ్చర్యకరమైన కల వచ్చింది. మామూలుగా ఉదయం లేవగానే నాకు వచ్చిన కలలను మర్చిపోతుంటాను. కాని అది నాకు బాగా జ్ఞాపకం ఉంది. ఒక ముసలి బ్రాహ్మణుడు, నుదుటన పెద్ద కుంకుమ తిలకంతో నాముందు నిలుచుని, "నాకు తెలుసు. ఈ మచ్చ గురించి నువ్వు బాగా ఆందోళన పడుతున్నావు. ఒక నెలరోజుల పాటు ఉదయాన్నే బావినీళ్ళతో తలస్నానం చెయ్యి. సాయింత్రం పూట నాగేశ్వర స్వామి దేవాలయా

నికి(మా ఇంటి వద్ద ఉంది) వెళ్ళు. మూడు ప్రదక్షిణలు చేసి, తప్పక శివలింగాన్ని దర్శించు. నెలరోజుల తరువాత నీ రూపు నీకు తిరిగొస్తుంది" అని చెప్పారు.

మొదట నేను ఆ కలకి అంత ప్రాముఖ్యతను ఇవ్వలేదు, కాని ఆయన రూపం పదే పదే కళ్ళముందు మెదలసాగేది. ఎందుకు ఆ సలహా పాటించకూడదు అనుకున్నాను. అదేమీ పెద్ద కష్టం ఏమి కాదుకదా! మరుసటిరోజు సూర్యోదయాత్పూర్వమే లేచి, బావి వద్దకు వెళ్లి గజగజలాడే చలిలో చన్నీళ్ళ స్నానం చేశాను. మంచి వేసవిలో కూడా వేడినీటి స్నానం చేసే అలవాటు నాకు. అందువల్ల ఆలస్యంగా లేచేవాడిని. అలాంటి స్థితిలో నేను తెల్లవారుఝామునే లేచి, నవంబర్ చలిలో బావి నీటితో చన్నీటి స్నానం చెయ్యడం మావాళ్ళని ఆశ్చర్యానికి గురిచేసింది. వాళ్ళ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నాను.

సాధారణంగా నేను నాస్తికుడిని, అంతగా భక్తిభావం లేనివాడిని. కనుక చాలా అరుదుగా దేవాలయాలకు వెళ్ళేవాడిని.కాని ముందుగానే నిర్ణయించుకున్నట్టుగా,సాయంత్రం నాగేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లి,మూడు ప్రదక్షిణలు చేసి, శివలింగాన్ని దర్శించు కునేవాణ్ణి. ఏవైనా బలమైన కారణాల వల్లవెళ్ళడం కుదరకపోతే, మరుసటిరోజు వెళ్ళినప్పుడు దేవునికి క్షమాపణ చెప్పి,బాకీపడ్డ ప్రదక్షిణలు కూడా చేసేవాణ్ణి.అలా కలలో బ్రాహ్మణుడు చెప్పినట్టుగా తప్ప కుండా చేశాను.

అన్ని రోజులూ మంచం నుండి లేవగానే ఎంతో ఆశతో అద్దంలో చూసుకునేవాణ్ణి. కాని ఈ ముప్పై రోజులూ ఏమి జరగలేదు సరికదా మెరుగవుతున్నట్టు కూడా కనబడలేదు. కాని నన్ను నమ్మండి, ముప్పైఒకటో రోజు మామూలుగా లేచి అద్దంలో చూసుకుంటే, నన్ను ఆశ్చర్యానందాలకు గురిచేస్తూ, మొత్తం మచ్చ వెళ్లిపోయింది.

నా ముఖం మునుపటిలా అయ్యింది. ఈ విషయం మావాళ్ళందరికీ తెలిపాను. ఎన్నో దశాబ్దాలు గడిచిపోవడంతో, ఈ విషయం మొత్తం మరచిపోయాను. కాని ఈరోజు (25/9/1993) జరిగిన ఒక అద్భుత విషయం వల్ల నలుగు దశాబ్దాల క్రితం జరిగిన ఏ సంఘటనని జ్ఞాపకాల పొరలలో నుండి తవ్వి తీయాల్సివచ్చింది. నిన్న నేను ఒక సెమినార్ కోసం మద్రాసుకు వచ్చాను. 'హిందూధర్మ సంఘం' కార్యదర్శి శ్రీ వి. మీనాక్షిసుందరం ని కలవడానికి నాకు ఇది ఒకఅవకాశం.వారితో దాదాపు గంటసేపు చర్చించాను. ఆ సంభాషణ లో భాగంగా కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారితో నాకు ఉన్న ఒక అనుభవాన్ని వాళ్ళు ప్రచురించబోయే సావనీర్ కోసం చెప్పమని అడిగారు. నాకు అలాంటి వ్యక్తిగత అనుభవం ఏమీ లేదని తెలిపాను. కాని మరలా వారు ఇదే విషయం అడుగగా, నేను లేదని తెలిపి, నా సోదరునికి ఒక అనుభవం ఉందని మొత్తం విషయం వారికి తెలిపాను. వెంటనే దాన్ని ఒకవ్యాసంగా వ్రాసి వారికి పంపమని అడిగారు. తరువాత మీనాక్షి సుందరం గారింట్లో పరమాచార్య స్వామివారి చిత్రాలు కొన్ని చూశాను.

నా బసకు వెళ్తుండగా నా కళ్ళ ముందు స్వామివారి చిత్రం ఒకటి జ్ఞాపకం వచ్చింది. ఆచిత్రాన్ని ఎక్కడో, ఎప్పుడో చూశాను అని అనిపిస్తోంది. కాని ఎక్కడ చూశానో గుర్తురావడం లేదు. నా ఆలోచనలన్నీ ఆ చిత్రం గురించే. గదిలోకి వచ్చి ఆలోచనల్లో పడ్డాను. హఠాత్తుగా నలభైఏళ్ళ క్రితం నా కలలో కనబడిన బ్రాహ్మణ స్వామి ముఖం కళ్ళ ముందు మెదలాడింది. అద్భుతాలకే అద్భుతం! అవును! అదే చిత్రం! మీనాక్షిసుందరం ఇంటినుండి వస్తున్నప్పుడు కూడా నా కళ్ళకు కనిపించిన చిత్రం కూడా అదే. నాలుగు దశాబ్దాల తరువాతా కూడా నాకు ఆ బ్రాహ్మణ స్వామి బాగా గుర్తు. నిజానికి ఆ వయస్సులో నాకు మహాస్వామి వారి గురించి ఏమీ తెలియదు. కాని స్వామివారే నా కలలో కనబడి నా ఆర్తిని తీర్చి, బాధను పోగొట్టారు. అందుకే అంటారు దేవుని లీలలు అత్యద్భుతాలు. ఇంతటి కరుణ నేను పొందడానికి ఎవరు కారకులో మరి.

కాకతాళీయమో ఏమో, మా ఇంటిపేరు 'కంచి'. నా పేరులోని మొదటి అక్షరం ఇదే. మా తాతముత్తాతలు కంచి నుండి వచ్చినవారే. బహుశా ఈ 'కంచి' సంబంధమే నన్ను పరమాచార్య స్వామివారి చరణకమలాల వద్దకు తెచ్చిందేమో. 'నడిచే దేవుడి' గా ప్రసిద్ధి నొందిన పరమాచార్య స్వామివారి అనుగ్రహాన్ని పొందడం నా అదృష్టం. మనం భగవంతుణ్ణి చూడాలి అనుకుంటే ఆయనే మనపై దయతలచి మన పంచేద్రియాలకు అగుపడే రూపాన్ని ధరించి రావాలి. అలా భక్తుల కోసం వచ్చిన దేవుడే మన పరమాచార్య స్వామివారు.

– కె. ఆర్. కె మోహన్, "kamakoti.org" నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదాస్వహం ॥

51. ఇప్పుడు 'శ్రేష్టిదార్' అని పిలవొచ్చునా?

నేను కాంచీపురంలోనే ఉండడంవల్ల ప్రతిరోజూ మహాస్వామివారి దర్శనభాగ్యం దొరికేది. ఒకసారి శ్రీమఠంలో ఎదో ఆరాధన సందర్భంగా కావల్సినంత మంది వైదికులు దొరకకలేదు.స్వామివారు నాపేరు సిఫారసు చేసి, వేరేవాళ్లతో పాటుగా ఆ కార్యక్రమంలో వైదికునిగా పాలుపంచుకునే భాగ్యాన్ని నాకు ప్రసాదించారు.భోజనాలు అయినతరువాత నన్ను పిలిచి ,ఆ ఆరాధనలో వైదికునిగా పాల్గొన్నదానికి పరిహారంగా సహస్రగాయత్రి చెయ్యమన్నారు.

చెంగల్పేట్ న్యాయాలయానికి బదిలీ అవ్వడంతో నాకు పరమాచార్య స్వామివారి దర్శన భాగ్యం తగ్గిపోయింది. కాబట్టి ప్రత్తి నెల అనుషం (స్వామివారి జన్మ నక్షత్రమైన అనూరాధ నక్షతం) రోజు కాంచీపురానికి వెళ్ళి కామాక్షి అమ్మవారి ఆలయంలో త్రిశతి అర్పన చేయించి,ప్రసాదాన్ని పరమాచార్యవారికి సమర్పించి వారిని దర్శించు కొనేవాణ్ణి. ఒకసారి

అలా వెళ్ళగా శ్రీమఠం ఆరోజు భక్తులతో చాలా రద్దీగా ఉంది. దర్శించుకుని బయటకు వచ్చే భక్తులవద్ద ఉన్నాను నేను. మహాస్వామివారు, దగ్గర ఉన్న సేవకునితో, "ఆ శ్రేష్టీదార్ ని పిలుపు"అని ఆదేశించారు.కొంతమంది,మాగుంపువైపు"శ్రేష్టీదార్ శ్రేష్టీదార్" అని అరిచారు ఎవరో నన్ను తీసుకునివెళ్ళి, మహాస్వామివారి ముందు నిలబెట్టారు. వారు స్వామి వారితో "శ్రేష్టీదార్ ఎవరూ లేరు స్వామీ, కోర్టు నుండి ఈపెద్ద గుమాస్తా మాత్రం ఉన్నారు" అని చెప్పారు. నేను స్వామితో, "పెరియవ, నేను శ్రేష్టీదార్ ను కాను, హెడ్ క్లర్క్ ని" అని, చెప్పాను.

కాని స్వామివారు పట్టుబట్టి "ఎందుకు నువ్వు శ్రేష్టీదార్ కాకూడదు?" అని అడిగారు.

నేనూ ఖచ్చితంగానే సమాధానం చెప్పాను. "నాకు దానికి కావాల్సిన విద్యార్హతలు లేవు. నేను కేవలం SSLC ముగించాను. నా కిందన ఉన్నవాళ్ళు, న్యాయశాస్త్రంలో BA.,BL, MA.,BL. మొదలైనవి పూర్తిచేసినవారు. కాబట్టి విదార్హతలను బట్టి నాకు రాదు. అదీగాక, బెంచిలో ఉన్న జిల్లా న్యాయాధికారి పరమ కఠినుడు, కనుక, నా పేరును సిఫారసు చెయ్యడు. కాబట్టి,నేను శ్రేష్టీదార్ ను కాలేను" అని చెప్పాను. స్వామివారు నాకు వెళ్ళడానికి అనుమతి నిచ్చారు.

కొన్నిరోజుల తరువాత చెన్నై న్యాయాలయం నుండి కొంతమంది తనిఖీకి వచ్చారు. వారునా శక్తి సామర్థ్యాలను పరిశీలించి, హైకోర్టు జడ్జీ కి ఒక రహస్య నివేదిక సమర్పించారు. కొన్నిరోజుల తరువాత నన్ను శ్రేష్టీదార్ గా చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. అందరికి ఆశ్చర్యం కలిగింది ఇది ఎలా సాధ్యం అని. కేవలం విద్యార్హ తలను బట్టే ఉన్నత పదవులిస్తారు అనుకునే వారికి ఇది ఒక గుణపాఠం.

ఈలోగా , నేను తరువాతి అనుషానికి కాంచీపురం వెళ్ళాను. పరమాచార్య స్వామివారి ముందు కామాక్షి అమవారి ప్రసాదం పెట్టగానే స్వామివారు చెయ్యెత్తి తమ తలపై ఉంచుకుని శ్రేష్టీదార్('హెడ్'– 'చీఫ్') అని అర్ధం స్ఫురించేట్టుగా నాకు చూపిస్తూ "ఇప్పుడు నిన్ను శ్రేష్టీదార్ అని పిలవొచ్చునా? అని అడిగారు. స్వామివారు అలా అనగానే నా వొళ్ళు గగుర్పా టుకు గురి అయ్యింది. నేను ఏమీ మాట్లాడలేకున్నాను. నేను చెయ్యగలిగింది 'దైవం మానుష రూపేణా అన్నట్టుగా నా ఎదురుగాఉన్న సర్వేశ్వరునికి సాష్టాంగంచేసి నా కన్నీళ్లతో వారి పాదపద్మము లను కడగడమే. వారే నాకు ఉద్యోగోన్నతి కల్పించినవారు. జరగబోయేది ఏమిటో ఆ దైవానికే తెలును అని ఆరోజే నాకు అర్ధమయ్యింది.

––పి. కె . రామనాధన్ , చెన్నై ,మహాయపెరియవళ్ –దరిశన అనుభవంగళ్

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదాన్వహం ॥

52. పూల కిరీటం–పండిత గౌరవం

సదాశివం సేలంలో నివసించే ఒక బ్రహ్మచారి యువకుడు. మహాస్వామి వారిపై అతనికి ఎనలేని భక్తి ఒక భోజనశాల గదిలో అద్దెకు నివసించేవాడు.

సేలంలోని కంచి మఠంలో 1990లో ఒక పెద్ద యాగం జరిగింది. దాదాపు అరవైమంది వేద పండితులను, విద్వాంసులను దూరప్రాంతాల నుండి పిలిపించారు. ఆ యాగం పదకొండు రోజుల పాటు జరిగింది. ఆ యాగానికి కావాల్సిన పూలను సర్దుబాటు చెయ్యడం సదాశివం బాధ్యత.

సశాస్త్రీయంగా వైదికనిష్ఠతో ఆ క్రతువు ముగిసింది. నిర్వాహకుల తదువరి కర్తవ్యం, మరుసటి రోజు ఆ తీర్థకలశాలను, యాగరక్షను మహాస్వామి వారికి సమర్పించి వారి ఆశీర్వాదం పొందటం. ముగ్గురు ప్రముఖులతో కలిసి వైదిక పండితుల బృందం మూడు వాహనాల్లో కాంచీపురానికి బయలుదేరారు. మొత్తం హోమానికి పూలను సమకూర్చి,పూల అలంకారాలను చేసిన సదాశివం కూడా వారితో బయలుదేరాడు. కాంచీపురం వెళ్ళే మారగమంతా బాగా వర్షం పడుతోంది. కొన్ని గంటల ప్రయాణం తరువాత వారు హోమ భాగాలతో కంచి చేరుకున్నారు.

మహాస్వామి వారిని దర్శించుకుని వారు తెచ్చిన కలశ తీర్థంతో పాటు హోమ భాగములన్నిటిని పరమాచార్య స్వామి ముందు పెట్టారు. వాటిని చూడగానే మహాస్వామి వారు మహాదానందపడ్డారు. ఎందుకంటే వారికి మాత్రమే తెలుసు జరిగిన ఆ యాగము యొక్క ఫలము, బలము ఎంతటిదో. మహాస్వామి వారు లోపలికి వెళ్ళిప్రధాన కలశ జలాన్ని తీసుకురమ్మన్నారు. వాటిని అందుకుని కొన్ని మంత్రములు చెప్పి తలపై చెల్లుకున్నారు. మరల బయటకు వచ్చి, వారి కోసమని తెచ్చిన ఒక పెద్ద పూలమాలను వారి మెడలో అలంకరించుకున్నారు. తరువాత ఆ పూలమాలతో పాటు తెచ్చిన ఒక పూల కిరీటాన్ని చేతిలోకి తీసుకుని దాన్ని కొద్దిసేపు పరిశీలనగా చూసారు. అది చాలా బాగా అలంకరింపబడి ఉంది.

“ఎవరు చేసారు దీన్ని?” అని మహాస్వామి వారు అడిగారు. వాహనాల్లో వచ్చిన వారు సమాధాన పూర్వకంగా సదాశివం వైపు చెయ్యి చూపించారు. నడుముకు లుంగి చుట్టుకుని పైన ఎర్ర చొక్కా చేసుకున్న అతను గుంపు నుండి ముందుకు వచ్చాడు. పరమాచార్య స్వామివారు ఆ పూల కిరీటాన్ని తమ తలపై ఉంచుకుని, పెదవుల పై చిరునవ్వుతో “నాకు బాగా అనిపిస్తోందా?” అని అడిగారు

ఆనందంలో ఏమి మాట్లాడాలో తెలియక చుట్లూ ఉన్నవారు. బాగుందన్నట్లు తల పంకించి, పరమాచార్య స్వామి వారికి సాష్టాంగం చేసారు. ఈలోగా సదాశివం తన చొక్కా విప్పి, ముందుకువెళ్ళి మహాస్వామి వారి ముందు నిలుచున్నాడు. శ్రీవారితో ఏమి చెప్పాలో అతనికి తెలియదు. చేతులు కట్టుకుని వారి ముందు నిలబడ్డాడు. కళ్ళల్లో నుండి కన్నీరు ఉబికి వస్తూ ఉంది. పరమాచార్య స్వామివారు వారి తలపై నుండి ఆ పూల కిరీటం తీసారు. సదాశివాన్ని చూసి చిన్నగా నవ్వి కొద్దిగా ముందుకు వొంగమన్నారు. వెంటనే తమ చేతులలో ఉన్న ఆ కిరీటాన్ని అతని తలపై ఉంచారు. అహా ఎంతటి అదృష్టం!

అక్కడున్న వారందరికి తన్మయత్వంతో ఒళ్ళు పులకరించింది. అప్పటి దాకా పండితులు, విద్వాంసులకు మాత్రమే మహాస్వామి వారు తమ స్వహస్తాలతో పూల కిరీటం పెట్టి గౌరవించేవారు. బహుశా తనను పూలతో ఇలా ఆరాధించి పూజిస్తున్న ఇతనికి కూడా ఆ గౌరంవం ఇవ్వాలని అనిపించిందేమో స్వామివారికి!

--. రా, వేంకటసామి, శక్తి వికటన్' జులై 17, 2004 ప్రచురణ

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

53. ఆయుర్వేదవైద్యం – బొమ్మలకొలువు

అది మహారాష్ట్రలోని సతారాలో ఉత్తర చిదంబరం శ్రీ నటరాజ స్వామి వారి దేవాలయం కడుతున్నప్పటి రోజులు. మహాస్వామి వారు అక్కడే ఉంటూ అన్నీ స్వయంగా పర్వవేక్షిస్తున్నారు.పరమాచార్య స్వామి వారి దర్శనానికి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు.

ఒకనాటి ఆదివారం మద్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ముప్పై సంవత్సరముల వయస్సుగల ఒక యువకుడు మహాస్వామి వారికి సాష్టాంగం నమస్కారం చేసి నుంచున్నాడు. అతని కళ్ళల్లోకన్నీటి ధారను మహాస్వామి వారు చూసి ప్రేమతో "ఏమప్పా! ఎవరు నీవు? ఎక్కడనుండి వచ్చావు? నీకళ్ళల్లో ఆ తడి ఎందుకు?" అని అడిగారు. అతను ఏ సమాధానమూ చెప్పకుండానే పెద్దగా ఏడవటం మొదలుపెట్టాడు. చుటూ ఉన్న వారు అతళ్ళి ఊరడించి మహాస్వామి వారి ముందు కూర్చోపెట్టారు.

"ఎక్కడినుండి వచ్చావు అప్పా? అని మహాస్వామి అడిగారు. "పాలక్కాడ్ కేరళ"

వెంటనే మహాస్వామి వారు "పాలక్కాడ్ నుండి ప్రయాసపడి ఇక్కడిదాకా వచ్చావా? అని అడిగారు.

"అవును స్వామీ మీకొసం అక్కడినుండి వచ్చాను"

"సరే. నీ పేరు ఏంటి?"

"హరిహర సుబ్రమణియన్"

"చాలా మంచి పేరు. మీ తండ్రి గారు ఏం చేస్తుంటారు?" అని అడిగారు. "మా తండ్రి గారు ఇప్పుడు శరీరంతో లేరు. వారు పాలక్కాడ్ లో ఆయుర్వేద వైద్యుడు. వారి పేరు డా. హరిహర నారాయణన్"

అతను ముగించక ముందే మహాస్వామి వారు కుతూహలంగా "ఓ నువ్వు పాలక్కాడ్ ఆయుర్వేద వైద్యులు హరిహర నారాయణన్ కుమారుడవా. మంచిది! సరే చెప్పు. అలా అయితే నువ్వు డా.హరిహర రాఘవన్ గారి మనవడివి కదూ! వారందరూ ఆయుర్వేద వైద్యంలో మంచి పేరుసంపాయించారు" అని చెప్తూ వచ్చిన అతజ్ఞి పరిశీలనగా చూస్తూ కనుబొమ్మలు పైకెత్తారు. "అవును స్వామీ" సమాధానమిచ్చాడు ఆ యువకుడు.

మహాస్వామి వారు నవ్వుతూ 'భేష్! ఉన్నతమైన వైద్య వంశం మీది. అది సరే నువ్వు నీ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోలేదా?' అని అన్నారు. "నేను అది చెదవలేదు స్వామీ. మా తండ్రి గారు నన్ను ఆ మార్గంలో పెంచలేదు" కొంచం నిర్లక్ష్యంగా అన్నాడు. "నువ్వు అలా చెప్పరాదు. మీ తండ్రిగారు చెప్పించలేదా లేదా నీకే దానిపైన శ్రద్ధ లేదా?"
అతను ఏమి చెప్పలేదు. "అంతటి మహా వైద్యుల వంశంలో పుట్టి నువ్వు నేర్చుకునే భాగ్యం పోగొట్టుకున్నావు. సరే ఎంతదాకా చదువుకున్నావు? అడిగారు మహాస్వామి వారు. "తొమ్మిది దాకా స్వామీ"
"ఏం మరి చదువుకోవాలని అనిపించలేదా"
"ఏమో నాకు అప్పుడు అనిపించలేదు. కాని ఇప్పుడు చింతిస్తున్నాను."
"నీకు వివాహం అయ్యిందా?"
"అయ్యింది స్వామీ. మాకు ఏడు సంవత్సరముల కూతురు ఉంది"
"సరే. ఇప్పుడు ఏమి చేస్తున్నావు"

అతని కళ్ళల్లో నుండి నీరు జారసాగింది. "నాకు మంచి చదువు లేకపోవడం వల్ల మంచి ఉద్యోగం లభించలేదు స్వామీ. నేను ఒక రైస్ మిల్లులో సూపర్వైజర్ గా పనిచేస్తున్నాను. నా జీతం ఏడువందల రూపాయలు. దాంతోనే మా కుటుంబం గడుస్తోంది."
"ఓహో అలాగా? సరే నీకు మీ పూర్వీకులు స్వంత ఇల్లు వదిలివెళ్ళారా?"

అతను కళ్ళు తుడుచుకుంటూ "మా తాత గారు ఒక ఇంటిని కట్టించారు. నేను ఇక్కడకి రావటం ఆ ఇంటి గురించే స్వామీ. కాలా ఏళ్ళ క్రితం మా అత్తయ్య (నాన్న గారి చెల్లెలు) భర్త చనిపోవడంతో తన ఇద్దరు కూతుళ్లను తీసుకుని పాలక్కాడ్ వచ్చింది. నవరాత్రులప్పుడు మా నాన్న గారు మేము ఉన్న ఇంటిని 25వేల రూపాయలకు తాకట్టుపెట్టారు. మా అత్తగారి పిల్లల పెళ్ళిళ్ళు చేసారు. తరువాత మానాన్న మా అత్త ఇద్దరూ కాలం చేసారు"

"స్వామీ నా బాధ ఏంటంకే నవరాత్రి సమయంలో లక్ష్మీకారకరం అయిన ఇంటిని తాకట్టు పెట్టి పోయారు. ఇప్పుడు ఆ అప్పు 45వేల రూపాయలు అయ్యింది. ఇక ఇల్లు నా నుండి వెళ్ళిపోతుంది"

పరమాచార్య స్వామివారు ధ్యానంలోకి వెళ్ళారు. కొద్దిసేపటి తరువాత చిరువవ్వుతో "సరే ప్రతి నవరాత్రికి నువ్వు ఇంట్లో బొముల కొలువు పెడుతున్నావు కదూ?"

"లేదు స్వామీ. మా తండ్రి గారు ఉన్నప్పుడు పెప్పేవారం. వారు వెళ్ళిపోయిన తరువాత నేను పెట్టడంలేదు"

మహాస్వామి వారు ఆ మాటలకు అడ్డుపడుతూ "పూర్వీకుల గురించి నువ్వు అలా మాట్లాడకూడదు.వారు చాలా గొప్పవారు. నాకు తెలుసు. వారు చాలా మంచి పనులు చేసి వెళ్ళిపోయారు. నువ్వు మనసులో ఏదో పెట్టుకుని తరతరాలుగా వస్తున్న ఆచారాలను వదలరాదు. మరొక్క వారంలో నవరాత్రి మొదలు అవుతుంది. పాలక్కాడ్ లోని మీ ఇంటిలో బొమ్మలు కొలువు పెట్టి దేవిని ఆరాధించు. నీ కష్టాలు తీరి ఊరట లభిస్తుంది" అని చెప్పి అతనికి ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించి పంపించారు.

ఇరవై రోజులు గడిచాయి. ఆ రోజు ఆదివారం. సతారా లో మహాస్వామి దర్శనార్థం చాలా మంది భక్తులు వచ్చారు. శ్రీమఠం పరిచారకుడు ఒకరు ఆ భక్తుల మధ్యలో (త్రోవ చేసుకుంటూ ఒక 60 – 65 సంవత్సరముల వయస్సు ఉన్న ఒక పెద్దాయనను తీసుకుని వచ్చాడు. వారు కాషాయ వస్త్రములు ధరించి మెడలో ఎన్నో తులసి, రుద్రాక్ష మాలలు ధరించి వున్నారు. ఆయన మహాస్వామి వారికి సాష్టాంగం చేసి హిందీలో మాట్లాడారు. పరమాచార్య స్వామివారు కూడా అతనితో హిందీలో మాట్లాడి తమ ఎదురుగా ఉన్న వేదిక పైన కూర్చోమన్నారు.

కొద్దిసేపటి తరువాత పాలక్కాడ్ హరిహర సుబ్రమణియన్ వచ్చి మహాస్వామి వారికి నమస్కరించాడు. అతని చేతిలో చిన్న ట్రంకు పెట్టె ఉంది. మహాస్వామి వారు అతని చేతిలోని ట్రంకు పెట్టెని చూసారు. ఆ యువకుడు ఆ డబ్బా తెరిచి అందులో ఉన్న పట్టు బట్టలో చుటబడియున్న కొన్ని తాళపత్రాలను బయటకు తీసాడు. మహాస్వామి వారు ఏమి తెలియనట్టు ఏంటవి అన్నట్టుగా చూసారు.

అతను అమాయకంగా "మీరు ఈ సంవత్సరం నుండి బొమ్మల కొలువు పెట్టమని నాకు అనుజ ఇచ్చారు. నేను బొమ్మల కోసం వెతికితే నాకు ఈ డబ్బా దొరికింది. నేను ఎప్పుడూ దీన్ని చూడలేదు.

నేను తెరచి చూసి అందులో ఉన్న భాష అర్థం కాక ఇక్కడకి తెచ్చాను"

మహాస్వామి వారు నవ్వుతూ తమ ఎదురుగా కూర్చొని ఉన్న ఆ కాషాయ వ్యస్తధారిని చూసి హిందీలో "కొద్దిసేపటి ముందు నువ్వు నన్ను అడిగిన ఆ అపూర్వ వస్తువు వచ్చింది. వచ్చి చూడు" అని అన్నారు. అతను కింద కూర్చుని ఆ తాళ పత్రాలను నిశితంగా

పరిశీలించసాగాడు. అతని మొహం ఆనందమయమైంది. వాటిని ఎత్తుకుని తలపై ఉంచుకొని ఆనందంతో గట్టిగా ఓ పరమ ఆచార్య పురుషా! ఈ అపూర్వ అయుర్వేద [గ్రంథం కోసం ఎన్నో ఏళు?గా వెతుకుతున్నాను. నువ్వు ప్రత్వక్ష దైవానివి. అరగంటలో నేను అడిగినదాన్ని నాకు ప్రసాదించావు. నేను ధన్యుణ్ణి " అని పరమాచార్య స్వామి వారికి సాషాంగ నమస్కారం చేశాడు.

హరిహర సుబ్రమణియన్ ఏమి అర్థం కాక అలా నిలుచుండిపోయాడు. మహాస్వామి వారు దగ్గరకు పిలిచి "ఇతను పండరీపురం నుండి వచ్చిన ఆయుర్వేద సిద్దాంతి. అరగంట క్రితం తను ఒక అపూర్వ గ్రంథం కోసం వెతుకుతున్నానని నాతో చెప్పాడు. నా మనస్సుకు ఏదో తోచినట్టయ్యి కొద్దిసేపు వేచియుండమని చెప్పాను. తరువాత నువ్వు ఈ ట్రంకు పెక్కెతో వచ్చావు. వారికి ఇవి ఉపయోగపడతాయి. నీ తండ్రిని తాతని తలచుకొని నీ చేతులతో వాటిని ఆయనకు ఇవ్వు అని ఆజ్ఞాపించారు .

ఆ యువకుడు శ్రీవారు చెప్పినక్కే చేశాడు. వాటిని తీసుకుంటున్నప్పుడు ఆ పెద్దమనిషి కళ్ళలో ఆనందభాష్పాలు రాసాగాయి. అతను ఆ యువకుడితో "నీ వల్ల నాకు ఒక అపూర్వ గ్రంథము దొరికింది. దానికి నేను వెల కట్టలేను. అలాగని ఈ అపూర్వ సంపదని ఉచితముగా తీసుకోలేను" అని ఒక పళ్ళాంలో యాభైవేల రూపాయలు, పళ్ళు ఉంచి వినయంగా ఇచ్చాడు. ఆ యువకుడు మహాస్వామి వారి వంక చూసాడు. శ్రీవారు చిరునవ్వుతో తీసుకుమ్మన్నారు. వణుకుతున్న చేతులతో అతను దాన్ని అందుకున్నాడు. మహాస్వామి వారు దగ్గరకు పిలిచి "నువ్వు నీ పూర్వీకుల గురించి తప్పుగా మాట్లాడినప్పుడు నేను నీకు ఏమి చెప్పానో గుర్తుందా? వారు చాలా గొప్పవారు. చాలా మంచి పనులు చేసారు. చూసావా బొమ్మల కొలువు పెట్టినందుకు నీకు ఇది దొరికింది. ఇంటి అప్పు 45వేలు అన్నావుగా! చంద్రమౌళీశ్వరుడు నిన్ను అనుగ్రహించాడు. పాలక్కాడ్ కి తిరిగి వెళ్ళు. డబ్బు జాగ్రత్త" అని చెప్పి ఆశీర్వదించి పంపించారు.

-- శ్రీ రమణి అన్న, 'శక్తి వికటన్' జూన్ 14, 2007 ప్రచురణ.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

54. వేదాధ్యయనం – విదేశీయానం

1968లో కుంబకోణం శ్రీ రంగరాజచారి పరమాచార్య స్వామి యొక్క పరిపూర్ణ కటాక్షంలో మునిగిపోయారు. 1971లో బుగ్వేద అధ్యయనం పూర్తైన తరువాత, జీవనాధారం కోసం వైదిక వృత్తి చేపట్టాలని భావిస్తే, అందుకు పరమాచార్య స్వామివారు తమ అంగీకారాన్ని తెలపలేదు.

"నీ వేద విద్యార్జనకు నేను తగిన ఏర్పాట్లు చేస్తాను. నీ విద్యార్జన కొనసాగించు" అని స్వామివారు తెలిపారు. ప్రతి నెలా రెండు వందల రూపాయలు రంగరాజచారి కుటుంబానికి అందేట్టు, స్వంతంగా వండుకోవడానికి కావాల్సిన సంభారాలు కూడా ఏర్పాటు చేశారు. రంగరాజచారి గారిది పెద్ద కుటుంబం. కేవలం పరమాచార్య స్వామివారి ఆశీస్సులతోనే అందరి ఆడపిల్లల పెళ్ళిళ్ళూజరిగాయి.

మహాస్వామివారు పండరీపురంలో మకాం చేస్తున్నప్పుడు, రంగరాజచారి స్వామివారిని దర్శించుకుని సాష్టాంగం చేసి నమస్కరించారు. అప్పుడు మహాస్వామివారు, "నువ్వు నాకు సాష్టాంగం చెయ్యొచ్చా?" అని అడిగారు.

మా సంప్రదాయం ప్రకారం, యజ్ఞోపవీతము, శిఖ లేని సన్యాసిని చూస్తే స్నానం చెయ్యాలి" అని రంగరాజచారి బదులిచ్చాడు.

"అలా అయితే, మరి నా ముందర ఎందుకు సాష్టాంగం చేశావు?"

"ఈ స్వరూపము విష్ణు స్వరూపమే అని నాకు అనిపించింది" అని భక్తితో బదులిచ్చాడు. ఈ శీవైష్ణవ భక్తశిఖామణి జీవితంలో పరమాచార్య స్వామి అనుగ్రహంతో ఒక అద్భుతం జరిగింది. రంగరాజచారిది పేద కుటుంబం. వారి ఆదాయంతో సభ్యులందరినీ చూసుకోవడం కూడా వీలు కాని పరిస్థితి. ఆడపిల్లల పెళ్ళిళ్ళుకు డబ్బు కూడా అవసరం. ఇటువంటి స్థితిలో వారికి ఒక మంచి అవకాశం వచ్చింది. 1978లో వేద విద్యాభ్యాసం ముగియగానే, వారిని జర్మని రమ్మని కొందరు ఆహ్వానించారు.

అంతటి కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న సమయంలో జర్మని అవకాశాన్ని, నేలకు మూడువేల రూపాయల సంపాదనని ఎలా కాదనగలరు. ఈ డబ్బుతో పాటు మూడేళ్ళ తరువాత మూడు లక్షల రూపాయలు అందుతుంది. కనుక రంగరాజచారి ఈ అవకాశాన్ని ఒప్పుకోవడంలో ఆశ్చర్యం ఏమి లేదు.

ఈ అవకాశాన్ని ఇచ్చినతనికి అన్ని ఏర్పాట్లు చూసుకోమని చెప్పాడు. ప్రయాణానికి కావాల్సిన ఏర్పాట్లలో మునిగిపోయాడు. అదే సంవత్సరం అక్టోబరు 31న బోంబే నుండి బయలుదేరడానికి నిర్ణయించుకున్నాడు. ఇంత జరిగినా ఈ విషయాలేవీ ఇతరులకు తెలియనివ్వలేదు. అక్టోబరు 27న తన తండ్రికి విషయం తెలపడానికి గ్రామానికి వెళ్ళాడు.

"పరమాచార్య స్వామివారి అనుమతి తీసుకున్నావా?" అని అడిగారు అతని తండ్రి. "లేదు, నాకు తెలిసి, వారు అనుమతి ఇవ్వరు. స్వామివారు అనుమతించకపోతే, ఇంత డబ్బులు వచ్చే ఈ ప్రతిపాదనని నేను కాదనలేను. వెళ్ళడానికి నేనే నిర్ణయించుకున్నాను. మనకు డబ్బు అవసరం చాలా ఉంది. నాకు ఇంకొక మార్గం కనపడడం లేదు, అని చెప్పాడు.

ఆరాత్రికి తన ఊళ్లోనే ఉండిపోయాడు. రాత్రి మూడు గంటలప్పుడు, నిద్ర రాక మంచంపై అటు ఇటు దొర్లుతున్నాడు. అప్పుడు కళ్ళ ముందు మహాస్వామివారు ఉన్నట్లుగా లీలగా కనపడుతోంది. దగ్గరకు వచ్చి తనని తాకినట్టుగా తనకు అనుభూతి కలిగింది. తన తల్లి అడిగినట్టుగానే, "వెళ్ళడానికే నిర్వయించుకున్నావా? అని అడిగినట్టు అనిపించింది. అది కలో, నిజమో అర్ధం కావడంలేదు. ఆలస్యం చేయకుండా మరునటిరోజే పరమాచార్య స్వామివద్దకు వెళ్లి అనుమతి పొందాలని భావించాడు.

అప్పుడు పరమాచార్య స్వామివారు కర్ణాటక రాష్ట్రం, బాదామి దగ్గరలోని బనశంకరి అనే చోట మకాం చేస్తున్నారు. అక్కడకు చేరుకోగానే స్వామివారి దర్శనానికి ముందు, స్నానం చేస్తున్నాడు. అప్పుడు పరమాచార్య స్వామివారి సహాయకులొకరు వచ్చి, "దర్శనం చేసుకోమని పరమాచార్య ఆదేశించారు" అని చెప్పాడు. తను వస్తున్న విషయం కాని, వచ్చిన కారణం కాని ఎవరికీ తెలియదు. కాని మహాస్వామివారు. కబురుచేయడంతో ఆశ్చర్యపోయాడు. అదే ఆశ్చర్యంతో వెళ్లి స్వామివారి ముందు నిలబడ్డాడు. "ఎప్పుడు బయలుదేరుతున్నావు?" అని అడిగారు స్వామివారు.

"ఎప్పుడు బయలుదేరుతున్నావు?" అని అడిగారు స్వామివారు. స్వామివారు ఎప్పుడు అనుమతిస్తే అప్పుడు అని బదులిచ్చాడు, స్వామివారు తన తిరుగు ప్రయాణం గురించి అడుగుతున్నరేమో అనుకుని. "నీవున్నచోటికి తరిగి వెళ్లే విషయం గురించి నేను అడగడం లేదు. విదేశాలకు వెళ్ళడానికి అన్నీ సిద్ధం చేసుకుంటున్నావు కదా! దాని గురించి ఎప్పుడు అని అడుగుతున్నా"

ఆ మాటలు విని నిశ్చేష్టుడయ్యాడు. ఇంకా ఆ విస్మయం నుండి తేరుకునే లోపే, పరమాచార్య స్వామివారు ఇంకొక విషయం తెలిపారు. "నువ్వు ఇక్కడకు రావడానికి కారణమేంటో చెప్పనా? మొన్న నేను వచ్చి నిన్ను అడిగాను, "వెళ్ళడానికే నిశ్చయించుకున్నావా?" అని. అందుకే వెళ్లబోయేముందు ఇక్కడకు వచ్చావు. అంతేనా? అని అన్నారు.

ఆరోజు జరిగినది కల కాదని, నిజంగా స్వామివారే వచ్చి ఆశీర్వదించారని తెలుసుకున్న తరువాత రంగరాజచారి భావోద్వేగానికి గురయ్యాడు.

నీ మంచి నడతను కొనసాగించు... డబ్బు అవసరం లేదు... మంచి నడవడిక ముఖ్యం. అని చెప్పి, తమ దివ్య పాదచారణాలను ఆ భక్తుని తలపై ఉంచి కరుణతో ఆశీర్వదించారు. ఇది అద్భుతం కదా!

ఒక సాంప్రదాయస్తుణ్ణి విదేశాలకు వెళ్ళకుండా ఆపారు స్వామివారు.
ధర్మం యొక్క సాకార రూపమైన మన స్వామివారు తన భక్తులను ధర్మ మార్గంలో పయనించడానికి అనుకూలంగా అనుగ్రహాన్ని ప్రసరిస్తారు.

--- "శ్రీ పెరియవ మహిమై పత్రిక నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥



కనకధారా స్తోత్రమ్

శ్రీ ఆదిశంకరాచార్య విరచితము

(శ్రీ నండూరి శ్రీనివాస్ గారిచే సూచింపబడిన క్రమములో..)

సంకల్పం

కమలే ! కమలాక్ష వల్లభే !త్వం కరుణాపూర తరంగితై రపాంగైః !
అవలోకయ మాం అకించనానాం ప్రథమం, పాత్రం అకృతిమం దయాయాః !!- 1
కమలాసన పాణినా లలాటే, లిఖితాం అక్షరపంక్తిం అస్యజంతోః
పరిమార్జయ మాతఃఅంఘ్రినాతే, ధనిక ద్వారనివాస దుఃఖదోగ్ధీం!!- 2

గణపతి ప్రార్థన

వందే వందారు మందారం ఇందిరానంద కందలం
అమందానంద సందోహబంధురం సింధురాననం!!- 3

ధ్యానశ్లోకం

దిగ్ఘ స్తిభిః కనకకుంభముఖావ సృష్టస్వర్వాహినీ, విమలచారు జలాప్లుతాంగీం !
ప్రాతర్నమామి జగతాం జననీం,అశేష లోకధినాథగృహిణీం అమృతాబ్ధిపుత్రీం !!- 4

కనకధారాస్తోత్రం

అంగంహరేః పులక భూషణమాశ్రయంతీ,భ్రుంగాంగనేవ ముకులాభరణం తమాలమ్!
అంగీకృతాఖిల విభూతి రపాంగలీలా,మాంగల్యదాస్తు మమమంగళ దేవతాయాః !!- 1
ముగ్ధా ముహుర్విదధతీ వదనే మురారేః,ప్రేమత్రపా ప్రణిహితాని గతాగతాని !
మాలాదృశోర్మధు కరీవ మహోత్పలేయా,సామేశ్రియం దిశతుసాగర సంభవాయాః !!- 2
విశ్వామరేంద్ర పదవిభ్రమ దానదక్షం, ఆనందహేతురధికం మురవిద్విషోపి!
ఈషన్నిషీదతుమయి క్షణమీక్షణార్ధం, ఇందీవరోదర సహోదరమిందిరాయాః !!- 3
ఆమీలితాక్ష మధిగ్యమ్య ముదాముకుందమ్, ఆనందకంద మనిమేషమనంగ తంత్రం!
అకేకరస్థిత కనీనిక పక్ష్మనేత్రం, భూత్యై భవేన్మమ భుజంగ శయాంగనాయాః !!- 4
కాలాంబుదాలి లలితోరసి కైటభారేః, ధారాధరే స్ఫురతియా తటిదంగనేవ !
మాతుః సమస్త జగతాం మహనీయమూర్తిః, భద్రాణిమే దిశతు భార్గవనందనాయాః !!- 5
బాహ్యంతరే మురజితఃశ్రిత కౌస్తుభేయా, హారావళీవ హరినీలమయీ విభాతి !
కామప్రదా భగవతోపి కటాక్షమాలా, కళ్యాణ మావహతుమే కమలాలయాయాయాః !!- 6

ప్రాప్తం పదం ప్రథమతః ఖలు యత్ప్రభావాత్, మాంగల్యభాజి మధుమాథిని మన్మథేన!
మయ్యాపతేత్తదిహ మంథర మీక్షణార్థం, మందాలసంచమకరాలయ కన్యకాయాః !!- 7

గమనిక : ఈ శ్లోకం (దద్యాద్దయాను..) చాలా ప్రాముఖ్యమైనది కనుక మనసు పూర్తిగా పెట్టి దోసిలిపట్టి ప్రార్థిస్తే మంచిది

దద్యాద్దయాను పవనోద్రవిణాంబుధారాం ,అస్మిన్న కించన విహంగ శిశౌవిషణ్ణే !
దుష్కర్మఘర్మమపనీయ చిరాయదూరం, నారాయణ ప్రణయినీ నయనాంబువాహః !!- 8
ఇష్టావిశిష్టమతయోపి యయా దయార్ద్ర, దృష్టాస్త్రివిష్టప పదం సులభం భజంతే !
దృష్టిః ప్రహృష్ట కమలోదర దీప్తిరిష్టాం, పుష్టింకృషీష్ట మమపుష్కర విష్టరాయాః !!- 9
గీర్దేవతేతి గరుడధ్వజ సుందరీతి, శాకంభరీతి శశిశేఖర వల్లభేతి !
సృష్టి స్థితి ప్రళయకేళిషు సంస్థితాయై ,తస్యై నమః త్రిభువనైక గురోస్తరుణ్యైః !!- 10
శ్రుత్యై నమోస్తు శుభకర్మ ఫలప్రశూత్యై ,రత్యై నమోస్తు రమణీయ గుణార్ణవాయై !
శక్త్యై నమోస్తు శతపత్రనికేతనాయై, పుష్ట్యై నమోస్తు పురుషోత్తమ వల్లభాయై !!- 11
నమోస్తు నాళీక నిభాననాయై, నమోస్తు దుగ్ధోదధి జన్మభూమ్యై !
నమోస్తు సోమామృత సోదరాయై, నమోస్తు నారాయణ వల్లభాయై !!- 12
నమోస్తు హేమాంబుజపీఠికాయై, నమోస్తు భూమండల నాయికాయై !
నమోస్తు దేవాది దయాపరాయై ,నమోస్తు శార్ఙ్గాయుధ (sarngayudha)వల్లభాయై!!-13
నమోస్తు దేవ్యై భృగునందనాయై , నమోస్తు విష్ణోరురసి స్థితాయై !
నమోస్తు లక్ష్మ్యై (lakshmyai) కమలాలయై , నమోస్తు దామోదర వల్లభాయై !!- 14
నమోస్తు కాంత్యై కమలేక్షణాయై , నమోస్తు భూత్యై భువనప్రసూత్యై !
నమోస్తు దేవాదిభిరర్చితాయై ,నమోస్తు నందాత్మజవల్లభాయై !!- 15
సంపత్కరాణి సకలేంద్రియనందనాని, సామ్రాజ్యదాన విభవాని సరోరుహాక్షి !
త్వద్వందనాని దురితోద్ధరణోద్యతాని, మామేవ మాతరనిశం కలయంతు నాన్యే !!- 16
యత్కటాక్ష సముపాసనావిధిః! సేవకస్య సకలార్థ సంపదః !
సంతనోతి వచనాంగ మానసైః! త్వాం మురారి హృదయేశ్వరీం భజే !!- 17
సరసిజనయనే! సరోజహస్తే ! ధవళతరాంశుక గంధమాల్య శోభే !
భగవతి ! హరివల్లభే ! మనోజ్ఞే ! త్రిభువన భూతికరి ! ప్రసీద మహ్యం !!- 18(two times)
దిగ్ఘ స్తిభిః కనకకుంభముఖావ సృష్టస్వర్వాహినీ, విమలచారు జలప్లుతాంగీం !
ప్రాతర్నమామి జగతాం జననీం,అశేష లోకధినాథగృహిణీం అమృతాబ్ధి పుత్రీం !!- 19

ఫలశ్రుతి

స్తువంతియే స్తుతిభిరమూభిరన్వహం, త్రయీమయీం త్రిభువనమాతరం రమాం !
గుణాధికా గురుతుర భాగ్యభాజినో, భవంతితే భువి బుధ భావితాశయాః !!- 20
సువర్ణధారా స్తోత్రం యచ్ఛంకరాచార్య నిర్మితం
త్రిసంధ్యం యఃపఠేన్నిత్యం స కుబేర సమోభవేత్ !!- 21

★★★★★★★★★★

శ్రీ శంకరాచార్య విరచిత – అన్నపూర్ణాస్తుతిః

నిత్యానన్దకరీ వరాభయకరీ సౌన్దర్యరత్నాకరీ
నిర్ధూతాఖిలఘోరపావనకరీ ప్రత్యక్షమాహేశ్వరీ ।
ప్రాలేయాచలవంశపావనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలమ్బనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ ॥ ౧॥

నిత్యమైన ఆనందము నిచ్చుదానవు, వరములను- అభయమును ప్రసాదించు దానవు, సౌందర్యసముద్రమైన దానవు, ఘోరమైన పాపముల నన్నిటినీ కడిగి వేయుదానవు, హిమవంతుని వంశమును పవిత్రము చేయుదానవు, కాశీపట్టణమునకు రాణివి, దయామయివి, తల్లివి, అన్నపూర్ణేశ్వరివి అగు నీవు భిక్షపెట్టుము.

నానారత్నవిచిత్రభూషణకరీ హేమామ్బరాడమ్బరీ
ముక్తాహారవిలమ్బమాన విలసత్ వక్షోజకుమ్భాన్తరీ ।
కాశ్మీరాగరువాసితా రుచికరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలమ్బనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ ॥ ౨॥

వివిధ రత్నముల విచిత్రాభరణములను ధరించినదానవు, బంగారు వస్త్రములను కట్టుకున్న దానవు, వక్షస్థలముపై ప్రకాశించు ముత్యాల హారములు ధరించిన దానవు, కుంకుమ- అగరులు పూసుకొనుటచే సువాసనలు వేదజల్లు శరీరము కలదానవు, కాశి పట్టణమునకు రాణివి, దయామయివి, తల్లివి, అన్నపూర్ణేశ్వరివి అగు నీవు భిక్షపెట్టుము..

యోగానన్దకరీ రిపుక్షయకరీ ధర్మార్థనిష్ఠాకరీ
చన్ద్రార్కానలభాసమానలహరీ త్రైలోక్యరక్షాకరీ ।
సర్వైశ్వర్యసమస్తవాఞ్ఛితకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలమ్బనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ ॥ ౩॥

యోగముచే పొందు ఆనందమును కలిగించుదానవు, శత్రువులను నాశనం చేయు దానవు, ధర్మనిష్ఠను ఏర్పరచుదానవు, చంద్రుడు- సూర్యుడు- అగ్నులతో సమానమైన కాంతి ప్రవాహమైనదానవు, మూడులోకములను రక్షించుదానవు, సమస్తైశ్వర్యములను ప్రసాదించుదానవు, తపస్సులకు ఫలమునిచ్చుదానవు, కాశీ పట్టణమునకు రాణివి, దయామయివి, తల్లివి, అన్నపూర్ణేశ్వరివి అగు నీవు భిక్షపెట్టుము..

కైలాసాచలకన్దరాలయకరీ గౌరీ ఉమా శఙ్కరీ
కౌమారీ నిగమార్థగోచరకరీ ఓఙ్కారబీజాక్షరీ ।
మోక్షద్వారకవాటపాటనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలమ్బనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ ॥ ౪॥

కైలాస పర్వత గుహయందుడు దానవు, తెల్లని దానవు, ఉమాదేవివి, శంకరుని భార్యవు, కుమారివి, వేదార్థమును భోధించు దానవు, ఒంకార బీజాక్షరస్వరూపము కలదానవు, మొక్షద్వారపు తలుపులను తెరచెడి దానవు, కాశీ పట్టణమునకు రాణివి, దయామయివి, తల్లివి, అన్నపూర్ణేశ్వరివి అగు నీవు భిక్షపెట్టుము..

దృశ్యాదృశ్య విభూతివాహనకరీ బ్రహ్మాణ్డభాణ్డోదరీ
లీలానాటకసూత్రభేదనకరీ విజ్ఞానదీపాఙ్కురీ ।
శ్రీవిశ్వేశమనఃప్రసాదనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలమ్బనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ ॥ ౫॥

కనబడే కనబడని మహిమలు కలదానవు, గర్భమునందు బ్రహ్మాండములను మోయుచున్న దానవు, లీలానాటకమునకు సూత్రధారివి, విజ్ఞానదీపమును వెలిగించుదానవు, పరమేశ్వరుని ఆనందింపచేయుదానవు, కాశీ పట్టణమునకు రాణివి, దయామయివి, తల్లివి, అన్నపూర్ణేశ్వరివి అగు నీవు భిక్షపెట్టుము..

ఉర్వీ సర్వజనేశ్వరీ భగవతీ మాతాఽన్నపూర్ణేశ్వరీ
వేణీనీలసమానకున్తలధరీ నిత్యాన్నదానేశ్వరీ ।
సర్వానన్దకరీ సదాశుభకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలమ్బనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ ॥ ౬॥

భూమియందలి సమస్త జనులకు నాయకురాలవు, విజయమునిచ్చుదానవు, తల్లివి, దయాసముద్రమైనదానవు, స్త్రీమూర్తివి, నల్లని కురులు కలదానవు, నిత్యము అన్నదానము చేయుదానవు, సాక్షాత్తుగా మొక్షమునిచ్చుదానవు, ఎల్లప్పుడు శుభము కలిగించు దానవు, కాశీ పట్టణమునకు రాణివి, దయామయివి, తల్లివి, అన్నపూర్ణేశ్వరివి అగునీవు భిక్షపెట్టుము.

ఆదిక్షాన్తసమస్తవర్ణనకరీ శమ్భోస్త్రిభావాకరీ
కాశ్మీరా త్రిజలేశ్వరీ త్రిలహరీ నిత్యాఙ్కురా శర్వరీ ।
కామాకాఙ్క్షకరీ జనోదయకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలమ్బనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ ॥ ౬॥

"అ" కారము మొదలు "క్ష" కారము వరకు ఉన్న అక్షరముల సముదాయమైన దానవు, పరమేశ్వరునకు ప్రియురాలవు, శంకరుని భార్యవు, కాశ్మీర త్రిపురేశ్వరివి, మూడుకన్నులు కలదానవు, కాశీ పట్టణమునకు రాణివి, దయామయివి, తల్లివి, అన్నపూర్ణేశ్వరివి అగు నీవు భిక్షపెట్టుము.

దేవీ సర్వవిచిత్రరత్నరచితా దాక్షాయణీ సున్దరీ
వామే స్వాదుపయోధరా ప్రియకరీ సౌభాగ్య మాహేశ్వరీ ।
భక్తాభీష్టకరీ సదాశుభకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలమ్బనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ ॥ ౭॥

దేవివి, విచిత్రములైన సర్వరత్నములతో అలంకరింపబడినదానవు, దక్షుని కుమార్తెవు, సుందరివి, యువతివి, మధురమైన పాలిండ్లు కలదానవు, ప్రియమునిచ్చుదానవు, కాశీ పట్టణమునకు రాణివి, దయామయివి, తల్లివి, అన్నపూర్ణేశ్వరివి అగు నీవు భిక్షపెట్టుము..

చన్ద్రార్కానలకోటికోటిసదృశా చన్ద్రాంశుబిమ్బాధరీ
చన్ద్రార్కాగ్నిసమానకుణ్డలధరీ చన్ద్రార్కవర్ణేశ్వరీ ।
మాలాపుస్తకపాశసాఙ్కుశధరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలమ్బనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ ॥ ౮॥

కోట్లాదిచంద్రులు, సూర్యులు, అగ్నులతో సమానముగా ప్రకాశించుదానవు, సూర్యబింబము వలె ఎర్రనైన క్రింది పెదవి కలదానవు, చంద్రుడు, సూర్యుడు, అగ్నుల వలే ప్రకాశించు కుండలములు ధరించిన దానవు, చంద్రుడు, సూర్యుడు వంటి వర్ణము కలదానవు, కాశీ పట్టణమునకు రాణివి, దయామయివి, తల్లివి, అన్నపూర్ణేశ్వరివి అగు నీవు భిక్షపెట్టుము.

క్షత్రత్రాణకరీ మహాఽభయకరీ మాతా కృపాసాగరీ
సాక్షాన్మోక్షకరీ సదా శివకరీ విశ్వేశ్వరీ శ్రీధరీ ।
దక్షాక్రన్దకరీ నిరామయకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలమ్బనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ ॥ ౯॥

వీరులను రక్షించుదానవు, మహాభయంకరివి, తల్లివి, దయా సముద్రమైన దానవు, అందరికీ ఆనందము కల్గించు దానవు, ఎల్లప్పుడు శుభము కల్గించు దానవు, విశ్వమునకు రాణిగాశోభిల్లుదానవు, దక్షప్రజాపతికి (యాగనాశనముద్వారా)దుఃఖమును కల్గించుదానవు, సుఖము నిచ్చుదానవు, కాశీ పట్టణమునకు రాణివి, దయామయివి, తల్లివి,అన్నపూర్ణేశ్వరివి అగు నీవు భిక్షపెట్టుము.

అన్నపూర్ణే సదాపూర్ణే శఙ్కరప్రాణవల్లభే ।
జ్ఞానవైరాగ్యసిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి ॥ ౧౧॥
ఓ అన్నపూర్ణా! ఎల్లప్పుడు పూర్ణముగా ఉండు తల్లీ! శంకరుని ప్రాణవల్లభురాలా! పార్వతీమాతా! జ్ఞానము వైరాగ్యము సిద్ధించుటకు భిక్షపెట్టుము.

మాతా మే పార్వతీ దేవీ పితా దేవో మహేశ్వరః ।
బాన్ధవాః శివభక్తాశ్చ స్వదేశో భువనత్రయమ్ ॥ ౧౨॥
తల్లియే పర్వతీదేవి , తండ్రియే పరమేశ్వరుడు, బంధువులు శివభక్తులు, మూడు లోకములే స్వదేశములయి ఉన్నారు.

॥ ఇతి శ్రీశఙ్కరభగవతః కృతౌ అన్నపూర్ణాస్తోత్రం సమ్పూర్ణమ్ ॥

★★★★★★★★★★

"ఎన్నడైతే శిష్యుడు తన్ను పూర్తిగా గురువునకు నివేదించుకొన్నాడో, ఆనాటినుండీ అతని భారం గురువుది. 'గురుదేవో మహేశ్వరః' గురుచరణములవద్ద పూర్ణంగా ఆత్మార్పణ చేసుకొన్న శిష్యుడిని దైవబలం అనుక్షణం రక్షిస్తూ ఉంటుంది. తమ లేఖలలో ఈ విషయాన్ని వివేకానందులవారు చర్వితచర్వణంగా ప్రస్తావించేవారు ."

"ఉద్యోగ వ్యాపారాలలో చిక్కుకొన్న మనకు తీవ్రమైన ఆధ్యాత్మిక సాధనలు చేయడానికి వ్యవధికానీ, అవకాశంకానీ ఉండదు. కానీ సంసారంలో అనుదినమూ ఎదుర్కొనే కష్టాలకూ, పరిష్కరించవలసిన సమస్యలకూ, కలిగే ధర్మసందేహాలకూ మనకొక సలహాదారుడు అవసరం. సాధన ముదిరే కొద్దీ భగవత్కృపచేత మనకు మార్గం గోచరిస్తూనే ఉంటుంది. ఆమాత్రం సదుపాయం కలుగడానికీ గురువు అవసరం. ఈ కాలపు జీవనవిధానంలో అన్ని వేళలా గురుసమక్షంలో ఉండటం జరుగనిపని. మనం ఎవరిని గురువుగా ఎన్నుకొంటామో వారి వాక్యాలే మనకు గురుస్వరూపం. ఆ గురుబోధలను మననం చేయడం, ఆచరించడమే గురుసమక్షం. అందుచేత ఎన్ని మైళ్ళ దూరంలోఉన్నా గురుసమక్షం, గురుస్వరూపం మన కందరికీ అందుబాటులోనే ఉంటుంది."

..... శ్రీ కంచి పరమాచార్య